సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 145

గురువారం 15-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'







PAN BAHAR
ప్రతీ
హృదయంలో
ఇండియా
ప్రతిధ్వనిస్తోంది
NEW PACK
PAN BAHAR
THE HERITAGE ELAICHI
NEW PACK
PAN BAHAR
THE HERITAGE ELAICHI
PAN BAHAR
THE HERITAGE ELAICHI
PEHCHAN KAMYABI KI
HAPPY INDEPENDENCE DAY
Toll Free No.: 1800 257 2258

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50





కేజ్రీవాల్‌కు చుక్కెదురు

మద్యం కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు చుక్కెదురైంది.

- వివరాలు 6లో



ఆ బకాయిలు చెల్లించాల్సిందే

గనులకు సంబంధించిన రాయల్టీ, పన్నుల బకాయిలను రాష్ట్రాలకు చెల్లించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

- వివరాలు 6లో

నిషా ముక్త్ తెలంగాణ

మీతో సాక్షి



అంతా చేతులు కలిపితే సాధ్యమే..

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడి

- మాదకద్రవ్యాల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ
- పాఠశాలలు, కళాశాలలపై ప్రత్యేక నిఘా
- పిల్లల ప్రవర్తన తేడాగా ఉంటే అనుమానించాల్సిందే
- 'మీతో సాక్షి'కి వచ్చిన ప్రశ్నలకు శాండిల్య సమాధానాలు
- ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అనూహ్య స్పందన

సమాచారం ఉన్నా, సహాయం కావాలన్నా కాల్ **87126 71111** లేదా **100**

సాక్షి, హైదరాబాద్: పోలీసులతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలు, ప్రజలు.. అంతా కలిసి పని చేస్తేనే రాష్ట్రం నుంచి మాదకద్రవ్యాలను తరిమేయడం సాధ్యమవుతుందని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) డైరెక్టర్ సందీప్ శాండిల్య స్పష్టం చేశారు. 'నిషా ముక్త్ తెలంగాణ'(మత్తు రహిత తెలంగాణ) కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా పాఠశాలలు, కళాశాలలపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. గంజాయితో పాటు సింథటిక్ డ్రగ్స్‌ను కట్టడి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. గంజాయి సహా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించడానికి, ప్రజల్లో ఉన్న సందేహాలు నివృత్తి చేయడానికి 'సాక్షి'చేపట్టిన 'మీతో సాక్షి'క్యాంపెయినింగ్‌కు అనూహ్య స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది తమ ప్రశ్నలను వాట్సాప్ ద్వారా పంపారు. వీటికి సందీప్ శాండిల్య సమాధానాలు ఇచ్చారు.

ప్రజల ప్రశ్నలకు సందీప్ శాండిల్య సమాధానాలు.. IVలో

గవర్నర్ నామినేట్ చేస్తే నియంత్రించలేం

- తెలంగాణ ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- తుది తీర్పునకు లోబడే తదుపరి నియామకాలు ఉండాలని వెల్లడి
- హైకోర్టు తీర్పుపై స్టే.. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు.. తదుపరి విచారణ నాలుగు వారాలపాటు వాయిదా

8లో



కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ

- తెలంగాణ నుంచి ఖరారు చేసిన పార్టీ అధిష్టానం
- కేశవరావు రాజీనామాతో జరగనున్న ఉప ఎన్నిక

- వివరాలు 8లో



నిషా ముక్త్ తెలంగాణ

'మీతో సాక్షి'కి వచ్చిన ప్రశ్నలకు శాండిల్య సమాధానాలు



ప్రశ్న:
మత్తు పదార్థాలకు అలవాటు పడిన పిల్లల్ని ఎలా గుర్తించాలి? డీ అడిక్షన్ కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏమైనా కేంద్రాలున్నాయా?
వేణుగోపాలరావు, ఖమ్మం వన్ టౌన్

సమాధానం: నలుగురిలో కలవకుండా దూరంగా ఉండటం, చదువులో వెనకబడటం, గతంలో ఉత్సాహంగా పాల్గొన్న కార్యక్రమాల విషయంలో ఇప్పుడు విముఖత చూపడం, ఖర్చు ఎక్కువ చేయడం, ఆ డబ్బు కోసం చోరీలు చేయడం, కేవలం ఒకరిద్దరితోనే ఎక్కువగా తిరుగుతూ ఉండటం, కుటుంబంతో కలిసి ఫంక్షన్లకు వెళ్లకుండా ఒంటరిగా ఉండటం, ముఖంపై చిరునవ్వు మాయం కావడం, కుటుంబీకుల కళ్లలోకి చూసి మాట్లాడలేక పోవడం.. ఇవన్నీ గంజాయి/డ్రగ్ బానిసల లక్షణాలు. ఇలాంటివారి కోసం నిషా ముక్త్ తెలంగాణ ప్రాజెక్టులో భాగంగా 26 ఆస్పత్రులతో పాటు 11 డీ అడిక్షన్ కేంద్రాలు పని చేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులను సంప్రదిస్తే వాటి వివరాలు తెలుస్తాయి.

ప్రశ్న:
మా ఫ్లాట్ ఎదురుగా ఉండే నా స్నేహితురాలి కుమారుడి ప్రవర్తనలో కొత్తగా మార్పు కనబడుతోంది. ఇతను జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. స్కూల్ నుంచి రాగానే బాత్‌రూమ్‌లోకి వెళ్లి గంటల తరబడి ఉంటున్నాడు. నిద్రలో ఉలిక్కి పడుతున్నాడు. ఒక రోజు బ్యాగ్‌లో ఏదో పౌడర్ ఉన్న ప్యాకెట్ దొరికింది. ఆ బాలుడి విషయంలో ఏం చేయాలి?
- ఓ మహిళ, మణికొండ

సమాధానం: ఎవరైనా గంజాయి, డ్రగ్స్‌కు బానిసయ్యారనే అనుమానం ఉంటే వారికి 12 ప్యారామీటర్ టెస్ట్ చేయించాలి. కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు ప్రముఖ డయాగ్నస్టిక్ సెంటర్లలో ఈ పరీక్ష చేస్తారు. మీరు చెప్తున్న బాలుడి విషయంలో ఎలాంటి సహాయం కావాలన్నా చేస్తాం. '87126 71111'కు కాల్ చేసి చిరునామా ఇతర వివరాలు చెప్పండి. ఓ మహిళా అధికారిని పంపి విషయం తెలుసుకుని, బాలుడికి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా సమస్య పరిష్కరిస్తాం. ఆ బాలుడు మాదకద్రవ్యాలకు బానిసయ్యాడని తెలిస్తే అతడి పైన కాకుండా అతడిని ఈ ఊబిలోకి దింపిన వారిపై చర్యలు తీసుకుంటాం.

మాకు సమీపంలో ఉన్న కాలేజీ ఆవరణలో చీకటి పడిన తర్వాత యువత పెద్ద సంఖ్యలో గుమిగూడుతున్నారు. వాళ్లు సిగరెట్లు తాగుతూ గంజాయితో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్నట్లుగా అనుమానం ఉంది. దీనిపై చర్యలు తీసుకోగలరా?
- పేరు, వివరాలు గోప్యంగా ఉంచాం

అలాంటప్పుడు మీరు వెంటనే '100'లేదా '87126 71111'కు ఫోన్ చేయండి. లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. మేము కూడా ఆ ప్రాంతంపై నిఘా వేసి ఏం జరుగుతోందో తెలుసుకుంటాం. మీ పేరు, ఇతర వివరాలు గోప్యంగా ఉంచుతాం.

మా ప్రాంతంలో ఉన్న కల్లు దుకాణం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేకమంది ఇక్కడకు వస్తుంటారు. ఆ దుకాణంలో విక్రయించే కల్లులో ఏదైనా కలుపుతున్నారేమోనని అనుమానం ఉంది.
- పేరు, వివరాలు గోప్యంగా ఉంచాం

దీనిపై ఏఎన్‌బీ ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఆరా తీస్తుంది. అలాంటిది ఏమైనా ఉన్నట్టు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటుంది.

గంజాయి అలవాటు సిగరెట్ నుంచి మొదలవుతుంది. పాఠశాలల పరిసరాల్లో ఉన్న దుకాణాల్లో సిగరెట్లు అమ్మకుండా తనిఖీలు ఏమైనా చేస్తున్నారా?
- వంశీకృష్ణ, విద్యార్థి, మోడల్ స్కూల్, మందమర్రి

సిగరెట్ ఇతర పొగాకు ఉత్పత్తుల (కోట్పా) చట్టం -2023 ప్రకారం విద్యా సంస్థలకు 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు విక్రయించే దుకాణాలు ఉండకూడదు. అలాంటి దుకాణాలపై జీహెచ్ఎంసీ, పోలీసు విభాగాలు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విక్రేతలకు గరిష్ఠంగా ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రాకుండా నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
- మిట్టపల్లి యుగంధర్, హెచ్ఎం, ఎంపీపీ స్కూల్ దూళికట్ట, పెద్దపల్లి జిల్లా

గంజాయికి దాన్ని పండించే ప్రాంతంలోనే చెక్ చెప్పాలని నిర్ణయించాం. టీఎస్ ఏఎన్‌బీ నేతృత్వంలో త్వరలో విశాఖపట్నంలో జరిగే మూడు రాష్ట్రాల అధికారులు, రాజకీయ నాయకుల భేటీలో గంజాయి కట్టడికి ప్రత్యేక కార్యాచరణ ఖరారు చేస్తాం. ఉపగ్రహ ఛాయా చిత్రాల ద్వారా గంజాయి పండించే ప్రాంతాలను గుర్తించనున్నాం. సరిహద్దు చెక్‌పోస్టుల్లో ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నాం.

మాదకద్రవ్యాల కట్టడికి సారా వ్యతిరేక ఉద్యమం మాదిరిగా ఉద్యమం రావాలి. దీనికోసం టోల్ ఫ్రీ నంబర్ ఏదైనా అందుబాటులో ఉందా?
- స్వాతి, మహిళా సంఘం నాయకురాలు, సుల్తానాబాద్

అలాంటప్పుడు మీరు వెంటనే '100'లేదా '87126 71111'కు ఫోన్ చేయండి. లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. మేము కూడా ఆ ప్రాంతంపై నిఘా వేసి ఏం జరుగుతోందో తెలుసుకుంటాం. మీ పేరు, ఇతర వివరాలు గోప్యంగా ఉంచుతాం.

అనూహ్య స్పందన

(నోట్: మీతో 'సాక్షి'పిలుపునకు అనూహ్య స్పందన వచ్చింది. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు ప్రశ్నలు వేశారు. కొందరు తమకు తెలిసిన సమాచారం ఇచ్చారు. వీటిల్లోని సున్నితాంశాలు, కీలక సమాచారాన్ని టీజీ ఏఎన్‌బీకి అందించాం. అనేక ప్రశ్నలు సారూప్యత కలిగి ఉండటంతో వాటిల్లో కొన్నింటినే ఎంపిక చేశాం)

ఆ తండ్రికి వందనం

తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటు చేసిన ప్రత్యేక నంబర్ 87126 71111కు నిత్యం కీలక సమాచారం అందుతోందని సందీప్ శాండిల్య తెలిపారు. ఆ సమాచారం ఆధారంగా ఛేదించిన కేసుల్లో కొన్ని ఆసక్తికర అంశాలు ఉన్నాయి. వాటిని ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు.

ప్రజారోగ్యానికి చేటు చేస్తుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ–సిగరెట్లను నిషేధించింది. అయితే నగరానికి చెందిన ఓ విద్యార్థి ఆన్‌లైన్‌లో వీటిని ఖరీదు చేస్తున్నాడు. రహస్యంగా తన వద్ద ఉంచుకుని స్నేహితులతో పాటు తోటి విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. తన కుమారుడు చేస్తున్న ఈ వ్యవహారం చట్ట విరుద్ధమని భావించిన అతడి తండ్రి ఏఎన్‌బీకి సమాచారం ఇచ్చాడు. ఈ నేపథ్యంలో అధికారులు అతనితో పాటు ఇతర విక్రేతలు, వినియోగదారులైన 30 మందిని గుర్తించారు. రూ.లక్షల విలువైన ఈ–సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు.

'సరుకు'దొరకకున్నా అరెస్టు

నానక్‌రామ్‌గూడలోని ఓ ఇంట్లో గంజాయి విక్రయాలు భారీగా సాగుతున్నట్లు సమాచారం ఇచ్చిన యువకుడు దీనికి సాక్ష్యంగా వీడియోను పంపాడు. ఏఎన్‌బీ అధికారులు వెళ్లి దాడి చేసే సమయానికి అప్రమత్తమైన భార్యాభర్తలు తమ ఇంట్లో గంజాయి ఆనవాళ్లు లేకుండా చేశారు. అయితే ఉన్నతాధికారులు తమ వద్ద ఉన్న వీడియోను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించారు. ఓ సందర్భంలో వారి కుమార్తె 'సరుకు'అందిస్తున్నట్లు కనిపించింది. స్కూల్ యూనిఫాంలో ఉన్న ఆమెను మైనర్‌గా గుర్తించారు. జువైనల్ జస్టిస్ యాక్ట్‌లోని సెక్షన్ 78 ప్రకారం సిగరెట్లు, మద్యం, మాదకద్రవ్యాలను చిన్నారుల చేతికి ఇవ్వకూడదు. దీని ఆధారంగా భార్యాభర్తలపై కేసు నమోదు చేసి ఏఎన్‌బీ జైలుకు పంపింది.

రివర్స్ మెకానిజంతో...

డార్క్‌వెబ్‌పై నిఘా ఉంచడం, అందులో జరిగే డ్రగ్స్ క్రయవిక్రయాలను అడ్డుకోవడం సాధ్యం కాదు. దీంతో ఏఎన్‌బీ రివర్స్ మెకానిజం మొదలెట్టింది. ఏ దేశంలో ఉన్న సప్లయర్‌కి ఆర్డర్ ఇచ్చినా అది పార్సిల్ రూపంలో వచ్చి పెడ్లర్‌కు చేరాల్సిందే. దీంతో వివిధ కొరియర్ సంస్థలు, ఎయిర్ కార్గో ద్వారా వచ్చే పార్సిళ్లను ట్రాక్ చేయడం మొదలెట్టారు. ఈ క్రమంలో ఇటీవల ఖమ్మంలో డ్రగ్స్ గుట్టు రట్టు చేశారు.

సినిమాలు, లఘుచిత్రాల్లో డ్రగ్స్, మద్యం వినియోగం సీన్ల విషయంలో ఏమైనా ఆంక్షలు పెట్టగలమా?
- అనురాధారావు, హైదరాబాద్

అభ్యంతరకరమైన సన్నివేశాలపై ప్రజలు మాకు సమాచారం ఇవ్వాలి. మేం కేంద్ర సెన్సార్ బోర్డు దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

గ్రామాల్లో మత్తు పదార్థాల నిషేధ కమిటీలు ఏర్పాటు చేసే ఆలోచన ఉందా?
- రాంచందర్ భీంవంశీ, ప్రజాకవి, ఉపాధ్యాయులు, జహీరాబాద్

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 7,500 యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేశాం. ఆయా స్కూళ్లు, కాలేజీల్లో ఇవి పని చేస్తున్నాయి. ప్రతి బుధవారం మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామీణ స్థాయిలో ఉన్న అన్ని విభాగాలు, అధికారులు, గ్రామ పెద్దలతో కలిసి పని చేస్తున్నాం.

భారీగా హెరాయిన్ పట్టివేత

రూ.4 కోట్ల విలువైన 650 గ్రాముల హెరాయిన్ స్వాధీనం


గచ్చిబౌలి (హైదరాబాద్): ఐటీ కారిడార్‌లో భారీగా మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ ఎస్‌వోటీ, టీ న్యాబ్, రాయదుర్గం పోలీసులు జరిపిన దాడిలో.. రూ.4 కోట్ల విలువైన 650 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివి. గచ్చిబౌలి జంక్షన్‌లో హెరాయిన్ విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో.. ఎస్‌వోటీ, టీ న్యాబ్, రాయదుర్గం పోలీసులు డ్రగ్ ముఠాపై దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గురు పెడ్లర్స్, ఐదుగురు కొనుగోలుదారులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. భారీ మొత్తంలో స్వాధీనం చేసుకున్న హెరాయిన్‌ను ఎక్కడికి తరలిస్తున్నారనే కోణంలో నిందితులను విచారిస్తున్నారు. డ్రగ్ ముఠాకు గోవా, బెంగళూర్‌తో ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. ప్రధాన పెడ్లర్ కోసం ఎస్‌వోటీ పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. హెరాయిన్ పట్టివేతకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించేందుకు మరికొంత సమయం పడుతుందని పోలీసులు పేర్కొంటున్నారు. రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ డోర్ డెలివరీ 18లో

'రామగుండం' సింగరేణికి ఇవ్వొద్దు

- జెన్‌కోకు ఇస్తేనే ఉద్యోగాలొస్తాయి!
- రామగుండం బీ–థర్మల్ స్థానంలో 800 మెగావాట్ల కొత్త కేంద్రం
- నిర్మాణ బాధ్యతలు సింగరేణికి అప్పగించడంపై విద్యుత్ ఉద్యోగుల్లో వ్యతిరేకత

సాక్షి, హైదరాబాద్: కాలం చెల్లిన 62.5 మెగావాట్ల రామగుండం బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో 800 మెగావాట్ల కొత్త సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించే బాధ్యతలను సింగరేణి బొగ్గు గనుల సంస్థకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ విద్యుత్ ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) సుస్థిర భవిష్యత్‌తో పాటు రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాల కోసం ఈ విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని జెన్‌కోకే అప్పగించాలని కోరుతున్నాయి. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో నిర్మించిన 1,200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్వహణ బాధ్యతలను సింగరేణి సంస్థ ఓ అంతర్జాతీయ ప్రైవేటు కంపెనీకి అవుట్ సోర్స్ చేసింది. దీంతో ఆ విద్యుత్ కేంద్రం నిర్మాణంతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు లభించాల్సిన ఉద్యోగావకాశాలకు గండిపడింది. రామగుండంలో సింగరేణి సంస్థ కొత్త విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తే, దాని ద్వారా యువతకు లభించాల్సిన ఉద్యోగావకాశాలు సైతం ఇదే తరహాలో దెబ్బతింటాయని విద్యుత్ ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జెన్‌కో ఆధ్వర్యంలో విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తే 1,500 కొత్త ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొంటున్నాయి. ఇక సింగరేణి సంస్థలో కేంద్రం 49, రాష్ట్రం 51శాతం వాటాలు కలిగి ఉండడంతో దాని ఆధ్వర్యంలో నిర్మించే విద్యుత్ కేంద్రంపై కేంద్ర ప్రభుత్వ అజమాయిషీ కూడా ఉంటుందని గుర్తు చేస్తున్నాయి. ఈ మేరకు తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నేతలు, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు ఇటీవల రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లును కలిసి జెన్‌కో ఆధ్వర్యంలోనే కొత్త విద్యుత్ కేంద్రం నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు.



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 145
గురువారం 15-8-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు,
శ్రేయోభిలాషులకు
సాక్షి
స్వాతంత్ర్య దినోత్సవ
శుభాకాంక్షలు



వినేశ్‌కు చుక్కెదురు

భారత స్టార్ రెజ్లర్ అప్పీల్‌ను కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్) తిరస్కరించింది. పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం ఇచ్చేందుకు నిరాకరించింది.

- వివరాలు 16లో



డెంగీకి రెండేళ్లలో టీకా!

డెంగీకి చెక్ పెట్టే అవకాశం కనిపిస్తోంది. ఐసీఎంఆర్, పాన్ ఆసియా బయోటెక్ కంపెనీలు తయారు చేస్తున్న టీకా 'డెంగీఆల్' మూడో దశ ప్రయోగాలకు సిద్ధమైంది.

- వివరాలు 18లో

హైదరాబాద్ మా బలం

ఈ తరహా నగరం దేశంలో ఎక్కడా లేదు: సీఎం రేవంత్‌రెడ్డి

పెట్టుబడులకు గమ్యస్థానంగా ఫ్యూచర్ సిటీ

కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించిన సీఎం



కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, కాగ్నిజెంట్ ప్రతినిధులు, ఐటీ, పరిశ్రమల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్

సాక్షి, హైదరాబాద్: 'పొరుగు రాష్ట్రాలు సహా భారత దేశంలోనే ఎవరి వద్దా లేని హైదరాబాద్ నగరం మా వద్ద ఉంది. ఇక్కడ ఉన్న ఔటర్ రింగు రోడ్డు వంటి మౌలిక వసతులు, వాతావరణం, శాంతిభద్రతలు దేశంలో మరెక్కడా లేవు. మేము పక్క రాష్ట్రాలతో పోటీ పడాలనే ఆలోచనలకంటే ప్రపంచంతో పోటీ పడాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. కేవలం అమెరికా, దక్షిణ కొరియాకే పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలకు పిలుపునిస్తున్నా. తెలంగాణకు పెట్టుబడులతో వస్తే భద్రత, లాభంతో పాటు సాంకేతిక నైపుణ్యం అందించే యువశక్తి మా వద్ద ఉంది. పెట్టుబడులతో ఎవరు వచ్చినా రక్షణ ఉంటుందని హామీ ఇస్తున్నా. మీకు అవసరమైన అనుమతులు, వసతులు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తుంది..' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ కోకాపేటలో 10 లక్షల చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కొత్త క్యాంపస్‌ను సీఎం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'మా పోటీ కర్ణాటక, తమిళనాడు, ఏపీ వంటి రాష్ట్రాలతో కాదు. హైదరాబాద్ వంటి

మిగతా 2వ పేజీలో ▶

నెత్తురోడుతున్నా.. పట్టు వీడలేదు



- ప్రాణాలకు తెగించి స్నాచర్‌ను పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ యాదయ్య
- పెనుగులాటలో యాదయ్యను దారుణంగా పొడిచిన స్నాచర్
- కత్తిపోట్లతో రక్తస్రావమవుతున్నా పట్టువిడవని తెగువ
- 3 సర్జరీలు, వందకుపైగా కుట్లతో బతికి బయటపడ్డ పోలీసు
- రాష్ట్ర పోలీసును వరించిన రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

14లో

సెప్టెంబర్ నుంచి డీఎస్సీ నియామక ప్రక్రియ

అక్టోబర్ చివరి నాటికి ముగింపు

ఒక్కో పోస్టుకు ముగ్గురి పేర్లు..

రాష్ట్ర స్థాయిలోనే జాబితా రూపకల్పన

ఉప వర్గీకరణ అంశంపై సందేహాలు

- వివరాలు 14లో

'సీతారామ' జలం ఖమ్మానికి తొలి ఫలం

- నేడు సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు మోటార్లను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నాగార్జునసాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలతో భరోసా
- భద్రాద్రి జిల్లాకు న్యాయం చేయాలంటున్న ప్రతిపక్షాలు

- వివరాలు 14లో

మొత్తం రూ. 36 వేల కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్‌కు చేరుకున్న సీఎం రేవంత్ బృందం..

ముగిసిన అమెరికా, దక్షిణ కొరియా పర్యటన

రేపు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్

అధిష్టానం పెద్దలను కలవనున్న సీఎం..

పీసీసీ అధ్యక్షుడి ఎంపికతోపాటు నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించే అవకాశం

- వివరాలు 2లో

క్లుప్తంగా...

దేశభక్తుల త్యాగాలు చిరస్మరణీయం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుభాకాంక్షలు తెలిపారు. మాతృభూమికి స్వాతంత్ర్యం కోసం పట్టువిడవని సంకల్పంతో పోరాడిన అసంఖ్యాక దేశభక్తుల నిస్వార్థ త్యాగాలు చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, త్యాగాలను స్మరించుకోవడమే వారికి సరైన నివాళి అని పేర్కొన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి



జాతీయ గీతాలాపనలో కిషన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి తదితరులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం మనందరి బాధ్యతని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ గీతాలాపన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులు

వివిధ రంగాల ప్రతినిధులకు కేంద్రం ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో జరగనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొనేందుకు రాష్ట్రానికి చెందిన పలువురికి ఆహ్వానం అందింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం తెలంగాణ గురుకుల పాఠశాల 10వ తరగతి విద్యార్థిని వి.గ్రేషిత, పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్ కూర సుజాత ఆనందం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌కు చెందిన శశాంక్ విశ్వనాథ్‌కు కూడా ఆహ్వానం అందింది.

స్వాతంత్ర్య ఫలాలు చివరి గడపకు చేరితేనే సార్థకత

బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఎందరో మహనీయుల పోరాటాలు..మరెందరో బలిదానాల ఫలితంగా సాధించుకున్న దేశ స్వాతంత్ర్య ఫలాలు చివరి గడపకు చేరిననాడే సంపూర్ణ సార్థకత చేకూరుతుందని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మహాత్మా గాంధీ నడిపించిన భారత స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో శాంతియుతమార్గంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం.. ప్రజల సహకారంతో పదేళ్లలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు.

'ఫాక్స్‌కాన్' విషయంలో ఏం జరుగుతోంది: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'ఫాక్స్‌కాన్'సంస్థ మొదటి దశ పెట్టుబడిలో భాగంగా రాష్ట్రంలో 16 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు పూర్తి చేసింది. త్వరలో ప్రారంభానికి కూడా సిద్ధంగా ఉంది. తద్వారా 20 వేలకు పైగా మందికి ఉద్యోగాలు లభిస్తాయి. రెండోదశలో 68 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 582 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని అనుమతులు కూడా కోరినట్టు తెలిసింది' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'గడిచిన రెండు దశాబ్దాలుగా తమిళనాడులో భారీ పెట్టుబడులు పెడుతున్న ఫాక్స్‌కాన్ ఇప్పుడు ఏపీ, కర్ణాటక వైపు దృష్టి సారిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. గతంలో తెలంగాణలో పెట్టుబడులపై ఫాక్స్‌కాన్ చేసిన ప్రకటన ఏమైంది'అని ఓ నెటిజన్ వేసిన ప్రశ్నకు కేటీఆర్ స్పందించారు.



మీ కల కలగానే మిగుల్తదేమో సార్!

నలభై ఏళ్లుగా మద్యానికి దూరం.. కాట్రేవ్



కాట్రేవ్ గ్రామం వ్యూ

ఆదర్శంగా నిలుస్తున్న భువనగిరి జిల్లాలోని గ్రామం | రాష్ట్రంలో మరికొన్ని గ్రామాల్లోనూ మద్య నిషేధం కట్టుబాటు

చౌటుప్పల్ రూరల్: ఇప్పుడు ఏ పల్లెలో చూసినా బెల్ట్ షాపుల జోరుతో మద్యం ఏరులై పారుతోంది. కానీ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కాట్రేవ్ గ్రామంలో మాత్రం మద్యం జాడే కనిపించదు. గ్రామంలో నాలుగు దశాబ్దాలుగా సంపూర్ణ మద్య నిషేధం అమలవుతోంది. అప్పట్లో గ్రామ పెద్దలు నిర్ణయించిన కట్టుబాటును ఇప్పటికీ కొనసాగిస్తూ.. తమ ప్రత్యేకతను నిలుపుకొంటున్నారు కాట్రేవ్ గ్రామ ప్రజలు. రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని గ్రామాల్లోనూ కొన్నేళ్లు మద్యం విక్రయాలు, వినియోగంపై నిషేధం పెట్టుకోవడం గమనార్హం. కాట్రేవ్‌లో అయితే సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతోంది.



గ్రామ యువత కూడా దూరమే..

కాట్రేవ్ గ్రామం ఒకప్పుడు ఆరెగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. ఐదేళ్ల కిందట నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. సుమారు 700కుపైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో అంతా రైతులే. రోజంతా వ్యవసాయ పనుల్లో మునిగిపోతారు. సాయంత్రానికి ఇంటికొచ్చి సేదతీరుతారే తప్ప మద్యం జోలికి వెళ్లరు. ఈ గ్రామం నుంచి బయట పట్టణాల్లో ఉద్యోగం, ఉపాధి, చదువు కోసం వెళ్లిన యువత కూడా.. ఈ గ్రామానికి ఎప్పుడూ మద్యం తీసుకురారు. ఇక్కడ వినియోగించరు. మద్య నిషేధమేకాదు.. అభివృద్ధిలోనూ కాట్రేవ్ గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. పక్కనే ఉన్న దివిస్ పరిశ్రమ అందించే 'కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)' నిధులతో గ్రామంలో ప్రతి వీధిలో సీసీ రోడ్లు, ఎల్‌ఈడీ లైట్లు, ప్రతి ఇంటికి శుద్ధిచేసిన సురక్షిత నీరు అందించేలా ఏర్పాటు చేసుకున్నారు. పక్కనే ఉన్న ఆరెగూడెంలోనూ రెండు దశాబ్దాలుగా మద్యం విక్రయాలు లేవు.



గ్రామ పంచాయతీ కార్యాలయం

గ్రామస్తుల సహకారంతోనే కొనసాగిస్తున్నా..

నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ గ్రామంలో మద్యపానం అలవాటు లేదు. 40 ఏళ్ల కింద పెద్దలు పెట్టుకున్న కట్టుబాటును.. గ్రామస్తుల సహకారంతో కొనసాగిస్తున్నాం. అభివృద్ధిలోనూ ముందుకెళ్తున్నాం.

– బచ్చ రామకృష్ణ
మాజీ సర్పంచ్, కాట్రేవ్

పెట్టుబడులు రూ.36 వేల కోట్లు

హైదరాబాద్‌కు చేరుకున్న సీఎం రేవంత్ బృందం

- ముగిసిన అమెరికా, దక్షిణ కొరియా పర్యటన

సాక్షి, హైదరాబాద్: సుమారు పది రోజుల పాటు అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం బుధవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకుంది. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రపంచ స్థాయి కంపెనీలు ముందుకు వచ్చినట్లు ఈ సందర్భంగా ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. అమెరికా కంపెనీలు రూ.31,502 కోట్ల పెట్టుబడులు, దక్షిణ కొరియా కంపెనీలు రూ.4,500 కోట్ల పెట్టుబడులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపాయి. మొత్తంగా 25 కంపెనీల నుంచి రూ.36 వేల కోట్ల పెట్టుబడులను తెలంగాణ సాధించింది. దీంతో ఆయా రంగాల్లో కొత్త సంస్థలు, కొత్త పరిశ్రమలతో వేలాది కొత్త ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

సరికొత్త రికార్డు: ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులోనూ సీఎం పాల్గొన్నారు. ఆ సందర్భంగా జరిగిన ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు సాధించినట్లు తెలిపారు. ఈ విధంగా 8 నెలల్లోనే మొత్తం రూ.76,232 కోట్ల పెట్టుబడుల సాధన ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త రికార్డు నమోదు చేసిందని ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. దేశంలోనే పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ అందరి దృష్టినీ ఆకర్షిస్తోందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ!

రెండురోజుల దక్షిణ కొరియా పర్య టనలో సీఎం రేవంత్ బృందం ప్రధానంగా ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఇంధన స్టోరేజీ, టెక్స్‌టైల్ రంగాలపై దృష్టి సారించినట్లు తెలిపాయి. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొచ్చే కంపెనీలకు ప్రభుత్వం తగినంత సహకారం అందిస్తుందని భరోసా ఇవ్వడంతో అమెరికన్ కంపెనీల తరహాలోనే కొరియన్ కంపెనీల నుంచి భారీ స్పందన లభించినట్లు వివరించాయి. కాగా కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం అదే తరహాలో రాష్ట్రంలోనూ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం

శంషాబాద్: బుధవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న రేవంత్ బృందానికి ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ తదితరులు ఘన స్వాగతం పలికారు. వీఐపీ లాంజ్‌లో పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. మరోవైపు కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా సీఎం అందరికీ అభివాదం చేస్తూ పుష్పగుచ్ఛాలు స్వీకరించారు. కాగా తమ పర్యటన విజయవంతమైందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు.

రేపు ఢిల్లీకి సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీ వెళ్లనున్నారు. అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని వచ్చిన సందర్భంగా పార్టీ పెద్దలను కలిసేందుకు ఆయన ఢిల్లీ వెళుతున్నారని గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసింది. అయితే వీలునుబట్టి సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతో ఆయన భేటీ అవుతారని, పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్‌ను కలుస్తారని తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, నామినేటెడ్ పోస్టుల భర్తీపై వీరితో చర్చలు జరిపే అవకాశముందని సమాచారం. పీసీసీకి కొత్త అధ్యక్షుడిపై ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిగాయి. కానీ ఎటూ తేలని నేపథ్యంలో దీనిపై చర్చించేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కూడా ఢిల్లీకి పిలవనున్నట్లు సమాచారం. బీసీ లేదా లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతకు పీసీసీ అధ్యక్ష పదవి అప్పగించే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతుండగా, తాజాగా ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న ఓ మంత్రి పేరు కూడా తెరపైకి వచ్చింది. ఇలావుండగా 17–20 నామినేటెడ్ పోస్టుల భర్తీకి ఈ సందర్భంగా లైన్ క్లియర్ అయ్యే అవకాశం ఉందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. రైతు, విద్య, మానవ హక్కులు, బీసీ కమిషన్ల పేర్లు కూడా ఫైనల్ అవుతాయని తెలుస్తోంది.

హైదరాబాద్ మా బలం

▶ మొదటి పేజీ తరువాయి

మహానగరం, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ ఉన్నాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపేలా పాలసీల్లో పారదర్శకత పాటిస్తాం. పెట్టుబడులకు ప్రోత్సాహం ఇవ్వాలని భావిస్తున్నాం'అని రేవంత్ చెప్పారు.



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

భిన్నాభిప్రాయాలు ఉన్నా అభివృద్ధి

'కులీ కుతుబ్‌షాహీలు మొదలుకుని హైదరాబాద్ నగరం 430 ఏళ్లుగా రాజకీయ భిన్నాభిప్రాయాలను అధిగమిస్తూ అభివృద్ధి చెందుతోంది. నిరుద్యోగ సమస్యకు సాంకేతిక నైపుణ్యంతో పరిష్కారం చూపాలనే రాజీవ్‌గాంధీ ఆలోచన మేరకు 1992లో నాటి సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హైటెక్ సిటీకి పునాది వేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత హైటెక్ సిటీ నిర్మించారు. వైఎస్ హయాంలో మూడో నగరంగా సైబరాబాద్ నిర్మాణం జరిగింది. భవిష్యత్తు అవసరాలను హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ నగరాలు తీర్చే పరిస్థితి లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎయిర్‌పోర్టుకు కూతవేటు దూరంలో నాలుగో నగరం 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తాం. చైనా బయట పెట్టుబడుల కోసం చూస్తున్న అమెరికా, దక్షిణ కొరియా వంటి దేశాలకు ఫ్యూచర్ సిటీ సమాధానం చెప్తుంది. ఫ్యూచర్ సిటీలో కాగ్నిజెంట్ వంటి సంస్థలు భాగస్వాములు కావాలి..'అని సీఎం అన్నారు.

ఇన్వెస్టర్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు: 'అమెరికా, దక్షిణ కొరియా పర్యటన ద్వారా రూ.31,500 కోట్ల పెట్టుబడులు, 30,750 ఉద్యోగాల కల్పన జరుగుతుంది. త్వరలో మరిన్ని పెట్టుబడుల సాధన దిశగా సమావేశాల నిర్వహణ కోసం 'ఇన్వెస్టర్ టాస్క్‌ఫోర్స్'ఏర్పాటు చేస్తాం. తెలంగాణను ఫ్యూచర్ స్టేట్‌గా మార్చేందుకు హైదరాబాద్‌ను కోర్ అర్బన్ ఏరియాగా, ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు నడుమ ప్రాంతాన్ని సెమీ అర్బన్ ఏరియాగా, రీజినల్ రింగు రోడ్డు వెలుపల ఉన్న ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా వర్గీకరిస్తున్నాం. సెమీ అర్బన్ ఏరియాను తయారీ కేంద్రంగా, రూరల్ తెలంగాణలోని ప్రాంతాలను ఆసియాలోనే అత్యుత్తమ గ్రామాలుగా అభివృద్ధి చేస్తాం..'అని రేవంత్ చెప్పారు.

57 వేల మంది హైదరాబాద్ నుంచే: కాగ్నిజెంట్ ప్రెసిడెంట్

'హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్‌ను కేవలం ఆరు నెలల్లో సిద్ధం చేసి ప్రారంభిస్తున్నాం. 2002 నుంచి హైదరాబాద్ అభివృద్ధిలో కాగ్నిజెంట్ భాగస్వామిగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా కాగ్నిజెంట్‌కు 3.56 లక్షల మంది ఉద్యోగులు ఉంటే అందులో 70 శాతం అంటే 2.40 లక్షల మంది భారత్ నుంచే ఉన్నారు. వీరిలో 57 వేల మంది హైదరాబాద్‌లోనే పనిచేస్తుండగా, 39 శాతం మంది మహిళలే కావడం గమనార్హం..'అని కాగ్నిజెంట్ ఈవీపీ ప్రెసిడెంట్ సూర్య గుమ్మడి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఐటీ, పరిశ్రమల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, కాగ్నిజెంట్ ప్రతినిధులు నారాయణన్, జాన్‌కిమ్, కేథరిన్ డియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.72 వేల కోట్ల బకాయిల పాపం మీది కాదా?

కేటీఆర్ పోస్ట్‌పై మంత్రి సీతక్క ఫైర్



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు, సర్పంచ్‌లకు ఏళ్ల తరబడి బకాయిలు చెల్లించకపోవడం వల్ల రూ.72 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన పోస్ట్‌పై ఘాటుగా స్పందించారు. కేటీఆర్ తీరు హంతకులే సంతాపం పలికినట్లు ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. మీరు చేసిన పాపం మేము మోయాల్సి వస్తోందని దుయ్యబట్టారు. మీ హయాంలో గ్రామాలకు గ్రామాలే విషజ్వరాల బారిన పడినా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒకే నెలలో 42 మంది మరణించినట్లు పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందించలేదని ఆరోపించారు. మీ పాపాలను మా ప్రభుత్వ ఖాతాలో వేయాలనుకోవడం మీ దిగజారిన రాజకీయానికి పరాకాష్ఠ అని మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలని కోరారు.

ఇందిరమ్మ రాజ్యంలో కంపు కొడుతున్న పల్లెలు, పట్టణాలు

అధ్వానంగా పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ

- నిధులు లేక, పెండింగ్ బిల్లులు రాక తీవ్ర సంక్షోభంలో పంచాయతీలు
- 'సాక్షి' వరుస కథనాలను ట్యాగ్ చేస్తూ కేటీఆర్ పోస్ట్



సాక్షి, హైదరాబాద్: కంపుకొడుతున్న పల్లెలు, పట్టణాలే ఇందిరమ్మ పాలనకు ఆనవాళ్లా అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ పల్లెల్లో పాలన పడకేసిందని, పట్టణాల్లో పరిస్థితి అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'సాక్షి'లో ఈనెల 12న ప్రచురితమైన 'పెను సంక్షోభంలో పట్టుగొమ్మలు', 13న ప్రచురితమైన 'పూర్.. పాలికలు!' కథనాల క్లిప్పింగ్‌లను ట్యాగ్ చేశారు. పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణను కూడా పట్టించుకోకపోవటంతో పల్లెల్లో ప్రజాజీవనం దినదిన గండంలా మారిందని చెప్పారు. దోమల మందుకు కూడా నిధులు లేకపోవడంతో పంచాయతీల్లో డెంగీ, మలేరియాలాంటి విషజ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. పంచాయతీలకు నిధులు చెల్లించకపోవటంతోనే ఈ దుస్థితి దాపురించిందని విమర్శించారు. అటు కేంద్రం నుంచి, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీల నిర్వహణ తీవ్ర సంక్షోభంలో పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లకు పాత పనులకు సంబంధించి ఎనిమిది నెలలైనా బిల్లులు చెల్లించటం లేదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రతినెలా పంచాయతీలకు ఠంచన్‌గా రూ.275 కోట్లు విడుదల చేశామని, కాంగ్రెస్ పాలనలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగిన పాపానికి 1,800 మంది మాజీ సర్పంచ్‌లపై నిర్బంధాలు, అక్రమ అరెస్టులు చేస్తూ వారిని ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు. 15వ ఆర్థిక సంఘం నుంచి అందిన రూ.500 కోట్ల నిధులు గ్రామపంచాయతీలకు ఎప్పుడిస్తారని నిలదీశారు. ఉపాధిహామీ పథకం, హెల్త్ మిషన్ నుంచి వచ్చిన రూ.2,100 కోట్ల కేంద్ర నిధులను ఎందుకు దారి మళ్లించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మొత్తం 12,769 పంచాయతీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలే రూ.4,305 కోట్లు అని, వాటి పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. నిధులు లేక పూర్తిగా నీరసించిన మున్సిపాలిటీల్లో కనీసం అత్యవసర మరమ్మతులకు కూడా పైసలు లేకపోవడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీల్లో రూ.1,200 కోట్లకుపైగా ఉన్న పెండింగ్ బిల్లులను ఇంకెప్పుడు విడుదల చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖకే ఈస్థాయిలో నిధుల కొరత ఉంటే...ఇక ఇతర శాఖల పరిస్థితి ఏమిటన్నారు. ఆగస్టు 15 లోపు బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు సిద్ధమవుతున్న మున్సిపల్ కాంట్రాక్టర్ల కష్టాలను తీర్చే తీరిక ఈ ప్రభుత్వానికి లేదని చెప్పారు. కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నుంచి పురపాలక శాఖను గట్టెక్కించేందుకు ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని సూచించారు.

రూ.50 వేల కోట్ల అప్పులు చేయడమే.. కాంగ్రెస్ తెచ్చిన మార్పా?

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రూ.50 వేల కోట్ల అప్పులు తీసుకురావడమే వారు తెచ్చిన మార్పా అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఒక్క కొత్త ప్రాజెక్ట్ కూడా లేకుండా అంత అప్పు తేవాల్సిన అవసరం ఏమొచ్చిందని ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. 2023 నాటికి రాష్ట్రం రూ.5,900 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉంటే.. 8 నెలల కాలంలో దానిని రూ.50 కోట్ల అప్పుగా మార్చేశారని మండిపడ్డారు. రాష్ట్ర సంపదను పెంచిన బీఆర్‌ఎస్‌పై అప్పులుఅప్పులు అంటూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. అపోహలు, అర్ధ సత్యాలను ప్రచారం చేసి జనాన్ని తప్పుదోవ పట్టించారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాత్రం అన్ని రికార్డులను బద్దలు కొడుతూ అప్పులు చేయటంలో టాప్‌లో నిలుస్తుందని చెప్పారు. ఇదేవిధంగా అప్పులు చేసుకుంటూ పోతే కాంగ్రెస్ పదవీకాలం ముగిసే నాటికి రూ.4 లక్షల నుంచి 5 లక్షల కోట్ల అప్పులభారం రాష్ట్రంపై పడడం ఖాయమని చెప్పారు. అప్పుల విషయంలో బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసి ప్రజలను మోసం చేయటంలో కాంగ్రెస్ విజయవంతమైందన్నారు. కానీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సరైన సమయంలో కాంగ్రెస్‌కు కచ్చితంగా బుద్ధి చెబుతారని తెలిపారు.

రెండు సబ్‌సెక్షన్లు.. కీలక పరిష్కార మార్గాలు

ఆర్‌వోఆర్-2024 చట్టం ముసాయిదాపై సందేహాలకు నిపుణుల సమాధానాలు

సాదాబైనామాలకు మోక్షం.. కానీ పెండింగ్ దరఖాస్తులకే చాన్స్

రెండంచెల అప్పీళ్ల వ్యవస్థ.. ట్రిబ్యునళ్ల ప్రస్తావన మాత్రం లేనట్టే..

భూఆధార్ కార్డు జారీతో వివాదాలు తగ్గిపోతాయి

అధికారులు తప్పులు చేస్తే ఐపీసీ ప్రకారం చర్యలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)–2024 చట్టం ముసాయిదా ప్రకారం సాదాబైనామాలకు పూర్తిస్థాయిలో మోక్షం కలిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దాదాపు 9 లక్షల దరఖాస్తులను వేగంగా పరిష్కరించే వెసులుబాటును కొత్త చట్టం కల్పిస్తుందని భూచట్టాల నిపుణులు చెప్తున్నారు. ఈ చట్టంలో పేర్కొన్న సెక్షన్ (4)లోని సబ్‌సెక్షన్లు (5, 6) ద్వారా ధరణి పోర్టల్‌లో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అంటున్నారు. అయితే ఈ చట్టం ద్వారా రెవెన్యూ కోర్టులు ఏర్పాటయ్యేది లేదని.. ట్రిబ్యునళ్ల ప్రస్తావనే లేదని వివరిస్తున్నారు. కొత్త చట్టం ముసాయిదాపై ప్రజల నుంచి వస్తున్న మరిన్ని సందేహాలకు నిపుణుల సమాధానాలు... 'సాక్షి' పాఠకులకు ప్రత్యేకం..

సందేహం: ఈ చట్టంతో రెవెన్యూ కోర్టులు మళ్లీ ఏర్పాటవుతాయా?

సమాధానం: ఈ ముసాయిదా చట్టం ప్రకారం కొత్తగా అప్పీల్, రివిజన్ వ్యవస్థలు వస్తాయి. కానీ రెవెన్యూ కోర్టులు ఎప్పుడూ రద్దు కాలేదు. రద్దు అయ్యాయనే గందరగోళం ఏర్పడింది. అందువల్ల మళ్లీ ఏర్పాటయ్యే ప్రస్తావన రాదు. కానీ రెవెన్యూ అధికారులు రికార్డులను సవరించే అధికారాలను ఈ కొత్త చట్టం కల్పిస్తుంది.

అప్పీల్ వ్యవస్థ ఉంటుందా?

ఈ ముసాయిదా ప్రకారం రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుంది. తొలి అంచెలో అడిషనల్ కలెక్టర్ లేదా కలెక్టర్‌కు, రెండో అంచెలో సీసీఎల్‌ఏ లేదా అప్పీల్ కమిషనర్‌కు చేసుకోవచ్చు. గత చట్టం ప్రకారం ఆర్డీవో, జేసీలకు అప్పీల్ అవకాశం ఉండేది. ఇప్పుడు ఒకస్థాయి పెరగడంతోపాటు అప్పీల్‌కు మాత్రమే కాకుండా రివిజన్‌కు ఆస్కారం ఏర్పడుతుంది.

భూఆధార్‌కార్డుల జారీ దేనికోసం?

ప్రతి భూకమతానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఉంటే చాలా వివాదాలు తగ్గిపోతాయి. భూములకు స్పష్టతతో కూడిన గుర్తింపు వస్తుంది. కేంద్రం కూడా గత ఐదేళ్లుగా ఇదే చెబుతోంది. అందుకే భూఆధార్‌కార్డు నిబంధన పెట్టారు.

ఈ చట్టం అమల్లోకి వస్తే కోర్టులకు వెళ్లాల్సిన అవసరం లేదా?

యాజమాన్య హక్కులను రికార్డు చేసేది రెవెన్యూ వ్యవస్థనే. అందుకే ఆ రికార్డుల్లోని తప్పొప్పులను కూడా ఆ వ్యవస్థే చేస్తుంది. యాజమాన్య, భాగ పంపకాల హక్కులు, వివాదాలపై మాత్రమే కోర్టులకు వెళ్లాలి. తప్పుల సవరణ కోసం అప్పీల్ చేసుకోవచ్చు.

రెవెన్యూ ట్రిబ్యునళ్లు ఏర్పాటవుతాయా?

ట్రిబ్యునళ్ల ఏర్పాటు గురించి ఈ చట్టంలో ఎక్కడా లేదు. భవిష్యత్తులో రెవెన్యూ చట్టాలన్నింటినీ కలిపి ఒకే చట్టం (రెవెన్యూ కోడ్) చేస్తే అందులో ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

సాదాబైనామాలు ఈ చట్టంలో క్రమబద్ధీకరించవచ్చా?

ఈ చట్టం అందుకు అవకాశం కల్పిస్తుంది. కానీ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మాత్రమే వర్తిస్తుంది. ఆర్డీవో స్థాయి అధికారి విచారించి సాదాబైనామాలపై నిర్ణయం తీసుకుంటారు.

గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థ మళ్లీ వస్తుందా?

గ్రామ రెవెన్యూ అధికారులు ఉండాలా, వద్దా అన్నది వేరే అంశం. కానీ, ఈ చట్టం అమలు చేయాలంటే మాత్రం క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ పటిష్టంగా ఉండాలి. గ్రామస్థాయిలో రెవెన్యూ సిబ్బంది ఉంటేనే ఈ చట్టంలోని నిబంధనలు సమర్థవంతంగా అమలవుతాయి.

ముసాయిదాపై అభిప్రాయ సేకరణ ఎందుకు?

ఏ చట్టం తేవాలన్నా ముసాయిదాపై ప్రజల్లో చర్చ జరగాలి. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా అవగాహన వస్తుంది. మంచి సూచనలు, సలహాలు వస్తాయి. ధరణి సమస్యలు జటిలమై ఉన్న తరుణంలో విస్తృత ప్రజాభిప్రాయం ద్వారానే మెరుగైన చట్టాన్ని తయారు చేసే అవకాశం ఉంటుంది.

ఆబాదీలకు (నివాస స్థలాలకు) కూడా పాసుపుస్తకాలు ఇస్తారా?

ఆబాదీలకు ఇప్పటివరకు ఎలాంటి రికార్డు లేదు. గ్రామాలు లేదా పట్టణాల్లో నివాసం కోసం కేటాయించబడిన స్థలాన్నే ఆబాదీ అంటారు. ఈ ముసాయిదా చట్టంలో గ్రామీణ ఆబాదీలను మాత్రమే ప్రస్తావించారు. వ్యవసాయ భూముల తరహాలోనే ఆబాదీలకు కూడా రికార్డు తయారవుతుంది. భూఆధార్ కార్డు లేదా పాసు పుస్తకాలు వస్తాయి. పంచాయతీరాజ్ చట్టం సహకారంతో తొలి రికార్డును రెవెన్యూ శాఖ తయారు చేస్తుంది. మ్యుటేషన్లను సబ్ రిజిస్ట్రార్లు చేస్తారు.

ధరణి సమస్యలకు పరిష్కారం ఈ చట్టంలో ఎక్కడుంది?

కొత్త చట్టం ముసాయిదాలోని సెక్షన్ 4లో 5, 6 సబ్‌సెక్షన్లు దీని గురించే చెప్తున్నాయి. సబ్‌సెక్షన్ 5 ప్రకారం ధరణి సమస్యలకు పరిష్కారం ఉంటుంది. సబ్‌సెక్షన్ 6లో పార్ట్–బీ కేసుల పరిష్కార అంశాలు ఉంటాయి. ఈ పరిష్కార వ్యవస్థను చట్టం అమలు కోసం రూపొందించే మార్గదర్శకాల్లో పొందుపరచుకోవాల్సి ఉంటుంది.

తప్పు చేసిన అధికారులపై ఎలాంటి చర్యలుంటాయి?

తప్పులు చేసే అధికారులకు శిక్షలు వేసే నిబంధన ఆర్‌వోఆర్–2020లోనూ ఉంది. కానీ ఎక్కడా కేసులు నమోదు కాలేదు. కావు కూడా. ఎందుకంటే రికార్డులకు హక్కులు కల్పించే చట్టంలో శిక్షలు అమలు చేసే నిబంధనలు సరికావు. దీనివల్ల మంచి కన్నా చెడు ఎక్కువ జరుగుతుందనే భావన ఉంది. అందుకే ఆర్‌వోఆర్–2024లో ఈ నిబంధన తొలగించారు. ఏదైనా తప్పులకు సంబంధించి ఇప్పటికే అమల్లో ఉన్న సీఆర్‌పీసీ, ఐపీసీ లాంటి క్రిమినల్ చట్టాలు లేదా క్రమశిక్షణ చర్యల మేరకు జరగాల్సి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

దేశం కోసం త్యాగాలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి, గాంధీ కుటుంబానికి ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. రాజీవ్ అమరజ్యోతి తెలంగాణకు వచ్చిన సందర్భంగా బుధవారం గాంధీభవన్‌లో సభ నిర్వహించారు. ఈ సభలో జగ్గారెడ్డి మాట్లాడుతూ బీజేపీలో ఎవరైనా దేశం కోసం ప్రాణత్యాగం చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ రాహుల్ దేశ ప్రధాని అయితే దేశంలోని ఓబీసీలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.


Reliance
Growth is Life
ఫుల్ పైసా వసూల్ సేల్
15th - 19th AUG
SMART BAZAAR
సఫోలా గోల్డ్ రైస్ బ్రాన్ ఆయిల్ 3 L + దావత్ రోజానా గోల్డ్ బాస్మతి రైస్ 5 kg
స్మార్ట్ ప్రైస్
₹725
కంబైన్డ్ ఎమ్ఆర్పి : ₹1140
ఇమామి హెల్తీ అండ్ టేస్టీ / ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 1 L
స్మార్ట్ ప్రైస్
₹99/ ₹112
ఎమ్ఆర్పి : ₹135 / ₹138
గుడ్ లైఫ్ బాదం / జీడిపప్పు (W320) 500 g
స్మార్ట్ ప్రైస్
₹339/ ₹459
ఎమ్ఆర్పి : ₹549 / ₹499
గుడ్ లైఫ్ డైలీ రైస్ 26 kg
స్మార్ట్ ప్రైస్
₹1329
(₹51.11 /kg)
ఎమ్ఆర్పి : ₹1860
విజయా ఘీ 1 L
స్మార్ట్ ప్రైస్
₹559
ఎమ్ఆర్పి : ₹690
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్పి : ₹120 మొదలుకుని / యూనిట్
బిస్కెట్స్ 275 g మొదలుకుని / లోట్టె చోకో పై 336 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
స్ప్రైట్ / కోకోకోలా / థమ్స్అప్ 750 ml (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 3 GET ANY 1 FREE
ఎమ్ఆర్పి : ₹45 మొదలుకుని / యూనిట్
కనీసం 25% తగ్గింపు
ఎమ్ఆర్పి : ₹20 మొదలుకుని
బ్యాటర్, బ్రెడ్, కేక్, చీజ్, ఫ్రోజెన్ వెజ్ మరియు స్నాక్స్, ఐస్ క్రీమ్, పాల పానీయాలు, పనీర్, యోగర్ట్ 47 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
క్లోజ్ అప్ రెడ్ / కోల్గేట్ / డాబర్ రెడ్ / మెస్వాక్ / పెప్సోడెంట్ జర్మిచెక్ టూత్‌పేస్ట్ 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
కనీసం 33% తగ్గింపు
ఎమ్ఆర్పి : ₹204 మొదలుకుని
Surya flame 2 బర్నర్ గ్లాస్ టాప్ గ్యాస్ స్టవ్
స్మార్ట్ ప్రైస్
₹1599
ఎమ్ఆర్పి : ₹5695
200 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 1 GET ANY 1 FREE
ఎమ్ఆర్పి : ₹80 మొదలుకుని
చక్ర గోల్డ్ ప్రీమియం టీ 500 g
ఆదా చేసుకోండి
₹90
ఎమ్ఆర్పి : ₹420 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ : ₹330 మొదలుకుని
115.5 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్పి : ₹100 మొదలుకుని / యూనిట్
కనీసం 33% తగ్గింపు
ఎమ్ఆర్పి : ₹175 మొదలుకుని
125 g x 4 + 1
ఫ్లాట్ 33% తగ్గింపు
ఎమ్ఆర్పి : ₹565 మొదలుకుని
₹379
ఫ్లాట్ 50% తగ్గింపు
ఎమ్ఆర్పి : ₹575 మొదలుకుని
₹288
ఆదా చేసుకోండి
₹500 మొదలుకుని
ఎమ్ఆర్పి : ₹799 మొదలుకుని
₹299
580 ml
BUY ANY 1 GET ANY 2 FREE
ఎమ్ఆర్పి : ₹1499 మొదలుకుని / యూనిట్
జీన్స్
BUY 1 GET 1 FREE
₹1000 మరియు ఆ పై ధర గల జీన్స్ కొనుగోలుపై
₹499
కంటే తక్కువలో ఫ్యాషన్
2000+ స్టైల్స్
వద్ద కూడా లభ్యం
SMART SUPERSTORE
JioMart
10% INSTANT DISCOUNT#
SBI card
#Min. Trxn.: ₹3,000; Max. Discount: ₹500 per Trxn. Valid on one Trxn. per credit card. Validity: 14 Aug - 19 Aug 2024. T&C Apply.
SMART BAZAAR
SMART SUPERSTORE



ఎంత ధర కలిగినదైనప్పటికీ స్వాతంత్య్రం అనేది ఎప్పటికీ ఖరీదైనది కాదు. అది మనిషి బతకడానికి అవసరమైన శ్వాస. దానికోసం ఎవరైనా సరే ఎంత మూల్యమైనా చెల్లిస్తారు.

– మహాత్మా గాంధీ

సాక్షి

గురువారం, 15 ఆగస్టు 2024

మీడియా స్వేచ్ఛకు కళ్లెమా!

వక్ఫ్ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటు చేయకతప్పని పక్షం రోజుల్లోనే ప్రస్తుతం భిన్నవర్గాల పరిశీలనలో ఉన్నదని చెబుతున్న బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ రెగ్యులేషన్ బిల్లు ముసాయిదాను కేంద్రంలోని ఎన్డీయే సర్కారు వెనక్కి తీసుకుంది. కారణమేదైనా ఇది ఆహ్వానించ దగ్గ పరిణామం. ఈ బిల్లు తొలి ముసాయిదా నిరుడు నవంబర్‌లో విడుదల చేయగా దానిపై వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని చెబుతూ గత నెల రెండో ముసాయిదా తీసుకొచ్చారు. తాజాగా దాన్ని కూడా వెనక్కి తీసుకున్నారు. వచ్చే అక్టోబర్ 15 వరకూ ముసాయిదా బిల్లుపై సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతుందని ప్రభుత్వం చెబుతోంది. బహుశా శీతాకాల సమావేశాలనాటికి దీనికి తుదిరూపం ఇవ్వాలన్నది పాలకుల ఉద్దేశం కావొచ్చు. డిజిటల్ మీడియా ప్రస్తుతం ఊహకందని రీతిలో విస్తరించింది. 1959లో ప్రయోగాత్మకంగా ఢిల్లీలో ప్రారంభించిన టెలివిజన్ ప్రసారసేవలు 80వ దశకం చివరినాటికి కొత్త పుంతలు తొక్కాయి. స్టార్ టీవీ, ఎంటీవీ, బీబీసీ, సీఎన్ఎన్ వగైరాలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ప్రస్తుతం యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విటర్‌వంటి సామాజిక మాధ్యమాలతోపాటు ఓటీటీలు వచ్చాయి. వాట్సాప్, టెలిగ్రామ్ వంటివి సరేసరి. అన్నింటా మంచీ చెడూ ఉన్నట్టే వీటివల్ల కూడా సమస్యలు ఎదురువుతూ ఉండొచ్చు. అవి దుష్పరిణామాలకు దారితీయటం నిజమే కావొచ్చు. అందుకు తగిన చట్టాలు తీసుకురావటం కూడా తప్పేమీ కాదు. కానీ ఈ మాధ్యమాలను నియంత్రించే పేరిట భావప్రకటనా స్వేచ్ఛకు కళ్లెం వేయాలనుకోవటం, అసమ్మతిని అణిచేయాలనుకోవటం ప్రజాస్వామ్యంలో మంచిది కాదు. బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ రెగ్యులేషన్ ముసాయిదా బిల్లు చేస్తున్నది అదే.

గతంలో కేబుల్ రంగం హవా నడిచినప్పుడు వీక్షకులకు ఇష్టం ఉన్నా లేకున్నా అనేక చానెళ్లు వచ్చిపడేవి. వర్తమానంలో అలా కాదు. ఏం చూడాలో, వద్దో నిర్ణయించుకునే స్వేచ్ఛ వీక్షకులకు ఉంటుంది. పార్టీలకు అమ్ముడుపోయిన చానెళ్లు వాస్తవాలను వక్రీకరిస్తున్నారని అర్థమయ్యాక జనం వాటిని చూడటం మానుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో ప్రత్యామ్నాయాలను వెదుక్కుంటున్నారు. తమకు నచ్చిన, తాము తెలుసుకోవాలనుకుంటున్న విషయం ఉన్నదనుకుంటేనే ఆన్‌లైన్‌లో లభ్యమయ్యే వీడియోలను వీక్షిస్తారు. వార్తా విశ్లేషణలను చదువుతారు. ఒక అంశంపై ఎవరెవరి అభిప్రాయాలు ఎలావున్నాయో తెలుసుకుంటారు. ఈ క్రమంలో సహజంగానే ప్రజలను పక్కదోవపట్టించేవాళ్లు ఉంటారు. అశ్లీలతనూ, దుర్భాషలనూ గుప్పించేవారుంటారు. తప్పుడు కథనాలను ప్రసారం చేసేవారూ ఉంటారు. అలాంటివారిపై తగిన చర్యలు తీసుకోవటాన్ని ఎవరూ కాదనరు. కానీ నిజాయితీగా అభిప్రాయాలు వ్యక్తీకరించేవారిని కూడా వారితో సమంచేసి శిక్షించే ధోరణి ఎంతవరకూ సబబు? అత్యధిక వీక్షకుల్ని రాబట్టుకుంటున్న ఆన్‌లైన్ మాధ్యమాలకు సైతం ముసాయిదాలో ఏముందో అధికారికంగా తెలియదు. అనేకానేక ఆన్‌లైన్ చానెళ్లు, ఇతర ప్రచురణ మాధ్యమాలూ సభ్యులుగా ఉన్న డిజిపబ్ వంటి స్వయంనియంత్రణ సంస్థలకే ఈ ముసాయిదాపై ప్రభుత్వం నుంచి ఎలాంటి వర్తమానమూ లేదు. మరి కేంద్రం ఇంతవరకూ సాగించామంటున్న సంప్రదింపులు ఎవరితో జరిగినట్టు? రెండు మూడు ఓటీటీ యాజమాన్యాలనో, కార్పొరేట్ రంగ ఆధిపత్యంలో సాగుతున్న ఇతర మాధ్యమాలనో, తాము నిపుణులుగా భావించేవారినో సంప్రదిస్తే సరిపోతుందా? సాగు చట్టాల విషయంలోనూ లక్షలాదిమంది రైతులతో, వేలాది సంఘాలతో చర్చించామని అప్పట్లో ప్రభుత్వం చెప్పింది. చివరకు ఏమైంది? రైతులు పట్టుదలగా పోరాడాక వెనక్కు తీసుకోకతప్పలేదు. సమస్యేమంటే...ట్విటర్‌లో లక్షల్లో అనుయాయులున్న రాజకీయ నాయకులు మొదలుకొని ధ్రువ్‌రాఠీవంటి పాపులర్ యూట్యూబర్‌ల వరకూ... ఎంతో నిబద్ధతతో సీనియర్ జర్నలిస్టులు నడిపే మాధ్యమాలవరకూ అందరినీ ముసాయిదా బిల్లు ఒకే గాటన కడుతోంది. ఆఖరికి పత్రికలూ, చానెళ్లూ అనుబంధంగా నడుపుతున్న డిజిటల్ మాధ్యమాలు సైతం ఈ పరిధిలోకొస్తాయి. పైగా ఈ కార్యకలాపాలు క్రిమినల్ చట్టాల పరిధిలోకి కూడా వెళ్లి అనేక కేసులు దాఖలవుతాయి. అరెస్టయితే బెయిల్ దుర్లభమవుతుంది. తటస్థంగా విశ్లేషణలందిస్తూ వేలల్లోనో, లక్షల్లోనో వీక్షకుల్ని సంపాదించుకుంటున్న వ్యక్తులు కూడా ఈ బిల్లు చట్టమైతే అనేకానేక పత్రాలు దాఖలుచేయాల్సివస్తుంది. అంతేకాదు...ఒక గ్రీవెన్స్ అధికారిని నియమించుకోవటం, స్వీయ మదింపు కమిటీని ఏర్పాటుచేసుకోవటం తప్పనిసరవుతుంది. ఈ వ్యయాన్నంతా వీక్షకులనుంచి వసూలు చేయటం సాధ్యమేనా? అసలు వచ్చే ఆదాయం ఎంత? పైగా తప్పుడు కథనాలు ప్రసారం చేశారనుకుంటే వారెంట్ లేకుండా దాడులు చేసి పరికరాలను స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వాలకు వస్తుందంటున్నారు.

ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధించి విపక్షాలను జైళ్లలో కుక్కి అసమ్మతిని అణిచేశారని బీజేపీ తరచు చెబుతుంటుంది. రాజ్యాంగాన్ని హత్య చేసిన రోజుగా ప్రతియేటా జూన్ 25ను పాటించాలని కూడా పిలుపునిచ్చింది. అలాంటి పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ ముసాయిదాను తీసుకురావటం, దాన్ని బహిరంగపరచకపోవటం వింత కాదా? మన పొరుగునున్న బంగ్లాదేశ్‌లో హసీనా హయాంలో ఇలాంటి చట్టాన్నే తీసుకొచ్చారు. కానీ అక్కడ నిరసన వెల్లువ ఆగిందా? తమ నిర్ణయాలపై సామాన్యులు ఏమనుకుంటున్నారో, వారిలోవున్న అసంతృప్తి ఏమిటో తెలుసుకోవటానికి డిజిటల్ మీడియా తోడ్పడుతుంది. అది పాలకులకే మంచిది. మీడియా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టయిన ఇలాంటి ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవటం ఉత్తమం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.దశమి ఉ.6.01 వరకు, తదుపరి ఏకాదశి తె.5.50 వరకు (తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** జ్యేష్ఠ ఉ.9.54 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** సా.6.04 నుండి 7.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.59 నుండి 10.47 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.52 వరకు, **అమృతఘడియలు:** రా.3.50 నుండి 5.27 వరకు.

సూర్యోదయం: 5.46
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు

మూలవాసుల అభివృద్ధా?
మూలాల విధ్వంసమా?

స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లవుతున్నా దేశ అభివృద్ధి నమూనా మారడం లేదు. అభివృద్ధి ఫలాలు కొందరి దగ్గరే పోగుబడడం అంతకంతకూ పెరిగిపోతోంది. సాంస్కృతిక హననంతోపాటు మూలవాసుల పేదరికమూ హెచ్చవుతోంది.

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

భారతదేశం ప్రపంచ దేశాల ముందు తలయెత్తుకొని నిలబడగలిగిన ప్రాకృతిక సంపదను కలిగి ఉంది. దాన్ని పరిరక్షించుకుంటూ, దేశ అభివృద్ధిని నిరంతరం పెంచి పోషించుకునే సూత్రాలు, అధికరణాలు రాజ్యాంగంలో ఎల్లెడలా పరచుకొని ఉన్నాయి. ముఖ్యంగా భారత రాజ్యాంగం మానవ హక్కుల పరిరక్షణలో బలమైన సూత్రాలను మనకు అందించింది. అధికరణం 46లో 'బలహీన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. బలహీన వర్గాలకు చెందిన ప్రజల (ప్రత్యేకించి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన ప్రజలు) ఆర్థికాభివృద్ధికి, వారిలో విద్యావకాశాల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలి. ఏ విధంగానూ దోపిడీకి గురి కాకుండా వారిని కాపాడాలి. వారికి సామాజికంగా అన్యాయం జరగకుండా చూడాల'ని ఉంది.

కానీ, ఇవాళ ఆర్థికాభివృద్ధి పేరుతో సహజవనరులు, సాంస్కృతిక సంపద హననానికి గురవుతోందనేది వాస్తవం. దక్షిణ భారత దేశం పారిశ్రామికంగా మిగతా ప్రాంతాల కన్నా వేగంగా అభివృద్ధి చెందుతోంది. అయితే ఈ అభివృద్ధి క్రమంలో... వేల ఏళ్ల పాటు తరతరాలు వారసత్వంగా మనకు అందించిన సాంస్కృతిక సంపద ధ్వంసమవుతోంది. దక్షిణ భారతదేశ నవీన రాతియుగ సంస్కృతి మూలాలు అంతరించే పరిస్థితులు వచ్చాయని చరిత్రకారులు, పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

సమాజ పరిణామక్రమంలో కొంత కాలానికి ప్రభుత్వాలేర్పడ్డాయి. చాలాకాలం వరకు అప్పటి ప్రభుత్వాలు భూమి పైన శిస్తు వసూలుకే పరిమితమయ్యాయి. కాని, భూమిపై హక్కును ఏర్పరచుకొనలేదు. కాలక్రమంలో భారతదేశాన్ని అనేక స్వదేశీ, విదేశీ తెగలు పరిపాలించాయి. మొగలాయీ చక్రవర్తుల కాలంలో భూమిశిస్తు వసూలు బాధ్యత ప్రభుత్వ అధికారుల నుండి ప్రైవేటు వ్యక్తులకు బదిలీ అయింది. వారే జమీందారులయ్యారు. బ్రిటీష్ వారి పాలనలో జమీందారులకు వారి అజమాయిషీలోని ఎస్టేటులపై 1793లో లార్డ్ కారన్‌వాలిస్ ఆస్తి హక్కు నిచ్చారు. భూమి కాస్తా అమ్మకపు సరుకైంది. కరవు కాటకాల సమయాల్లో నిర్బంధపు శిస్తులు కట్టలేక భూమిని అమ్ముకున్న రైతులు భూమిలేని పేదలయ్యారు. హెచ్చుగా భూములను కొన్నవారేమో... వడ్డీ వ్యాపారులు, భూస్వాములయ్యారు. భూమిని పోగొట్టుకున్న వారిలో చాలామంది కౌలు దారులయ్యారు. క్రమంగా భూస్వాముల నిర్బంధపు కౌలు వసూలును కౌలుదార్లు భరించలేని స్థితికి చేరారు. ఆ క్రమంలో వారు భూమిలేని గ్రామీణ పేదలయ్యారు. తిరిగి భూమిని పేదలకు పంచాలనే ఉద్యమాలు ప్రారంభమయ్యాయి, 1947 తర్వాత స్వతంత్ర భారతంలో ఈ ఉద్యమాలు ఊపందుకున్నాయి.



1948లో జమీందారీ వ్యవస్థ రద్దు కాక పూర్వం మామూలు భూస్వాములకు సగటున 100 ఎకరాలుండేది. 1938లో వచ్చిన ప్రకాశం కమిటీ రిపోర్టు ఆధారంగా తయారుచేసిన 'మద్రాసు ఎస్టేట్ రద్దు – రైత్వారీకి మార్పు బిల్లు' 1949 ఏప్రిల్ 19న శాసనసభ ఆమోదం పొంది, 1950లో రాష్ట్రపతి ఆమోదముద్ర పడి చట్టమైంది. ఈ చట్టం ప్రకారం పర్మనెంట్ సెటిల్మెంట్ ఎస్టేటు భూములు, అడవులు, గనులు, ఖనిజాలు గల భూములన్నీ రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోకి వచ్చాయి. జమీందారులకు పెద్ద ఎత్తున నష్టపరిహారం చెల్లిస్తూ, వారి సొంత సేద్యానికి సారవంతమైన వేలాది ఎకరాలు వదిలి వేయబడ్డాయి. దీనితో జమీందారులు బడా భూస్వాములయ్యారు.

ప్రధానమైన వనరులన్నీ కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్ళాక... దేశంలో కరవు, అవిద్య, అనారోగ్యం, దురాక్రమణలతో కూడిన పాలనా విధానాలు పెరుగుతున్నాయి. డా॥ బీఆర్ అంబేడ్కర్ ఆనాడే దక్షిణ భారత అస్తిత్వాన్ని గురించీ, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల అస్తిత్వాల గురించి అనేక సూత్రాలు మనకు అందించారు. ముఖ్యంగా దక్షిణ భారత భూభాగంలో... స్థానిక భాషలు, సంస్కృతి, చరిత్ర, పురాతత్వ భావనలను పెంపొందించాలన్నారు. అంతేకాని వాటిని ఇతరులకు తాకట్టు పెట్టే విధానాలను అవలంబించరాదనీ, అందువల్ల భారతదేశం అంతర్గతంగా తాకట్టులోకి వెళ్ళే ప్రమాదం ఉందనీ చెప్పారు. నిజానికి ప్రస్తుత పాలకవర్గ నిష్క్రియాపర్వాన్ని అలా ఉంచితే... కాంగ్రెస్ నాయకత్వంలో ఉన్న 'ఇండియా' కూటమి కూడా దేశాన్ని తాకట్టు నుంచి విముక్తి చేసే విధంగా పార్లమెంటులో వాదించలేకపోతోంది. ఆ మాట ఒప్పుకోవాల్సిందే! కొన్ని కార్పొరేట్ శక్తులు వీరి వెనక కూడా ఉండడమే ఇందుకు ఒక కారణం కావచ్చు. ఇదే సమయంలో రాజ్యాంగ హక్కుల్ని కాపాడుకునే విషయంలో పార్లమెంటులోని దళిత బహుజన ఎం.పీలు నోరు మెదపకపోవడం వారి బానిసత్వాన్ని గుర్తు చేస్తోంది.

నిజానికి ఈ దేశం ఇలా కార్పొరేట్ శక్తుల, అగ్రవర్ణ భూస్వామ్య శక్తుల చేతుల్లోకి వెళ్ళడానికి ప్రధాన కారణం పూనా ప్యాక్ట్ ద్వారా ఉమ్మడి నియోజక వర్గాల్లో గెలిచిన దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలని చెప్పక తప్పదు. ఇప్పటికీ ఈ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు దళిత హక్కుల కోసం ఎలుగెత్తి మాట్లాడలేకపోతున్నారు అనేది స్పష్టమైన అంశం. అలాగే వామపక్షాలు కూడా అనేక సందర్భాల్లో దళిత బహుజనుల భూమి హక్కు మీద, కౌలుదార్ల హక్కుల మీద మాట్లాడటం తగ్గించారు.

మరోపక్క సెంటు భూమి కూడా లేని వారు భారతదేశంలో 80 కోట్ల మంది ఉన్నారు. బ్యాంకులో అప్పుల్లో ఉన్నవారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. ప్రభుత్వాలు ప్రజలకు ఉత్పత్తి క్రమాన్ని నేర్పటం లేదు. ప్రజల్లో జీవశక్తినీ, ఆత్మ విశ్వాసాన్నీ, ఆత్మ గౌరవ స్ఫూర్తినీ, స్వీయ జీవన ప్రమాణాన్నీ పెంచినప్పుడే దేశం ఇతర దేశాలకు అప్పులు ఇవ్వగలిగిన స్థాయికి ఎదుగుతుంది. ఈనాడు దేశీయ భావన, జాతీయ భావన, రాజ్యాంగ స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో పెంచాల్సిన బాధ్యత లౌకికవాద ప్రజాస్వామ్య శక్తుల చేతుల్లో ఉంది. రాజకీయ పార్టీల కన్నా ... ఎప్పుడూ ప్రజా ఉద్యమాలే దేశాన్ని మేల్కొలుపుతాయి. నిద్రావస్థలో మునిగిన సమాజాన్ని చైతన్యవంతం చేసి, అంబేడ్కర్ మార్గంలో ఈ దేశ సాంస్కృతిక వికాసానికి అందరం పాటుపడుదాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695

జాతీయవాదమా?
జాతీయోన్మాదమా?

ఇవాళ వ్యక్తులుగా పౌరులూ, సమాఖ్యలో భాగంగా ఉన్న రాష్ట్రాలూ తమ హక్కులను కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. జాతీయవాదం పేరుతో జాతీయోన్మాదాన్ని పాలకులు ప్రేరేపిస్తున్నారు. భిన్నాభిప్రాయాలను దేశ వ్యతిరేకమైనవిగా ముద్ర వేస్తున్నారు.

అభిప్రాయం



ప్రొ॥ కె నాగేశ్వర్

రాజకీయ వ్యతిరేకతను, పౌర సమాజంలో భిన్నాభిప్రాయాలను కలిగివుండి, పాలనను విమర్శించే ప్రతి ఒక్కరినీ ప్రస్తుత భారత పాలక వ్యవస్థ తరచుగా దేశ వ్యతిరేకులుగా చిత్రీకరించింది. ఈ ద్వేషభావం... అసలు జాతీయవాదం అంటే ఏమిటి, నిజమైన జాతీయవాది ఎవరు అనే మౌలిక ప్రశ్నలను లేవనెత్తింది. జాతీయవాదం అనే పదం విభిన్న రాజకీయ తత్త్వశాస్త్రాల ద్వారా ప్రత్యేకంగా గుర్తించబడింది.

జాతీయవాదంపై వలసవాద వ్యతిరేక దృక్పథం... కుల, మత, వర్గ, ప్రాంతీయ అనుబంధాలతో సంబంధం లేకుండా నిర్దిష్ట రాజకీయ భౌగోళిక ప్రాంతంలో నివసించే ప్రజలందరినీ తప్పనిసరిగా కలుపుతుంది. శక్తిమంతమైన వలస పాలకుల నుండి భారతదేశం విముక్తి పొందేందుకు అటువంటి జాతీయవాద దృక్పథం చాలా అవసరం. ఆ విధంగా, స్వాతంత్య్ర పోరాటంలో అందరినీ కలుపుకొని పోవడం వల్ల జాతీయవాదపు రాజ్యాంగ దార్శనికత అభివృద్ధి చెందింది. ఇతర సంకుచిత గుర్తింపుల కన్నా మిన్నగా అది పౌరుల ప్రాధాన్యాన్ని గుర్తిస్తుంది.

మతం లేదా జాతి వంటి వివాదాస్పద పరిగణనలపై ఆధారపడిన జాతీయవాద విభజన దృక్పథం తన లోపలే ఒక శత్రువును కనుగొంటుంది. విభజించి పాలించే వలస రాజ్యాల ప్రాజెక్టును లక్ష్యంగా చేసుకున్న బ్రిటిష్ వలసవాద వారసత్వపు కమ్యూనల్ అవార్డు చరిత్ర దృష్ట్యా, భారతదేశంలోని మతపరమైన మెజారిటీ శక్తులు ఇప్పుడు ముస్లింలను లోపలి శత్రువుగా ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ముస్లిం, ముజ్రా, మంగళసూత్ర, మందిర్ వంటివి సార్వత్రిక ఎన్నికలలో అధికార పార్టీ విభజిత ఎన్నికల చర్చలో ఆధిపత్యం చలాయించాయి. కానీ, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఇతర జీవనోపాధి సమస్యలు దాని పాలనను సవాలు చేశాయి.

జాతీయవాదపు వలసవాద వ్యతిరేక దృక్పథంలోని మరొక కోణం ఏమిటంటే... వైవిధ్యాన్ని వేడుకగా జరుపుకోవడమే! నిజానికి, భారత రాజ్యాంగం, దానిలోని అనేక నిబంధనలు, దేశ న్యాయశాస్త్రం అనేవి భిన్నత్వంలో ఏకత్వాన్ని ఎల్లప్పుడూ ఆధునిక భారత జాతీయవాదపు కొనసాగుతున్న ఇతివృత్తంగా సమర్థించాయి. దేశం దైవపరిపాలనచే నడుస్తోందనే దృష్టి కోణం ఉద్దేశపూర్వకంగా దేశం, దాని ప్రజల సజాతీయ దృక్పథాన్ని ప్రోత్సహించడం ద్వారా వైవిధ్యాన్ని అణిచివేస్తుంది. జాతీయతలోని అనేక ఉపజాతి విధేయతలు తప్పనిసరిగా పరస్పర విరుద్ధమైనవి కానప్పటికీ, వాస్తవానికి అవి పరిపూర్ణమైనవి అనే వాస్తవాన్ని గుర్తించడానికి ఇది నిరాకరిస్తుంది. ఉదాహరణకు, భాషాపరమైన గుర్తింపులు జాతీయ గుర్తింపుతో విభేదించాల్సిన అవసరం లేదు. స్వాతంత్య్ర పోరాటం భాషాప్రయుక్త రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ పోరాటాన్ని హృదయపూర్వకంగా స్వీకరించింది, దాని చట్టబద్ధమైన ప్రజాస్వామ్య స్వభావాన్ని గుర్తించింది. కానీ, భిన్నత్వానికి విరుద్ధమైన వారు విస్తృతమైన జాతీయ గుర్తింపు పేరుతో సమాజంపై ఏకరూప దృక్పథాన్ని రుద్దడానికి ప్రయత్నిస్తారు. ఒక దేశం – ఒకే మార్కెట్, ఒక దేశం – ఒకటే భాష, ఒక దేశం – ఒకేసారి ఎన్నికలు, ఒక దేశం – ఒకటే పన్ను అలాంటి అసహన ప్రయత్నాలకు ఉదాహరణలు.

ప్రస్తుత పాలక జాతీయవాద కథనం ప్రజల సామాజిక, ఆర్థిక శ్రేయస్సుతో కూడిన చిహ్నాలతో దేశం గురించిన నైరూప్య ఆలోచనను స్పృహతో ప్రోత్సహిస్తుంది. సాంఘిక, ఆర్థిక అసమానతలను సాధారణ మనిషికి హాని కలిగించేలా చేస్తుంది. కార్పొరేట్ సంపదలో పెరుగుదలను అసహజమైన అసమానతలపై జాతీయ గర్వకారణంగా చూపుతుంది. ఈ దృక్పథం అంతిమంగా కులం, వర్గం, అటువంటి ఆధిపత్య ధోరణులన్నింటినీ శాశ్వతంగా కొనసాగించే లక్ష్యానికే ఉపయోగపడుతుంది.

జాతీయవాదానికి సంబంధించి పైన పేర్కొన్న వక్రీకృత దృక్పథం స్వభావం ఏమిటంటే, ప్రక్రియ దిద్దుబాటును ప్రభావితం చేసే లక్ష్యంతో వాస్తవికతపై విమర్శనాత్మక ప్రశంసలను నిరోధిస్తూనే, గతం లేదా వర్తమానాన్ని విమర్శారహితంగా కీర్తించడం! అటువంటి విమర్శనాత్మక దృక్పథాన్ని వృత్తిపరమైన నిరాశావాదంగా కొట్టివేయడం జరుగుతుంది. కానీ, ఇది యథాతథ స్థితిని మాత్రమే ప్రోత్సహిస్తుంది. దేశ పురోగతిని అడ్డుకుంటుంది. నిరంకుశ జాతీయవాద ఉద్దేశ్యం స్వార్థ ప్రయోజనాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఉంది. అందువల్ల, భారతదేశ నాగరికత వారసత్వంగా ఉన్న వాదనా విధానం అణచివేయబడింది. దేశద్రోహం వంటి ప్రాచీన చట్టాల బలిపీఠం వద్ద వాక్ స్వాతంత్య్రాన్ని త్యాగం చేశారు. భిన్నాభిప్రాయాలను దేశ వ్యతిరేకమైనవిగా ముద్ర వేస్తారు. పౌర హక్కులు, స్వేచ్ఛ వంటివి జాతీయవాద ప్రాజెక్టుకు సహించరానివిగా చిత్రీకరించబడ్డాయి.

నిజమైన జాతీయవాదం దాని సొంత గుర్తింపును మాత్రమే ప్రోత్సహిస్తుంది, ఆత్మగౌరవాన్ని వేడుక చేసుకుంటుంది. కానీ, జాతీయోన్మాదం బలవంతంగా, అసంకల్పితంగా అటువంటి స్వీయ అహంకారాన్ని దాని పౌరులపై మోపుతుంది. అటువంటి జాతీయోన్మాదాన్ని ప్రశ్నించే ఎవరైనా దేశం పట్ల అసంతృప్తిని ప్రదర్శించే వ్యక్తిగా పరిగణించబడతారు. నిజానికి అసమ్మతి అనేది ప్రజాస్వామ్యంలో ఓ అంతర్భాగం. కానీ, మెజారిటీ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకించే సామాజిక, రాజకీయ శక్తులు చట్టబద్ధమైన జాతీయ గర్వాన్ని తగినంతగా ప్రకటించనప్పుడు జాతీయోన్మాదం విశ్వసనీయతను పొందుతుంది. ఆధునిక భారతీయ జాతీయవాదాన్ని ప్రజాస్వామ్యం, భాష, మతపరమైన బహుళత్వం, వైవిధ్యం, సమాఖ్యవాదం, లౌకికవాదం, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం మొదలైన రాజ్యాంగ విలువలపై తిరుగులేని నిబద్ధతతో నిర్వచించాలి. అందువల్ల రాజ్యాంగ జాతీయవాదం ఆధునిక ప్రజాస్వామ్యాలలో అభివృద్ధి చెందిన పౌరసత్వ భావనపై కేంద్రీకృతమై ఉంది. దీనికి విరుద్ధంగా, విభజన గుర్తింపులపై ఆధారపడిన జాతీయవాదం... రాజ్యాంగవాదానికి వ్యతిరేక సిద్ధాంతం. అందువల్ల, మెజారిటీ గుర్తింపుపై ఆధారపడిన జాతీయవాద కథానాయకుడు రాజ్యాంగపు ప్రాథమిక నిర్మాణాన్ని ద్వేషిస్తాడు. అటువంటి మెజారిటీ జాతీయ వాదం అసంపూర్తిగా ఉన్న ప్రజాస్వామిక ప్రాజెక్టులో కొనసాగుతున్న సామాజిక దోష రేఖలను ఉపయోగించు కోవడం ద్వారా అభివృద్ధి చెందుతుంది.

అంబేడ్కర్ 'రాజ్యాంగ నైతికత అనేది సహజమైన భావన కాదు, ఎవరికి వారు పెంపొందించుకోవాల్సినది' అని గమనించారు. అందువల్ల, మెజారిటీ జాతీయవాదానికి వ్యతిరేకంగా పోరాటం కేవలం నైతిక లేదా నైతిక విమర్శ కాదు. రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో నేటికీ కొనసాగుతున్న సామాజిక లోపాలను సరిదిద్దడానికి కఠిన ప్రయత్నం అవసరం. కొందరిని అతి శక్తిమంతుల్ని చేసే ఘనత వహించిన జాతీయవాదంపై తద్వారానే పోరాడవచ్చు. కానీ జాతీయవాదపు లౌకిక, ఉదారవాద విమర్శ మెజారిటీ జాతీయవాద సాంస్కృతిక అంశాలపై దృష్టి పెడుతోంది. అసలు జాడ్యాన్ని విడిచిపెట్టి, దాని లక్షణాలపై మాత్రం ఇలాంటి పోరాటం చేస్తే, అది స్వీయ ఓటమినే మిగులుస్తుంది. దానికి బదులు అటువంటి వక్రీకృత జాతీయవాద ప్రపంచ దృక్పథానికి జవజీవాలను అందించే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక దోష రేఖలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం సాగించడమే మార్గం.

వ్యాసకర్త ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

మనం సాధించిందీ తక్కువేమీ కాదు!

సందర్భం



డా॥ పి.ఎస్. చారి

భారతదేశం తన 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకొంటోంది. వికసిత్ భారత్–2047 అనేది స్వాతంత్య్రం వచ్చి 100వ సంవత్సరమైన 2047 నాటికి సాకారం చేయాలని ప్రభుత్వ లక్ష్యం. భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే దృక్పథం ఉండటమే కాదు, దాన్ని తు.చ. అనుసరించడం అవసరం. వికసిత్ భారత్ అనేది ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, సుపరిపాలన వంటి వివిధ అంశాల ఆధారంగా ఉంటుంది. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు స్వాతంత్య్ర సమరయోధుల ఆశయాలను నెరవేర్చేందుకు ఎంతవరకు కృషి చేస్తున్నామో మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. స్వాతంత్య్ర సమరయోధుల స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ కలలను మనం ఎంతవరకు సాధించాము? భారతదేశం తన జీవన ప్రమాణాలను మెరుగుపరిచిందా? ఇవన్నీ ఈ సందర్భంగా చర్చనీయాంశాలే.

మన దేశం 3.937 ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తితో ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ప్రస్తుతం 2023–24లో తలసరి ఆదాయం రూ. 2.12 లక్షలు. కానీ ఇప్పటికీ మనం 5 శాతం పేదరికంతో బాధపడుతున్నాము. 2023 ప్రపంచ ఆకలి సూచిక ప్రకారం, 125 దేశాలలో భారతదేశం 111వ స్థానంలో ఉంది. భారత ఆర్థిక వ్యవస్థను పర్యవేక్షించే కేంద్రం (సీఎంఐఈ) ప్రకారం, భారతదేశంలో నిరుద్యోగం రేటు 2024 మేలో 7 శాతం ఉంటే ఆ మరుసటి నెల (జూన్)లో 9.2 శాతానికి పెరిగింది. ఒక శాతం జనాభా



సంపద వాటా 2022–23లో 40.1 శాతంగా ఉంది. 2023–24లో దేశంలోని పొదుపులో 92 శాతం సంపన్నులైన 20 శాతం మంది కలిగి ఉన్నారు.

వీటితో పాటు 2023లో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ యొక్క 'కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్' ప్రకారం 100కి 40 శాతం అవినీతి భారంతో భారతదేశం ఉంది. భారతదేశం 2023 నాటికి తన స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 3–4 శాతం విద్యపై ఖర్చు చేస్తోంది. ఆరోగ్య సంరక్షణపై 1.2–1.5 శాతం ఖర్చు చేస్తోంది. మానవాభివృద్ధి–సంబంధిత అంశాలపై మొత్తం వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 6–8 శాతంగా అంచనా వేయబడింది. అయితే ఇది వార్షిక బడ్జెట్ కేటాయింపులు, విధాన మార్పుల ఆధారంగా మారవచ్చు. సరళీకరణ ఆర్థిక వ్యవస్థలో 'రెడ్ టేపిజం' ఇప్పటికీ తన ప్రభావాన్ని చూపుతోంది. బంధుప్రీతి దాదాపు అన్ని రంగాలలో కనిపిస్తుంది. అయితే ఇది వ్యాపారం, రాజకీయాలు, క్రీడలు, వినోద రంగాలలో ఎక్కువగా కనిపిస్తుంది. దురదృష్టవశాత్తు ఇప్పటికీ మనం వరకట్నం, ఆడ శిశుహత్య, లింగ అసమానత్వం, గృహహింస, అంటరానితనం వంటి సాంఘిక దురాచారాలతో కునారిల్లుతున్నాం.

మన దేశం ఎన్ని ఆటంకాలు ఎదురైనా విభిన్న రంగాలలో చాలా అభివృద్ధిని సాధించింది. మానవ వనరులలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. ఉక్కు, బొగ్గు ఉత్పత్తిలో; మొబైల్ వినియోగంలో, వ్యవసాయ ఉత్పత్తిలో ప్రపంచంలో 2వ ర్యాంక్ కలిగి ఉంది. బిలియనీర్ల సంఖ్యలో 3వ ర్యాంక్, గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ అవుట్‌పుట్ మరియు స్పేస్‌లో 5వ స్థానంలో ఉంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను స్వీకరించడంలో 8వ స్థానంలో ఉంది, 14వ అతిపెద్ద ఎగుమతిదారు మన దేశం. సాంస్కృతిక వైవిధ్యంలో 17వ ర్యాంక్, ఐటీ పరిశ్రమ పోటీతత్వంలో 18వ ర్యాంక్, హ్యాపీ ప్లానెట్ ఇండెక్స్‌లో 30వ ర్యాంక్, గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 40వ స్థానాన్ని భారత్ నిలుపుకుంది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఫిన్‌టెక్, పునరుత్పాదక శక్తి, బయోటెక్నాలజీ, డిజిటల్ లావాదేవీలు ఉన్నాయి.

సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ యుగంలో నిరంతర ఆర్థికాభివృద్ధి మరియు విభిన్న సంక్షేమ కార్యక్రమాలతో స్వాతంత్య్ర దినోత్సవ స్ఫూర్తిని మనం కొనసాగించాలి. దేశంలోని పౌరులు తమ హక్కులను పరిరక్షించడానికి మానవ హక్కుల సంఘాలు, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, ఫోర్త్ ఎస్టేట్, సమాచార హక్కు చట్టం మొదలైన ప్లాట్‌ఫారమ్‌లు, చట్టాల గురించి తెలుసుకోవాలి.

పౌరుల ఆర్థిక పరిస్థితులు మెరుగు పడినప్పుడే సమానత్వం, సౌభ్రాతృత్వం లభిస్తాయి. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలపై అవగాహన ఉన్న పౌరుల భాగస్వామ్యంతోనే స్వాతంత్య్ర సమర యోధుల స్ఫూర్తిని సాధించగలుగుతాం.

వ్యాసకర్త మేనేజ్మెంట్ స్టడీస్‌లో ఆచార్యులు
మొబైల్ : 83090 82823

కలాలు ఎక్కుపెట్టిన వీరులు

భారతదేశ స్వాతంత్య్ర పోరాటంలో ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా, భారతీయులందరినీ ఒక్కటి చేసేందుకు ఎందరో తమ కలాలను ఎక్కుపెట్టారు. రవీంద్రనాథ్ టాగూర్ కవిత్వం, కథలు, నాటకాలు, వ్యాసాలు వంటి అన్ని ప్రక్రియల్లోనూ దేశభక్తిని పెంపొందించే రచనలు చేశారు. దేశానికి జాతీయ గీతాన్ని అందించింది ఆయనే. తన కలం శక్తితో బ్రిటిష్ వారికి ముచ్చెమటలు పట్టించిన మరో రచయిత బంకించంద్ర ఛటర్జీ. 1874లో రాసిన 'వందేమాతర గీతం' స్వాతంత్ర్యోద్యమాన్ని మలుపు తిప్పింది, ఆంగ్లేయులపై పోరాటానికి ఇదే నినాదంగా మారింది. ఈ గేయం మన దేశ జాతీయ గేయంగా నిలిచిపోయింది.

స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఎందరో స్త్రీమూర్తులలో సుభద్ర కుమారి చౌహాన్ ఒకరు. బ్రిటిష్‌వాళ్లకు వ్యతిరేకంగా అనేక ఘాటైన వ్యాసాలు రాశారు, ఝాన్సీ రాణి లక్ష్మీబాయిపై రాసిన కవిత్వం అప్పట్లో సంచలనం కలిగించింది. బ్రిటిష్ ఖజానా ధనాన్ని తీసుకువెళుతున్న రైలును కకోరీ వద్ద దోపిడీ చేసి వారికి సవాల్ విసిరిన విప్లవ వీరకిశోరాల్లో రామ్ ప్రసాద్ బిస్మిల్ ఒకరు. 'సర్ఫరోష్ కీ తమన్నా అబ్ హమారే దిల్మే హై' అని ఆయన రాసిన గీతం అప్పట్లో ఓ సంచలనం. జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త అయిన శ్యామలాల్ గుప్తా 'విజయ్ విశ్వ తిరంగ ప్యారా' గీతం ప్రతి స్వాతంత్య్ర ఉద్యమకారుడిని ధైర్యంగా ముందుకు నడిపించింది. అలాగే 'సారే జహాసే అచ్ఛా, హిందుస్థాన్ హమారా' అంటూ అద్భుత గీతాన్ని రాసి, స్వరపరిచారు మహమ్మద్ ఇక్బాల్.

స్వేచ్ఛా భారతదేశం కోసం 1908లో సంచలనాత్మక 'సుదేశ గీతాలు' ద్వారా దేశభక్తి, ఆధ్యాత్మిక ఇతివృత్తాలతో తమిళ కవి, జాతీయవాది సుబ్రహ్మణ్య భారతి ప్రజలను జాగృత పరిచారు.

స్వాతంత్ర్యోద్యమంలో తన గీతాల ద్వారా ప్రజలను ఉద్రూతలూగించిన తెలుగువారు గరిమెళ్ళ సత్యనారాయణ. ఆయన రాసిన 'మా కొద్దీ తెల్ల దొరతనం...' పాట సత్యాగ్రహులకు గొప్ప తెగువనూ, ఉత్తేజాన్ని కలిగించింది. దేశభక్తి కవితలు రాసి జైలుశిక్ష అనుభవించిన కవులలో ప్రథముడు గరిమెళ్ళ. మరో తెలుగు కవి రాయప్రోలు సుబ్బారావు 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా– ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన' వంటి గీతం, 'అవమానమేలరా! అనుమానమేలరా! భారతీయుడనంచు భక్తితో పాడ,' 'లేరురా మన వంటి వీరులింకెందు' అని రాసిన గీతాలు గొప్ప ప్రేరణ ఇచ్చాయి.

గురజాడ అప్పారావు 'దేశమంటే మట్టి కాదోయ్ – దేశమంటే మనుషులోయ్' అంటూ రాసిన గీతం కాని, చిలకమర్తి లక్ష్మీనరసింహం రాసిన 'భరతఖండంబు చక్కని పాడియావు'అనే పద్యం కానీ, త్రిపురనేని రామస్వామి 'వీర గంధము తెచ్చినారము వీరుడెవ్వడు దెల్పుడి' అనే గేయం, అలాగే మైథిలీ శరణ్ గుప్తా, భరతేందు హరిశ్చంద్ర, మున్షీ ప్రేమ్‌చంద్... ఇతరులు అనేక మంది రాసిన సాహిత్యం కానీ దేశ స్వాతంత్ర్యాన్ని సాధించడంలో తమ వంతు పాత్ర పోషించాయనడం అతిశయోక్తి కాదు.

– డా॥ బాలాజీ దీక్షితులు పి.వి
మొబైల్: 88853 91722

ఎనిమిది మందికి ఐపీఎస్ హోదా

- జాబితాను విడుదల చేసిన కేంద్ర హోంశాఖ

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు చెందిన 8 మంది రాష్ట్ర పోలీస్ అధికారులకు ఐపీఎస్‌లుగా పదోన్నతి కల్పించే ఎంపిక జాబితాకు యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) ఆమోదముద్ర వేసింది. జూలై 23న జరిగిన సెలక్షన్ కమిటీ సమావేశంలో ఖరారు చేసిన జాబితాను యూపీఎస్సీ తాజాగా ఆమోదించింది. ఈ మేరకు పదోన్నతికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర హోం శాఖ బుధవారం విడుదల చేసింది. 2022 సంవత్సరానికిగాను ఇద్దరికి, 2023 సంవత్సరానికిగాను ఆరుగురు అధికారులకు తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారులుగా పదోన్నతి కల్పించనున్నారు. వీరిలో ఇద్దరిపై క్రమశిక్షణ ప్రొసీడింగ్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన తర్వాతే వారికి ఐపీఎస్ హోదా లభిస్తుందని హోం శాఖ అండర్ సెక్రటరీ సంజీవ్‌కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2022 సంవత్సరానికి వై.సాయి శేఖర్, సీహెచ్ సమేజాన్‌రావు, 2023 సంవత్సరానికి బి.రాంరెడ్డి, సీహెచ్.శ్రీధర్, ఎస్.చైతన్య కుమార్, ఎ.భాస్కర్, కె.నరసింహ, కె.శిల్పవల్లి పదోన్నతి పొందారు. ఖాళీగా ఉన్న ఐపీఎస్ పోస్టుల్లో రాష్ట్ర ప్రభుత్వం వీరిని నియమించనుంది.

సీజనల్ వ్యాధులను అరికట్టే చర్యలు తీసుకోండి

- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆమె స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సందర్భంగా పలు సూచనలు చేశారు. సీజనల్ జ్వరాలు, డెంగీ, చికున్ గున్యా తదితర వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు కలెక్టర్లు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. కలెక్టర్లతో పాటు జిల్లాలోని ఇతర ఉన్నతాధికారులు అన్ని పాఠశాలలు, హాస్టళ్ల సందర్శించి పిల్లలకు జ్వరాలు, ఇతర వ్యాధులు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. హాస్టళ్లు, పాఠశాలల్లో ఆహారం, పరిశుభ్రతను కూడా తనిఖీ చేయాలని ఆమె సూచించారు. కలెక్టర్లు అన్ని పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి రోగులకు తగిన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు. ప్రైవేట్ ఆసుపత్రులు న్యాయమైన పద్ధతులను అనుసరించేలా చూడాలన్నారు. కాగా, కుక్కల సమస్యను పరిష్కరించేందుకు వీధికుక్కలకు స్టెరిలైజేషన్ కార్యక్రమం చేపట్టాలని అన్నారు.

నిఖత్ జరీన్ దేశానికి గర్వకారణం

- 2028లో దేశానికి స్వర్ణం తెస్తుంది: షబ్బీర్ అలీ


నిఖత్ జరీన్‌ను అభినందిస్తున్న షబ్బీర్ అలీ

సాక్షి, హైదరాబాద్: పారిస్ ఒలింపిక్స్‌లో హైదరాబాద్‌కు చెందిన మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ మెచ్చుకోదగ్గ ప్రదర్శన చేసిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ ప్రశంసించారు. ఒలింపిక్స్‌లో పాల్గొని తిరిగి వచ్చిన నిఖత్ జరీన్.. తన తండ్రి మహమ్మద్ జమీల్ అహ్మద్‌తో కలిసి బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ 2028 ఒలింపిక్స్‌లో నిఖత్ స్వర్ణ పతకాన్ని తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరిగే బాక్సింగ్ ఈవెంట్‌లలో ఆమె విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆమె బాక్సింగ్ కెరీర్‌కోసం ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తనకు గ్రూప్–1 హోదాలో ఉద్యోగం, 600 చదరపు గజాల స్థలం ఇవ్వడం పట్ల తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, షబ్బీర్ అలీకి నిఖత్ జరీన్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు అనుసరిస్తున్న విధానాలను ఆమె ప్రశంసించారు.

సబ్సిడీ బియ్యానికి రూ. 2 వేల కోట్లు

సాక్షి, హైదరాబాద్: పేదలకు అందించే ఉచిత బియ్యం పథకానికి రూ. 2,000 కోట్ల రాయితీని ప్రభుత్వం విడుదల చేసింది. 2024–25 రాష్ట్ర బడ్జెట్‌లో సబ్సిడీ బియ్యం కోసం రూ. 3 వేల కోట్లను కేటాయించడం తెలిసిందే. ఇందులో భాగంగా మూడు పద్దుల కింద రూ. 2 వేల కోట్లు విడుదల చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు.

జయశంకర్ అగ్రి వర్సిటీకి జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు



సాక్షి, హైదరాబాద్: బోధన, పరిశోధన, విస్తరణ విభాగాల్లో చేపట్టిన వినూత్న కార్యక్రమాల కుగాను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు దక్కింది. దేశవ్యాప్తంగా 145 వ్యవసాయ, అనుబంధ పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయాలు ఈ ర్యాంకింగ్‌లో పాల్గొన్నాయి. ఇందులో టాప్–40 సంస్థలకు ఎన్ఐఆర్ఎఫ్ తాజాగా ర్యాంకులను ప్రకటించింది. ఇందులో హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం 37వ ర్యాంకు సొంతం చేసుకుంది. గతేడాది ఎన్ఐఆర్ఎఫ్ ప్రకటించిన టాప్ 40 విద్యాసంస్థలలో వర్సిటీకి చోటు లభించలేదు. ఈ ఏడాది బోధన, పరిశోధనా, విస్తరణ కార్యక్రమాలను మెరుగుపర్చడంతో ఈ ర్యాంకు దక్కిందని విశ్వవిద్యాలయ వర్గాలు చెబుతున్నాయి. బోధన కార్యక్రమాల్లో భాగంగా వర్సిటీ ద్వారా 2023–24 విద్యా సంవత్సరంలో ఆదిలాబాద్, తొర్నాలలో 60 మంది విద్యార్థులతో రెండు కొత్త వ్యవసాయ డిగ్రీ కళాశాలలను ప్రారంభించింది. నారాయణపేట్‌లో నూతన పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు, వివిధ డిగ్రీ కోర్సులలో సీట్ల సంఖ్యను 1,370కి పెంపుదల, వివిధ పంటలలో 8 నూతన వంగడాలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో విడుదల చేసింది. ఇందులో 5 రకాలను రాష్ట్రస్థాయిలో, 3 వంగడాలను జాతీయస్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీ ఆమోదంతో విడుదల చేసింది.

రిలయన్స్ 'డిజిటల్ ఇండియా' సేల్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రిలయన్స్ డిజిటల్ దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ విక్రయాల కోసం 'డిజిటల్ ఇండియా సేల్'ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ సేల్ సమయంలో వినియోగ దారులు అన్ని రిలయన్స్ డిజిటల్, మై జియో స్టోర్‌లలో అద్భుతమైన ఆఫర్‌లను పొందొచ్చు. అన్ని ఎలక్ట్రానిక్స్ కొనుగోలుపై 25 శాతం వరకు తగ్గింపులను పొందడమే కాకుండా సౌకర్యవంతమైన ఈఎంఐ సౌలభ్యంతో సులభంగా రుణాలు కూడా పొందవచ్చు. ఆగస్టు 18, 2024 వరకు ఈ సేల్ కొనసాగనుంది. ఈ సేల్ ద్వారా టీవీలు, ఐఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లపై భారీ తగ్గింపు ధరలు అందుబాటులో ఉంటాయని రిలయన్స్ డిజిటల్ వెల్లడించింది.

దూర విద్య మరింత భద్రం

- గుర్తింపు వర్సిటీలతో యూజీసీ పోర్టల్

సాక్షి, హైదరాబాద్: సార్వత్రిక, దూర విద్యలతో పాటు ఆన్‌లైన్ విద్య ప్రవేశాల్లో గుణాత్మక మార్పులు చేపట్టినట్టు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తెలిపింది. యూజీసీ అనుమతి ఉన్న విద్యా సంస్థల వివరాలను ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించింది. దీనికోసం యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. ఆన్‌లైన్ ద్వారా ఉన్నత విద్యలో ప్రవేశాలు పొందాలనుకునే వారు ఈ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరింది. ఎలాంటి అనుమతిలేని విశ్వవిద్యాలయాల్లో కోర్సులు చేసిన విద్యార్థులు గతంలో అనేక ఇబ్బందులు పడ్డారని, ఇక మీదట ఈ పరిస్థితి తలెత్తకుండా చేయడమే దీని ఉద్దేశమని తెలిపింది. మరింత పారదర్శకంగా ఉండేందుకు చేపట్టిన ఈ మార్పులు 2024–25 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. వెబ్ పోర్టల్‌తో పాటు విద్యార్థులకు ఉపయుక్తంగా అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్‌ను అందుబాటులోకి తెచ్చామని తెలిపింది. విద్యార్థి చేసే కోర్సుకు సంబంధించిన అన్ని వివరాలు ఇందులో పొందుపరుస్తారు. ఈ ఏడాది అకడమిక్ సెషన్ సెప్టెంబర్ నుంచి మొదలవుతుందని యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్ వెల్లడించారు.

ట్యాపింగ్ ప్రధాన నిందితులు ఎక్కడ?

- నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితులైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌కుమార్ రావు ఎక్కడున్నారని, వారిని తెచ్చేందుకు ఇంకా ఎన్నిరోజుల సమయం తీసుకుంటారని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నాంపల్లి కోర్టు ప్రశ్నించింది. అమెరికాలో ఉన్న వారిని పట్టుకునేందుకు పోలీసు అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారని, త్వరలోనే వారిని తెస్తామని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పారు. బుధవారం ట్యాపింగ్ కేసు విచారణ సందర్భంగా చంచల్‌గూడ జైల్లో ఉన్న నలుగురు నిందితులు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును పోలీసులు నాంపల్లిలోని 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచారు. నిందితుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్, మిగతా డాక్యుమెంట్లు సరిగ్గా లేవని, వారు మొత్తం డాక్యుమెంట్లను తమకు ఇవ్వలేదని చెప్పారు. దీంతో అన్ని డాక్యుమెంట్లను సరిచూసుకొని నిందితుల తరఫు న్యాయవాదికి ఇవ్వాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను మేజిస్ట్రేట్ ఆదేశించారు. జైల్లో ఉన్న నలుగురు నిందితులకు ఈనెల 28 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగిస్తూ.. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేశారు.

ఒకరోజు ముందే ఎందుకంటే..!

పాకిస్తాన్‌కు కూడా ఆగస్టు 15నే స్వాతంత్య్రం ● దేశ విభజన చట్టంలోనూ స్పష్టంగా ఉంది ● కానీ ఏటా ఆగస్టు 14నే స్వాతంత్య్ర వేడుకలు

1947 ది అదర్ సైడ్

బ్రిటిష్ పాలన నుంచి 1947లో ఇండియాకు విముక్తి లభించినా ఆంగ్లేయుల కుట్ర దేశాన్ని రెండు ముక్కలు చేసింది. ఫలితంగా భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా ఆవిర్భవించాయి. ఆగస్టు 15న ఒకే రోజు అధికారికంగా ఉనికిలోకి వచ్చాయి. కనుక రెండింటికీ అదే స్వాతంత్య్ర దినం. కానీ పాక్ మాత్రం ఆగస్టు 14నే తమ స్వాతంత్య్ర దినంగా జరుపుకుంటుంది. ఎందుకో తెలుసా? ఏటా భారత్ కంటే ముందే వేడుకలు చేసుకోవాలని నాటి పాక్ పెద్దలు చేసిన ఆలోచన వల్ల! లేదంటే చరిత్రను చూసినా, ఇంకే కోణంలో ఆలోచించినా అంతకుమించి దీని వెనక మరో కారణమేదీ ఏమీ కన్పించదు. స్వాతంత్య్ర ప్రకటన మొదలుకుని రెండు దేశాలకు అధికారాన్ని బ్రిటన్ బదలాయించడం దాకా ఏం జరిగిందన్నది నిజంగా ఆసక్తికరం...

భారత స్వాతంత్య్ర చట్టాన్ని 1947 జూలై 18న ప్రకటించారు. '1947 ఆగస్టు 15న భారత్, పాకిస్తాన్ పేరిట బ్రిటిషిండియా రెండు స్వతంత్ర దేశాలుగా ఏర్పడనుంది' అని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. పాక్ జాతి పిత, తొలి గవర్నర్ జనరల్ మహ్మదాలీ జిన్నా కూడా జాతినుద్దేశించి ప్రసంగించింది కూడా ఆగస్టు 15వ తేదీనే. ఆగస్టు 15ను స్వతంత్ర, సార్వభౌమ పాకిస్తాన్' పుట్టినరోజుగా ఆ ప్రసంగంలో ఆయన అభివర్ణించారు. ఇలాంటి వాస్తవాలు, రికార్డులతో పాటు లాజిక్ ప్రకారం చూసినా పాక్‌కు కూడా ఆగస్టు 15 మాత్రమే స్వాతంత్య్ర దినమని ఆ దేశానికి చెందిన సీనియర్ జర్నలిస్టు షాహిదా కాజీ అభిప్రాయపడ్డారు. జిన్నా, పాక్ తొలి మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసింది కూడా 1947 ఆగస్టు 15వ తేదీనే అని ఆయన గుర్తు చేశారు. 1948 జూలైలో పాక్ విడుదల చేసిన తొలి స్మారక పోస్టల్ స్టాంపుపై కూడా ఆగస్టు 15ను దేశ స్వాతంత్య్ర దినంగా స్పష్టంగా పేర్కొన్నారు. పాక్ మాజీ ప్రధాని చౌధురీ ముహమ్మద్ అలీ 1967లో రాసిన పుస్తకంలో కూడా ఈ ప్రస్తావన ఉంది. ''1947 ఆగస్టు 15 ఈదుల్ ఫిత్ర్ పర్వదినం. ముస్లింలకు అతి పవిత్రమైన ఆ రోజునే ఖాద్-ఏ-ఆజం (జిన్నా) పాక్ తొలి గవర్నర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించారు. తొలి మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసింది. నెలవంక, నక్షత్రంతో కూడిన పాక్ పతాకం ప్రపంచ యవనికపై తొలిసారి అధికారికంగా ఎగిరింది'' అని రాసుకొచ్చారు.



దేశ విభజన చర్చల సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ, మౌంట్‌బాటెన్, మహ్మదాలీ జిన్నా

- సాక్షి, నేషనల్ డెస్క్

ఆగస్టు 14న ఏం జరిగిందంటే...

1947 ఆగస్టు 14న నాటి బ్రిటిషిండియా వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటెన్ కరాచీలో పాక్ రాజ్యాంగ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్య్ర చట్టం ప్రకారం ఆయన ఆగస్టు 15న భారత్, పాక్ రెండింటికీ అధికారాన్ని లాంఛనంగా బదలాయించాలి. బ్రిటన్ సింహాసన ప్రతినిధిగా సంబంధిత ప్రక్రియను వ్యక్తిగతంగా దగ్గరుండి పూర్తి చేయాలి. కానీ, అందుకోసం ఒకే రోజు ఇటు ఢిల్లీలో, అటు కరాచీలో ఉండటం సాధ్యపడని పని. పోనీ ముందుగా భారత్‌కు అధికారాన్ని బదలాయించాక కరాచీ వెళ్లడమూ కుదరదు. ఎందుకంటే బ్రిటన్ రాణి నిర్ణయం మేరకు విభజన అనంతరం స్వతంత్ర భారత్‌కు ఆయన తొలి గవర్నర్ జనరల్ అవుతారు. భారత్‌కు అధికార బదలాయింపు జరిగిన క్షణమే ఆయనకు వైస్రాయ్ హోదా పోయి గవర్నర్ జనరల్ హోదా వస్తుంది. కనుక బ్రిటిషిండియా వైస్రాయ్‌గా ఉండగానే పాక్‌కు అధికార మార్పిడి ప్రక్రియ పూర్తి చేయాలి. అందుకే మౌంట్‌బాటెన్ 14వ తేదీనే కరాచీ వెళ్లి ఆ లాంఛనం పూర్తి చేసి ఢిల్లీ తిరిగొచ్చారు. పాక్‌కు స్వాతంత్య్రం మాత్రం ఆగస్టు 15నే వచ్చింది.



వాఘా బోర్డర్‌లో బీటింగ్ రిట్రీట్

ముందుకు జరుపుకోవడం వెనక...

విభజన చట్టం ప్రకారం, వాస్తవాల ప్రాతిపదికన... ఇలా ఏ లెక్కన చూసినా పాక్ కూడా భారత్‌తో పాటే ఏటా ఆగస్టు 15వ తేదీనే స్వాతంత్య్ర దినం జరుపుకోవాలి. కానీ స్వాతంత్య్రం వచ్చిన మరుసటి ఏడాది నుంచే, అంటే 1948 నుంచే ఆగస్టు 14న స్వాతంత్య్ర దినం జరుపుకుంటూ వస్తోంది. దీనికి రకరకాల కారణాలు చెబుతారు. ఎక్కువమంది చెప్పేదేమిటంటే, భారత్ కంటే ముందే స్వాతంత్య్ర వేడుకలు చేసుకోవాలని నాటి పాక్ పెద్దల మెదళ్లను ఓ పురుగు తొలిచిందట! దాంతో 1948 జూన్ చివర్లో నాటి ప్రధాని లియాకత్ అలీ ఖాన్ తన మంత్రివర్గాన్ని సమావేశపరిచి ఈ మేరకు అధికారికంగా తీర్మానించారు. ఈ నిర్ణయాన్ని ఎవరూ ప్రశ్నించొద్దంటే పాక్ జాతి పిత జిన్నా ఆమోదముద్ర ఉండాలని భావించారట. అందుకే, స్వాతంత్య్ర దినాన్ని ఒక రోజు ముందుకు జరిపేందుకు జిన్నా కూడా అనుమతించారని తీర్మానంలో స్పష్టంగా పేర్కొన్నారు. కానీ అది శుద్ధ అబద్ధమని, 1948 ఆగస్టు నాటికే జిన్నా మరణశయ్యపై ఉన్నారని ఆయన జీవిత చరిత్ర రాసిన యాసర్ లతీఫ్ హందానీ స్పష్టం చేశారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్...
కెప్టెన్ వీరమరణం



శ్రీనగర్: స్వాతంత్య్ర వేడుకల వేళ జమ్మూకశ్మీర్‌లో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. ఉగ్రవాదులను ఏరేసే క్రమంలో ఎదురుకాల్పుల్లో ఆర్మీ కెప్టెన్ వీరమరణం పొందారు. ఓ ముష్కరున్ని బలగాలు మట్టుబెట్టాయి. దోడా జిల్లా అస్సార్ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఈ ఎన్‌కౌంటర్లో ఓ పౌరుడు కూడా గాయపడ్డాడు. శివగఢ్-అస్సర్ ప్రాంతంలో విదేశీ ముష్కరులు నక్కారన్న సమాచారంతో మంగళవారం నుంచే సైన్యం, పోలీసులు సంయుక్తంగా కార్డన్ సెర్చ్ చేపట్టారు. రాత్రి వేళ స్వల్ప కాల్పుల అనంతరం ఉగ్రవాదులు పారిపోయారు. బుధవారం ఉదయం బలగాలు వారి ఆచూకీని కనిపెట్టాయి. ఉగ్రవాదుల కాల్పుల్లో కెప్టెన్ దీపక్ సింగ్ తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన సైనిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. అనంతరం కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. అతడి నుంచి ఏకే 47 తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్ రాత్రి దాకా కొనసాగింది. మరో ముగ్గురు ఉగ్రవాదులు దాగున్నట్టు భావిస్తున్నారు.

అసమానతలను రూపుమాపాలి

- విభజన యత్నాలను తిప్పికొట్టాలి
- ఇక నవ తరం సంస్కరణలు
- పంద్రాగస్టు ప్రసంగంలో రాష్ట్రపతి

న్యూఢిల్లీ: సామాజిక అసమానతలను పెంచి పోషించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. ''వ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన విభజన ధోరణులను సమూలంగా పెకిలించాలి. అన్ని వర్గాలవారినీ కలుపుకుపోయేలా గట్టి కార్యాచరణ రూపొందించి అమలు చేసినప్పుడే అది సాధ్యం'' అని స్పష్టం చేశారు. 78వ స్వాతంత్య్ర దినం సందర్భంగా మంగళవారం ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు. భారత్‌లో రాజకీయ ప్రజాస్వామ్యం స్థిరమైన ప్రగతి సాధిస్తోందన్నారు. విస్తరిస్తున్న సామాజిక ప్రజాస్వామ్యానికి అది నిదర్శనమని చెప్పారు. భిన్నత్వం, బహుళత్వమే ఆభరణాలుగా దేశమంతా ఐక్యంగా ముందుకు సాగుతోందంటూ హర్షం వెలిబుచ్చారు. సామాజిక న్యాయానికి మోదీ సర్కారు అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఇతర అణగారిన వర్గాల అభ్యున్నతికి చేపట్టిన చర్యలను వివరించారు. మహిళల అభ్యున్నతికీ పెద్దపీట వేసిందన్నారు. దేశ విభజన సందర్భంగా జరిగిన అంతులేని అకృత్యాలు, మానప్రాణ నష్టం ఎన్నటికీ మర్చిపోలేనివంటూ ఆవేదన వెలిబుచ్చారు.



స్ఫూర్తిదాయక ప్రసంగం: మోదీ

భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో భాగంగా నవతరం ఆర్థిక సంస్కరణలకు రంగం సిద్ధమైందని రాష్ట్రపతి తెలిపారు. ఆర్థిక రంగంలో భారత్ దూసుకుపోతోందంటే దీర్ఘదృష్టితో కూడిన సారథ్యం, రైతులు, ఇతర సంపద సృష్టికర్తల నిర్విరామ శ్రమే కారణమన్నారు. అద్భుతమైన మౌలిక సదుపాయాలు, ఏఐతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పటిష్టమైన బ్యాంకింగ్ వ్యవస్థ, ఉరకలెత్తుతున్న ఆర్థిక రంగం భారత్‌ను ప్రపంచ పెట్టుబడిదారుల గమ్యస్థానంగా మారుస్తున్నాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగం స్ఫూర్తిదాయకంగా ఉందంటూ మోదీ ప్రశంసించారు.

మరో బంగ్లాదేశ్ చేద్దామనుకుంటున్నారు

- వైద్యురాలి హత్యపై చిల్లర రాజకీయాలు
- విపక్షాలపై మమత ధ్వజం

కోల్‌కతా: వైద్యురాలి రేప్, హత్యపై విపక్షాలు చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని, విద్యార్థులను ఎగదోసి బంగ్లాదేశ్ లాంటి పరిస్థితులు సృష్టించాలని అనుకుంటున్నాయని సీపీఎం, బీజేపీలపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి ఆవరణలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసును కలకత్తా హైకోర్టు సీబీఐకి అప్పగించడంపై తమకేమీ అభ్యంతరం లేదని, సీబీఐకి పూర్తిగా సహకరిస్తామని, కేసు త్వరితగతిన తేలాలనేదే తమ అభిమతమని పేర్కొన్నారు. 'వైద్యురాలి కుటుంబానికి అండగా నిలువాల్సిందిపోయి సీపీఎం, బీజేపీలు చవకబారు రాజకీయాలు చేస్తున్నాయి. బంగ్లాదేశ్ లాంటి పరిస్థితి ఇక్కడా తేగలమని వారు అనుకుంటున్నారు. నేనొకటే చెప్పదలచుకున్నాను. నాకు అధికార వ్యామోహం లేదు' అని మమత అన్నారు. హత్య గురించి తెలియగానే రాత్రంతా కేసును పర్యవేక్షించానని, పోలీసు కమిషనర్‌తో, బాధితురాలి తల్లిదండ్రులతో మాట్లాడానని వివరించారు. మేము ఏం చేయలేదో చెప్పండి? ఏం చర్యలు తీసుకోలేదో చెప్పండి? అని విపక్షాలపై మండిపడ్డారు. 'డీఎస్ పరీక్ష, సీసీటీవీ ఫుటేజీని సేకరించడం, శాంపిల్స్‌ను పరీక్షించడం.. ఇలా ప్రతిదీ 12 గంటల్లోపే జరిగింది. నిందితుడిని కూడా 12 గంటల్లోనే అరెస్టు చేశాం' అని చెప్పుకొచ్చారు. సీబీఐ ఆదివారం లోగా కేసును ఛేదించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతా పోలీసులు 90 శాతం దర్యాప్తును పూర్తి చేశారన్నారు. దోషులను ఉరి తీయాలన్నారు. వైద్యురాలికి న్యాయం జరగాలనే డిమాండ్‌తో స్వయంగా తాను శుక్రవారం కోల్‌కతా వీధుల్లో నిరసన ప్రదర్శన చేయనున్నట్లు వెల్లడించారు.



నిందితుడిని రక్షించే ప్రయత్నం: రాహుల్

వైద్యురాలి రేప్, హత్య ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. బాధితురాలికి న్యాయం చేయాల్సింది పోయి నిందితుడిని రక్షించే ప్రయత్నాలు జరగడం ఆసుపత్రిపై, అధికార యంత్రాంగంపై పలు సందేహాలకు తావిస్తోందన్నారు. డాక్టర్లలో, మహిళల్లో అభద్రతా భావం నెలకొందన్నారు. ''మెడికల్ కాలేజీలోనే డాక్టర్లకు భద్రత లేకపోతే తల్లిదండ్రులు తమ కూతుళ్లను చదువు కోసం ఎలా పంపిస్తారు? నిర్భయ వంటి కఠినచట్టాలు కూడా ఇలాంటి నేరాలను ఎందుకు ఆపలేకపోతున్నాయి?'' అని ప్రశ్నించారు.





వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా బుధవారం అర్ధరాత్రి కోల్‌కతాలో ర్యాలీ

వైద్యురాలిపై గ్యాంగ్‌రేప్!

జననాంగంలో భారీ పరిమాణంలో వీర్యం

కాళ్లు విరిచేశారన్న పోస్ట్‌మార్టం నివేదిక

కోల్‌కతా/న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా ఆర్జీ కార్ ప్రభుత్వ వైద్యకళాశాల ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఉదంతంలో విస్తుగొలిపే విషయాలు వెలుగు చూస్తున్నాయి. ప్రధాన నిందితుడు పోలీస్ వాలంటీర్ సంజయ్ రాయ్‌తో పాటు మరికొందరి ప్రమేయం ఉండవచ్చన్న అనుమానాలను పోస్ట్‌మార్టం నివేదిక బలపరుస్తోంది. మృతురాలి జననాంగంలో 151 గ్రాముల వీర్యం ఉన్నట్లు పోస్ట్‌మార్టం నివేదిక వెల్లడించిందని జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. ఇది కచ్చితంగా గ్యాంగ్ రేపేనని ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ సువర్ణ గోస్వామి చెప్పారు. ''మృతురాలి శరీరంలో తీవ్రమైన గాయాలున్నాయి. ఒక్క వ్యక్తి ఇన్ని గాయాలు చేయలేడు! ఎక్కువ మంది దాడి చేసినట్లు అనిపిస్తోంది'' అన్నారు.

ఒళ్లంతా గాయాలే

నాలుగు పేజీల పోస్ట్‌మార్టం నివేదికలో విస్మయకర వివరాలున్నాయి. ''రేప్ చేశాక గొంతు నులిమి చంపారు. పెనుగులాట సందర్భంగా కదలకుండా తలను గోడకు బలంగా అదమడంతో వెనక వైపు పెద్ద గాయమైంది. ముఖమంతా గీసుకుపోయింది. కేకలు వేయకుండా నోరు మూసేశారు. గొంతుపై బలంగా నొక్కడంతో థైరాయిడ్ కార్టిలేజ్ చితికిపోయింది. జననాంగాల వద్ద లోతైన గాయమైంది. లైంగికదాడే అందుకు కారణం. నడుము, పెదాలు, చేతి వేళ్లు, ఎడమ కాలిపై గాయాలున్నాయి. రెండు కళ్ల నుంచి, నోటి నుంచి రక్తస్రావమైంది. ముక్కు, నోరు గట్టిగా అదిమిపట్టి మూసేసినట్లు చర్మం కమిలింది'' అని నివేదిక పేర్కొంది. ''కాళ్లు పూర్తిగా 90 డిగ్రీల కోణంలో వంపు తిరిగాయి. కటిభాగం వద్ద 'పెల్విక్ గార్డిల్' చీలిపోయింది. అంటే కాళ్లను పూర్తిగా పక్కకు విరిచేశారు' అని వైద్యురాలి బంధువు ఒకావిడ విలపిస్తూ చెప్పారు.

మూడు గంటలు బయటే నిలబెట్టారు

మృతదేహాన్ని చూపించకుండా ఆస్పత్రి బయట మూడు గంటలు బయటే నిలబెట్టారని కుటుంబసభ్యులు ఆరోపించారు. ''తర్వాత తండ్రిని అనుమతించారు. తన ఒంటిపై బట్టల్లేవు. కాళ్లు పక్కకు విరిచేసినట్లు ఫొటోలోకనిపిస్తోంది. కళ్లద్దాల ముక్కలు కంట్లో ఉన్నాయి. ఊపిరాడకుండా చేసి చంపేశారు' అంటూ కన్నీటిపర్యంతం అయ్యారు.

కమలా హారిస్‌దే పైచేయి

ట్రంప్‌పై 4.2 శాతం ఆధిక్యం ● పోల్ ఆఫ్ ది పోల్స్ వెల్లడి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష రేసులో డెమొక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్‌దే పైచేయిగా ఉందని తాజాగా వెల్లడైంది. డెసిషన్ డెస్క్ హెచ్‌క్యూ- ది హిల్ కూర్చిన పోల్ ఆఫ్ ది పోల్స్‌లో దేశవ్యాప్తంగా డొనాల్డ్ ట్రంప్ కంటే హారిస్ 4.2 శాతం ఆధిక్యంలో ఉన్నారు. 45 పోల్స్‌ను క్రోడీకరించి ఫలితాలను వెల్లడించారు. కమలా హారిస్ ఏకంగా 4.2 శాతం ఆధిక్యంలో ఉండగా, మే తర్వాత ఆమె ఏకంగా పది శాతం పుంజుకోవడం విశేషం. హోరాహోరీ పోరు నెలకొన్న ఏడు రాష్ట్రాల్లో ఆరింటిలో ట్రంప్‌పై హారిస్ ఒకశాతం ఆధిక్యంలో ఉన్నారని బెనెన్‌సన్ స్ట్రాటజీ గ్రూపు-జీఎస్ స్ట్రాటజీ గ్రూపు సర్వే వెల్లడించింది. హోరాహోరీ రాష్ట్రాలైన జార్జియా, మిషిగాన్, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్, అరిజోనాల్లో హారిస్‌కు ఒక శాతం ఆధిక్యం ఉంది. నెవెడాలో మాత్రం ట్రంప్ ముందంజలో ఉన్నారు. నెవెడాలోనూ హారిస్ క్రమేపీ పుంజుకుంటున్నారు. మే నుంచి తీసుకుంటే ట్రంప్‌తో వ్యత్యాసాన్ని ఆరు పాయింట్ల మేరకు తగ్గించారు. ట్రంప్‌తో పోలిస్తే కమలా హారిస్ నిజాయితీ, క్రమశిక్షణ కలిగిన నాయకురాలని అమెరికన్లు భావిస్తున్నట్లు అసోసియేటెడ్ ప్రెస్- ఎన్‌ఓఆర్‌సీ సర్వే తెలిపింది. ఆర్థిక వ్యవస్థ, వలసల అంశాల్లో ట్రంప్ మెరుగని భావిస్తున్నారు. అధ్యక్ష రేసులోకి లేటుగా వచ్చినా హారిస్ దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 10న ట్రంప్‌తో ఆమె డిబేట్ పోటాపోటీగా ఉంటుందని భావిస్తున్నారు. అందరి దృష్టీ దానిపైనే నెలకొంది.

కల్నల్ మన్‌ప్రీత్‌కు కీర్తిచక్ర



కల్నల్ మన్‌ప్రీత్ సింగ్



హుమయూన్ భట్

న్యూఢిల్లీ: కశ్మీర్ లోయలో ఉగ్రవాదులతో పోరులో వీరమరణం పొందిన కల్నల్ మన్‌ప్రీత్‌సింగ్, జమ్మూకశ్మీర్ డీఎస్పీ హుమయూన్ ముజ్జామిల్ భట్‌కు కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర అవార్డ్‌ను ప్రకటించింది. రైఫిల్‌మన్ రవికుమార్ (మరణానంతరం), మేజర్ మల్ల రామగోపాల్ నాయుడు, (మరణానంతరం)లనూ కీర్తిచక్రతో ప్రభుత్వం గౌరవించింది. శాంతిసమయంలో ప్రకటించే రెండో అత్యున్నత గ్యాలెంట్రీ అవార్డ్‌కు ఈసారి నలుగురికి ఎంపికచేశారు. అనంత్ నాగ్ అడవుల్లో ఆర్మీ బృందానికి నాయకత్వం వహిస్తూ ప్రాణాలను లెక్కచేయకుండా ఉగ్రవాదులను నేరుగా ఎదుర్కొని ఒక ఉగ్రవాదిని కల్నల్ మన్‌ప్రీత్ హతమార్చారు. తర్వాత నక్కిన ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. త్రివిధ దళాల సర్వసైన్యాధ్యక్ష హోదాలో రాష్ట్రపతి ముర్ము బుధవారం మొత్తం 103 గ్యాలంట్రీ అవార్డులను ప్రకటించారు. కీర్తిచక్రతోపాటు 18 మందికి శౌర్య చక్ర, ఒకరికి బార్ టు సేనా మెడల్, 63 మందికి సేనా మెడల్, 11 మందికి నావో సేనా మెడల్, ఆరుగురికి వాయుసేనా మెడల్ ప్రకటించారు. ఒక ప్రెసిడెంట్ తట్‌రక్షక్ మెడల్, మూడు తట్‌రక్షక్ మెడళ్లనూ తీర గస్తీ దళాలకు ప్రకటించారు.

ఆ బకాయిలను రాష్ట్రాలకు చెల్లించాల్సిందే

గనుల రాయల్టీ, పన్నులపై సుప్రీం



న్యూఢిల్లీ: ఖనిజ సంపన్న రాష్ట్రాలకు శుభవార్త. గనులకు సంబంధించిన రాయల్టీ, పన్నుల తాలూకు బకాయిలను కేంద్రం నుంచి వసూలు చేసుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. 2005 ఏప్రిల్ 1 నుంచీ బకాయిలను వసూలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు బుధవారం తీర్పు వెలువరించింది. బకాయిలను 12 ఏళ్లలోపు చెల్లించాలని కేంద్రాన్ని, వాటిపై పెనాల్టీల వంటివేమీ విధించొద్దని రాష్ట్రాలను ఆదేశించింది.ధర్మాసనం తరఫున సీజేఐ తీర్పు రాశారు. ఖనిజాలు, నిక్షేపాలున్న భూములపై రాయల్టీ వసూలు అధికారం కేంద్రానిదేనన్న 1989 నాటి సుప్రీంకోర్టు తీర్పును పలు రాష్ట్రాలు సవాలు చేశాయి. గనులు, ఖనిజాలపై రాయల్టీ విధించే అధికారం రాష్ట్రాలకే ఉంటుందంటూ 8:1 మెజారిటీతో జూలై 25న ధర్మాసనం తీర్పు వెలువరించింది. దీన్ని 1989 నుంచీ వర్తింపయాలని పలు రాష్ట్రాలు కోరాయి. దీన్ని కేంద్రం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇందుకు ఒప్పుకుంటే సంబంధిత ప్రభుత్వ రంగ సంస్థలు రాష్ట్రాలకు రూ.70 వేల కోట్ల మేరకు చెల్లించాల్సి రావచ్చని తెలిపింది. కనుక తీర్పును జూలై 25 నుంచే వర్తింపజేయాలని అభ్యర్థించింది. దీన్ని ధర్మాసనం తాజాగా తోసిపుచ్చింది.

మోదీ 11వ సారి

నేడు ఎర్రకోట నుంచి ప్రసంగం

న్యూఢిల్లీ: 78వ స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా 11వ సారి ఎర్రకోట నుంచి ప్రసంగించనున్నారు. 2004-2014 కాలంలో పదిసార్లు ప్రసంగించిన మన్మోహన్‌సింగ్ రికార్డును బద్దలు కొట్టనున్నారు. అయితే నెహ్రూ 17 సార్లు, ఇందిరాగాంధీ 16 సార్లు ఎర్రకోట నుంచి ప్రసంగించారు. వేడుకల నేపథ్యంలో 10,000 మంది పోలీసులు, 3,000 మంది ట్రాఫిక్ పోలీసుల పహారాతో ఢిల్లీని శత్రు దుర్భేద్యంగా మార్చారు.

ఈడీ డైరెక్టర్‌గా రాహుల్ నవీన్



న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పూర్తికాలపు డైరెక్టర్‌గా రాహుల్ నవీన్ నియమితులయ్యారు. ఈడీ తాత్కాలిక చీఫ్‌గా వ్యవహరిస్తున్న ఆయనను బుధవారం పూర్తిస్థాయి డైరెక్టర్‌గా నియమించారు. నవీన్ ఇండియన్ రెవెన్యూ సర్వీసు (ఐఆర్‌ఎస్) 1993 బ్యాచ్.. ఇన్‌కంట్యాక్స్ కేడర్‌కు చెందిన అధికారి. రాహుల్ నవీన్‌ను రెండేళ్ల కాలానికి, లేదా తదుపరి ఆదేశాలు వచ్చేవరకు (ఇందులో ఏది ముందైతే అది వర్తిస్తుంది) ఈడీ డైరెక్టర్‌గా నియమిస్తున్నట్లు క్యాబినెట్ నియామకాల కమిటీ ఆదేశాలు జారీచేసింది. 57 ఏళ్ల నవీన్ 2019 నవంబరులో స్పెషల్ డైరెక్టర్‌గా ఈడీలో చేరారు. ఈడీ డైరెక్టర్‌గా సంజయ్‌కుమార్ మిశ్రా పదవీకాలం గత ఏడాది సెప్టెంబరు 15న ముగియడంతో.. నవీన్ అప్పటినుండి తాత్కాలిక డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ పన్ను వ్యవహారాల్లో నవీన్ నిపుణులు. తాత్కాలిక డైరెక్టర్‌గా నవీన్ వ్యవహరించిన కాలంలోనే మనీలాండరింగ్ కేసుల్లో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ల సంచలన అరెస్టులు జరిగాయి.

ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ఎంటెక్

రాహుల్ నవీన్ బిహార్‌కు చెందిన వారు. ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి బీటెక్, ఎంటెక్ చేశారు. మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)లోని స్విన్‌బుర్నే యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎంబీఏ పూర్తిచేశారు. ఆదాయపు పన్ను శాఖలో 30 ఏళ్లు పనిచేశారు. అంతర్జాతీయ ట్యాక్సేషన్స్‌పై నవీన్ రాసిన పలు వ్యాసాలను నాగ్‌పూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్‌లో ట్రైనీ ఐఆర్‌ఎస్ విద్యార్థులకు పాఠాలుగా బోధిస్తున్నారు. ''ఇన్ఫర్మేషన్ ఎక్స్చేంజ్ అండ్ ట్యాక్స్ ట్రాన్స్‌పరెన్సీ: టాక్లింగ్ గ్లోబల్ ట్యాక్స్ ఎవాషన్ అండ్ అవాయిడెన్స్'' శీర్షికన నవీన్ రాసిన పుస్తకం 2017లో ప్రచురితమైంది.

ఐరాసలో భారత రాయబారిగా హరీశ్



సాక్షి, న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితికి భారత శాశ్వత ప్రతినిధిగా పర్వతనేని హరీశ్‌ను నియమిస్తూ కేంద్ర విదేశాంగ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం జర్మనీలో భారత రాయబారిగా సేవలందిస్తున్న హరీష్ త్వరలో యూఎన్ అంబాసిడర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని కేంద్రం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సెప్టెంబర్‌లో ఐరాసలో ప్రధాని మోదీ ఒక సదస్సుకు హాజరుకానున్న నేపథ్యంలో హరీశ్ నియామకం త్వరగా పూర్తయింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ జూన్‌లో పదవీవిరమణ చేశాక ఆ పోస్ట్ అప్పటి నుంచీ ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో తదుపరి రాయబారి నియామక ప్రక్రియను కేంద్రం వేగంగా పూర్తిచేసింది. 1990 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారి అయిన హరీష్ మూడు దశాబ్దాలుగా విదేశాంగ శాఖ పరిధిలో పలు దేశాల్లో పనిచేశారు.

కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా గోవింద్ మోహన్



న్యూఢిల్లీ: సీనియర్ ఐఏఎస్ అధికారి గోవింద్ మోహన్ తదుపరి కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా ఉన్న గోవింద్ మోహన్‌ను అజయ్ కుమార్ భల్లా స్థానంలో హోంశాఖ కార్యదర్శిగా నియమిస్తూ కేబినెట్ నియామకాల కమిటీ నిర్ణయం తీసుకుందని ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. ఈనెల 22న అజయ్‌కుమార్ పదవీ విరమణ చేయనున్నారు. అదేరోజు గోవింద్ మోహన్ బాధ్యతలు చేపడతారు.

నళిన్ ప్రభాత్ పదవీకాలం కుదింపు



నేషనల్ సెక్యూరిటీ గార్డ్ డైరెక్టర్ జనరల్‌గా నళిన్ ప్రభాత్ పదవీకాలం 2028 ఆగస్టు 31 ఉండగా కేంద్రం అర్ధంతరంగా కుదించింది. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన నళిన్‌ను డిప్యుటేషన్‌పై ఏజీఎంయూటీ కేడర్‌కు మార్చింది. ఈ మేరకు కేబినెట్ నియామకాల కమిటీ బుధవారం ఆదేశాలు జారీచేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేదాకా లేదా మూడేళ్లపాటు నళిన్ ఏజీఎంయూటీ కేడర్‌లో డిప్యుటేషన్‌పై కొనసాగుతారని వివరించింది. అరుణాచల్ ప్రదేశ్– గోవా– మిజోరం – కేంద్ర పాలిత ప్రాంతాలను కలిపి ఏజీఎంయూటీ కేడర్‌గా పిలుస్తారు. ఇది కేంద్ర హోంశాఖ నియంత్రణలో ఉంటుంది. ప్రభాత్‌కు కేంద్రం కొత్త బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

సెప్టెంబర్‌లో మళ్లీ పోటీచేయను

జపాన్ ప్రధాని పదవి నుంచి తప్పుకోనున్నట్లు పరోక్షంగా తెలిపిన కిషిద



టోక్యో: జపాన్ అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ(ఎల్‌డీపీ) అధ్యక్షుడు, ఆ దేశ ప్రధాని ఫుమియో కిషిద త్వరలో ప్రధాని పదవి నుంచి తప్పుకోనున్నారు. ఎల్‌డీపీ అధికారంలో ఉన్న నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడే దేశ ప్రధాని అవుతారు. అయితే సెప్టెంబర్‌లో జరగబోయే పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేయట్లేదని కిషిద బుధవారం ప్రకటించారు. 2021లో ఎల్‌డీపీకి అధ్యక్షుడిగా ఎన్నికైన కిషిద పార్టీ అధ్యక్ష పదవీకాలం ఈ సెప్టెంబర్‌తో ముగుస్తోంది. దీంతో ఆయన మళ్లీ పార్టీ పగ్గాలు, దేశ అధికార పగ్గాలు చేపడతారన్న చర్చ నడుమ కిషిద పక్కకు తప్పుకోవడం గమనార్హం. పార్టీలో అవినీతి కుంభకోణాలుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరగడంతోపాటు ఆయనకు ప్రజల్లో మద్దతు సైతం 20 శాతానికి పడిపోయిన నేపథ్యంలో స్వచ్ఛందంగా పక్కకు జరగాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

థాయిలాండ్ ప్రధానికి ఉద్వాసన

నైతిక ఉల్లంఘన అభియోగాలపై తొలగించిన కోర్టు



బ్యాంకాక్: అవినీతి మరక అంటుకున్న వ్యక్తిని తిరిగి మంత్రివర్గంలోకి తీసుకుని నైతిక ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ థాయిలాండ్ ప్రధాన మంత్రి స్రెట్టా థావిసిన్‌ను అక్కడి రాజ్యాంగ ధర్మాసనం ప్రధాని పదవి నుంచి తొలగించింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీని రద్దుచేయాలంటూ ఒక కోర్టు నుంచి ఉత్తర్వులు వెలువడిన వారం రోజులకే ఇలా ప్రధాన మంత్రి పదవి ఊడిపోవడం గమనార్హం. '' నన్ను క్షమించండి. నన్ను కోర్టు అనైతిక ప్రధానిగా భావించిందిగానీ నేను అలాంటి వ్యక్తినికాదు. ఏదేమైనా కోర్టు తీర్పును శిరసావహిస్తా' అని తీర్పు తర్వాత ప్రధాని స్రెట్టా వ్యాఖ్యానించారు. స్రెట్టాకు వ్యతిరేకంగా 5:4 మెజారిటీతో బుధవారం కోర్టు తీర్పు వెలువరించింది. తక్షణం తమ ఆదేశాలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఏప్రిల్‌లో కేబినెట్ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా పిచిత్ చుయెన్‌బన్‌ను మంత్రిగా ఎంపికచేశారు. అయితే 2008లో ఆయన ఒక జడ్జికి 55వేల అమెరికన్ డాలర్లు లంచం ఇవ్వజూపిన కేసులో అరెస్టయి ఆరు నెలలపాటు జైలు జీవితం గడిపి విడుదలయ్యారు. అవినీతి నేతకు మళ్లీ మంత్రి పదవి కట్టబెట్టారంటూ ప్రధానిపై విమర్శలు వెల్లువెత్తడం తెల్సిందే.

సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు చుక్కెదురు

మధ్యంతర బెయిల్‌కు కోర్టు నిరాకరణ



న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం కుంభకోణానికి సంబంధించి సీబీఐ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం స్పష్టంచేసింది. దీనిపై స్పందన తెలపాలంటూ సీబీఐకి నోటీసులిచ్చింది. ఇదే మనీలాండరింగ్ కేసులో మూడుసార్లు కేజ్రీవాల్‌కు బెయిల్ ఇచ్చారని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించినా ఫలితంలేకుండా పోయింది. మే 10, జూలై 12న సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వగా ట్రయల్ కోర్టు జూన్ 20న సాధారణ బెయిల్ మంజూరు చేసింది. జూన్ 20న ట్రయల్ కోర్టు నుంచి వచ్చిన బెయిల్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు మౌఖిక ఆదేశాల ద్వారా స్టే విధించిందని అభిషేక్ సుప్రీంకోర్టుకు గుర్తుచేశారు. అయినాసరే మధ్యంతర బెయిల్ ఇచ్చేదిలేదని కోర్టు స్పష్టం చేస్తూ కేసు తదుపరి విచారణను 23వ తేదీకి వాయిదావేసింది.

హిమాలయాల్లో భూకంపాలపై అధ్యయనం



ఒప్పందం కుదుర్చుకుంటున్న ఎన్‌జీఆర్‌ఐ, ఇస్రో ప్రతినిధులు

ఉప్పల్ (హైదరాబాద్): హిమాలయాల్లో భూకంపాలపై అధ్యయనానికి ఎన్‌జీఆర్‌ఐ, ఇస్రో మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఎన్‌జీఆర్‌ఐలో జరిగిన ఒక కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్, ఇస్రో ఎన్ఆర్ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్‌లు ఎంవోయూపై సంతకాలు చేశారు. రెండు సంస్థలు మూడేళ్ల పాటు కలిసి పరిశోధనలు జరపనున్నాయి. పశ్చిమ హిమాలయాల్లోని టెక్టోనిక్ పలకల కదలికలు, క్రస్టల్ డిఫార్మేషన్ తదితర వివరాలను నిరంతరం జీపీఎస్ ద్వారా, ఉపగ్రహాధారిత పరిశీలనల విశ్లేషణకు ఇరు సంస్థలు పరస్పర సహకారాలు అందించుకుంటాయని ఎన్‌జీఆర్‌ఐ తెలిపింది.

విద్యావ్యవస్థను బీఆర్ఎస్, కాంగ్రెస్ భ్రష్టు పట్టించాయి

- కాసం వెంకటేశ్వర్లు ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: విద్యా వ్యవస్థను బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు భ్రష్టు పట్టించాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. యూనివర్సిటీ ఫ్యాకల్టీల్లో దాదాపు 70 శాతం మేరకు ఖాళీలు ఉన్నాయని, రాష్ట్రంలో ఒక్క యూనివర్సిటీకి కూడా వైస్-చాన్స్‌లర్ లేరని ఆయన దుయ్యబట్టారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌లో రాష్ట్ర యూనివర్సిటీలు, కాలేజీలు అసలు ఉనికిలో లేకుండా పోయాయని ఎద్దేవా చేశారు. ఏటేటా ఉస్మానియా యూనివర్సిటీ ర్యాంకింగ్ దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో 46వ ర్యాంకు, 2023లో 64వ ర్యాంకు, 2024లో 70వ ర్యాంకుకు దిగజారిపోయిందన్నారు. గత మేలోగా అన్ని యూనివర్సిటీలకు వైస్-చాన్స్‌లర్లను నియమిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినా, కనీసం సెర్చ్ కమిటీలను కూడా ఏర్పాటు చేయలేకపోతోందని ఆరోపించారు. యూనివర్సిటీల్లో ఫ్యాకల్టీని నియమించి, పరిశోధనలకు నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాఠశాల విద్యా వ్యవస్థ గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 14,028 స్కూళ్లలో విద్యార్థినులకు కనీసం టాయిలెట్స్ కూడా లేవని వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

గాంధీలో జూడాల విధుల బహిష్కరణ

తొమ్మిది డిమాండ్లతో పాలనాధికారులకు వినతిపత్రం అందజేత

- అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో కొనసాగిన నిరసనలు
- వైద్యసేవల్లో జాప్యంతో రోగుల ఇబ్బందులు
- జూడాల ఆందోళనకు మంత్రి సీతక్క సంఘీభావం



గాంధీలో జూడాల ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్న మంత్రి సీతక్క

గాంధీ ఆస్పత్రి: కోల్‌కతాలో విధి నిర్వహణలో ఉన్న వైద్యవిద్యార్థినిపై లైంగికదాడి, హత్యలకు నిరసనగా సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జూనియర్ వైద్యులు నిరసన చేపట్టారు. బుధవారం అవుట్‌పేషెంట్ విభాగ విధులను బహిష్కరించి, ఆస్పత్రి ప్రాంగణంలో ధర్నా, ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య విద్యార్థులపై జరుగుతున్న దాడుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జూడాల సంఘం గాంధీ యూనిట్ అధ్యక్షుడు వంశీకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థుల ప్రధానమైన 9 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఇవీ డిమాండ్లు

రెసిడెంట్, మహిళ, పురుష వైద్యులకు వేర్వేరుగా హైజెనిక్ డ్యూటీరూమ్‌లను ఏర్పాటు చేయాలని, డాక్టర్స్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ కమిటీ ఏర్పాటు, వైద్యులు, వైద్యవిద్యార్థులు విధులు నిర్వహించే ప్రాంతాల్లో 24 గంటలూ సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని, ఆస్పత్రి మెయిన్ ఎంట్రన్స్, అత్యవసర విభాగం, ఇతర ప్రదేశాల్లో సెక్యూరిటీ గార్డులను నియమించి, పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని, కళాశాల మైదానంలో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలని, ఆస్పత్రి ప్రాంగణంలోని జయశంకర్ విగ్రహం నుంచి బాయ్స్ హాస్టల్, ఇతర చీకటి ప్రదేశాల్లో వీధిదీపాలను ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి ప్రాంగణంతోపాటు హాస్టల్స్ పరిసర ప్రాంతాల్లో వీధికుక్కలను నిరోధించాలని, పీజీ హాస్టల్‌కు సింగిల్ ఎంట్రీ, ఎగ్జిట్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి సెక్యూరిటీ వ్యవస్థను మరింత పటిష్టపర్చాలని కోరుతూ ఆస్పత్రి, మెడికల్ కాలేజీ పాలనాధికారులకు వినతిపత్రం సమర్పించారు. జూడాల ఓపీ విధుల బహిష్కరణ ఫలితంగా వైద్యసేవల్లో జాప్యంతో నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా, అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో బుధవారం ఈ నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. గురువారం కూడా విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఐజాక్ న్యూటన్ తెలిపారు.



సచివాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న జూడాలు

వైద్యులకు అండగా మేమున్నాం: మంత్రి సీతక్క

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం అత్యంత హేయమైన చర్య అని మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగిని పరామర్శించిన అనంతరం అక్కడ ఆందోళన చేస్తున్న జూడాల వద్దకు వచ్చి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడుతూ వైద్యులకు తాము అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి, మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు, హత్యాయత్నాలు జరగకుండా కఠినమైన చట్టాలను తేవడంతో పాటు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తామని హామీనిచ్చారు.


బాలిక వాంగ్మూలాన్ని ఇంటి వద్ద తీసుకోలేమా?

అత్యాచారం కేసులో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అత్యాచారానికి గురై తీవ్ర భయభ్రాంతుల్లో ఉన్న అంధ బాలిక వాంగ్మూలాన్ని ఇంటి వద్ద తీసుకోవడానికి అభ్యంతరం ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ, విచారణ ఈ నెల 19కి వాయిదా వేసింది. హైదరాబాద్ మలకపేట్‌లోని అంధ బాలికల వసతి గృహంలో అంధ బాలికపై బాత్‌రూమ్‌లు కడిగేందుకు వచ్చిన ఓ యువకుడు నరేశ్ అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. తీవ్ర రక్తస్రావంతో బాలిక అస్వస్థతకు గురైంది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గత నెల 16న పోక్సో చట్టం కింద మలకపేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో మేజిస్ట్రేట్ ముందుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వాలని దర్యాప్తు అధికారి బాలికపై ఒత్తిడి తెస్తున్నారంటూ ఆమె తల్లి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీవ్ర భయభ్రాంతులకు గురైన బాలిక వాంగ్మూలాన్ని ఇంటి వద్దే తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వసుధా నాగరాజ్ వాదనలు వినిపించారు. ప్రస్తుతం బాలిక తల్లిదండ్రుల వద్ద ఉందని, భయంతో ఉన్న ఆమెను హైదరాబాద్‌కు తరలించే పరిస్థితి లేదని చెప్పారు. హైదరాబాద్ వచ్చి వాంగ్మూలం ఇవ్వాలని దర్యాప్తు అధికారి ఒత్తిడి చేయడం సరికాదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బాలికకు ఇబ్బంది కలుగకుండా వాంగ్మూలం ఎలా తీసుకుంటారో చెప్పాలని ఆదేశించారు.

స్థానికత నిబంధనను పక్కకు పెట్టి.. దరఖాస్తులు స్వీకరించండి

- వైద్య విద్య అడ్మిషన్లపై కాళోజీ వర్సిటీకి హైకోర్టు ఆదేశం
- తుది తీర్పు మేరకు అడ్మిషన్లు ఉంటాయని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో ప్రస్తుతానికి స్థానికత నిబంధనల అంశాన్ని పక్కకు పెట్టి పిటిషనర్ల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని హైకోర్టు ఆదేశించింది. నేటితో దరఖాస్తుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో పిటిషనర్లు తమ వద్ద ఉన్న ఫార్మాట్‌లో స్థానికత సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. పిటిషనర్లు తమ పిటిషన్ వివరాలను సంబంధిత అధికారులకు ఇవ్వాలని చెప్పింది. ఈ నెల 24లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. 'ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల్లో తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజీల అడ్మిషన్ నిబంధనలు-2017లోని రూల్ 3(ఏ)ను సవాల్ చేస్తూ హైదరాబాద్ ప్రగతినగర్‌కు చెందిన కల్లూరి నాగ నరసింహా అభినామ్‌తోపాటు మరో 13 మంది తరఫున న్యాయవాది కొండపర్తి కిరణ్ కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'ఈ నిబంధనలు ఉల్లంఘిస్తూ గత నెల 19న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 33 చట్టవిరుద్ధం. జీవో ప్రకారం విద్యార్థులు 9, 10తోపాటు ఇంటర్ స్థానికంగా చదివి ఉండాలి. పరీక్షలు ఇక్కడే రాయాలి. ఇది చట్టవిరుద్ధం. స్థానికతపై కొత్త రూల్స్ అంటూ వైద్యారోగ్య శాఖ జారీ చేసిన ఈ జీవోను కొట్టివేయాలి' అని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం బుధవారం ఇరుపక్షాల వాదనలు వినింది. ప్రస్తుతానికి స్థానికత నిబంధనను పక్కకుపెట్టి దరఖాస్తులు స్వీకరించాలని, తుది తీర్పునకు లోబడి చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- కాంగ్రెస్ అంటేనే మహిళా ప్రభుత్వం
- 'శ్రీనిధి' సమావేశంలో మంత్రి సీతక్క

ఏజీ వర్సిటీ: రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్ మంత్రి సీతక్క చెప్పారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శ్రీనిధి 11వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ సంస్థల కోరల్లో చిక్కుకుని చాలా మంది మహిళలు నష్టపోయిన నేపథ్యంలో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కొప్పుల రాజు, వాకాటి కరుణ వంటి ఉన్నతాధికారుల సూచనలతో స్త్రీనిధిని ఏర్పాటు చేశామని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే మహిళా ప్రభుత్వమని, తెలంగాణ ప్రదాత సోనియాగాంధీ మార్గదర్శకంలో మహిళా సాధికారత కోసం ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మహిళా సంఘాలు అంటే సమాజంలో గౌరవం పెరిగిందన్న సీతక్క గ్రామీణ స్థాయిలో 63 లక్షల మందిని సభ్యురాళ్లుగా చేర్పించారని, అయితే ఇంకా ఈ సంఖ్య పెరగాలని సూచించారు. ఆర్థిక అంశాలతో పాటు మహిళల రక్షణ కోసం మహిళా సంఘాలు పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళల్లో అభద్రత పోగొట్టేలా త్వరలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని సీతక్క వెల్లడించారు. సచివాలయంలో ప్రారంభించిన మహిళా శక్తి క్యాంటీన్‌లను త్వరలో జిల్లాల్లో కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనిధి అధికారులు, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

'ఆఫ్ క్యాంపస్'ల అంశాన్ని పునఃపరిశీలించండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల ఆఫ్ క్యాంపస్ సెంటర్ల (అనుబంధంగా బ్రాంచ్‌ల ఏర్పాటు) అనుమతి అంశంపై పునఃపరిశీలన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ వరకు నిర్ణయం తీసుకోకుండా.. ఇప్పుడు అనుమతి ఇవ్వలేమని పేర్కొనడం సరికాదని వ్యాఖ్యానించింది. విద్యా చట్టంలోని సెక్షన్ 20కి విరుద్ధంగా ప్రభుత్వ నిర్ణయం ఉందని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం పరిశీలన చేసి వారంలోగా నిర్ణయం తీసుకోవాలని సర్కార్‌కు తేల్చిచెప్పింది. ఆఫ్ క్యాంపస్ సెంటర్ల ఏర్పాటుపై ఇప్పుడు నిర్ణయం తీసుకోలేమన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జేపీ నారాయణ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, విజ్ఞాన భారతి ఇంజనీరింగ్.. హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ, పిటిషన్లను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం దృష్ట్యా ఆఫ్ క్యాంపస్ సంస్థల ప్రారంభాన్ని వాయిదా వేయాలని నిపుణుల కమిటీ సూచన మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ కాలేజీలు అప్పీల్ దాఖలు చేశాయి.

సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టివేసిన ధర్మాసనం

ఈ అప్పీళ్లపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఆఫ్ క్యాంపస్ సెంటర్ల ఏర్పాటుపై ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అనుమతి ఇచ్చినా ప్రభుత్వం నిర్ణయం వాయిదా వేయడం సరికాదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. అనుమతించాలా? వద్దా? అన్న దానిపై వచ్చే ఏడాది నిర్ణయం తీసుకుంటామని చెప్పడం చట్టవిరుద్ధమన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. 'తెలంగాణ విద్యా చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం చట్టబద్ధంగా లేదు. అందుకే ఆ నిర్ణయాన్ని రద్దు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయమే తప్పు. సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టివేస్తున్నాం. సెక్షన్ 20లోని నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ఆఫ్ క్యాంపస్ సెంటర్ల ప్రారంభ అంశాన్ని పునఃపరిశీలన చేయాలి' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

క్లుప్తంగా...

కేంద్ర సమాచార ప్రసారశాఖ డైరెక్టర్‌గా శిల్పారావు

సాక్షి, న్యూఢిల్లీ: ఇండియన్ పోస్టల్ సర్వీస్ అధికారి తనుగుల శిల్పారావును కేంద్ర సమాచార ప్రసారశాఖ డైరెక్టర్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఐదేళ్లు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు శిల్పారావు ఆ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణవిభాగం డైరెక్టర్ సాక్షి మిత్తల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్‌లోకి తెచ్చాం

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ పాలనలో తెలంగాణలోని ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదన్నారు. తెలంగాణలో ప్రాజెక్టులు ఎవరి హయాంలో పూర్తయ్యాయో తేల్చేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, తుంగ బాలుతో కలిసి జగదీశ్‌రెడ్డి బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టును తమ ఖాతాలో వేసుకునేందుకు పోటీ పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క ఉత్తరమైనా రాసిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టు అంచనాలు విపరీతంగా పెంచారని, కమీషన్లు ఇవ్వడం, తీసుకోవడం ఆ పార్టీ నేతలకు అలవాటు అని విమర్శించారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ముగ్గురు చిన్నారులపై దాడి

వీణవంక(హుజూరాబాద్): కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఘన్ముక్కుల గ్రామంలో బుధవారం సాయంత్రం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఘన్ముక్కుల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇద్దరు చిన్నారులు (12 ఏళ్ల లోపు) ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసింది. వారి తొడ, కాళ్లు, వీపును గాయపరిచింది. అప్రమత్తమైన గ్రామస్తులు కుక్కను తరిమి కొట్టడంతో.. అక్కడి నుంచి కమ్మరివాడకు వెళ్లి మరో బాలిక (13)పై దాడి చేసి చేతిని కొరికింది. మరో ఇద్దరు యువకులపై కుక్క దాడికి దిగగా త్రుటి లో తప్పించుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మూడు రోజుల క్రితం కూడా.. ఇదే కుక్క ఇద్దరు వృద్ధులపై దాడి చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

పౌర సరఫరాల ఉద్యోగులకు పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా పౌరసరఫరాల సంస్థ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు సంస్థ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను.. 33 జిల్లాలకు అనుగుణంగా క్యాడర్ సిబ్బందిని పునర్విభజన చేసి వారి హోదాల ప్రకారం కల్పించారు. తద్వారా ఏర్పడిన ఖాళీలను ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ద్వారా పూర్తి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఉద్యోగుల పదోన్నతుల్లో కమిషనర్ కృషికి ధన్యవాదాలు తెలుపుతూ.. ఆయనను పౌరసరఫరాల ఉద్యోగుల సంఘం ఘనంగా సన్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎస్. ఉత్తమ్, ఇతర మంత్రులకు కూడా సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది.

పచ్చదనాల పల్లె.. మరియపురం

స్వచ్ఛత, గ్రీనరీలో ఆదర్శంగా వరంగల్ జిల్లా గ్రామం ● ఇంటింటా పచ్చని చెట్లు.. వీధులన్నీ వనాలు



గీసుకొండ: ఒకప్పుడు పల్లెలు పచ్చదనానికి పట్టుగొమ్మలు, ఇప్పుడంతా మారిపోయిందని అంటూ ఉంటారు. కానీ వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని మరియపురం మాత్రం ఇప్పటికీ పచ్చదనంతో కళకళలాడుతోంది. ఏ ఇంటి ఆవరణ చూసినా, ఏ వీధిలో తిరిగినా పచ్చటి చెట్లు, మొక్కలు కనువిందు చేస్తున్నాయి. 2019 నుంచి ఇటీవలి వరకు సర్పంచ్‌గా పనిచేసిన అల్లం బాలిరెడ్డి చొరవే దీనికి కారణం. ఆయన సొంత ఖర్చుతో నర్సరీల నుంచి మొక్కలు తెప్పించారు. గ్రామంలోనూ నర్సరీ ఏర్పాటు చేయించారు. వివిధ పండ్లు, పూలు, కూరగాయల మొక్కలను ఇంటింటికి అందించారు. మొక్కలు నాటి సంరక్షించిన వారికి బహుమతులు ఇచ్చారు. నిండా పచ్చదనంతో, కాలుష్యానికి దూరంగా ఉండే ఈ గ్రామానికి ఇప్పటికే జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీగా గుర్తింపు వచ్చింది. ఇటీవల రాష్ట్ర స్థాయి పర్యావరణ పరిరక్షణ అవార్డు ఇచ్చారు.

కాలుష్యం నుంచి విముక్తి

గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి..



"ప్రజలు, ప్రభుత్వ అధికారుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేశాం. అన్ని గ్రామాలు స్వయం సమృద్ధి చెందితే దేశం మరింత ప్రగతి సాధిస్తుంది." – మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు.. సోలార్ ఉత్పత్తిలోనూ..

గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడానికీ సర్పంచ్ కృషి చేశారు. గ్రామంలో ఇంటింటికీ జనపనార, క్లాత్ సంచులను అందించారు. తనకు వచ్చే గౌరవ వేతనాన్ని మహిళా సంఘాలకు ఇచ్చి.. వారితో వారంలో ఒకరోజు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే పనులు చేయించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను పోగుచేసి విక్రయించి, ఆ సొమ్మును గ్రామ అభివృద్ధికి ఖర్చు చేశారు. ఇక గ్రామంలో 20 మంది తమ ఇళ్లపై సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకోసం సర్పంచ్ తన వంతుగా రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. గత ఐదేళ్లలో గ్రామంలో పుట్టిన 29 మంది బాలికలకు రూ.10వేల చొప్పున సాయం అందించారు.

రైల్వేలో క్యూఆర్ కోడ్

- యూపీఐ చెల్లింపు పద్ధతి వచ్చిన ఇన్నేళ్ల తర్వాత మేల్కొన్న రైల్వే
- ఐదు నెలల ప్రయోగాత్మక పరిశీలన తర్వాత అన్ని స్టేషన్‌లలో స్కానర్ల ఏర్పాటు
- ఇక టికెట్ల కొనుగోలుకు పూర్తిస్థాయి నగదురహిత లావాదేవీలు



సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని స్టేషన్‌లలో యూపీఐ(యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) చెల్లింపులో భాగంగా క్యూఆర్ కోడ్ స్కానర్లు అందుబాటులోకి వచ్చాయి. ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్లతోపాటు టికెట్ జారీ కౌంటర్‌లన్నింటిలో క్యూఆర్ కోడ్ స్కానర్లు ఉంచారు. యూపీఐ పద్ధతిలో చెల్లింపులు అతి సర్వసాధారణంగా మారిన తరుణంలో రైల్వే ఏకంగా దీనిపై ఐదునెలల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలించింది. అంతకు కొద్ది నెలల ముందు యూపీఐ చెల్లింపులను కొన్ని స్టేషన్‌లలో ప్రారంభించినా.. క్యూఆర్ కోడ్ స్కానింగ్ పద్ధతిని మాత్రం అందుబాటులోకి తేలేదు. మార్చి 21న దక్షిణ మధ్య రైల్వేలోని 14 ప్రముఖ స్టేషన్‌లలో క్యూఆర్‌కోడ్ పరిశీలన ప్రారంభించింది. కేవలం 31 కౌంటర్లలో స్కానర్లను ఏర్పాటు చేసింది. దాదాపు ఐదు నెలల సుదీర్ఘకాల ప్రయోగానంతరం ఎట్టకేలకు ఇప్పుడు జోన్ పరిధిలోని అన్ని స్టేషన్‌లలో వాటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించి ప్రారంభించటం విశేషం.

వంద శాతం డిజిటల్ చెల్లింపులు జరగాలని నినాదం ఇచ్చి..

రైల్వేస్టేషన్‌లలో నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు దాదాపు ఆరేళ్ల క్రితం దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఇందుకోసం కాచిగూడ స్టేషన్‌లో ఓ అవగాహన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసింది. స్టేషన్‌లలోని అన్ని దుకాణాల్లో డిజిటల్ చెల్లింపు పద్ధతిని కచ్చితంగా అమలు చేయాలని, ప్రయాణికుల నుంచి బలవంతంగా నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తరచూ ఆకస్మిక తనిఖీలతో అధికారులు స్టేషన్లలోని దుకాణాలను తనిఖీ చేసి దాని అమలు తీరును పరిశీలిస్తూ వచ్చారు. ఆపై రైల్వే బోర్డుకు నివేదికలు సమర్పించింది. కానీ, తాను మాత్రం టికెట్ల విక్రయాల్లో దాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయింది. ఆర్థిక లావాదేవీల్లో డిజిటల్ చెల్లింపులకు అలవాటు పడ్డ ప్రజలు రైల్వేస్టేషన్‌లలో టికెట్ కొనేందుకు మాత్రం నగదు చెల్లించాల్సి రావటంతో ఇబ్బంది పడుతూ వచ్చారు. యూపీఐ చెల్లింపులు విస్తృతమైన నేపథ్యంలో చాలామంది జేబుల్లో నగదు అందుబాటులో ఉండేది కాదు. రైల్వే స్టేషన్‌లలో ఈ పద్ధతి అమలులో లేదని తెలియక, నగదు లేకుండా వచ్చి క్యూలైన్లలో నిలబడి తీరా టికెట్ కొనేప్పుడు విషయం తెలిసి ఉసూరుమంటూ ఏటీఎంల వైపు పరుగుపెట్టడం సాధారణంగా మారింది. దీంతో అనేక ఫిర్యాదులు వెల్లువెత్తుతూ వచ్చాయి. కొన్నేళ్ల పాటు డెబిట్ కార్డు ద్వారా డిజిటల్ చెల్లింపు పద్ధతులను మాత్రం అమలు చేసింది. యూపీఐ చెల్లింపుల కోసం ఇక తప్పని పరిస్థితి ఎదురుకావటంతో క్యూఆర్‌కోడ్ స్కానర్లను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో నగదు రహిత లావాదేవీలకు శ్రీకారం చుట్టి జనం 'జేబు'ఇబ్బందులను దూరం చేసింది.

గవర్నర్ నామినేట్ చేస్తే నియంత్రించలేం

- తెలంగాణ ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- తుది తీర్పునకు లోబడే తదుపరి నియామకాలు ఉండాలని వెల్లడి
- హైకోర్టు తీర్పుపై స్టే.. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు
- తదుపరి విచారణ నాలుగు వారాలపాటు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్సీలను గవర్నర్ నామి నేట్ చేయడాన్ని నియంత్రించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గవర్నర్ నిర్ణయాన్ని ఆపలేమంటూ.. ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. తుది తీర్పునకు లోబడే తదుపరి నియామకాలు ఉండాలని పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ గవర్నర్ శాసనమండలికి సభ్యులను నామినేట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని బీఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేతో కూడిన ధర్మాసనం విచారించింది. కోర్టు తుది ఆదేశాలు ఇచ్చే వరకూ హైకోర్టు ఆదేశాలపై స్టేటస్‌కో ఇవ్వాలని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయ వాది కపిల్ సిబల్ కోరారు. అయితే, ధర్మాసనం హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తామనగా.. సిబల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. 'అభ్యంతరం ఎందుకు? మీరు హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా వచ్చారు కదా. మేం స్టే ఇస్తాం' అని ధర్మాసనం చెప్పింది. అలా చేయడం వల్ల మళ్లీ నూతన సిఫార్సులు చేసే అవకాశం ఉందని సిబల్ పేర్కొన్నారు. 'శాసనమండలిలో పిటిషనర్ల నియామకాన్ని గవర్నర్ నిరా కరించినందున కేసు వేయడానికి వారు అర్హులు. గవర్నర్ పిటిషనర్లను కాకుండా వేరే వారిని నియమించే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం సిఫార్సు చేసిన ఇద్దరు వ్యక్తుల నియామక గెజిట్‌ను కూడా హైకోర్టు రద్దు చేసింది. ప్రస్తుతం అదే వ్యక్తుల్ని నియమించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్ని స్తోంది' అని సిబల్ వాదించారు. స్టేటస్ కో ఇవ్వడం వల్ల ఉపయోగమేమీ లేదని జస్టిస్ విక్రమ్‌నాథ్ చెప్పారు. అలా ఇవ్వకపోతే కొత్త వారిని నియమించడమో, దీనికి కాలపరి మితి అయిపోతుందనో లేదా ఇంకేదైనా చెబుతారని సిబల్ పేర్కొన్నారు. 'మీకు పోటీగా మరికొంత మంది సీనియర్ న్యాయవాదులున్నారు కదా.. వారిని కూడా రానివ్వండి.. వారేం చెబుతారో చూద్దాం' అని జస్టిస్ విక్రమ్‌నాథ్ వ్యాఖ్యా నించారు. అనంతరం.. కోర్టు తుది ఉత్తర్వులు వచ్చే వరకూ హైకోర్టు తీర్పుపై స్టే అమల్లో ఉంటుందని ఆదేశాలు జారీ చేశారు. అయితే, గవర్నర్ మరొకరిని నియమిస్తారని సిబల్ పేర్కొనగా... దానిని ఆపలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. పిటిషనర్ నియామకం సరైనదే కాబట్టి నియంత్రించొచ్చని సిబల్ పేర్కొనగా దానికి న్యాయమూర్తి అంగీకరించలేదు. గవర్నర్ తాజా నామినేషన్‌ను కోర్టు ఆపలేదని జస్టిస్ విక్రమ్‌నాథ్ తేల్చిచెప్పారు. మంత్రివర్గం సిఫార్సు చేస్తే ఆ నియామకంలో గవర్నర్ పాత్ర ఉండదని సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం ముందు కేసు పెండింగ్‌లో ఉందని సిబల్ ధర్మాసనం దృష్టికి తెస్తూ.. కేసులో విజయం సాధిస్తే చట్టబద్ధంగా పిటిషనర్ అర్హుడవుతారని చెప్పారు. సిబల్ సూచనను అంగీకరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ పూర్తయ్యేలోపు చేసే ప్రతి నామినేషన్ తుది తీర్పునకు లోబడి ఉండాలంటూ ధర్మాసనం ఆదేశాలను సవరించింది. ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలంటూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఆ రైళ్లలో బెడ్‌రోల్స్ లేవు...

వరుస సెలవులతో నేటి నుంచి సోమవారం వరకు అధిక రద్దీ

- ఎంపీల డిమాండ్‌తో కొన్ని స్పెషల్ రైళ్లను ప్రకటించిన ద.మ.రైల్వే
- జోన్ పరిధిలో ప్రస్తుతం బెడ్‌రోల్స్‌కు కొరత
- వాటిల్లో బెడ్‌రోల్స్ సరఫరా చేయలేమని రైల్వే అధికారిక ప్రకటన



సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్నప్పుడు నడిపే స్పెషల్ రైళ్లలో బెడ్‌రోల్స్‌కు కొరత ఏర్పడుతోంది. అందుబాటులో ఉన్న బెడ్ రోల్స్ సంఖ్య, వాటిని శుభ్రపరిచి తిరిగి అందించే లాండ్రీల సామర్థ్యానికి మించి డిమాండ్ ఏర్పడటమే దీనికి కారణం. రెగ్యులర్ రైళ్లు, సంవత్సరం పొడవునా నిర్వహించే సాధారణ స్పెషల్ రైళ్లకు ఇవి సరిపోతుండగా, ఉన్నట్టుండి వచ్చే రద్దీ ఆధారంగా నడిపే స్పెషల్ రైళ్లకు ఈ సమస్య ఏర్పడుతోంది.

ఐదు రోజుల వరుస సెలవులతో..

పంద్రాగస్టు నేపథ్యంలో గురువారం దేశవ్యాప్త సెలవు ఉంది. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం. తెలుగు రాష్ట్రాల్లో ఈ వేడుకకు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. దీంతో రాకపోకలు బాగా పెరుగుతాయి. శనివారం వారాంతం కావటంతోపాటు ఆదివారం పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు ఉండటంతో శనివారం ప్రయాణించేవారి సంఖ్య అధికంగా ఉండనుంది. ఆదివారం ఎలాగూ సెలవు, ఆ రోజు వేల సంఖ్యలో పెళ్లిళ్లున్నాయి. సోమవారం రాఖీ పౌర్ణమి.. ఇలా వరుసగా ఐదు రోజుల పాటు రైళ్లన్నీ ఫుల్ అయ్యాయి. దీంతో.. మరిన్ని స్పెషల్ రైళ్లు నడపాలంటూ దక్షిణ మధ్య రైల్వేకు ఏకంగా 15 మంది పార్లమెంటు సభ్యులు విన్నప లేఖలు పంపారు. ప్రయాణికుల నుంచి కూడా డిమాండ్ వచ్చింది. దీంతో అందుబాటులో రేక్స్ తక్కువగా ఉండటంతో.. కొన్ని స్పెషల్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.

స్పెషల్ రైళ్లు ఇవే..

18న నర్సాపూర్–సికింద్రాబాద్, 19న సికింద్రాబాద్–నర్సాపూర్, 15, 17, 19 తేదీల్లో కాకినాడ–సికింద్రాబాద్, 16, 18, 20 తేదీల్లో సికింద్రాబాద్–కాకినాడ, 14, 15 తేదీల్లో తిరుపతి–నాగర్‌సోల్, కాచిగూడ–తిరుపతి మధ్య వీటిని నడుపుతున్నారు. వీటన్నింటిలో ఏసీ కోచ్‌లున్నాయి. కానీ, వాటిల్లోని ప్రయాణికులకు బెడ్‌రోల్స్‌ను సర్దుబాటు చేయలేమని నిర్ణయించుకున్న దక్షిణ మధ్య రైల్వే, బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఈ స్పెషల్ రైళ్లలో బెడ్ రోల్స్‌ను సరఫరా ఉండదని తేల్చి చెప్పింది. ఇక ప్రయాణికులే సొంత ఏర్పాట్లతో రావాలన్నది దాని పరోక్ష సారాంశం.

రేలంపాడుకు రూ.153 కోట్లతో మరమ్మతులు!

- కరకట్టలో సీపేజీ ఏర్పడటంతో సమస్యలు
- కర్టెన్ గ్రౌటింగ్ నిర్వహించాలని అధికారుల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన రేలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కరకట్టలో సీపేజీ కట్టడికి కర్టెన్ గ్రౌటింగ్ చేపట్టాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ నిర్ణయించింది. దీనికి రూ.150 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేసింది. ఇక్కడ దీర్ఘకాలంగా సీపేజీ సమస్య వేధిస్తుండగా, ప్రభుత్వం ఎట్టకేలకు మరమ్మతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కట్ట ఎగువ భాగంలో డ్రిల్లింగ్ చేసి సిమెంట్, ఇతర కెమికల్ మిశ్రమాన్ని లోపలికి ఒత్తిడి ద్వారా పంపించి సీపేజీని కట్టడి చేయాలని భావిస్తున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో 2 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు 8 మండలాల పరిధిలోని 118 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం గుడెందొడ్డి గ్రామంలో రేలంపాడు రిజర్వాయర్‌ను నిర్మించారు. 2.3 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో దీని నిర్మాణం 2011లో పూర్తైంది. 3 కిలోమీటర్ల మేర మట్టికట్టతో ఈ రిజర్వాయర్‌ను నిర్మించారు. కుడి కాల్వ కింద 1.11 లక్షల ఎకరాలు, ఎడమ కాల్వ కింద 25 వేల ఎకరాలకు సాగునీటి సరఫరాను లక్ష్యంగా పెట్టుకున్నారు. తర్వాత 2014 ఫిబ్రవరిలో నిల్వ సామర్థ్యాన్ని 4 టీఎంసీలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 2014–16 మధ్యకాలంలో 1 టీఎంసీ నీళ్లను నిల్వ చేసి విడుదల చేశారు. 2019లో రిజర్వాయర్‌లో భారీ సీపేజీలు ఏర్పడడంతో డ్యామ్ సేఫ్టీ కమిటీ పర్యవేక్షణలో మరమ్మతులు చేసినా ఫలితం లేకుండాపోయింది. 2021–22లో రేలంపాడు రిజర్వాయర్‌లో నిల్వలను 3 టీఎంసీలకు పెంచగా, దిగువ భాగంలో సీపేజీ మళ్లీ ఏర్పడింది. నిల్వలను 3.450 టీఎంసీలకు పెంచగా సీపేజీ సమస్య మరింతగా పెరిగింది. దీంతో రిజర్వాయర్‌లోకి నీటి పంపింగ్‌ను నిలుపుదల చేశారు. 2021 ఆగస్టులో అధికారులు రిజర్వాయర్‌ను పరిశీలించి 2 టీఎంసీల నీళ్లను మాత్రమే నిల్వ చేయాలని సిఫారసు చేశారు. సీపేజీకి కారణాలను తెలుసుకోవడానికి జియోఫిజికల్, ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్టులు నిర్వహించడంతో పాటు సీపేజీ ఏర్పడిన ప్రాంతంలో మట్టి నమూనాలను సేకరించి పరీక్షించారు. వీటి ఆధారంగా కర్టెన్ గ్రౌటింగ్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.

సుంకిశాల ఘటనలో అధికారులపై చర్యలు

ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌పై బదిలీ వేటు
నిర్మాణ సర్కిల్ –3 అధికారుల సస్పెన్షన్

సాక్షి, హైదరాబాద్: సుంకిశాల ప్రాజెక్టు ప్రమాద ఘటనను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌పై బదిలీ వేటు వేసి, నాన్ ఫోకల్ పోస్టుకు పంపింది. అలాగే సుంకిశాల ప్రాజెక్టు నిర్మాణ సర్కిల్–3 అధికారులు సీజీఎం ఎస్. కిరణ్‌కుమార్, జీఎం మరియరాజ్, డీజీఎం ప్రశాంత్, మేనేజర్ హరీశ్‌లను సస్పెండ్ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. సుంకిశాల పంపుహౌజ్ రక్షణగోడ కూలిపోవడంతో పాటు పంపుహౌజ్ పూర్తిగా నీట మునగడంపై వాటర్ బోర్డు అంతర్గతంగా ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులతో విచారణ నిర్వహించి ప్రభుత్వానికి బుధవారం ఉదయం నివేదికను అందజేసింది. ఈ మేరకు సర్కార్ చర్యలు చేపట్టింది. వేసవి కాలంలో నాగార్జున సాగర్ నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరినా హైదరాబాద్ నగరం తాగునీటికి ఇబ్బంది లేకుండా చూసేందుకు జలమండలి ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును చేపట్టారు. కాగా, ఈ ప్రాజెక్టు పనుల్లో ఆలస్యం, సాంకేతిక లోపాలపై నిర్మాణ సంస్థకు ప్రభుత్వం షోకాజ్ నోటీసు జారీ చేసింది.

డెడ్‌స్టోరేజీకి చేరినా నీటి కోసం..: హైదరాబాద్ మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే నాగార్జునసాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరినప్పటికీ నీటి తరలింపునకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు భారీ అంచనా వ్యయంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సుంకిశాల ఇన్‌టేక్‌వెల్ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టింది. ఇప్పటికే ఇన్‌టేక్ వెల్ పనులు 60 శాతం, పంపింగ్ మెయిన్ పనులు 70 శాతం, ఎలక్ట్రో మెకానికల్ పనులు 40 శాతం పూర్తయ్యాయి. ప్రాజెక్టులో భాగంగా నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి సంపు, పంప్‌హౌస్‌లోకి నీటిని ఎత్తిపోయడానికి మూడు టన్నెళ్ల నిర్మాణం చేపట్టగా, 90 పనులు శాతం పూర్తయ్యాయి. వచ్చే వేసవిలోగా నీరు అందించాలనే ఉద్దేశంతో మధ్య టన్నెల్‌ను పూర్తి చేసేందుకు సంప్‌వైపు టన్నెల్‌పై గేటును ఏర్పాటు చేశారు. కాగా, ఒకే సారి వరద రావడంతో ఆ ఉధృతికి టన్నెల్ గేటు ధ్వంసం కావడంతో సైడ్ వాలి కూలిపోయింది.

కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ సింఘ్వీ

తెలంగాణ నుంచి ఖరారు చేసిన అధిష్టానం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ పేరును కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసింది. త్వరలో జరగనున్న ఉప ఎన్నికల్లో సింఘ్వీని బరిలోకి దింపాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయించినట్లు పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన కె.కేశవరావు పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఈ ఉప ఎన్నిక జరుగుతోంది. తెలంగాణతో పాటు మరో తొమ్మిది రాష్ట్రాల్లో ఖాళీ అయిన 12 స్థానాలకు కూడా ఉప ఎన్నికలు జరగనున్నాయి. సెప్టెంబర్ 3 నుంచి ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన విషయం విదితమే. రాజస్థాన్‌లో జన్మించి ఢిల్లీలో చదువుకున్న సింఘ్వీ.. చిన్నవయసులోనే అదనపు సొలిసిటర్ జనరల్‌గా పనిచేశారు. ప్రస్తుతం సీనియర్ న్యాయవాదిగా కొనసాగుతున్నారు. గతంలో పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు.

హైకమాండ్‌కు కృతజ్ఞతలు: సింఘ్వీ

తనను రాజ్యసభకు పంపాలని నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ అధిష్టానానికి సింఘ్వీ కృతజ్ఞతలు తెలిపారు. తన ఎంపికపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

నాటకీయ ఓటమి: ఈ ఏడాది ఫిబ్రవరిలో అభిషేక్ మను సింఘ్వీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన హిమాచల్‌ప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల్లో బరిలోకి దిగి నాటకీయ ఫక్కీలో ఓటమి పాలయ్యారు. హిమాచల్ అసెంబ్లీ బలం 68 కాగా.. కాంగ్రెస్‌కు 40 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. మరో ముగ్గురు స్వతంత్రుల మద్దతుంది. కానీ అనూహ్యంగా ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రులు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటంతో సమాన ఓట్లు రాగా నిబంధనల ప్రకారం డ్రా తీయగా.. అందులో సింఘ్వీ ఓటమి పాలయ్యారు.

ఎన్ని పెట్టుబడులు తెచ్చారో చెప్పండి

సీఎం రేవంత్ విదేశీ పర్యటనపై శ్వేతపత్రం విడుదల చేయాలి: విష్ణువర్ధన్‌రెడ్డి, గెల్లు

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు తెచ్చారో శ్వేతపత్రం ప్రకటించాలని బీఆర్‌ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ పర్యటనలో రూ.31 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెబుతున్నారని, ఆ పెట్టుబడుల వివరాలు వెల్లడించాలని కోరారు. రాష్ట్రానికి మాజీ మంత్రి కేటీఆర్ నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులతో లక్షల ఉద్యో గాలు తెచ్చినా ఎక్కడా పబ్లిసిటీ కోసం వాడుకో లేదని అన్నారు. గతంలో రేవంత్‌రెడ్డి దావోస్‌లో కుదుర్చుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి పెట్టుబ డులు వచ్చిందే లేదని, ఇప్పుడు యూఎస్, కొరి యా పర్యటన కూడా దావోస్ తరహాలోనే అయిందని విమర్శించారు. సీఎం టూర్‌కు కాగ్నిజెంట్ సంస్థ కార్యక్రమానికి ఎలాంటి సంబంధంలేదని, దీన్ని పట్టుకొని యూఎస్‌లో ఒప్పందం చేసుకున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు.



దుబాయ్ నుంచే హత్యకు ప్లాన్

కంచన్‌బాగ్ రౌడీషీటర్ ఖాజా రియాజుద్దీన్ హత్య కేసును రాచకొండ పోలీసులు ఛేదించారు. భూ వివాదం కారణంగానే రియాజుద్దీన్ హత్యకు గురైనట్లు తేల్చారు. -10లో



ఫ్రీడమ్ కలర్స్..

యువతరం స్వాతంత్య్ర దినోత్సవాన్ని విభిన్నంగా జరుపుకొంటోంది. వస్త్రధారణ, యాక్సెసరీస్‌లలో ట్రైకలర్స్‌ను జత చేస్తూ స్వాతంత్య్ర స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/24.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



5,400 అడుగుల భారీ జెండా

మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ ఆధర్వంలో బుధవారం 5,400 అడుగుల మువ్వన్నెల జెండాను ప్రదర్శించారు. - చార్మినార్




హ్యాపీ ఇండిపెండెన్స్ డే సార్

లాలాపేట: జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి బుధవారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.









మువ్వన్నెలు జిగేల్

పంద్రాగస్టు వేడుకలకు నగరం సిద్ధమైంది. నేడు స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు అంబరాన్నంటనున్నాయి. బుధవారం రాత్రి గోల్కొండ కోట, సచివాలయం, అసెంబ్లీ భవనం, కాచిగూడ రైల్వే స్టేషన్ తదితర ప్రభుత్వ విభాగాల కార్యాలయాలు విద్యుద్దీపాలంకరణలో తళుకులీనుతూ కనిపించాయి.

బండి పెడితే బాదుడే

నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లలో పార్కింగ్ ఫీజులు

- మోటారు సైకిల్‌కు కనీసం రూ.10, కారుకు రూ.30
- నాగోల్ పార్కింగ్ ప్రాంతంలో ట్రయల్స్



నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న వాహనదారులు

సాక్షి, సిటీబ్యూరో/ఉప్పల్: నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లలో పార్కింగ్ ఫీజు వసూలుకు రంగం సిద్ధమైంది. నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఈ నెల 25 నుంచి, మియాపూర్ మెట్రో స్టేషన్‌లో సెప్టెంబర్ 1 నుంచి మెట్రో నిర్వహణ సంస్థ పార్కింగ్ ఫీజులను ప్రవేశపెట్టనుంది. బుధవారం పైలట్ ప్రాజెక్టుగా నాగోల్ పార్కింగ్ ప్రాంతంలో ట్రయల్స్ నిర్వహించారు. పార్కింగ్ ఫీజు వివరాలు రెండు ప్రాంతాల్లోనూ పెట్టారు. మోటారు సైకిల్‌కు కనీస రుసుము రూ.10. దీని కాల పరిమితి 2 గంటల వరకే. 12 గంటలకు రూ.40 చెల్లించాల్సి ఉంటుంది. ఆపై ప్రతి గంటకు రూ.5 అదనంగా చెల్లించాలి. కార్లకు కనీసం రూ.30 కాగా.. 12 గంటలకు రూ.120గా నిర్ణయించారు. ఆపై ప్రతి ఒక్కో గంటకు అదనంగా రూ.15 చెల్లించాలి. పార్కింగ్ ఫీజు యాప్ ఆధారిత (క్యూఆర్ కోడ్) చెల్లింపులను అనుమతిస్తారు.

వాహనదారుల ఆందోళన

నాగోల్ మెట్రో స్టేషన్‌లో ఫ్రీ పార్కింగ్ ఎత్తివేతపై వాహనదారులు బుధవారం ఆందోళనకు దిగారు. ఫ్రీ పార్కింగ్ ఎత్తివేస్తున్నట్లు బోర్డులు ఏర్పాటు చేయడంపై కన్నెర్ర జేశారు. ఎల్‌అండ్‌టీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు, మెట్రోస్టేషన్ అధికారులు ఇప్పుడప్పుడే పార్కింగ్ ఫీజు వసూలు చేయడం లేదని ప్రకటించడంతో వాహనదారులు శాంతించారు.

బోర్డుల్లో ఒకలా వసూళ్లు మరోలా..

ఏ విధమైన పార్కింగ్ ఫీజులు వసూలు చేయడం లేదు. కేవలం పైలట్ ప్రాజెక్టుగానే బోర్డులను ఏర్పాటు చేశామంటూనే ద్విచక్ర వాహన దారుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేశారు. ఆగస్టు 25 నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తామంటూ బోర్డులు పెట్టి బుధవారం నుంచే మెట్రో అధికారులు వాహనదారులను నిలువుదోపిడీ చేయడం గమనార్హం.

57 చోట్ల పార్కింగ్ స్థలాలు

మెట్రో రైల్‌కు అన్ని మార్గాల్లో ఆయా స్టేషన్ల వద్ద మొత్తం 57 వరకు పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. అందులో దాదాపుగా 14 చోట్ల ఫ్రీ పార్కింగ్ ఉన్నట్లు సమాచారం. వీటిని కూడా ఎత్తివేసినట్లు తెలిసింది. నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద పార్కింగ్‌లో ప్రతిరోజూ దాదాపు 4 వేల నుంచి 4,500 వరకు వాహనాలను పార్కు చేస్తుంటారు. ఇక్కడ ఫ్రీ పార్కింగ్ కావడంతో అందరూ ఇక్కడే వాహనాలను పార్కు చేసి నాగోల్ స్టేషన్ నుంచే వెళ్తుంటారు.

మెరుగైన వసతుల కల్పనకే..

బైక్‌లు, కార్ల మధ్య స్పష్టమైన హద్దులతో క్రమబద్ధమైన పార్కింగ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎల్‌అండ్‌టీ మెట్రో రైలు అధికారులు తెలిపారు. బయో టాయిలెట్స్ సిస్టం కల్పించనున్నట్లు చెప్పారు. 24 గంటల పాటు సీసీ కెమెరాలతో నిఘా పెంచుతామన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో మెరుగైన లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. మెట్రో ప్రయాణికుల సౌకర్యార్థం నాగోల్, మియాపూర్ స్టేషన్లలో పార్కింగ్ రుసుముల వివరాలను అందుబాటులో ఉంచినట్లు వారు తెలిపారు. సౌకర్యవంతమైన పార్కింగ్‌ను అందించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రకటించారు.



నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద వాహనాల పార్కింగ్ రుసుము వివరాలు

మెట్రో టికెట్ కన్నా పార్కింగ్ రుసుమే భారం



మీ వాహనాలకు మీదే బాధ్యత అంటూ బోర్డులు ఏర్పాటు చేసిన ఎల్‌అండ్‌టీ సిబ్బంది పార్కింగ్ ఫీజులు ఎందుకు వసూలు చేస్తున్నారు. వాహనాలకు భద్రత లేనప్పుడు డబ్బులు ఎందుకు చెల్లించాలి. మొదట్లో ఉచితం అని చెప్పి ఇప్పుడు పార్కింగ్ ఫీజు వసూలు చేయడం సరికాదు. కనీసం షెడ్ కూడా లేదు. వాహనాలకు రక్షణ లేదు. మెట్రో టికెట్ కన్నా పార్కింగే ఫీజే అధిక భారంగా మారింది. - పవన్, వనస్థలిపురం

వసతులు కల్పించిన తర్వాతే వసూలు చేయాలి



రోడ్లు బాగాలేవు. గుంతలుగా మారాయి. చినుకు పడితే చాలు బురద పేరుకుపోతున్నాయి. పార్కింగ్ ఫీజు పెంచాలనుకుంటే ముందస్తుగా సమాచారం అందించాలి. బోర్డులు ఏర్పాటు చేయాలి. అవేమి లేకుండానే నేరుగా ఫ్రీ పార్కింగ్‌ను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకోవడం సరికాదు. పార్కింగ్‌కు రూ.40 వసూలు చేశారు. అప్పటికే అందరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. దీంతో మరింత మంది మెట్రో ప్రయాణాన్ని విరమించుకుంటారు. - సాయి, ఎల్‌బీనగర్

డెకాయ్ టీమ్స్‌తో సత్ఫలితాలు

గణనీయంగా తగ్గిన సెల్‌ఫోన్ స్నాచింగ్స్

- నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగం తీసుకున్న కీలక నిర్ణయాల్లో యాంటీ డెకాయ్ టీమ్స్ ఒకటి. ఇవి రంగంలోకి దిగిన తర్వాత నగరంలో సెల్‌ఫోన్ స్నాచింగ్స్ గణనీయంగా తగ్గాయని కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 'కొన్నాళ్ల క్రితం వరకు నగరంలో సెల్‌ఫోన్ స్నాచింగ్స్ ఎక్కువగా జరిగేవి. ప్రతి రోజూ అనేక కేసులు నమోదయ్యేవి. వ్యవస్థీకృతంగా ఈ దందా చేయడానికి కొన్ని ముఠాలు పని చేశాయి. తన సెల్‌ఫోన్ స్నాచింగ్ అడ్డుకోవడానికి ప్రయత్నించిన బాధితుడు గుడిమల్కాపూర్‌లో స్నాచర్ల చేతిలో హత్యకు గురయ్యాడు. దీంతో వీరికి చెక్ చెప్పడానికి డెకాయ్ టీమ్స్ రంగంలోకి దింపడంతో పాటు నిఘా ముమ్మరం చేశాం. ఈ బృందాలు రెండు చోట్ల కాల్పులు కూడా జరిపాయి. వీరి కృషితో పాటు ప్రజల్లో పెరిగిన అవగాహనతో ఈ నేరాలు 90 శాతం తగ్గాయి. ఇక్కడి చోరీ ఫోన్లను ఖరీదు చేసి నేపాల్, శ్రీలంక సహా వివిధ దేశాలకు సరఫరా చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్న 27 మంది రిసీవర్లకు చెక్ చెప్పాం. నగరంలో సెల్‌ఫోన్ చోరీలు, స్నాచింగ్స్ పూర్తిగా లేకుండా చేయడానికి కట్టుబడి ఉన్నాం. అలాగే మాదకద్రవ్య రహిత తెలంగాణ కోసమూ కృషి చేస్తున్నాం. వీటిపై సమాచారం ఉన్న వాళ్లు 87126 61601కు ఫోన్ చేసి చెప్పండి. అలా సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం' అని అన్నారు.

స్వాతంత్య్ర దిన వేడుకలకు పటిష్ట బందోబస్తు

గురువారం గోల్కొండ కోటతో పాటు గవర్నర్ నివాసంలో జరగబోయే స్వాతంత్య్ర దినోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. నగర వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత, నిఘా, అప్రమత్తత కొనసాగుతుంది. వేడుకలకు నాలుగు వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నాం. గ్రే హౌండ్స్, ఆక్టోపస్ టీమ్స్ కూడా పాల్గొంటాయి. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు గోల్కొండ కోటలో ప్రభుత్వం తరఫున అధికారిక వేడుకలు జరగనున్నాయి.

దిగులే.. గుబులే



టౌన్ ప్లానింగ్, ట్యాక్స్ విభాగాల్లో టెన్షన్

- అవకతవకలు వెలుగు చూస్తాయనే భయం

సాక్షి, సిటీబ్యూరో:

- తమ ఇంటి నిర్మాణంలో స్వల్ప ఉల్లంఘనలు జరగడంతో పౌరుడొకరు జోనల్ కమిషనర్ వద్దకు వెళ్లారు. విషయం చెప్పి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) వచ్చేలా చేయాలంటూ కోరగా.. సదరు అధికారి కుదరదు అనడంతో పాటు తాము అలాంటి వాటిని అసలు సహించమని నిర్దాక్షిణ్యంగా తిప్పి పంపించేశారు. ఇంతకీ నిర్మాణంలో జరిగిన ఉల్లంఘనలు ఐదు శాతం లోపునే. ఆమేరకు కాంపౌండింగ్ ఫీజుతో ఓసీ ఇవ్వవచ్చు. అయినా ఆ విషయం కూడా చెప్పకుండా తిప్పి పంపారు.
- మరో వ్యక్తి నిర్మాణ నిబంధనల్లో కొంతమేర ఉల్లంఘనలతో అనుమతి కోసం ఒక సర్కిల్ అధికారిని సంప్రదించారు. అమ్మో! మేమసలు అలా చేయం. ఎప్పుడైనా ఎవరైనా ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేసుకుంటే మాకు ముప్పు అంటూ తిప్పి పంపించారు. తీరా పలుకుబడి కలిగిన వ్యక్తులను పంపి కోరిన పైకం చెల్లిస్తే అనుమతులు జారీ చేశారు.

పై రెండు ఘటనలు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం తీరుకు మచ్చుతునకలు. సాధారణ ప్రజలకు మాత్రం నీతులు చెబుతూ పెద్దల విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న జీహెచ్‌ఎంసీ తీరు ఇటీవల హైడ్రా అధికారుల తనిఖీల్లోనూ వెల్లడైంది.

ఏం కాదులే.. అనుకుని?

ఎప్పుడేం జరుగుతుందోననే ఆందోళనలో ఉన్నవారితోపాటు ఏమీ కాదులే అనే ధీమాతోనే ఎక్కువ మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడిగా జరిగిన అక్రమాల్లో తమ నిర్వాకాలే ఎందుకు బయటికొస్తాయన్నది అలాంటి వారిలో కొందరి ధీమా కాగా, పాతవాటినన్నింటినీ పట్టించుకుంటూ పోతారా అభిప్రాయాలతోనూ కొందరున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రిటైరైన, బల్దియా నుంచి బదిలీ అయిన వారి విషయంలో ఏంచేస్తారు ? వంటి ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. జీహెచ్‌ఎంసీలో సర్కిళ్లు, జోన్లకు అధికారాలను పూర్తిస్థాయిలో వికేంద్రీకరించినప్పటి నుంచే అవకతవకలు, అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయాయనే ఆరోపణలున్న నేపథ్యంలో అందుకు ఊతమిస్తూ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్న ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లలోనూ అక్రమాలు అధికంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

అసలు భవన నిర్మాణం జరగక ముందే ఓసీలివ్వడం తెలిసి సాధారణ ప్రజలు నోరెళ్లబెడుతుండగా, టౌన్‌ప్లానింగ్ తంతు గురించి తెలిసిన వారు మాత్రం సాధారణ అంశంగానే పరిగణిస్తున్నారు. ఆస్తిపన్ను అసెస్‌మెంట్లలోనూ అవకతవకలే. తమను 'కలిసిన'వారికి మాత్రం వాస్తవంగా చెల్లించాల్సిన పన్ను కంటే తక్కువ వచ్చేలా చేస్తున్న బిల్‌కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు తక్కువేం లేరు. అలాంటి అధికారులంతా ఇప్పుడు ఆలోచనల్లో పడ్డట్లు తెలుస్తోంది. అందుకు కారణం తమ అవకతవకలు వెల్లడైతే.. ఎలాంటి చర్యలుంటాయోనని భావిస్తుండటమే అందుకు కారణం. జీఐఎస్ మ్యాపింగ్ కోసం డ్రోన్, ఇంటింటి సర్వేలతో తమ నిర్వాకం బయటపడుతుందేమోననే వారు ఆలోచనల్లో పడ్డట్లు సమాచారం.

ఎంత నష్టమో..

టౌన్‌ప్లానింగ్, ట్యాక్స్ విభాగాలతో పాటు జీహెచ్‌ఎంసీ ఇతర విభాగాల్లోనూ అవినీతి ఉన్నప్పటికీ, ఈ విభాగాల్లో ఎక్కువని జీహెచ్‌ఎంసీ గురించి తెలిసిన వారు చెబుతున్నారు. ఈ విభాగాల అక్రమాల గురించి రాష్ట్ర ఆడిట్ విభాగం (కాగ్) ఇటీవల విడుదల చేసిన రెండేళ్ల నివేదికల్లోనూ ప్రస్తావించడం తెలిసిందే. ట్యాక్స్ సెక్షన్ విభాగం అవకతవకల కారణంగా కేవలం ఏడు భవనాల నుంచే జీహెచ్‌ఎంసీకి రావాల్సిన ఆస్తిపన్ను రూ.11.71 లక్షలు రాకుండాపోయిందని ఎండగట్టింది. ఆ లెక్కన గ్రేటర్‌లోని ఎన్ని భవనాల నుంచి ఎంత ఆస్తిపన్ను రాకుండా పోయిందో జీఐఎస్ సర్వేతో వెల్లడయ్యే అవకాశం ఉంది. టౌన్‌ప్లానింగ్ విభాగం తక్కువ కాంపౌండింగ్ ఫీజు విధించి కేవలం రెండు భవనాల నుంచే రూ.2.46 లక్షలు తక్కువ ఫీజు వసూలు చేయడాన్ని కాగ్ తప్పుబట్టింది. అలా ఏటా జీహెచ్‌ఎంసీలో ఎన్ని భవనాలు నిర్మాణమవుతున్నాయో, ఎన్నింటికి ఆస్తిపన్ను అసెస్‌మెంట్ చేస్తున్నారో లెక్కలోకి తీసుకుంటే సంబంధిత సిబ్బంది అక్రమాలతో బల్దియా ఎంత నష్టపోతోందో బట్టబయలయ్యే అవకాశముంది. అందుకు బాధ్యులుగా గుర్తించిన వారిపై చర్యలు తీసుకుంటే ఎలా? అన్నదే ఇప్పుడు సదరు విభాగాల్లోని సిబ్బంది ఆందోళనకు కారణంగా తెలుస్తోంది.

ఫీవర్ ఆసుపత్రిలో వైద్య సేవలపై కలెక్టర్ ఆరా

నల్లకుంట: సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్, సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ జయలక్ష్మితో కలిసి ముందుగా ఓపీ విభాగానికి వెళ్లిన కలెక్టర్ అక్కడ రోగులకు అందిస్తున్న సేవలు, కుక్కకాటు బాధితులకు అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులకు ప్రబలుతున్న నేపథ్యంలో ఆసుపత్రి ఫార్మసీలో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా? అనే విషయంపై ఆరా తీశారు. అనంతరం 1, 2, 3 ఇన్ పేషెంట్ల వార్డుల్లోకి వెళ్లారు. సమయానికి చికిత్సలు సరిగా అందుతున్నాయా? నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా? అని రోగులను అడిగారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో నిర్మాణంలో ఉన్న కొత్త భవనాన్ని పరిశీలించారు. రెండేళ్లయినా కొత్త భవనం పూర్తి కాకపోడంపై ఆర్‌ఎంవోను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కోల్‌కతాలో ఓ వైద్య విద్యార్థిని హత్యకు నిరసనగా పీజీ వైద్య విద్యార్థులు విధులకు హాజరు కాకపోవడాన్ని కలెక్టర్ గమనించారు. వైద్య సేవల్లో ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌ఎంవోకు సూచించారు.

కుక్కల బెడదను నివారించాలి

లక్డీకాపూల్: గ్రేటర్ పరిధిలో చెలరేగిపోతున్న కుక్కలపై బల్దియా ప్రత్యేక చర్యలు తీసుకోనుంది. ఇటీవల కాలంలో వీటి బెడద పెచ్చుమీరిపోయింది. ఈ నేపథ్యంలో వీధి శునకాల కట్టడిపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ప్రధానంగా కుక్కల బెడద, కుక్కకాటు నివారణకు చర్యలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో నగరంలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు సమాయత్తమయ్యారు. అడిషనల్, జోనల్ కమిషనర్లతో బుధవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. నగరంలో కుక్కల బెడద, కుక్క కాటు నివారణకు నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యా సంస్థలు, మహిళా సంఘాలు, రెసిడెన్షియల్ అసోసియేషన్ ప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. స్టెరిలైజేషన్ అయిన కుక్కల మానసిక పరిస్థితి ఏ విధంగా ఉంటుందో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కుక్కల బెడద ఉన్న వారు జీహెచ్‌ఎంసీ హెల్ప్ లైన్/ కాల్ సెంటర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం మేరకు క్షేత్ర స్థాయి అధికారులను అప్రమత్తం చేసి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా.. నగరంలో 23 ప్రాంతాల్లో పీపీపీ పద్ధతిలో నిర్మించాల్సిన టాయిలెట్స్ విషయంలో నెలకొన్న జాప్యంపై కమిషనర్ ఆమ్రపాలి ఆరా తీశారు.

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. సమాజాన్ని మేల్కొలుపుదాం



ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న ఆమ్రపాలి తదితరులు

లక్డీకాపూల్: డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. సమాజాన్ని మేల్కొలుపుదాం నినాదంతో కళాయాత్ర సాగనుంది. ఈ యాత్రకు సంబంధించిన ఆడియో సీడీని బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి సెప్టెంబర్ 21 వరకు కొనసాగే కళాయాత్రకు సంబంధించి విధి విధానాలను రాష్ట్ర సహాయ కార్యదర్శి పి. కల్యాణ్ కమిషనర్‌కు వివరించారు. మనల్ని మనం కాపాడుకుంటూ సమాజాన్ని కాపాడాల్సిన కర్తవ్యం పట్ల పాటలతో చైతన్యపర్చనున్నట్లు పేర్కొన్నారు. హైస్కూళ్లు, కాలేజీలు, కాలనీలు, బస్తీల్లో ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం సలహాదారు డీజీ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ఎం. మారన్న పాల్గొన్నారు.


'హైడ్రా' ఏర్పాటు ఏకపక్షం

ఎంఐఎం స్టాండింగ్ కమిటీ సభ్యులు



సాక్షి, సిటీబ్యూరో: ఈవీడీఎం పేరిట ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేస్తూ జీహెచ్‌ఎంసీ పరిధిలోకి తేవడం, దాన్ని ఇటీవల ఏర్పాటు చేసిన 'హైడ్రా'లో విలీనం చేయడం చట్ట విరుద్ధం, ఏకపక్షమని ఎంఐఎం పార్టీకి చెందిన ఏడుగురు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆరోపించారు. చట్టం మేరకు వాటిపై తగిన నిర్ణయం తీసుకోవాలని వారు మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఈవీడీఎం, హైడ్రాల ఏర్పాటుకు సంబంధించిన జీవోలు వెనక్కు తీసుకునేలా చూడాలన్నారు. ఈ మేరకు వారు మేయర్‌కు, కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రాలు అందజేశారు. హైడ్రా పేరిట ప్రత్యేక సంస్థ ఏర్పాటు ఓఆర్ఆర్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ, ఇతర స్థానిక సంస్థల అధికారాలు, హక్కులు, విధులను గుంజుకోవడం తప్ప మరొకటి కాదని అభిప్రాయపడ్డారు. హైడ్రా ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచించి తగిన నిర్ణయం తీసుకునేలా చూడాలని వినతిపత్రంలో కోరారు.

హైడ్రా కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



నిజాంపేట్: కుత్బుల్లాపూర్ పరిధిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటన స్థానికులను హడలెత్తించింది. అక్రమ నిర్మాణాలపై, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్‌లోని దుండిగల్, బాచుపల్లి మండలాల్లోని పలు ప్రాంతాల్లో జరిగిన పలు ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, చెరువుల కబ్జాలపై అందిన ఫిర్యాదులతో రంగనాథ్ పర్యటించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తదితరులున్నారు.

అమానుష ఘటనపై విచారణ

- గత నెల 6న మలక్‌పేట్ హాస్టల్‌లో బాలికపై లైంగిక దాడి
- వివరాలు సేకరించిన స్త్రీశిశు సంక్షేమ శాఖ డైరెక్టర్

బొంరాస్‌పేట: ఏడేళ్ల అంధ బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటనపై బుధవారం అధికారులు విచారణ నిర్వహించారు. బాధితుల వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతుల కుమార్తె ఏడాది వయసులోనే చూపును కోల్పోయింది. దీంతో దివ్యాంగుల సంక్షేమ సంస్థ కమిట్‌మెంట్స్ సిబ్బంది ఏడాది క్రితం హైదరాబాద్ మలక్‌పేటలోని అంధత్వ వసతి గృహంలో చేర్పించారు. అక్కడ పారిశుద్ధ్య పనులు చేస్తున్న నరేశ్ గత నెల 6న బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటికి పొక్కకుండా వసతిగృహం వార్డెన్ పద్మ జాగ్రత్తలు తీసుకున్నారు. దీనిపై బాధిత తల్లి ఫిర్యాదు చేసింది. ఘటనపై వెల్లువెత్తిన నిరసనలతో కేసును స్త్రీ శిశు సంక్షేమాధికారికి అప్పగించారు.



రాష్ట్ర స్థాయి అధికారుల విచారణ

బొంరాస్‌పేటలో ఉన్న బాలికను విచారించేందుకు స్త్రీ శిశుసంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ నిర్మలాక్రాంతి వెస్లీ వచ్చారు. బాలికతో పాటు తల్లిదండ్రులతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకుని విచారం వ్యక్తంచేశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధిత తల్లిదండ్రులు అధికారులను కోరారు. బాలిక ఆరోగ్య పరిస్థితులపై తమ శాఖ నుంచి రూ.25 వేల చెక్కును అందజేశారు. వీరితోపాటు స్త్రీ శిశుసంక్షేమ శాఖ హైదరాబాద్ డీడబ్ల్యూఓ అకేశ్వర్‌రావు, హైదరాబాద్ డీసీపీఓ శ్రీనివాస్, స్వాతి, జీవిత, వికారాబాద్ డీడబ్ల్యూఓ, కొడంగల్ సీడీపీఓ కృష్ణవేణి, సూపర్‌వైజర్ మంజుల, చైల్డ్‌లైన్ జిల్లా అధికారి శ్రీకాంత్ ఉన్నారు.

హాజరుపై మేయర్ ఆరా

సాక్షి,సిటీబ్యూరో: ఇటీవల జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు సమయానికి హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి.. బుధవారం సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. మధ్యాహ్నం దిగువ అంతస్తులోని రెండుమూడు విభాగాల్లో సిబ్బంది హాజరును ఆమె అడిగి తెలుసుకున్నారు. సమయానికి వచ్చినట్లు అధికారులు ఆమెకు తెలిపారు.

మహిళ ఆత్మహత్య



రేష్మా బేగం (ఫైల్)

మల్కాజిగిరి : ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మౌలాలికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ముక్రం అలియాస్‌కు రెండేళ్ల క్రితం జీడిమెట్లకు చెందిన రేష్మాబేగంతో వివాహం జరిగింది. వారికి ఓ కుమారుడు. ఈనెల 13న రాత్రి భర్తతో గొడవపడి రేష్మాబేగం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అదనపు కట్నం కోసం భర్త వేధింపుల కారణంగా తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి రజియాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుబాయ్ నుంచే హత్యకు ప్లాన్

కళ్లల్లో కారం కొట్టి గొడ్డళ్లు, కత్తులతో దాడి



- ఆపై నాటు తుపాకీతో కాల్పులు
- ఈ హత్యతో డాన్‌గా ఎదగాలని భావించిన నిందితుడు సలీం
- రౌడీషీటర్ రియాజుద్దీన్ హత్య కేసులో వీడిన మిస్టరీ
- 8 మంది నిందితుల అరెస్టు
- దుబాయ్‌లో తలదాచుకున్న సూత్రధారి హమీద్
- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: కంచన్‌బాగ్ రౌడీషీటర్ ఖాజా రియాజుద్దీన్ హత్య కేసును రాచకొండ పోలీసులు చేధించారు. సూత్రధారి షేక్ అహ్మద్ హమీద్, హతుడు రియాజ్‌కు మధ్య వాటర్ ప్లాంట్‌కు సంబంధించిన భూ వివాదమే హత్యకు కారణంగా పోలీసులు తేల్చారు. మొత్తం 11 మంది ముఠాలో 8 మందిని అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను మహేశ్వరం డీసీపీ డీ సునీతారెడ్డి, స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) డీసీపీ మురళీధర్‌తో కలిసి కమిషనర్ జీ సుధీర్ బాబు బుధవారం మీడియాకు వెల్లడించారు.

- షేక్ అహ్మద్ హమీద్, రియాజ్ మధ్య కొన్నాళ్లుగా భూ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఇరువురిపై మీర్‌పేట పీఎస్‌లో పలు కేసులు నమోదయ్యాయి. రియాజ్‌ను ఎలాగైనా అంతమొందించాలని హమీద్ కక్ష కట్టాడు. దీంతో గోల్కొండకు చెందిన మహ్మద్ సలీంను సంప్రదించాడు. ఈ హత్యను సెన్సేషన్ చేసి డాన్‌గా ఎదగాలని భావించిన సలీం.. హమీద్‌తో రూ.13 లక్షల సుపారీ కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.2.5 లక్షలు తీసుకున్నాడు. హత్యకు 15 రోజుల ముందే సలీం, హమీద్ ఇరువురు కలిసి లక్నోకు వెళ్లి ఫాజిల్, ఫరాజ్ అనే వ్యక్తుల నుంచి నాటు తుపాకీ, బుల్లెట్లను కొనుగోలు చేశారు. అక్కడినుంచే హమీద్ దుబాయ్‌కు చెక్కేశాడు. అక్కడి నుంచే రియాజ్ హత్యకు పక్కా పథకం రచించాడు. హత్య ప్రణాళిక మొదలు, అమలు, నిందితులను తప్పించడం, వారికి ఆశ్రయం కల్పించడం, బెయిల్ ప్రక్రియ వరకు అన్ని ఏర్పాట్లు చేశాడు.
- హమీద్ సూచన మేరకు సలీం సుల్తాన్, ఇస్మాయిల్, గౌస్, అహ్మద్ అలియాస్ బాద్షా, సయ్యద్ ఇనాయత్ ఉల్లా, తోఫీక్ ఖాన్, షేక్ హుస్సేన్‌లతో ముఠాగా ఏర్పడ్డారు. మొయినాబాద్‌లోని రోడ్‌సైడ్ మార్కెట్‌లో ఇస్మాయిల్, హుస్సేన్‌లతో కలిసి రెండు కత్తులు, గొడ్డళ్లు కొనుగోలు చేశారు. గోల్కొండలోని ట్రావెల్ ఏజెన్సీ నుంచి ఫార్చ్యూనర్, స్విఫ్ట్ కార్లను అద్దెకు తీసుకున్నారు. రియాజ్ ప్రతి కదలికలపై ఈ గ్యాంగ్ రెక్కీ వేసింది. ఈనెల 8న ఉదయం రియాజ్ ఇంటి నుంచి బైక్‌పై వ్యాపారం నిమిత్తం కంచన్‌బాగ్‌కు వెళ్లాడు. ఇదే అనువైన సమయంగా భావించిన సలీం.. వెంటనే గ్యాంగ్ సభ్యులకు సమాచారం అందించాడు.
- కార్లలో ఆర్సీఐ మల్లాపూర్ రహదారిలోని గ్యాస్ గోదాం వద్ద కాపు కాసిన ఈ ముఠా.. రియాజ్ బైక్‌ను ఢీకొట్టి కిందపడేశారు. కారులో నుంచి కిందికి దిగి తల, ముఖంపై గొడ్డళ్లు, కత్తులతో నరికారు. అనంతరం అతడి ఛాతిపై సలీం నాటు తుపాకీతో కాల్చాడు. రక్తపు మడుగులో కొట్టుకుంటున్న రియాజ్ మృతదేహం ముందు నుంచే సలీం హమీద్‌కు ఫోన్ చేసి పని పూర్తయిందని సమాచారం అందించాడు.నక్కర్త మేడిపల్లిలోని గెస్ట్ హౌస్‌లో కలుస్తానని, రూ.4 లక్షలు సిద్ధం చేయాలని సూచించాడు. దీంతో హమీద్ ఆదేశాల మేరకు తౌఫీక్ ఖాన్ గెస్ట్ హౌస్‌లో సలీంకు సొమ్ము అందజేశాడు.అనంతరం వారు నగరశివార్లలోని పొదల్లో తుపాకీ, గొడళ్లు, కత్తులు, రక్తంతో తడిసిన దుస్తులను విసిరేసి రారయ్యారు.
- రియాజ్ సోదరుడు ఖాజా సిరాజుద్దిన్ ఫిర్యాదు మేరకు బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించారు. సాంకేతిక ఆధారాలు సేకరించిన పోలీసులు నక్కర్త మేడిపల్లిలోని హమీద్ స్నేహితుడైన మున్వర్ ఖాన్ గెస్ట్ హౌస్‌లో నిందితులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ టీ భూపతి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు మధు, ఎస్ఐలు శ్రీనివాస్, నాగరాజులతో కూడిన బృందం అక్కడికి వెళ్లి సలీం సుల్తాన్, ఇస్మాయిల్, గౌస్, అహ్మద్ అలియాస్ బాద్షా, సయ్యద్ ఇనాయత్ ఉల్లా, తోఫీక్ ఖాన్, షేక్ హుస్సేన్‌లను అరెస్టు చేసి బాలాపూర్ ఠాణాకు తరలించారు. వీరి నుంచి రూ.4 లక్షల నగదు, కార్లు, తుపాకీ, ఇతరత్రా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి, హమీద్, లక్నోకు చెందిన ఫాజిల్, ఫరాజ్‌లు పరారీలో ఉన్నారు.

తెలంగాణలో కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కులగణనపై దేశవ్యాప్త పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జాతీయ కాంగ్రెస్ నిర్ణయంతోనైనా తెలంగాణ రాష్ట్రంలో కులగణన వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో భాగంగా సమగ్ర కుల గణన చేపట్టాలని ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పర్యటించి, కుల గణన సాధనకు జాతీయ స్థాయిలో ఉద్యమిస్తామని ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రుల సమావేశంలో నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. బీసీల పోరాటానికి మద్దతుగా కులగణన కోసం కాంగ్రెస్ పార్టీ ముందుకు రావడం గొప్ప పరిణామంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ విధానాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగౌని బాలరాజ్‌గౌడ్ మాట్లాడుతూ కులగణనపై రాహుల్‌గాంధీ మొదటి నుంచి సానుకూలంగా ఉన్నారన్నారు. కులగణన ఏజెండాతోనే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని పేర్కొనడం హర్షనీయమన్నారు. రాహుల్‌గాంధీ ఆదేశాలతోనైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వెంటనే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వాయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం హైదరాబాద్ అధ్యక్షులు మాదేశి రాజేందర్, బాలగౌని వెంకటేష్, ఇంద్రం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈకి ఏడాది జైలు

రూ.10 వేలు జరిమానా

సిటీ కోర్టులు : ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసేందుకు రైతుల నుంచి రూ.3 వేలు లంచం తీసుకున్నందుకు ఏఈ/ఎన్పీడీసీఎల్ (అదనపు అసిస్టెంట్ ఇంజినీర్/నార్తర్న్ పవర్ డిస్ట్రిబూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్) అధికారి మచ్చ సదాశివ్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. నిజామాబాద్ జిల్లా, మక్లూర్ మండలం, మదనపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల వద్ద ఉన్న బోరు బావులకు కొత్త కరెంట్ కనెక్షన్‌లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏఈఈ అధికారి మచ్చ సదాశివ్‌ను సంప్రదించారు. ఇందుకుగాను అతను రూ.3 వేలు లంచం డిమాండ్ చేశాడు. రైతుల ఫిర్యాదుతో దాడులు నిర్వహించిన ఏసీబీ అధికారులు అతడిని అదుపులోకి తీసుకుని అవినీతి నిరోధక చట్టం 1988 కింద సెక్షన్ 7,13 (డీ) రెడ్‌విత్ 13 (2) ప్రకారం కేసు నమోదు చేశారు. దీనిపై నాంపల్లి 2వ అదనపు ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి విచారణ చేపట్టారు. రైతుల దగ్గర నుంచి లంచం డిమాండ్ చేస్తూ అవినీతికి పాల్పడినందుకు నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. రూ.10 వేల జరిమానా విధించకపోతే మరో 3 నెలలు జైలు శిక్ష పొడిగించాల్సి ఉంటుందని ఉత్తర్వులు జారీ చేశారు.

కక్షకట్టి కడతేర్చాడు

- మామను గొంతుకోసి చంపిన అల్లుడు
- ఇంటి ముందు ముగ్గు తుడిపేశాడని గొడవ
- గతంలో పోలీసులకు ఫిర్యాదు
- పగ పెంచుకున్న ప్రవీణ్



కొండ రాజు(ఫైల్)

మణికొండ: ఎనిమిది నెలల క్రితం ఇంటి ముందు ముగ్గు తుడిపేశాడని జరిగిన గొడవ ఓ వ్యక్తి హత్యకు దారితీసింది. అప్పట్లో ముగ్గు తుడిపిన విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. దీంతో వరుసకు అల్లుడైన ప్రవీణ్ కక్షకట్టి మామ కొండ రాజు(50)ను బుధవారం తెల్లవారుజామున గొంతు కోసి హత్య చేసిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ కేంద్రంలోని కుమ్మరి బస్తీలో జరిగింది. నార్సింగి సీఐ హరికృష్ణారెడ్డి, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కొండ రాజు, ప్రవీణ్‌లు వరుసకు మామా అల్లుల్లు. కుమ్మరి బస్తీలో నివాసంఉంటున్న వీరు వేర్వేరు కటింగ్ షాప్‌లలో బార్బర్‌లుగా పనిచేస్తున్నారు. గత డిసెంబర్ 31న తన ఇంటి ముందు వేసిన ముగ్గును ప్రవీణ్ చెడిపేశాడని రాజు గొడవ పడటమేగాక అతడిపై నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చివరకు పెద్ద మనుషులు సర్ది చెప్పటంతో కేసును వాపసు తీసుకున్నాడు. అప్పటి నుంచి రాజుపై కక్ష కట్టిన ప్రవీణ్ బుధవారం గడ్డం చేసే కత్తితో అతని గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

రిటైర్డ్ కల్నల్‌కు టోకరా

- నకిలీ రిజిస్ట్రేషన్‌తో ఖాళీ స్థలం కబ్జాకు యత్నం
- నిందితుల అరెస్ట్

కంటోన్మెంట్: ప్లాటు ఖాళీగా ఉంది, 87 ఏళ్ల వయసున్న యజమాని అందుబాటులో లేడు.. పైగా సదరు ప్లాటు 1982లో రిజిస్ట్రేషన్ అయి ఉంది. అప్పటి డాక్యుమెంట్‌లలో యజమాని ఫొటో, ఫింగర్ ప్రింట్స్ ఉండవు. ఇదే అదునుగా భావించిన ఓ ముఠా ప్లాటును సొంతం చేసుకునేందుకు పక్కాగా పథకం వేసింది. యజమాని వయసులో ఉన్న ఓ నకిలీ వ్యక్తిని గుర్తించారు. తమకు తెలిసిన మరో విక్రేతకే అమ్ముతున్నట్లుగా రిజిస్ట్రేషన్ చేయించారు. ఇందుకు సంబంధించి ఇద్దరు నకిలీ సాక్షులను కూడా రంగంలోకి దింపారు. వీరి పన్నాగం ఫలించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా సాఫీగా జరిగిపోయింది. అయితే అసలు యజమాని రంగంలోకి దిగడంతో వారి మోసం బయటపడింది. ఈ కేసును చాకచక్యంగా చేధించిన పోలీసులు ఫేక్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించి, నిందితులను రిమాండ్‌కు తరలించారు. బుధవారం నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మి కేసు వివరాలు వెల్లడించారు.

- ఆర్మీ రిటైర్డ్ కల్నల్ కృష్ణారావుకు కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలోని గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లో 450 గజాల స్థలం ఉంది. కొన్నేళ్లుగా స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో నగరంలోని ఈడీ బజార్, బోయిన్‌పల్లికి చెందిన ఇద్దరు రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లు ఉబేయిద్ బిన్ మహ్మద్, షేక్ రౌఫ్ పాషా సదరు ప్లాటుపై కన్నేశారు. బాన్సువాడకు చెందిన 64 ఏళ్ల సాయినాథ్‌ను కృష్ణారావుగా మార్చేశారు. ఈ మేరకు అతని ఆధార్ కార్డులోనూ మార్పులు చేశారు. నిజామాబాద్‌కు చెందిన మహ్మద్ అబిద్‌కు ప్లాటు విక్రయించేలా ఏర్పాటు చేశారు. ఇందుకు రసూల్‌పురాకు చెందిన షేక్ అమీద్, బాన్సువాడకు చెందిన బానోత్ భీమ్ సింగ్‌లను సాక్షులుగా చేర్చి గత మే నెలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగించేశారు.

అసలు యజమాని ఎంట్రీతో..

చెన్నైలో నివాసముంటున్న రిటైర్డ్ కల్నల్ కృష్ణారావు ఇటీవల నగరానికి వచ్చాడు. స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి, తన ప్లాటుకు సంబంధించిన వివరాలు సేకరించగా మరొకరి పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించాడు. దీంతో అతను కార్ఖానా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నకిలీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించి, నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఇటీవలి కాలంలో భూకబ్జాలు పెరిగిపోయాయని, కొందరు వ్యక్తులు ఖాళీ స్థలం కనిపిస్తే వాటిని కబ్జా చేసి విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సీనియర్ సిటిజెన్స్ అధిక సంఖ్యలో ఉండే నార్త్‌జోన్ పరిధిలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో నార్త్‌జోన్ అడిషనల్ డీసీపీ పీ.అశోక్, తిరుమలగిరి ఏసీపీ రమేష్, కార్ఖానా ఇన్స్పెక్టర్ రామకృష్ణ ,ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కుత్బుల్లాపూర్: డ్రగ్స్ విక్రయిస్తున్న యువకుడిని అరెస్ట్ చేసిన మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అతడి నుంచి 3.26 గ్రాముల ఎండీఎంఏ ను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. వనస్థలిపురం ఎన్జీవో కాలనీకి చెందిన అలెక్స్‌బినాయ్స్ బైక్ విన్యాసాలు చేసేవాడు. అతను హైదరాబాద్, బెంగళూర్, పూణే, ముంబై నగరాల్లో ఇన్‌స్టాగామ్ గ్రూపులను ఏర్పాటు చేశాడు. ఇటీవల ముంబై వెళ్లిన అతను ఎండీఎంఏ డ్రగ్ తీసుకువచ్చి నగరంలోని యువతకు విక్రయించేవాడు. బుధవారంహెచ్ఎంటీ పరిసరాల్లో డ్రగ్స్ డెలివరీ చేసేందుకు వచ్చిన అతడిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి 3.26 గ్రాముల ఎండీఎంఏ, మొబైల్, ఎలక్ట్రానిక్ తూనిక మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ మాధవయ్య, సీఐ నర్సిరెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది వెంకటేశ్వరరావు, సత్తార్, సంజయ్, శ్రీనివాస్, చెన్నయ్య పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, నిందితుడు అలెక్స్ బినాయ్స్

ఎమ్మెల్యేకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న జ్ఞానిజైల్ సింగ్ నగర్ బస్తీవాసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని జ్ఞానిజైల్‌సింగ్‌నగర్ బస్తీలో సమస్యలు పరిష్కరించాలంటూ బస్తీ సంక్షేమ సంఘం నేతలు బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బస్తీలోని బంగారు మైసమ్మగుడి వెనుక భాగంలో డ్రైనేజీ, సీసీ రోడ్డు, వాటర్‌లైన్ సమస్యలున్నాయని చాలా రోజులుగా బస్తీవాసులు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో ప్రతిపాదనలు రూపొందించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోతుల మల్లేష్, సలహాదారు మామిడి నర్సింగ్‌రావు, బాలస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు



ఆత్మకూరి రామారావు స్కూల్‌లో రక్షాబంధన్, వరలక్ష్మి వ్రత వేడుకలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో బుధవారం ముచ్చటగా జరిగిన మూడు పండుగలతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టే రీతిలో అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిర్వహించుకునే రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు రాఖీలు కట్టుకుని సంతోషం వ్యక్తం చేశారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వరలక్ష్మి వ్రత వేడుకలు కార్యక్రమానికి హైలెట్‌గా నిలిచాయి. దేశభక్తిని చాటుకునేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కూడా నిర్వహించారు. విద్యార్థులకు మన సంప్రదాయాలను తెలియజేయడం, జాతీయ సమగ్రతను చాటిచెప్పడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ తెలిపారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు కనువిందు చేసే వస్త్రధారణలో విశేషంగా ఆకట్టుకున్నారు.

జాతీయతను చాటిన ఎన్‌సీసీ కేడెట్స్



నెక్లెస్‌రోడ్డులో హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమంలో సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్

బంజారాహిల్స్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ బుధవారం జాతీయతను చాటారు. నెక్లెస్‌రోడ్డులో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ దేశభక్తిని చాటారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి జాతి ఐక్యతను చాటిచెప్పాలని ఈ సందర్భంగా విద్యార్థులు సందేశమిచ్చారు.

ఖాళీ స్థలాలపై పెద్దల కన్ను!



ప్రజా ప్రజయోనాలకు ఉపయోగపడే స్థలాలు గాలికి

- సర్కార్ స్థలాల వినియోగంలో అధికారుల విఫలం
- అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- వత్తాసు పలుకుతున్న కొందరు అధికారులు



జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ పక్కన ఉన్న జీహెచ్‌ఎంసీ ఖాళీ స్థలం

బంజారాహిల్స్: ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాల్సిన ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకోవడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, హెచ్‌ఎండీఏ తదితర శాఖలు తమ కున్న స్థలాలను వినియోగించుకుని వాటిల్లో ప్రజలకు ఉపయోగపడే కట్టడాలు చేపట్టాల్సి ఉండగా గాలికొదిలేస్తున్నారు. దీంతో ఈ ఖాళీ స్థలాలపై పెద్దల కన్నుపడి గద్దల్లా తన్నుకుపోతున్నారు. తీరా కబ్జా జరిగాక సంబంధిత అధికారులు మేల్కొంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసి ఇక తమ బాధ్యత తీరిపోయిందన్నట్లుగా చేతులు దులుపుకుంటున్నారు. జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్ పక్కన ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీలో పేదల ప్రయోజనాల కోసం ఉపయోగపడాల్సిన 850 గజాల ఖరీదైన ప్లాట్లను కొంతమంది పెద్దలు డాక్యుమెంట్లు సృష్టించి పాగా వేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకున్నారు. గురుబ్రహ్మనగర్ బస్తీవాసులు సకాలంలో మేల్కొని ఈ కబ్జాలకు అడ్డుకట్ట వేయడంతో అటు కొందరు అధికారులు, ఇటు కొంతమంది పెద్దలు వారిపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. వాస్తవానికి పాతికేళ్ల క్రితం ఇక్కడి ప్రభుత్వ స్థలంలో గురుబ్రహ్మనగర్ బస్తీపేరిట వందలాది మంది గిరిజనులు గుడిసెలు వేసుకున్నారు. పక్కా ఇళ్లు వస్తాయని పాతికేళ్లుగా కలలు కంటూనే ఉన్నారు. పక్కా ఇళ్లు కాదు కదా..! పక్కనే ఉన్న జీహెచ్‌ఎంసీ లేఅవుట్ ఖాళీ స్థలంలో తమ బస్తీకి సంబంధించి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం లేదా సామాజిక భవనం నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఆ ఆశ కూడా తీరకపోగా ఐదు రోజుల క్రితం ఈ స్థలం చుట్టూ పెద్దలు, అధికారులు కలిసి దర్జాగా ప్రహరీ గోడ నిర్మించారు. వాస్తవానికి నందగిరి హిల్స్ హుడా లేఅవుట్, గురుబ్రహ్మనగర్ బస్తీల మధ్య ఉన్న ఈ 850 గజాల ప్లాట్ జీహెచ్‌ఎంసీ లేఅవుట్‌లో ఓపెన్ స్పేస్‌గా గుర్తించబడి ఉంది. అంటే నిబంధనల ప్రకారం ఇక్కడ బస్తీవాసుల కోసం సర్కారు బడి గానీ ప్రభుత్వ ఆస్పత్రి గానీ నిర్మించాల్సి ఉంటుంది. ప్రభుత్వానికి మాత్రం ఇవేమీ పట్టడంలేదు. ఈ నిర్మాణాలకు నిధులు లేకున్నా పార్కుగానైనా అభివృద్ధి చేస్తే ఇటు బస్తీవాసులకు, అటు కాలనీవాసులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది. అధికారులు ఆ దిశలో కూడా ప్రణాళికలు రూపొందించకపోగా చుట్టూ గోడ కట్టి బస్తీవాసులకు రాకపోకలు నిలిపివేయడంతో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. తక్షణమే ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని బస్తీవాసుల కోసం ప్రభుత్వ పాఠశాలతో పాటు కమ్యూనిటీహాల్, బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ బడిని సందర్శించిన విదేశీయులు

విద్యార్థుల ప్రతిభ చూసి మంత్రముగ్ధులు



ఎస్పీటీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఫారెనర్లు

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మాట్లాడే ఇంగ్లిష్‌కు, వారి ప్రతిభను చూసిన విదేశీయులు మంత్రముగ్ధులైపోయారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎస్పీటీనగర్ ప్రభుత్వ పాఠశాలను కోఫోర్జ్ సాఫ్ట్‌వేర్ సంస్థకు చెందిన ఫారెనర్లు తమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలకు సదరు సాఫ్ట్‌వేర్ సంస్థ కంప్యూటర్ ల్యాబ్ టీచర్లతో పాటు పలు విభాగాలకు టీచర్లను కేటాయించడంతో విద్యార్థులను కలుసుకునేందుకు వచ్చారు. విద్యార్థుల ఇంగ్లిష్ పరిజ్ఞానంతో పాటు వారు తయారు చేసిన సైన్స్ ఎక్విప్‌మెంట్లు చూసి విదేశీయులు మురిసిపోయారు. తమ సహాయ సహకారాలు పాఠశాలకు ఎప్పటికీ ఉంటాయని అన్నారు. అనంతరం విద్యార్థులు విదేశీయులతో సరదాగా కొన్ని ప్రశ్నలు అడుగుతూ ఉత్సాహంగా గడిపారు. కష్టపడి చదివి ఉన్నత స్థితికి రావాలని ఫారెనర్లు విద్యార్థులకు పాఠలు బోధించారు.

చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

వెంగళరావునగర్ : విద్యార్థులు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని శ్రీ సాయి సరస్వతి విద్యానికేతన్ స్కూల్స్ డైరెక్టర్ జయంతి వెంకట్రామన్ అన్నారు. బుధవారం యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని హైస్కూల్‌లో బుధవారం ఘనంగా సింహాసనోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గత నెలలో స్కూల్‌లో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు బాధ్యతలను అప్పగించారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు చేసిన కరాటే విన్యాసాలు, యోగా, ఏరోబిక్ తదితర విద్యలు ఎంతో ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్కూల్స్ డైరెక్టర్ జయంతి వెంకట్రామన్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వివిధ క్రీడల్లో కూడా ప్రావీణ్యం పొందితే మంచి భవిషత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యక్షులు భవానీశంకర్, చైర్మన్ శిరీష శంకర్, ప్రధానోపాధ్యాయురాలు ఉషా మీనాక్షి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ

బంజారాహిల్స్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ నేతలతో పాటు విభిన్న రకాల వేషధారణలు ధరించి ఆకట్టుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎస్పీటీనగర్ శ్రీ సాయిరాం స్కూల్‌లో ప్రీ ప్రైమరీతో పాటు ప్రైమరీ విద్యార్థులకు ఫ్యాషన్స్ డ్రెస్ పోటీలను బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఝాన్సీ లక్ష్మీబాయి, సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌తో పాటు పలువురు జాతీయ నేతల వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సీమ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలి

కాచిగూడ: ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్‌ను ప్రభుత్వం గుర్తింపునిచ్చి ఆదుకోవాలని ఫ్రీలాన్స్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కోశాధికారి మెట్టు వేణుకుమార్, జాయింట్ సెక్రెటరీ ఉదయ్ కుమార్ నేత, అక్షయ్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫొటోగ్రఫీని గుర్తించి గుర్తింపు కార్డులు అందజేయాలని అన్నారు. బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలు అందించాలని, ఫొటో గ్రాఫర్స్ సంఘ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవాలు

శ్రీనగర్‌కాలనీ: అమీర్‌పేటలోని గౌతం మోడల్ స్కూల్‌లో బుధవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో హాజరై ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరుణారెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో ఇలాంటి వేడుకలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు, స్టూడెంట్స్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని మతాల సారాంశం ఒక్కటే

లిబర్టీ: అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ఎవరి మతాన్ని వారు విశ్వసించాలని ఇండియాన్ ప్రజా కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షులు నాగిళ్ల నవీన్ కుమార్ అన్నారు. పరస్పర మతసహనాన్ని పాటించాలి తప్ప ఇతర మతాలను ద్వేషించడం తగదని స్పష్టం చేశారు. లిబర్టీ ప్లాజాలోని సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవుడు ఒకటేనని అన్ని మతాల సారాంశం చెబుతుందని ఆయన స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై అక్కడి మైనార్టీలు చేస్తున్న దాడులు, హింసా పద్ధతులు సరికాదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించి బంగ్లాదేశ్ హిందువులకు రక్షణ కల్పించాలన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



రహమత్‌నగర్ (బోరబండ): క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని కాంగ్రెస్ నాయకురాలు, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా అన్నారు. బోరబండ డివిజన్‌ఎస్పీ జేఆర్ గ్రౌండ్స్‌లో ఎన్ఆర్ఆర్‌పురంకాలనీ హైస్కూల్ క్రికెట్ పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయన్నారు. ఎంతో మంది నైపుణ్యం ఉన్న క్రీడాకారులు సరైన ప్రోత్సాహం లేక క్రీడల్లో రాణించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రికెట్ పోటీలు ఏర్పాటు చేసిన నిర్వాహకులకు ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ ఎజాజ్ బేగ్, మహ్మద్ ఖుస్రు, రవూస్, అబ్దుల్ రహమాన్, సయ్యద్ ఖదర్‌సాబ్, సాజిద్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో కేసులు త్వరగా పరిష్కారం

ఏసీపీ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్: సీసీ కెమెరాల ఏర్పాటుతో కేసులు త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. బస్తీవాసులు ఆలోచించి ప్రతీ ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎస్పీటీనగర్ బస్తీలో బస్తీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శాంతి భద్రతల విషయంలో పోలీసులు కృషి చేస్తున్నప్పటికీ సీసీ కెమెరాలు క్రైం కంట్రోల్ చేయడంతో పాటు నిందితులను పట్టుకోవడానికి ఉపయోగపడతాయని అన్నారు. త్వరలోనే బస్తీ మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సమావేశాలు నిర్వహించుకోవాలని తాము కూడా ఇందుకు సహకరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా బస్తీలో ఉన్న పలు సమస్యలను బస్తీవాసులు పోలీసుల దృష్టికి తీసుకెళ్ళారు. రాత్రి 10 గంటల తర్వాత కొంతమంది యువకులు గంజాయి తాగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, బస్తీలో పోలీసుల గస్తీ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ సీఐ రాఘవేంద్ర పాల్గొన్నారు.

నియామకం



రహమత్‌నగర: రహమత్‌నగర్ డివిజన్ బ్రహ్మశంకర్‌నగర్ బస్తీకి చెందిన విద్యార్థి సంఘం నాయకుడు ఎడవెల్లి వెంకటస్వామి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షునిగా నియామకమయ్యారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్వామి కాలేజీలో ఎన్ఎస్‌యూఐ నాయకునిగా, జూబ్లీహిల్స్ నియోజకవర్గం అధ్యక్షునిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, సెక్రటరీగా ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘంలో పనిచేశారు. అనేక విద్యార్థి ఉద్యమాల్లో ఎన్ఎస్‌యూఐ ప్రతినిధిగా ఆయన పాల్గొన్నారు. స్వామి అందిస్తున్న సేవలను గుర్తించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్వామిని తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డికి సన్మానం



ముఖ్యమంత్రిని సన్మానిస్తున్న సదానందం

లిబర్టీ: తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు పలు కంపెనీలను తెలంగాణలో పెట్టుబడులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి చేపట్టిన రెండు దేశాల పర్యటన విజయవంతమైందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద అన్నారు. కోట్లాది రూపాయలు పెట్టుబడులతో అమెరికా దక్షిణ కొరియా పర్యటన ముగించుకొని వచ్చిన ముఖ్యమంత్రిని శాలువాతో ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కంపెనీల పెట్టుబడితో దాదాపు 31 వేలకుగా మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సీఎంగా పాలనా పగ్గాలు చేపట్టి దాదాపు 8 మాసాల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతోపాటు విదేశీ పెట్టుబడులను తీసుకురావడం గొప్ప విషయమన్నారు.

వీసా పేరుతో మోసం

వెంగళరావునగర్: విదేశాలకు వెళ్ళేందుకు నకిలీ వీసా డాక్యుమెంట్స్ ఇచ్చి రూ.25 లక్షలు కాజేశాడని కన్సల్టెన్సీ నిర్వాహకుడిపై ఓ యువతి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... ఏపీలోని కృష్ణాజిల్లా నందిగామ ప్రాంతానికి చెందిన కె.అనూష కూకట్‌పల్లిలో నివాసం ఉంటుంది. గత ఏడాది జూన్ 4వ తేదీన ఆమె వెంగళరావునగర్‌లోని ఆర్‌కె ఓవర్సీస్ కన్సల్టెన్సీ మేనేజర్ ఏ.మధుసూదన్‌ను కలిసింది. తాను ఆస్ట్రేలియాలో ఉన్నత చదువుల కోసం వెళ్ళాను కుంటున్నట్టుగా తెలియజేసి, తనకు వీసా, ఇతర డాక్యుమెంట్స్ కావాలని కోరింది. ఇందుకు మధుసూదన్‌రావు డాక్యుమెంట్స్ అన్నీ ఇవ్వడానికి కొంత సమయం కావాలని, ఇందు కోసం దాదాపు రూ.పాతిక లక్షల వరకు ఖర్చవుతుందన్నాడు. ఆమె అందుకు అంగీకరించి విడదల వారీగా అతనికి రూ . 25 లక్షల వరకు అందజేసింది. ఇటీవల ఆమెకు వీసా, సర్టిఫికెట్లు సిద్ధం చేశానని చెప్పి వాటిని అందజేశాడు. వాటిని తీసుకుని అనూష ఈనెల 8వ తేదీ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళింది. అయితే ఎయిర్‌పోర్ట్ అధికారులు ఆ డాక్యుమెంట్స్ పరిశీలించి వాటిని ఫేక్ డాక్యుమెంట్స్‌విగా గుర్తించి ఆమెకు తెలియజేశారు. దీంతో నిర్ఘాంతపోయిన ఆమె తాను మోసపోయినట్టుగా తెలుసుకుని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్రెండ్‌కు ఫోన్ చూపిస్తానని చెప్పి...

ఫోన్‌తో ఉడాయించాడు

బంజారాహిల్స్: ఓఎల్‌క్స్‌లో పెట్టిన మొబైల్ ఫోన్‌ను ఫ్రెండ్‌కు చూపిస్తానని చెప్పిన ఓ వ్యక్తి ఫోన్‌తో ఉడాయించిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మాదాపూర్ అయ్యప్ప సొసైటీ రోడ్డునెంబర్–18లోని హాస్టల్‌లో ఉండే జానీ బాషా (22) తన ఫోన్ విక్రయించేందుకు ఓఎల్ఎక్స్‌లో పెట్టాడు. దానిని చూసిన ఓ వ్యక్తిని అతనికి కాల్ చేసి తాను మొబైల్ కొనుగోలు చేస్తానని చెప్పి జూబ్లీహిల్స్‌లోని ఎస్ఎల్ బిల్డింగ్‌లోని తన కార్యాలయానికి తీసుకురావాల్సిందిగా సూచించాడు. దీంతో జానీబాషా తన ఫోన్‌ను తీసుకుని సదరు వ్యక్తి చెప్పిన చోటికి వెళ్లాడు. ఆఫీసు క్యాబిన్‌లో కూర్చొన్న వ్యక్తి అదే ఆఫీసులో పని చేస్తుంటారేమోనని భావించిన బాషా తన ఫోన్‌కు అతనికి చూపించాడు. ఫోన్ బాగుందని, దీనిని లోపల ఉన్న తన స్నేహితుడికి చూపించి వస్తానని చెప్పి వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో ఆ వ్యక్తి గురించి అదే ఆఫీసులో వాకబు చేయగా అతను ఎవరో తమకు తెలియదని చెప్పారు. దీంతో మోసపోయానని భావించి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సెక్టార్ ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సైట్3 శ్మశాన వాటిక వద్ద గుర్తుతెలియని వ్యక్తి గంజాయి విక్రయిస్తున్న సమాచారం మేరకు ఎస్సై మనోజ్ తన సిబ్బందితో కలిసి అక్కడకు వెళ్లి గంజాయిని విక్రయిస్తున్న ఫలక్‌నుమాకు చెందిన కరీమొద్దీన్ అలియాస్ షాబాద్ (29)ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 18 గ్రాముల గంజాయితో పాటు, సెల్‌ఫోన్, రూ. 300 నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: హాస్టల్ ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్ హాస్టల్‌లో ఉంటున్న సాయిపవన్ జొమాటోలో విధులు నిర్వహిస్తుంటాడు. ఈ మేరకు మూసారాంబాగ్‌లో వాహనాన్ని అద్దెకు తీసుకుని వస్తుంటాడు. ఈ నెల 12 తన అద్దె వాహనాన్ని హాస్టల్ ముందు ఉదయం పార్క్ చేయగా, అదే రోజు మధ్యాహ్నం తిరిగి వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.







స్వరాల జల్లు..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సింగింగ్ కాంపిటీషన్ ఆహా 'తెలుగు ఇండియన్ ఐడల్'కు చెందిన సింగర్ గీతా గ్యాంగ్‌స్టర్స్, కార్తీక్ కిలాడీలు, మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ట్రెండ్ సెట్టర్స్ నగరంలోని ఓ విశ్వవిద్యాలయంలో పాటలతో సందడి చేశారు. ఈ లైవ్ మ్యూజిక్ ఈవెంట్‌లో యువ సింగర్స్ సాయి వల్లభ, భరత్, అనిరుధ్, నజీర్, అభిజ్ఞలు తమ సంగీత స్వరాలతో యూనివర్సిటీ విద్యార్థులను అలరించారు. ఇందులో భాగంగానే వారి స్ఫూర్తిదాయక వ్యక్తిగత ప్రయాణాలను ప్రేక్షకులతో పంచుకున్నారు.





'అకాన్ ఆహ్వానం'

సిటీలో వినూత్నంగా ఫండ్ రైజింగ్ ఫీస్ట్

నెలలు నిండకుండా జన్మించిన శిశువుల సంరక్షణ కోసం ఫండ్ రైజింగ్

ఎక్స్‌ట్రామైల్ ఫౌండేషన్, అకాన్ రెస్టారెంట్ ఆధ్వర్యంలో నిర్వహణ

లంచ్‌ను ఆస్వాదించండి.. నచ్చినంత చెల్లించండి..



సాక్షి, సిటీబ్యూరో: స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో నగరం వేదికగా 'అకాన్ ఆహ్వానం' పేరుతో వినూత్నంగా ఫండ్ రైజింగ్ ఫీస్ట్‌ను గురువారం నిర్వహిస్తున్నారు. పేద కుటుంబాల్లో నెలలు నిండకుండానే పుట్టిన చిన్నారుల సంరక్షణ, సహకారం అందించడం కోసం ఈ ఫీస్ట్ నిర్వహించడం విశేషం. దుర్గంచెరువు దగ్గరలోని అకాన్ రెస్టారెంట్ వేదికగా ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఎక్స్‌ట్రామైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఫండ్ రైజింగ్ ఫీస్ట్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రముఖ చెఫ్‌లు తయారు చేసిన పసందైన ఆహార పదార్థాలను, సితార్ ప్రదర్శనను ఆస్వాదిస్తూ ఆరగించవచ్చు. లంచ్ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. లంచ్ అనంతరం చెల్లించే ప్రతిపైసా పేద కుటుంబాల్లోని ప్రీ మెచ్యూర్డ్ చిన్నారులకు, అనారోగ్యాలతో జన్మించిన శిశువులకు విరాళంగా అందిస్తారు. సామాజిక బాధ్యతగా ఈ వినూత్నమైన ఆహారానికి, ఆతిథ్యానికి ఎంతైనా చెల్లించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఒక్కో శిశువుకు రూ.10 లక్షల వరకు..

నెలలు నిండని శిశు జననాల సంఖ్య ఈ మధ్య కాలంలో విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా బతుకు గడవడమే కష్టంగా మారిన పేద కుటుంబాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. ఇలాంటి శిశువులకు, వారి కుటుంబాల చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడానికి ఎక్స్‌ట్రామైల్ ఫౌండేషన్ కృషి చేస్తోంది. 'అకాన్ ఆహ్వానం' ఫండ్ రైజింగ్ ఫీస్ట్‌లో పోగైన ప్రతి పైసా ప్రీమెచ్యూర్డ్ చిన్నారులకు, అనారోగ్యంతో జన్మించిన శిశువులకు చేరుతుంది. మా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి హాస్పిటల్‌లో ఉండే ఎన్ఐసీయూ యూనిట్ల ద్వారా సహాయం అవసరమైన శిశువులకు సహకారం అందిస్తున్నాం. ఇప్పటి వరకు 197 మంది చిన్నారులకు సహకారం అందించాం. 400 గ్రాముల బరువుతో జన్మించిన చిన్నారులను రక్షించాలంటే రూ.10–15 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇతర సమస్యలతో జన్మించినా కనీసం రూ.3, 4 లక్షలు అవసరం. ఒక్క లంచ్ ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుంది. లంచ్ రిజర్వేషన్ల కోసం ఫోన్: 96496 52222



– డా.నిటాషా, ఎక్స్‌ట్రామైల్ ఫౌండేషన్

ఫ్రీడమ్ కలర్స్

ఇండిపెండెన్స్ స్టైల్స్

గతంతో పోలిస్తే విభిన్నంగా యూత్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. అందులో ఫ్యాషన్, స్టైలింగ్ కూడా ఇప్పుడు భాగమైంది. వస్త్రధారణ, యాక్సెసరీస్‌లలో ట్రైకలర్స్‌ను జత చేస్తూ స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నారు. కార్పొరేట్ ఆఫీసుల్లో, కాలేజీల్లో అని తేడా లేకుండా ప్రతిచోటా నిర్వహిస్తున్న ఇండిపెండెన్స్ డే ఈవెంట్స్ ఈ ఫ్రీడమ్ ఫ్యాషన్‌కు సరికొత్త వన్నెలు అద్దుతున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

దేశ భాషల్ని వేష భాషల్లో మమేకం చేసి ప్రదర్శించే అవకాశం అందిస్తుంది ఈ రోజు. నగరం నలువైపులా నిర్వహించుకునే వేడుకల్లో భాగం అవుతూ.. రోజువారీ వస్త్రధారణకు భిన్నంగా, ఇండిపెండెన్స్ డే స్పెషల్‌గా కనిపించాలనుకునే వారి కోసం నగరానికి చెందిన ప్రముఖ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ హామ్‌స్టెక్ కాలేజ్ ఆఫ్ క్రియేటివ్ ఎడ్యుకేషన్‌కు చెందిన డిజైన్, స్టైల్ ఫ్యాకల్టీలు అందిస్తున్న సూచనలు ఇవే..

త్రివర్ణశోభితంగా.. మహిళలు..

సంప్రదాయంగా కనిపించాలంటే.. ఒక తెల్ల చీరపైన కుంకుమ పువ్వు, ఆకుపచ్చ అంచులు లేదా త్రివర్ణ మూలాంశంతో ఉండే చీర ఎంచుకోవాలి. అలాగే సంప్రదాయ ఆభరణాలు, మ్యాచింగ్ క్లచ్‌తో పూర్తి రూపాన్ని అలంకరించవచ్చు. అదే మోడ్రన్ లుక్‌లో కనిపించాలంటే ఈ రంగులలో చిక్ సల్వార్ కమీజ్ లేదా లెహంగా చోలీని కూడా ఎంచుకోవచ్చు. దీనికి తెలుపును జత చేయచ్చు. అదేవిధంగా కుంకుమపువ్వు/ఆరెంజ్ లేదా ఆకుపచ్చ దుపట్టా కుర్తీ అత్యాధునిక ఎంపికగా అనిపిస్తుంది.



భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపొచ్చు ఇలా..

భారతదేశ గొప్పతనం భిన్నత్వంలోని ఏకత్వం. ఇది ప్రదర్శించడానికి డ్రెస్సింగ్ చక్కని అవకాశం.

మహిళలు.. ప్రాంతీయ వస్త్రధారణ: కంజీవరం పట్టుచీర వంటి నిర్దిష్ట ప్రాంతాల సంప్రదాయ దుస్తులను ధరించవచ్చు. తమిళనాడు లేదా గుజరాత్‌కు చెందిన బంధనీ దుపట్టాతో ప్రాంతీయ వైవిధ్యాన్ని హైలైట్ చేయచ్చు. అలాగే జుకాలు, బ్యాంగిల్స్ లేదా బంగారంతో కూడిన స్టేట్‌మెంట్ నెక్లెస్ ఇతర అలంకరణలు వస్త్రధారణకు పరిపూర్ణతను అందిస్తాయి.

- పురుషుల ధోతీ–కుర్తా లేదా త్రివర్ణ రంగులలో షేర్వాణీ ఎంచుకోవచ్చు.

స్టైలిష్: షేర్వానీపైన నెహ్రూ జాకెట్ ధరించడం అంటే ఆడంబరపు టచ్ జోడించినట్టే. అలాగే పాష్ లుక్ కోసం దుస్తులకు సంప్రదాయ తలపాగా లేదా సొగసైన వాచ్ వంటి ఇతర అలంకారాలు జత చేయచ్చు. ఆధునికత ఉట్టిపడాలంటే సంప్రదాయ దుస్తులకు పైస్లీ, పూలు లేదా రేఖా గణిత ప్రింట్లు వంటి నమూనాలు సమకాలీన ట్విస్ట్‌ను జోడిస్తాయి.

ట్రైకలర్స్‌లో.. మేన్లీ..

మగవాళ్లు సంప్రదాయం ఉట్టిపడేలా కనిపించడానికి తెల్లని చుడిదార్ లేదా పైజామాతోనూ, కుంకుమపువ్వు లేదా ఆకుపచ్చ రంగు కుర్తా ధరిస్తే.. ఓ వైపు సౌకర్యవంతంగా మరో వైపు గౌరవప్రదంగానూ ఉంటుంది. అదనపు టచ్ కోసం సరిపోయే స్కార్ఫ్ లేదా స్టోల్‌ను జోడించవచ్చు. మోడ్రన్ లుక్‌లో మెరవాలంటే.. తెల్లటి చొక్కా మీద కుంకుమపువ్వు లేదా ఆకుపచ్చ రంగు టైలర్డ్ బ్లేజర్‌ని ధరించాలి. ఇది అఫీషియల్‌కూ.. ఫెస్టివల్‌కూ మధ్య సరైన సమతుల్యత.

మరికొన్ని సూచనలు



ఆకుపచ్చ, తెలుపు రంగుల్లో పూలకుర్తీ లేదా కుంకుమ పువ్వుతో కూడిన ప్రింటెడ్ చీరను మహిళలు ధరించవచ్చు. లగ్జరీ టచ్ కోసం కాటన్ లేదా సిల్క్ వంటి ఫ్యాబ్రిక్‌లను ఎంచుకోవాలి. అలాగే సూక్ష్మమైన త్రివర్ణ నమూనా లేదా జాతి ముద్రలతో కూడిన స్కార్ఫ్ లేదా శాలువా వస్త్రధారణకు నిండుదనాన్నిస్తుంది.

- కుంకుమ/ఆరెంజ్, ఆకుపచ్చ రంగులలో సున్నితమైన నమూనాలు లేదా ఎంబ్రాయిడరీతో కూడిన కుర్తా, సంప్రదాయ మూలాంశాలతో ప్రింటెడ్ షర్టులు కూడా మగవాళ్లకు స్టైలిష్ ఎంపికగా ఉంటాయి. ట్రైకలర్ జోష్‌ను జోడించడానికి మూడు రంగుల పాకెట్ చతురస్రాన్ని లేదా నమూనా స్కార్ఫ్‌ను ఎంచుకోవచ్చు.



మహిళల కోసం..

సాదా దుపట్టాకు మూడు రంగుల ఎంబ్రాయిడరీని జోడించవచ్చు. లేదా హెడ్‌బ్యాండ్‌లు లేదా బ్రోచెస్ వంటి వాటితో స్పెషల్ లుక్‌ను తీసుకురావచ్చు. త్రివర్ణ స్వరాలు లేదా ప్రత్యేక థీమ్డ్ చీర లేదా సల్వార్ కమీజ్‌ని డిజైన్ చేసుకోవచ్చు.

ఇతర అలంకరణ

స్టేట్‌మెంట్ క్లచ్ లేదా త్రివర్ణ–నేపథ్య హ్యాండ్‌బ్యాగ్‌తో ఫ్రీడమ్ టచ్‌ను జోడించవచ్చు. అయితే సహజ సౌందర్యాన్ని పెంచేలా పరిమిత మేకప్ వేసుకోవాలి.

- బ్రౌన్ లేదా టాన్‌లో ఉన్న సంప్రదాయ లోఫర్‌లు లేదా కుర్తా–పైజామాతో పురుషుల ఫ్రీడమ్ లుక్‌ని పూర్తి చేస్తాయి. ఫార్మల్ సెట్టింగులు, న్యూట్రల్ షేడ్స్‌లో పాలిష్ చేసిన డ్రెస్ షూలు కూడా అనువైనవి.
- **ఇతర అలంకరణలు:** క్లాసిక్ వాచ్, ఆధునాతన బెల్ట్ లేదా సొగసైన జత సన్ గ్లాసెస్ జోడించవచ్చు.

పురుషుల కోసం..

- త్రివర్ణ పాచెస్ లేదా ఎంబ్రాయిడరీతో సాదా కుర్తా లేదా షర్టును కొత్తగా మార్చవచ్చు.
- విలక్షణమైన, సూక్ష్మమైన త్రివర్ణ వివరాలతో జాకెట్ లేదా వెయిస్ట్‌కోట్‌ను డిజైన్ చేయవచ్చు.


భారతీయ సంస్కృతికి నిదర్శనం

స్వాతంత్ర్య దినోత్సవం స్వేచ్ఛ, ఏకత్వం, సాంస్కృతిక వైవిధ్యంతో నిండిన వేడుక. వస్త్రధారణ ఈ రోజు దేశభక్తి స్వాతంత్ర్యంపై గౌరవాన్ని మాత్రమే కాకుండా వ్యక్తిగత శైలి, సాంస్కృతిక సంపదను కూడా ప్రతిబింబిస్తుంది. కాబట్టి ఎంచుకున్న వస్త్రధారణ సంప్రదాయమైనా, ఆధునికమైనదైనా లేదా రెండింటినీ మిళితం చేసినదైనా సరే, దాన్ని అత్యంత అంగీకారయోగ్యంగా ధరించడమే కీలకం. స్వాతంత్ర్య థీమ్‌తో డ్రెస్సింగ్ అంటే పార్టీ కల్చర్‌కు కాదు భారతీయ సంస్కృతికి నిదర్శనం అనేది గుర్తుంచుకోవాలి.

దేశసేవకు.. మేము సైతం..



స్వచ్ఛంద ప్రాతిపదికన పాఠశాల, కళాశాలల విద్యార్థులకు సైన్యం, నావిక దళం, ఎయిర్‌ఫోర్స్ ట్రై సర్వీసెస్‌లో శిక్షణ అందజేయడం కోసం ఏర్పడిన భారత సాయుధ దళాల యువ విభాగం నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ). మన భారత దేశ సైన్యంలో సిబ్బంది కొరతను భర్తీ చేసే లక్ష్యంతో భారత రక్షణ చట్టం ప్రకారం 1948లో ఎన్‌సీసీ ఏర్పాటైంది. 1949లో బాలికల విభాగం, 1950లో ఎయిర్‌వింగ్, 1952లో నేవీ వింగ్ ఏర్పడ్డాయి. 1962 చైనా– ఇండియా యుద్ధం తర్వాత దేశం అవసరాన్ని తీర్చడానికి 1963లో ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆయుధాల్లో, డ్రిల్ తదితర అంశాల్లో శిక్షణ తప్పనిసరి చేశారు.



తెలంగాణ, ఏపీ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో 9 గ్రూపులు

1949లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌సీసీ స్థాపించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో టివోలీ థియేటర్ సమీపంలో రాష్ట్ర ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయం ఏర్పాటు చేశారు. 1962లో ఎయిర్ కమోడోర్‌ను డైరెక్టర్‌గా నియమించారు. 2014లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత ఆంధ్ర, తెలంగాణ డైరెక్టరేట్ కార్యాలయంగా మారింది. ప్రస్తుతం తెలంగాణలో హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్, వరంగల్–4 గ్రూపులు, ఆంధ్రలో గుంటూరు, కాకినాడ, కర్నూలు, తిరుపతి, విశాఖపట్నం 5 గ్రూపులు ఉన్నాయి. 9 గ్రూపుల్లో జూనియర్, సీనియర్ వింగ్‌లలో లక్షా నలభై వేల మందికి పైగా క్యాడెట్లు ఉన్నారు. ప్రస్తుతం ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా ఎయిర్ కమోడోర్ వీఎం.రెడ్డి ఉన్నారు.

నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) అనేది జాతీయ యువజన విభాగం. ఇది ఒక స్వచ్ఛంద ప్రాతిపదికన ఏర్పాటు చేసిన సంస్థ. ఇది భారత సాయుధ దళాల అంతర్భాగం. దేశంలోని యువతను క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రముఖపాత్ర పోషిస్తుంది. ఇది పాఠశాల స్థాయిలో మొదలై డిగ్రీ విద్యార్థులను కేడెట్స్‌గా సెలెక్ట్ చేసుకొని శిక్షణ అందిస్తారు. వీరికి డ్రిల్, ఆయుధాల వినియోగం తదితర వాటిపై శిక్షణ ఇచ్చి ఏ, బీ, సీ సర్టిఫికెట్లను అందజేస్తారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌వింగ్‌లో ఎన్‌సీసీ పూర్తి చేసిన వారికి రిజర్వేషన్ కల్పిస్తారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని దేశసేవకు మేముసైతం అంటున్న ఎన్‌సీసీ క్యాడెట్లపై సాక్షి ప్రత్యేక కథనం..

– రసూల్‌పురా



ఎన్‌సీసీ క్యాడెట్లకు వివిధ అంశాల్లో శిక్షణ

తొమ్మిది గ్రూపుల పరిధిలోని వివిధ బెటాలియన్లు, పాఠశాల, కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. ఈ శిక్షణ శిబిరంలో ఆయుధ శిక్షణ, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్ లేదా బాటిల్ క్రాఫ్ట్, ఫైరింగ్‌తో పాటు క్రమశిక్షణ, యోగా, నాయకత్వ లక్షణాలు, మార్చింగ్ డ్రిల్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ విషయాలపై నిపుణులతో ఉపన్యాసాలు, క్రీడా పోటీలు, వ్యర్థాలను రిసైక్లింగ్ చేసే పద్ధతులు, కెరీర్ కౌన్సిలింగ్‌తో పాటు సేవా కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛ భారత్, రక్తదానం, వివిధ అంశాలపై అవగాహన ర్యాలీలు తదితర వాటిల్లో క్యాడెట్లకు తర్ఫీదు అందజేస్తారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రయోజనాలు

ఏ సర్టిఫికెట్

జూనియర్ వింగ్ లేదా జూనియర్ క్యాడెట్ల విభాగంలో 2 సంవత్సరాల ఎన్‌సీసీ కోర్సులో ఉత్తీర్ణత సాధించిన క్యాడెట్లకు ఏ సర్టిఫికెట్ అందజేస్తారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో పరీక్షలు జరుగుతాయి.

బీ సర్టిఫికెట్

పాఠశాల, కళాశాలల తరపున సీనియర్ వింగ్ లేదా సీనియర్ క్యాడెట్లకు రెండు సంవత్సరాల కోర్సు పరీక్ష ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణత సాధించిన క్యాడెట్లకు బి సర్టిఫికెట్ అందజేస్తారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, మార్చిలో పరీక్షలు నిర్వహిస్తారు.

సీ సర్టిఫికెట్

ఎన్‌సీసీలో సీనియర్ వింగ్ లేదా సీనియర్ క్యాడెట్ల విభాగంలో మూడు సంవత్సరాల కోర్సు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన క్యాడెట్లకు సీ సర్టిఫికెట్ జారీచేస్తారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలలో పరీక్షలు నిర్వహిస్తారు. డిఫెన్స్‌లో చేరాలనుకునే అభ్యర్థులకు సీ సర్టిఫికెట్ ఉపయోగపడుతుంది. వీరికి ఆర్మీ వింగ్‌లో 3–15 శాతం, నేవీలో 05–08, ఎయిర్‌వింగ్‌లో 10 శాతం రిజర్వేషన్లు ఇతర ప్రయోజనాలు ఉంటాయి. ఇక క్యాడెట్ వెల్ఫేర్ సొసైటీ నుంచి అకాడమిక్ ఇయర్‌లో క్యాడెట్లకు రూ.6 వేల ఉపకార వేతనం, అత్యుత్తమ క్యాడెట్‌కు రూ.4,500, ద్వితీయ అత్యుత్తమ క్యాడెట్లకు రూ.3,500 ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు.



అవకాశాలు ఉంటాయి..

శిక్షణ పొంది వివిధ ఎన్‌సీసీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన ఎన్‌సీసీ క్యాడెట్లకు కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రయోజనాలు అందజేస్తోంది. సీ సర్టిఫికెట్లు సాధించిన క్యాడెట్లకు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో రిజర్వేషన్లు ఉంటాయి. ఏ, బీ సర్టిఫికెట్లు పొందిన వారికి ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు ఉంటాయి. – వి.ఎం.రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ జనరల్



గోల్కొండ కోట వద్ద బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్లు

ఎమ్మెల్సీగా బొత్స



మహారాణిపేట (విశాఖ దక్షిణ): ఏపీలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎన్నిక దాదాపు ఖరారైంది. స్వతంత్ర అభ్యర్థి షఫీ ఉల్లా తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంది. ఆ రోజు బొత్స సత్యనారాయణ ఎన్నికను అధికారికంగా ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు. ఓటమి భయంతో కూటమి పోటీ నుంచి తప్పుకుంది. బలం లేకపోయినా పోటీ చేయడానికి చివరి వరకు టీడీపీ ప్రయత్నం చేసింది. పోటీ చేస్తే చిత్తుగా ఓడిపోవడం ఖాయమని ఆ పార్టీ పెద్దలు గ్రహించారు. దీంతో పోటీకి వెనకడుగు వేశారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడా?

- త్వరలోనే ఏపీకి బృందం
- దుండగుల్ని శిక్షించేలా చర్యలు
- వైఎస్సార్‌సీపీ నేతలకు ఎన్‌సీఎస్సీ చైర్మన్ కిషోర్ మక్వానా హామీ

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి జరిగిందన్న విషయం తెలుసుకొని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'అసలా ఆలోచన ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది?' అని పూర్తి వివరాలు ఆరా తీశారు. ఈ ఘటనకు సంబంధించి వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ బృందంతో ఆయన సుదీర్ఘంగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దుండగుల్ని విడిచి పెట్టేది లేదని స్పష్టం చేశారు. 'అంబేడ్కర్ విగ్రహం జాతీయ సంపద. దానిపై ఎవరూ దాడి చేయకూడదు. అమానుషంగా ప్రవర్తించకూడదు. ఈ ఘటనపై చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు. త్వరలోనే ఏపీకి కమిషన్ నుంచి బృందాన్ని పంపి పూర్వాపరాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక తెప్పించుకుంటామని తెలిపారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని వైఎస్సార్‌సీపీ బృందానికి హామీ ఇచ్చారు. ఆగస్టు 8న విజయవాడ నడిబొడ్డున వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహంపై దాడి జరిగిన విషయం విదితమే. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి నేతృత్వంలో మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, మాజీ ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌లతో కూడిన బృందం మంగళవారం ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో భేటీ అయింది.

సామాన్యుడు కోర్టుకు రాకూడదా?

సీబీఐ దర్యాప్తు కోరకూడదా?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

- సీఎం చంద్రబాబు తదితరులపై కేసులు సీబీఐకి బదలాయింపుపై కౌంటర్‌కు ఆదేశం
- తదుపరి విచారణ సెప్టెంబర్ 11కి వాయిదా



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, పొంగూరు నారాయణ, కింజారపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, వ్యాపారవేత్తలు లింగమనేని రమేష్, వేమూరు హరికృష్ణ ప్రసాద్ తదితరులతో పాటు పలు కంపెనీలపై గతంలో నమోదైన కేసులన్నింటినీ సీబీఐ, ఈడీలకు అప్పగించేలా ఆదేశించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు స్పందించింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణను సెప్టెంబర్ 11కి వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నిష్పాక్షిక దర్యాప్తునకు ఆస్కారం లేదు...

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్, మద్యం కుంభకోణం, ఏపీ ఫైబర్ నెట్ కుంభకోణం, అసైన్డ్ భూముల కుంభకోణం, ఇసుక కుంభకోణం, ఇన్నర్ రింగ్ అలైన్‌మెంట్‌లో అక్రమాలు తదితరాలకు సంబంధించి చంద్రబాబు, ఇతరులపై నమోదైన కేసుల్లో పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు చేసే పరిస్థితులు ప్రస్తుతం లేనందున ఈ బాధ్యతను సీబీఐ, ఈడీలకు అప్పగించాలంటూ సీనియర్ పాత్రికేయుడు, స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ కొట్టి బాలగంగాధర తిలక్ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా విచారణ సందర్భంగా పిటిషనర్ సీనియర్ న్యాయవాది శ్రీపాద ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ పరిస్థితుల్లో ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు తెలిపారు. చంద్రబాబు తదితరులపై నమోదైన 7 కేసుల్లో దర్యాప్తును సీబీఐకి బదలాయించాలని కోరుతున్నామన్నారు. ఈ కేసుల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిందితుడిగా ఉన్నందున రాష్ట్ర దర్యాప్తు సంస్థలు, పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు పరిస్థితి లేదన్నారు. ఈ కేసుల్లో ఐపీఎస్ అధికారులు సంజయ్, కొల్లి రఘురామిరెడ్డి దర్యాప్తు చేసి ఇప్పటికే కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం మారగానే ఈ ఇద్దరు అధికారులను దర్యాప్తు బాధ్యతల నుంచి తప్పించారని నివేదించారు.

గొప్పగా దర్యాప్తు చేశారు.. అందుకే బదిలీ

ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ఆ 7 కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు ఎప్పుడు నమోదయ్యాయి? చార్జిషీట్లు ఎప్పుడు దాఖలు చేశారు? అనే వివరాలను ఆరా తీసి నమోదు చేసుకుంది. కేసుల విషయంలో సంజయ్, రఘురామిరెడ్డి ఎంతో గొప్పగా తమ బాధ్యతలను నిర్వర్తించారని శ్రీపాద తెలిపారు. ప్రభుత్వం మారగానే కక్ష సాధింపులు మొదలయ్యాయని, అందుకు వీరిద్దరూ బలైపోయారన్నారు. మద్యం కుంభకోణానికి సంబంధించి చంద్రబాబుపై ఫిర్యాదు చేసిన అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ వాసుదేవరెడ్డిపై కూడా కక్ష సాధింపులు మొదలయ్యాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కారులో ఫైళ్లు తరలిస్తున్నారంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్‌ను 20 నిమిషాల్లో మేజిస్ట్రేట్‌కు పంపారన్నారు. ఒలింపిక్స్‌లో ఇలాంటి పోటీలు నిర్వహిస్తే ఆ పోలీసు అధికారికి కచ్చితంగా బంగారు పతకం దక్కేదని చమత్కరించారు.

కేసులపై నిందితుడి స్వీయ సమీక్ష..

గత ప్రభుత్వ హయాంలో సీఐడీ నమోదు చేసిన కేసులన్నింటినీ సమీక్షిస్తామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత మీడియాతో పేర్కొన్నారని శ్రీపాద కోర్టు దృష్టికి తెచ్చారు. ఆ క్లిప్పింగ్‌లను ఆయన ధర్మాసనం ముందుంచారు. హోంమంత్రిని పక్కన పెడితే ముఖ్యమంత్రి స్వయంగా సీఐడీ కేసులను సమీక్షిస్తామని చెప్పడం ఆందోళన కలిగించే అంశమన్నారు. తను నిందితుడిగా ఉన్న కేసులను తానే సమీక్షిస్తానని ముఖ్యమంత్రి చెప్పడం తదుపరి పరిణామాలను తెలియచేస్తోందన్నారు. ఓ నిందితుడు తన కేసులను తానే సమీక్షిస్తాననడం ఇంతవరకు ఎక్కడా లేదన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ కేసుల ఉపసంహరణ విషయంలో అంతిమంగా సంబంధిత పబ్లిక్ ప్రాసిక్యూటరే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందిగా? అని వ్యాఖ్యానించింది. ఆ పరిస్థితి ఇంకా రాలేదుగా? అని ప్రశ్నించింది. నిందితుడిగా ఉన్న వ్యక్తి తన కేసులను తానే సమీక్షిస్తానని చెప్పడాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకోవాలని శ్రీపాద కోరారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఐదుగురు ముఖ్యమంత్రులు ప్రాసిక్యూషన్ ఎదుర్కొన్నారని, అందులో పలువురిని సీబీఐ ప్రాసిక్యూట్ చేసిందన్నారు. ఆ కేసుల్లో స్థానిక పోలీసుల దర్యాప్తు చేయలేదన్నారు. ఇప్పుడు నిందితుడిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై నమోదైన కేసుల తాలూకు కీలక డాక్యుమెంట్లను పరిశీలించి వాటిని తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉందన్నారు. రహస్య, అంతర్గత డాక్యుమెంట్లను సైతం చంద్రబాబు పరిశీలించే ఆస్కారం ఉందన్నారు. తద్వారా ఆయా కేసుల్లో తనకు ప్రయోజనం చేకూరేలా డిఫెన్స్‌ను సిద్ధం చేసుకుంటారని శ్రీపాద నివేదించారు.

రాజకీయ కేసులు కాదు.. అవినీతి కేసులు

ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. అలా చేయకుండా ప్రభుత్వాన్ని తాము నియంత్రించగలమా? అని ప్రశ్నించింది. కీలక, రహస్య డాక్యుమెంట్లను చంద్రబాబుకు అందుబాటులో ఉంచకూడదనే తాము కోరుతున్నామని శ్రీపాద చెప్పారు. దానివల్ల కేసులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. చంద్రబాబు తదితరులపై నమోదైనవి రాజకీయ కేసులు కాదని, రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకే కేసులు నమోదయ్యాయని నివేదించారు. ఈ కేసులన్నీ పూర్తిగా అవినీతికి సంబంధించినవన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ అసలు ఇది ప్రజా ప్రయోజన వ్యాజ్యం నిర్వచన పరిధిలోకి రాదన్నారు. పిటిషనర్ విశ్వసనీయతపై సందేహాలున్నాయన్నారు. పత్రిక నడుపుతున్నట్లు చెబుతున్న పిటిషనర్ తన వ్యాజ్యంలో పత్రిక సర్కులేషన్ వివరాలను పొందుపరచలేదన్నారు. ఈ వ్యాజ్యంలో మొత్తం 114 మందిని ప్రతివాదులుగా చేర్చారన్నారు.

సామాన్యుడు కోర్టుకు రాకూడదా? సీబీఐ దర్యాప్తు కోరకూడదా..?

ఈ సమయంలో ధర్మాసనం మరోసారి జోక్యం చేసుకుంటూ.. పత్రిక నడుపుతున్న విషయాన్ని పక్కన పెట్టండి. సామాన్యుడు కోర్టును ఆశ్రయించకూడదా? కేసులను సీబీఐకి బదలాయించాలని కోరకూడదా? అని ప్రశ్నించింది. ఈ కేసులో పిటిషనర్ పూర్వాపరాలు ముఖ్యం కాదని వ్యాఖ్యానించింది. దీంతో ఈ వ్యాజ్యాన్ని మొత్తం పత్రికా కథనాల ఆధారంగా దాఖలు చేశారని రోహత్గీ పేర్కొన్నారు. ఇద్దరు అధికారులను బదిలీ చేశారని చెబుతున్నారని, వాస్తవానికి బదిలీపై వారికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు కాబట్టి సీబీఐతో దర్యాప్తు నిర్వహించాలనడం సరికాదన్నారు. ఇప్పటికే ఐదు కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారని, రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అనంతరం ధర్మాసనం జోక్యం చేసుకుంటూ విచారణార్హతపై అభ్యంతరాలుంటే పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అందుకు మూడు వారాల సమయం ఇస్తామని పేర్కొంది. ముందు విచారణార్హతపై కౌంటర్ దాఖలు చేస్తామని, దానిని తేల్చిన తరువాత మిగిలిన విషయాల్లోకి వెళ్లవచ్చని రాష్ట్ర ప్రభుత్వం తరఫునే హాజరవుతున్న అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతిపాదించగా ధర్మాసనం తోసిపుచ్చింది. ముక్కలుముక్కలుగా విచారణ చేయబోమన్న ధర్మాసనం.. విచారణార్హతతో పాటు పిటిషనర్ లేవనెత్తిన అన్ని అంశాలతో కౌంటర్ దాఖలు చేయాల్సిందేనని తేల్చి చెబుతూ విచారణను వాయిదా వేసింది.

ఒక్కటిగా నిలబడ్డాం

అందుకే బాబు తలవంచారు

- ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్
- ఐదేళ్ల తర్వాత మళ్లీ మన విజయం తథ్యం

నిజానికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా చంద్రబాబు అందరికీ కాల్స్ చేసి.. అది ఇస్తా, ఇది ఇస్తా అని ఆశ చూపే ఉంటాడు. కానీ ధర్మం, న్యాయం గెలిచింది. మీరు ఒక్కటిగా నిలబడ్డారు కాబట్టి ఆయన ఆటలు సాగలేదు. సంఖ్యా బలం లేనప్పుడు పోటీ పెడతాననడమే తప్పు. అలా చేయడం ఆయన నైజం. ఆ మనిషి అలా చేసినా కూడా వైఎస్సార్‌సీపీ నాయకులు అందరూ ఒకే తాటిమీద విలువలు, విశ్వసనీయతతో నిలబడ్డం వల్లే ఆ మనిషి తల వంచారు.

– వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



ప్రసంగిస్తున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఉమ్మడి విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో మనమంతా ఏకమై ఎప్పుడైతే యుద్ధం చేయడం ప్రారంభించామో.. ఎప్పుడైతే వైఎస్సార్‌సీపీ కేడర్ బలంగా కనిపించిందో అప్పుడు చంద్రబాబు వెన్నులో భయం ప్రారంభమైందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అందుకే ఎన్నికలో పోటీ నుంచి విరమించుకున్నట్టు ప్రకటన చేశారని చెప్పారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో బుధవారం ఆయన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో యలమంచిలి, భీమిలి నియోజకవర్గాల పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్‌లతో సమావేశమయ్యారు. 'గత ఎన్నికలు ఎలా జరిగాయో ప్రజా ప్రతినిధులుగా మీరంతా చూసే ఉంటారు. ఎన్నికల్లో ఈ మాదిరి ఫలితాలు రావడానికి కారణం పది శాతం ఓటర్లు చంద్రబాబు చెబుతున్న అబద్ధాల వైపు మొగ్గుచూపారు. ఎన్నికల ప్రచారంలో అబద్ధపు హామీలతో మోస పూరితమైన ప్రచారం చేశారు. తీరా ఇప్పుడు అంతా మోసపోయిన పరిస్థితుల్లో ఉన్నారు' అని చెప్పారు. ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ జగన్ ఉండి ఉంటే.. అన్న విషయంపై చర్చ జరుగుతోందన్నారు. 'జగన్ పలావు పెట్టాడు.. చంద్రబాబు బిర్యానీ పెడతానని ఆశ చూపాడని అంటున్నారు. చివరకు పలావు పోయింది. బిర్యానీ పోయిందనే చర్చ ఇప్పుడు ప్రతి ఇంట్లో జరుగుతోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక పథకాలు రాకపోగా, వ్యవస్థలన్నీ కుప్పకూలిపోతున్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో ఓపీ దగ్గర కుర్చీలు కూడా తీసేస్తున్న పరిస్థితి ఉంది'ని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ ఐదేళ్లలో కష్టాలు ఉంటాయి. కష్టాలు లేకుండా సృష్టే ఉండదు. చీకటి వచ్చిన తర్వాత మళ్లీ పగలు రాక తప్పదు. కష్టాలు ఎంత తీవ్రంగా ఉంటాయంటే.. 16 నెలలు నన్నే జైల్లో పెట్టారు. కష్టాలు వచ్చినప్పుడు మన వ్యక్తిత్వమే మనకు శ్రీరామరక్షగా నిలబడుతుంది. మీ అందరికీ ఒక్కటే చెబుతున్నా. మనం చేసిన మంచి ఎక్కడికీ పోలేదు. రానున్న రోజుల్లో ఏ తెలుగుదేశం పార్టీ కార్యకర్త కూడా ప్రజల్లోకి వెళ్లి మేం ఫలానా మంచి చేశామని చెప్పుకునే పరిస్థితి ఉండదు. ఎందుకంటే వాళ్లు చెప్పినవన్నీ మోసాలు, అబద్ధాలు కాబట్టి ప్రజలు వాళ్లను నిలదీసే కార్యక్రమం జరుగుతుంది. అదే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్తే చెప్పిందే చేశారని దండలు వేసే పరిస్థితి వస్తుంది. ఐదేళ్ల తర్వాత మళ్లీ మీకు, నాకు ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుంది' అని ధీమా వ్యక్తం చేశారు.

మరిన్ని వివరాలు, ఏపీ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నగర వార్తలు

మహిళల వెల్‌నెస్ ఉత్పత్తుల విడుదల

రసూల్‌పురా: చెన్నైకి చెందిన హీరావి పింక్ స్టోర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ, సీఈవో రాధాకృష్ణన్, డైరెక్టర్ వెంకటేశన్‌లు బుధవారం మహిళల సీక్రెట్ వెల్‌నెస్ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఆ సంస్థ హష్‌పూర్ బ్రాండ్ పేరుతో ఈ ఉత్పత్తులను అందుబాటులో ఉంచింది. ఈ సందర్భంగా కంటోన్మెంట్‌లోని మోక్ష్ బాంక్వెట్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఈవో మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణకు తమ ఉత్పత్తులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మహిళా సాధికారతలో భాగంగానే తమ సంస్థ మహిళల రహస్య వెల్నెస్ ఉత్పత్తులు ప్రారంభించిందన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: నిరుద్యోగ ఎస్సీ యువతీ, యువకులు ఉచిత డ్రైవింగ్(లైట్, హెవీ మోటార్ వెహికిల్) శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు ఈ నెల 20వ తేదీ అని పేర్కొన్నారు. హకీంపేట్ డ్రైవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచిత భోజనంసహా వసతి సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. లైట్ మోటార్ వెహికిల్ లైసెన్స్ పొందటానికి 18 నుంచి 35 ఏళ్ల లోపల వయసు, 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, హెవీ మోటార్ వెహికిల్ లైసెన్స్‌కు 20 నుంచి 35 ఏళ్ల వయసు, పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాని తెలిపారు. ఆసక్తి కలిగిన ఎస్సీ యువతీ, యువకులు , ట్రాన్స్‌జెండర్లు కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

కేంద్రం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి: మల్లు రవి

పంజగుట్ట: సుప్రీంకోర్టు తీర్పును సుమోటోగా తీసుకుని కేంద్రప్రభుత్వ పరిధిలోని ఉద్యోగ, విద్యా రంగాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో చట్టం చేసి మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. తెలంగాణ మాదిగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్ దేవని సతీష్ మాదిగ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ జరపాలి' అనే అంశంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, మాదిగ సంఘాలు, మేధావులు, ప్రజా సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. మల్లు రవి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు రాగానే మొదటగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ వర్గీకరణకు సిద్ధమని ప్రకటించారన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడుతూ మందకృష్ణ ఉద్యమంతోపాటు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన ఉషామెహ్రా కమిటీ నివేదిక ఎస్సీ వర్గీకరణకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, ఆయా పార్టీల నేతలు సారంపల్లి మల్లారెడ్డి, మేరీ మాదిగ, అంజన్ కుమార్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నగరానికి నిధులేవి?

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ముషీరాబాద్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రాంభిస్తున్న కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే గోపాల్, ఎంపీ లక్ష్మణ్

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నిధుల కేటాయింపులో హైదరాబాద్ నగరాన్ని పూర్తిగా విస్మరించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని అజార్ గల్లీ, జాంబవినగర్, బాపూజీనగర్, బాప్టిస్ట్ చర్చి వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌లతో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ ఓవర్ ఫ్లో, కలుషిత నీటి సరఫరా, అధ్వానపు రోడ్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని విమర్శించారు. నగర అభివృద్ధికి నిధులు కేటాయింపులో గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం నిధులను తగ్గిస్తూ వస్తున్నాయని అన్నారు. నగరంలో కనీస సౌకర్యాలు కల్పించేందుకు వెంటనే నిధులు కేటాయింపును పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ధర్నాలు చేస్తున్నారని, జీతాలు ఇవ్వడకపోవడంతో ఉద్యోగులు సమ్మెలు చేస్తున్నారన్నారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజాసమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన కమిటీ నగర నాయకులు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద సహకార సంఘం అధ్యక్షుడిగా శ్రీనాథ్



సిటీ కోర్టులు: న్యాయవాద పరస్పర సహకార సంఘం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎన్నికలు బుధవారం హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో జరిగాయి. 2024–25 సంవత్సరానికి సంబంధించిన కార్యవర్గాన్ని న్యాయవాద పరస్పర సహకార సంఘం డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహకార సంఘం అధ్యక్షుడిగా న్యాయవాది పిల్లరిశెట్టి శ్రీనాథ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్ మణికొండ, కార్యదర్శిగా శ్రీధర్ తడకంటి, జాయింట్ సెక్రటరీగా మహేశ్వర ఆర్ముల, కోశాధికారిగా గిరి తోర్నాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీనాథ్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమం కోసం పాటుపడుతామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ అసోసియేషన్ మెంబర్ కొండా రెడ్డి, ఆయా బార్ అసోసియేషన్ల అధ్యక్షులు, న్యాయవాదులు పి.ప్రదీప్, జి.రామారావు, అమరేందర్, నర్సింహ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'కిమ్స్ సన్‌షైన్'లో అరుదైన చికిత్స

- 'ఇన్ స్పేస్'బెలూన్ టెక్నాలజీతో భుజం నొప్పికి విముక్తి
- దేశంలోనే మొదటిసారిగా విజయవంతంగా ప్రొసీజర్



'ఇన్ స్పేస్'బెలూన్ టెక్నాలజీతో భుజం నొప్పికి చెక్ చెప్పిన కిమ్స్ సన్‌షైన్ వైద్యులు

సనత్‌నగర్: భుజంనొప్పితో బాధపడుతున్న వయసు పైబడిన వారికి శుభవార్త. 'ఇన్ స్పేస్' బెలూన్ టెక్నాలజీతో భుజంనొప్పికి చెక్ పెట్టారు బేగంపేట కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు. బుధవారం షోల్డర్ సర్జన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 'ఇన్ స్పేస్'అనే బెలూన్ ప్రక్రియతో 77 ఏళ్ల రోగికి అరుదైన ప్రొసీజర్ నిర్వహించారు. వృద్ధుడి భుజంలో దెబ్బతిన్న కండరాల వద్ద బెలూన్ లాంటి ఇంప్లాంట్‌ను ఆర్థోస్కోపీ విధానంలో కేవలం లోకల్ అనస్థీషియా ఇచ్చి ఈ ప్రొసీజర్ నిర్వహించారు. ఈ ప్రొసీజర్ పూర్తయిన రోజునే రోగిని డిశ్చార్జి చేశారు. రోగి రెండు మూడు వారాల్లో తిరిగి వారు రోజువారీ కార్యక్రమాలను యథావిధిగా చేసుకోవచ్చు. దేశంలోనే మొట్టమొదటిసారిగా బెలూన్ టెక్నాలజీని తమ హాస్పిటల్‌లో ఉపయోగించినట్లు చంద్రశేఖర్ తెలిపారు. 70–80 ఏళ్ల పైబడినవారు కూడా ఎంతో సురక్షితంగా ఈ ప్రొసీజర్‌ను చేయించుకోవచ్చని చెప్పారు.

నగరంలో నేడు

- పాపెక్స్ 2025 పేరిట 'భారత్ కా అప్నా పేపర్ షో'ఉదయం 11.30 గంటల నుంచి మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతుంది.
- 'ఎవ్రీ డే ఇండియా'పేరిట సామాన్యశాస్త్రం ఛాయాచిత్ర ప్రదర్శన సాయంత్రం 6 గంటలకు మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరుగుతుంది. ఈ ప్రదర్శన రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారా హిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో ఉదయం 9 గంటలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

మెరిట్ విద్యార్థులకు అంబేడ్కర్ కెనరా విద్యాజ్యోతి స్కాలర్‌షిప్‌లు

సాక్షి, సిటీబ్యూరో: కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కెనరా విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ కార్యక్రమాన్ని నగరంలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని బుధవారం జాతీయ షెడ్యూల్డ్ క్యాస్ట్ కమిషన్ డైరెక్టర్ జి.సునీల్ కుమార్ బాబు, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య, కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ బి.చంద్రశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని మెరిట్ సాధించిన 1,236 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.49.44 లక్షల స్కాలర్‌షిప్‌లను అందించారు.

గురుబ్రహ్మనగర్ ఘటనపై నివేదిక ఇవ్వండి

జీహెచ్ఎంసీ, నగర పోలీసు కమిషనర్లకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశం



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు ఫిర్యాదు చేస్తున్న గురుబ్రహ్మనగర్ బస్తీవాసులు

ఫిలింనగర్: గురుబ్రహ్మనగర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని నగర పోలీసు, జీహెచ్ఎంసీ కమిషనర్‌లను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. కమిషన్ బస్తీవాసులకు అండగా ఉంటుందని, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీనిచ్చారు. దళిత, గిరిజనులను కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–52లోని నందగిరి హిల్స్ హుడా లేఅవుట్‌ను ఆనుకుని ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీలోరాకపోకలకు అడ్డంగా నిర్మించిన గోడ కూల్చివేత ఘటనపై బస్తీవాసులు బుధవారం కమిషన్ చైర్మన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 30 ఏళ్లుగా నివసిస్తున్న తమ బస్తీలోకి రాకపోకలను నిలిపివేస్తూ గోడను నిర్మించారని, దానిని తొలగించినందుకు ఎస్సీ, ఎస్టీలపై, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారని పేర్కొన్నారు. 'మమ్మల్ని కులం పేరుతో దూషించారు. ఎస్సీ, ఎస్టీలైన మేం అక్కడ ఉండటం, మా ముఖాలు చూడటం ఇష్టంలేని అగ్రవర్ణాలకు చెందినవారు గోడ నిర్మించారు'అని వారు ఆరోపించారు.

ఉర్దూ భాషాభివృద్ధి కోసం సమష్టి కృషి

- తెలంగాణ, కర్ణాటక ఉర్దూ అకాడమీల చైర్మన్ల నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: ఉర్దూ భాషాభివృద్ధికి ఇప్పటికే ఉన్న పథకాలను ఉత్తమంగా తీర్చిదిద్దాలని తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఉర్దూ అకాడెమీల చైర్మన్లు తాహిర్ బిన్ హమ్దాన్, మహమ్మద్ అలీ ఖాజీ నిర్ణయించారు. బుధవారం కర్ణాటక ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాజీ నేతృత్వంలోని 15 మంది సభ్యుల ప్రతినిధి బృందం తెలంగాణ ఉర్దూ అకాడమీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. అనంతరం జరిగిన సమావేశంలో ఉర్దూ భాషా సాహిత్యాలు, అభివృద్ధికి రెండు రాష్ట్రాలు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై చర్చించారు. దక్షిణ భారతదేశంలోని యువ, ప్రతిభావంతులైన ఉర్దూ రచయితలు, కవులను ప్రోత్సహించడానికి, వారి నైపుణ్యాలను పెంపొందించడానికి తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలతో కూడిన దక్షిణ భారత ఉర్దూ అకాడమీని స్థాపించడానికి అంగీకరించారు. ఈ సమావేశానికి ప్రత్యేక అతిథిగా హాజరైన మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం ప్రొఫెసర్ ఎహతేషామ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ ఉర్దూ జర్నలిస్టులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించడానికి సమన్వయం పెంచాలన్నారు.

జాతీయ సమైక్యతాభావం పెంచాలి



బర్కత్‌పురలో విద్యార్థులతో కలిసి తిరంగా ర్యాలీలో పాల్గొని మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: యువతలో జాతీయ సమైక్యతాభావాన్ని పెంపొందింపజేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం బర్కత్‌పురలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 'ప్రధాని నరేంద్ర మోదీ దేశ సమగ్రత, సమైక్యత అని మాట్లాడుతున్నారే కానీ, అందరినీ సమానంగా చూడటం లేదు'అని విమర్శించారు. ఒకవైపు అదానీ, అంబానీలకు లబ్ధి చేకూరుస్తూ, మరోవైపు దేశ సంపదను ఉత్పత్తి చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా పార్లమెంట్‌లో బీసీబిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు నీల వెంకటేష్, టి.రాజ్‌కుమార్, ఉదయ్, మట్ట జయంతి, కోటేశ్వరి, బలరామ్, పవన్, ప్రీతమ్, అభిషేక్, రాజ్, తదితరులు పాల్గొన్నారు.

నెత్తురోడుతున్నా.. బెదరకుండా..

ప్రాణాలకు తెగించి స్నాచర్‌ను పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ యాదయ్య

- పెనుగులాటలో యాదయ్యను విచక్షణారహితంగా పొడిచిన స్నాచర్
- 7 కత్తిపోట్లతో తీవ్ర రక్తస్రావమవుతున్నా పట్టువిడవని వైనం
- 3 సర్జరీలు, వందకుపైగా కుట్లతో బయటపడ్డ పోలీసు

సాక్షి, హైదరాబాద్: ఛాతి, మెడ, కడుపు, చేతుల మీద విచక్షణారహితంగా కత్తిపోట్లు.. రక్తం ఏరులై పారుతున్నా ఏమాత్రం బెదరకుండా కరుడుగట్టిన అంతర్రాష్ట్ర చెయిన్ స్నాచర్ ఇషాన్ నిరంజన్ నీలంనల్లి ఆటకట్టించారు హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్య. అతని ధైర్య సాహసాలను గుర్తించిన కేంద్ర హోం శాఖ అత్యున్నత శౌర్య పతకం రాష్ట్రపతి గ్యాలంటరీ పురస్కారానికి ఎంపిక చేసింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యాదయ్య ఈ అవార్డును అందుకోనున్నారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఈ పతకానికి ఎంపికైన ఏకైక పోలీసు యాదయ్యే కావడం విశేషం. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోని మాదాపూర్ సీసీఎస్‌లో యాదయ్య హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. యాదయ్య అవార్డుకు ఎంపికవడంతో ఆయన కుటుంబ సభ్యులు, స్వగ్రామమైన చేవెళ్లలోని మీర్జాగూడలో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

నాడు ఏం జరిగిందంటే..

2022 జూలై 25న చెయిన్ స్నాచింగ్, అక్రమ ఆయుధాల సరఫరాదారులైన ఇషాన్ నిరంజన్ నీలంనల్లి, రాహుల్ సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో స్నాచింగ్‌లకు తెగబడ్డారు. కూకట్‌పల్లి, గచ్చిబౌలి, ఆర్సీపురం, మియాపూర్‌లలో వరుస చెయిన్ స్నాచింగ్‌లతో హడలెత్తించారు. దీంతో స్నాచర్లను పట్టుకునేందుకు వెంటనే అప్పటి కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. స్నాచర్ల కోసం కమిషనరేట్ పరిధిలోని అన్ని సీసీటీవీ ఫుటేజీలను జల్లెడ పట్టారు. స్నాచింగ్ సమయంలో నిందితులు వినియోగించిన ద్విచక్ర వాహనం, వారు ధరించిన దుస్తులను గుర్తించారు. వీటి ఆధారంగా నిందితుల జాడ కోసం వేట మొదలుపెట్టారు. ఈ క్రమంలో స్నాచర్లు మియాపూర్‌లో మరో స్నాచింగ్ చేసి, బైక్ మీద వెళ్తున్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఆ సమయంలో మాదాపూర్ సీసీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న యాదయ్య, దేబేష్‌లు బైక్ మీద ఆర్సీపురం నుంచి మియాపూర్ వైపు వస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఇరువురు స్నాచర్లను పట్టుకునేందుకు బయలుదేరారు.



స్నాచర్ దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాదయ్య (ఫైల్)

రక్తం కారుతున్నా...

నిందితులు అశోక్‌నగర్ హెచ్‌ఐజీ గేట్ నుంచి బీహెచ్‌ఈఎల్ వైపు మళ్లారు. దీంతో కాలనీలోనే స్నాచర్లను పట్టుకోవాలని నిర్ణయించుకున్న యాదయ్య బైక్‌ను హెచ్‌ఐజీ గేట్ లోపలికి మళ్లించారు. కాలనీలో నుంచి బైక్ మీద ఎదురుగా వస్తున్న నిందితులు ఇషాన్, రాహుల్ వీరిని దాటి వెళ్లేందుకు యత్నించారు. దీంతో బైక్ వెనకాల కూర్చున్న కానిస్టేబుల్ దేబేష్ స్నాచర్ రాహుల్‌ను, బైక్ నడుపుతూనే యాదయ్య మరో స్నాచర్ ఇషాన్‌ను గట్టిగా పట్టుకున్నాడు. దీంతో ఇషాన్ జేబులో నుంచి కత్తి తీసి యాదయ్య ఛాతి, మెడ, చేతులు, కడుపు, శరీరం వెనక భాగంలో విచక్షణారహితంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావమవుతున్నా యాదయ్య ఏమాత్రం బెదరకుండా ఇషాన్‌ను అదిమి పట్టుకున్నాడు. ఇంతలో సమీపంలో ఉన్న మరో కానిస్టేబుల్ రవి ఘటనా స్థలానికి రావడంతో ఇరువురు స్నాచర్లను అదుపులోకి తీసుకున్నారు. యాదయ్యను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఏడు కత్తిపోట్లతో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చేరిన యాదయ్య 18 రోజులపాటు చావుతో పోరాడాడు. ఆఖరికి శరీరం లోపల, బయట మూడు సర్జరీలు, వందకు పైగా కుట్లు పడటంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. రెండు నెలల విశ్రాంతి తర్వాత మళ్లీ విధుల్లో చేరాడు. గతంలో లాగా శరీరం సహకరించకపోవడంతో అధికారులు యాదయ్యను ఆఫీసు విధులకు పరిమితం చేశారు.

సహచరుల సహకారంతోనే..

తోటి కానిస్టేబుళ్లు దేబేష్, రవి సహకారంతోనే స్నాచర్లను పట్టుకోగలిగాం. ప్రజలకు రక్షణ కల్పించడం పోలీసుగా మా విధి. పై అధికారుల ప్రోత్సాహంతో వారిని ఆదర్శంగా తీసుకొని విధులు నిర్వర్తిస్తాను.

-చదువు యాదయ్య, హెడ్ కానిస్టేబుల్

హెడ్ కానిస్టేబుల్ యాదయ్యకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

- దేశంలోనే ఈ అవార్డుకు ఎంపికైన ఏకైక వ్యక్తి
- ఏడీజీ సంజయ్ కుమార్ జైన్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకం
- 29 మంది రాష్ట్ర పోలీస్ అధికారులకు శౌర్య, సేవా పతకాలు
- 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీస్ పతకాలు ప్రకటించిన కేంద్రం



యాదయ్యను అభినందిస్తున్న డీజీపీ జితేందర్



సంజయ్ కుమార్ జైన్



పి.కృష్ణమూర్తి

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: భారత ప్రభుత్వం ప్రకటించే ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకానికి తెలంగాణకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ చదువు యాదయ్య ఎంపికయ్యారు. ఈ ఏడాది దేశంలో ఈ పురస్కారాన్ని పొందిన ఏకైక వ్యక్తి యాదయ్య కావడం విశేషం. 2022లో యాదయ్య చూపిన తెగువ, ధైర్యానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఈ పతకాన్ని ప్రకటించింది. తెలంగాణ ఏడీజీ సంజయ్ కుమార్ జైన్, డీసీపీ కటకం మురళీధర్‌లకు రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకం లభించింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీసెస్‌కు చెందిన మొత్తం 1,037 మంది అధికారులకు శౌర్య/ సేవా పోలీస్ పతకాలను ప్రకటించింది. ఈ మేరకు బుధవారం కేంద్ర హోంశాఖ జాబితాను విడుదల చేసింది.

తెలంగాణకు ఏఏ పతకాలు...

తెలంగాణకు ఒక రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం, 7 పోలీస్ శౌర్య పతకాలు, 2 రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకాలు, 11 ప్రతిభాపూర్వక పోలీస్ పతకాలు లభించాయి. అగ్నిమాపక సర్వీస్‌కు చెందిన ఒకరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకం, ఇద్దరికి ప్రతిభాపూర్వక పోలీస్ పతకం వరించాయి. వీరితోపాటు ఐదుగురు హోంగార్డులకు ప్రతిభాపూర్వక పోలీస్ పతకం లభించింది. ప్రాణాలు, ఆస్తులను కాపాడటంలో, నేరాలను నిరోధించడంలో లేదా నేరస్తులను అరెస్టు చేయడానికి విధి నిర్వహణలో ప్రదర్శించిన శౌర్యం, తెగువ ఆధారంగా రాష్ట్రపతి శౌర్య పతకం, శౌర్య పతకాన్ని ఇస్తున్నారు. విధి నిర్వహణలో అందించిన విశిష్ట సేవకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం, విలువైన సేవకు ప్రతిభాపూర్వక సేవా పతకం ఇస్తున్నారు.

ఇద్దరు ఆర్‌పీఎఫ్ ఏఎస్సైలకు..

విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన దక్షిణ మధ్య రైల్వేకి చెందిన ఇద్దరు రైల్వే రక్షక దళం అధికారులకు ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీసు మెడల్ లభించింది. పంద్రాగస్టు నేపథ్యంలో ఈమేరకు రైల్వే శాఖ ప్రకటించింది. హైదరాబాద్ డివిజన్ పరిధిలోని కామారెడ్డి ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ జె.సుధాకర్, విజయవాడ డివిజన్‌లో అనలిటికల్ డేటా మేనేజ్‌మెంట్ సెల్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నయీం బాషా షేక్‌లకు ఈ మెడల్ వరించింది.

యాదయ్యకు డీజీపీ అభినందనలు

రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం పొందిన హెడ్‌కానిస్టేబుల్ చదువు యాదయ్యను డీజీపీ జితేందర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీలు సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్, ఐజీ ఎం.రమేష్ తదితరులు పాల్గొని పురస్కార గ్రహీతను సత్కరించారు. యాదయ్య పనితీరు స్ఫూర్తిదాయకమని డీజీపీ కొనియాడారు.

తెలంగాణ అధికారులకు లభించిన పతకాలు

రాష్ట్రపతి శౌర్య పతకం : చదువు యాదయ్య, హెడ్ కానిస్టేబుల్

శౌర్య పతకాలు :

1) సునీల్‌దత్, ఎస్పీ
2) మోరా కుమార్, డిప్యూటీ అసాల్ట్ కమాండర్
3) శనిగరపు సంతోష్, అసిస్టెంట్ అసాల్ట్ కమాండర్
4) అమిలి సురేష్, జూనియర్ కమాండో
5) వేముల వంశీ, జూనియర్ కమాండో
6) కంపటి ఉపేందర్, జూనియర్ కమాండో
7) పాయం రమేష్, జూనియర్ కమాండో

రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు :

1) సంజయ్ కుమార్ జైన్, అడిషనల్ డైరెక్టర్ జనరల్
2) కటకం మురళీధర్, డీసీపీ
3) వెంకటేశ్వర్లు కందిమల్ల, డ్రైవర్ ఆపరేటర్, అగ్నిమాపక శాఖ

ప్రతిభాపూర్వక సేవా పతకాలు :

1) అవినాశ్ మొహంతి, కమిషనర్ ఆఫ్ పోలీస్
2) సయ్యద్ జమీల్ బాషా, కమాండెంట్
3) పి.కృష్ణమూర్తి, అడిషనల్ ఎస్పీ (యాంటీ నార్కోటిక్ బ్యూరో)
4) కొమరబత్తిని రాము, సబ్ ఇన్‌స్పెక్టర్
5) అబ్దుల్ రఫీక్, సబ్ ఇన్‌స్పెక్టర్
6) ఇక్రమ్ అబ్ ఖాన్, సబ్ ఇన్‌స్పెక్టర్
7) శ్రీనివాస మిశ్రా, సబ్ ఇన్‌స్పెక్టర్
8) కుంచాల బాల కాశయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్
9) ఎ.లక్ష్మయ్య, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్
10) గుంటి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్
11) నూతలపాటి జ్ఞాన సుందరి, ఇన్‌స్పెక్టర్
12) మాధవరావు తెలుగు, లీడింగ్ ఫైర్‌మన్ (అగ్నిమాపక శాఖ)
13) వహీదుద్దీన్ మహ్మద్, లీడింగ్ ఫైర్‌మన్ (అగ్నిమాపక శాఖ)
14) లక్ష్మీ బండొళ్ల, మహిళా హోంగార్డు
15) మల్లేష్ మేడిపల్లి, హోంగార్డు
16) కవిత ఇంటూరి, మహిళా హోంగార్డు
17) గాలయ్య నామాల, హోంగార్డు
18) సుమలత ఎనుమల, మహిళా హోంగార్డు



పంచాయతీ కార్యాలయం వద్ద సంబురాలు జరుపుకుంటున్న హరిదాస్‌పూర్ మహిళలు

ఆడపిల్ల పుడితే.. ఊరంతా సంబురాలే

ఆదర్శంగా నిలుస్తున్న సంగారెడ్డి జిల్లా హరిదాస్‌పూర్, మరికొన్ని గ్రామాలు

వివక్ష నుంచి విముక్తి

కొండాపూర్ (సంగారెడ్డి): ఆడపిల్ల అంటే వివక్ష కాదు.. సంబురం అని చూపిస్తున్న గ్రామం సంగారెడ్డి జిల్లా హరిదాస్‌పూర్. ఆడపిల్ల పుట్టిందంటే ఈ ఊరి ప్రజలంతా పండుగలా జరుపుకొంటారు. దీనికి గ్రామంలోని ఓ ఘటన మూలంగా నిలిచింది. ఈ గ్రామానికి చెందిన కమలమ్మకు ముగ్గురు కుమార్తెలు. ఇద్దరు బిడ్డలకు పెళ్లిళ్లు చేసి అత్తగారింటికి పంపగా.. మూడో కుమార్తెకు ఇల్లరికం అల్లుడిని తెచ్చుకుంది. ఈమెకు కూడా తొలి రెండు కాన్పుల్లో ఆడపిల్లలే పుట్టడంతో ఆందోళనలో పడ్డారు. మూడోసారి కూడా ఆడపిల్ల జన్మించడంతో.. కుటుంబ సభ్యులంతా విషాదంగా కూర్చుండిపోయారు. అయితే పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఇల్లిల్లూ తిరుగుతున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆ సమయంలో కమలమ్మ ఇంటికి వచ్చారు. ఏం జరిగిందంటూ వారు ఆరా తీయడంతో.. వరుసగా ఆడపిల్లలు పుట్టిన బాధలో ఉన్నామని కమలమ్మ వివరించింది.

సంబురాలు చేస్తూ.. భరోసా ఇస్తూ..

ఈ ఘటనపై చలించిన సర్పంచ్, కార్యదర్శి.. ఆడపిల్లలు జన్మిస్తే సంబురాలు జరపాలని, ఆ కుటుంబానికి భరోసా కల్పించాలని నిర్ణయించారు. 2020 జనవరి 1వ తేదీ నుంచి అమలు చేయడం మొదలుపెట్టారు. గ్రామంలో ఆడపిల్ల పుడితే పంచాయతీ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, రాత్రివేళలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుతున్నారు. సుకన్య సమృద్ధి యోజన పథకం కింద ఆ చిన్నారికి పోస్టాఫీస్‌లో ఖాతా తెరిచి, మొదటి నెలకు సంబంధించి రూ.1,000ని పంచాయతీ తరఫునే చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు గ్రామంలో 82 మంది చిన్నారులకు ఇలా సంబురాలు చేశారు. ఎక్కడైతే ఆడపిల్ల దేవతగా పూజింపబడుతుందో ఆ ప్రాంతం సుఖసంతోషాలతో వర్ధిల్లుతుందంటూ.. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ ఈ గ్రామానికి వెళ్లి కన్యా వందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లల కాళ్లు కడిగి పూజించారు. హరిదాస్‌పూర్ గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల బహుమతి అందించింది. మరోవైపు సంగారెడ్డిలోని గాయత్రి ఆస్పత్రి.. హరిదాస్‌పూర్ నుంచి ఏ ఆడపిల్ల వచ్చినా 50 శాతం రాయితీతో వైద్యం అందిస్తోంది.

హత్నూరలోనూ 'ఆడపిల్ల' సంబురం

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తిపూర్ గ్రామంలోనూ 2023 జనవరి నుంచి ఆడపిల్ల పుడితే సంబురం చేస్తున్నారు. ఆడపిల్లల తల్లులకు సన్మానం చేసి, రూ. 1,000 నగదు బహుమతిగా అందిస్తున్నారు.

విద్యుత్ కేంద్రాలపై అలసత్వం వద్దు

- జల విద్యుత్ కేంద్రాల్లో ఇబ్బందులొస్తే వెంటనే నా దృష్టికి తీసుకురండి
- విద్యుత్ కేంద్రాల్లో తలెత్తే సమస్యలపై త్రిసభ్య కమిటీ
- కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా జెన్‌కో సీఎండీ నిర్ణయాలు తీసుకోవాలి
- భద్రాద్రి యూనిట్-1 ట్రాన్స్‌ఫార్మర్‌పై నిర్ణయం టెక్నికల్ కమిటీదే
- సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ కేంద్రాల్లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) అధి కారులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. జల విద్యుత్ కేంద్రాల్లో సమస్యలు తలెత్తితే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని, ఈ విషయంలో ఎలాంటి అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. విద్యుత్ కేంద్రాల్లో ఏర్పడే సమస్యలను పరిష్కరించేందుకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. క్షేత్ర స్థాయిలో కమిటీ పర్యటించి సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను సిఫారసు చేస్తూ నివేదిక అందజేస్తుందని తెలిపారు. దీని ఆధారంగా జెన్‌కో సీఎండీ నిర్ణయాలు తీసుకోవాలని విద్యుదుత్పత్తిలో అంతరాయాలు లేకుండా పరిష్కరించాల్సి ఉంటుందని సూచించారు. ప్రజాభవన్‌లో బుధవారం భట్టి తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో, టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. భద్రాద్రి థర్మ ల్ విద్యుత్ కేంద్రంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో కా లిపోయిన యూనిట్-1కి సంబంధించిన జనరేటర్ ట్రాన్స్ ఫార్మర్‌కు మరమ్మతులు నిర్వహించాలా? కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను కొనుగోలు చేయాలా? అనే అంశాన్ని టెక్నికల్ కమిటీ పరిశీలిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తీసు కున్న నిర్ణయాలను అమలు చేసే ముందు తప్పనిసరిగా ఈ ప్రభుత్వానికి తెలియజేసి అనుమతి పొందాలని కోరారు. ఈ విషయంలో విద్యుత్ సంస్థల సీఎండీలు తప్పనిసరిగా ఇంధ న శాఖ కార్యదర్శిని సంప్రదించాలని ఆయన ఆదేశించారు.

మళ్లీ గృహజ్యోతి దరఖాస్తుల స్వీకరణ...

గృహజ్యోతి పథకం కింద అర్హులై ఉండి గతంలో దరఖాస్తు చేసుకోని వారి నుంచి మళ్లీ దరఖాస్తులను స్వీకరించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. పేదల గృహాలకు ప్రతి నెలా 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరాను అమలు చేసే గృహజ్యోతి పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని కోరారు. టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో 227 కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి ప్రక్రియ ప్రారంభమైందని, అందులో 113 సబ్ స్టేషన్లకు స్థలాల సమస్య లేదని, మిగతా వాటికి స్థలాలను కలెక్టర్లు కేటాయించాల్సి ఉందన్నారు. కాళేశ్వరం, ఇతర ఎత్తిపోతల పథకాలకు ఎంత విద్యుత్‌ను వినియోగిస్తున్నారు? అందుకు అవుతున్న ఖర్చు ఎంత? తదితర వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను కోరారు. సమావేశంలో ఇంధన శాఖ ఇన్‌చార్జి కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీలు ముషర్రఫ్ అలీ, వరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

సెప్టెంబర్ నుంచి డీఎస్సీ నియామక ప్రక్రియ

అక్టోబర్ చివరి నాటికి ముగింపు

- ఒక్కో పోస్టుకు ముగ్గురి పేర్లు జిల్లా కమిటీకి
- రాష్ట్ర స్థాయిలోనే జాబితా రూపకల్పన

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక ప్రక్రియను సెప్టెంబర్ ఆఖరి వారం నుంచి మొదలు పెట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కసరత్తు చేపట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే ప్రాథమిక కీ విడుదల చేసింది. దీనిపై వచ్చే అభ్యంతరాలను పరిశీలించి ఈ నెలాఖరుకు తుది కీ విడుదల చేసే వీలుంది. మరోవైపు జిల్లాల వారీగా పోస్టులు, డీఎస్సీ పరీక్ష రాసిన వారి వివరాలను క్రోడీకరిస్తున్నారు. రోస్టర్ విధానం, వివిధ కేటగిరీ పోస్టుల విభజనపై అధికారులు దృష్టి పెట్టారు. పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించడం వల్ల ఫలితాలను తేలికగా వెల్లడించే వీలుందని అధికారులు చెబుతున్నారు. ఫైనల్ కీ విడుదల చేసిన రోజు.. లేదా మర్నాడు ఫలితాలను వెల్లడించే వీలుంది. ఆ తర్వాత వారం రోజుల్లో సీనియారిటీ జాబితాను రూపొందించే యోచనలో ఉన్నారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఇటీవల పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షకు 3,29,897 మంది దరఖాస్తు చేస్తే, 2,79,957 మంది పరీక్ష రాశారు.

కేంద్రీకృత ప్రక్రియ

రోస్టర్ విధానం, జిల్లాల వారీగా పోస్టులకు సంబంధించిన డేటా, ఇతర అంశాలన్నీ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్ పరిధిలోనే చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ప్రతీ జిల్లాలోనూ టీచర్ పోస్టుకు ముగ్గురు చొప్పున మెరిట్ పద్ధతిన ఎంపిక చేసి, ఆ జాబితాను మాత్రమే జిల్లా కేంద్రాలకు పంపాలని నిర్ణయించారు. జిల్లా ఎంపిక కమిటీ ఈ ముగ్గురిలో ఒకరిని ఎంపిక చేస్తుంది. వ్యక్తిగత వివరాల విచారణ నివేదికలను తెప్పించేందుకు అన్ని జిల్లాల పోలీసు అధికారులకు కేంద్ర కార్యాలయం నుంచే జాబితాలు పంపాలని భావిస్తున్నారు. ఈ ప్రక్రియను సెప్టెంబర్ మూడోవారంలో ముగించి, జిల్లా కేంద్రాల్లో నియామక ప్రక్రియను నాలుగోవారం నుంచి మొదలుపెట్టాలని భావిస్తున్నారు. ఒక వేళ ఇది ఆలస్యమైతే అక్టోబర్ మొదటి వారంలో నియామక ప్రక్రియ ఉండవచ్చని ఓ అధికారి తెలిపారు. ఏదేమైనప్పటికీ అక్టోబర్ చివరి నాటికి నియామక ఉత్తర్వులను అభ్యర్థులకు అందించేందుకు ప్రయత్నిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఉప వర్గీకరణ అంశంపై సందేహాలు..

కొత్తగా భర్తీ చేసే అన్ని ఉద్యోగ నియామకాల్లో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల శాసనసభలో తెలిపారు. అవసరమైతే ఆర్డినెన్స్ కూడా తెస్తామన్నారు. అయితే, డీఎస్సీ నోటిఫికేషన్‌ను వర్గీకర ణపై తీర్పు రాక ముందే ఇచ్చారు. కాబట్టి ఈ నియామకాలకు వర్గీకరణ అంశం చేరిస్తే న్యాయపరమైన సమస్యలు వస్తాయని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాలేదని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఒకవేళ వర్గీకరణ అంశం ముందుకొస్తే అనుకున్న తేదీల్లో ఉపాధ్యాయ నియామకాలు కష్టమేనని అధికారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

రేపు ఎస్ఎస్ఎల్‌వీ డీ-3 ప్రయోగం?

సిద్ధమవుతున్న ఇస్రో శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా శ్రీహరికోట సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగవేదిక నుంచి శుక్రవారం ఉదయం 9.17 గంటలకు స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ డీ-3)ను ప్రయోగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ప్రయోగాన్ని 16.56 నిమిషాల్లో పూర్తి చేయనున్నారు. అయితే వాతావరణ పరిస్థితులను బట్టి ప్రయోగ సమయం కొద్దిగా మార్పు చేసే అవకాశం ఉండొచ్చు. ఈ ప్రయోగానికి సంబంధించి గురువారం మధ్యాహ్నం 1 గంటకు మిషన్ సంసిద్ధతా సమావేశం (ఎంఆర్ఆర్) నిర్వహించిన తర్వాత ప్రయోగ తేదీని అధికారికంగా ప్రకటిస్తారు. అనంతరం ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్)కు అప్పగిస్తారు. ల్యాబ్ చైర్మన్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో రాకెట్‌కు తుది విడత తనిఖీలు నిర్వహించి ప్రయోగానికి 7 గంటల ముందు అంటే గురువారం రాత్రి 2.17 (తెల్లవారితే శుక్రవారం) గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ ప్రయోగంలో ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్-08)తో పాటు ఎస్ఆర్-0 డెమో శాట్ అనే చిన్న తరహా ఉపగ్రహాలను 475 కిలో మీటర్ల ఎత్తులోని సర్క్యులర్ ఆర్బిట్‌లో ప్రవేశ పెట్టనున్నారు.

'సీతారామ' జలం.. ఖమ్మానికి తొలి ఫలం

నేడు సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు మోటార్లు ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి | నాగార్జునసాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలతో భరోసా | భద్రాద్రి జిల్లాకు న్యాయం చేయాలంటున్న ప్రతిపక్షాలు

సాక్షి ప్రతినిధి ఖమ్మం/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎనిమిదేళ్లుగా నిర్మాణం జరుపుకొంటున్న సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు తొలి ఫలాలు ఉమ్మడి ఖమ్మం జిల్లావాసులకు అందనున్నాయి. గురువారం హైదరాబాద్‌లో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నాక సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్దకు చేరుకొని పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. ఇక్కడ సీతారామ ప్రాజెక్టులో భాగమైన రెండో పంప్‌హౌస్‌లో మధ్యాహ్నం 12:50 గంటలకు మోటార్లు స్విచ్ఛాన్ చేసి గోదావరి జలాల ఎత్తిపోతలను ప్రారంభిస్తారు. అనంతరం డెలివరీ చానల్ వద్ద పొలాల్లోకి ప్రవహించే జలాలకు పూజ చేస్తారు. అనంతరం మీడియాతో మాట్లాడి వైరాలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొనేందుకు హెలికాప్టర్‌లో బయలుదేరతారు. మరోవైపు అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద మొదటి పంప్‌హౌస్‌ను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ములకలపల్లి మండలం కమలాపురంలో మూడో పంప్‌హౌజ్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభిస్తారు. కాగా, బుధవారం పంప్‌హౌస్-2 వద్ద ఏర్పాట్లను, పంప్‌హౌస్-3లో ట్రయల్ రన్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు.



వైరాలో సభ నిర్వహణకు సిద్ధమైన వేదిక

వైరా సభలో రూ.2 లక్షల రుణమాఫీ

పూసుగూడెంలో కార్యక్రమం అనంతరం సీఎం రేవంత్ మధ్యాహ్నం 2.45 గంటలకు ఖమ్మం జిల్లా వైరా చేరుకుంటారు. అక్కడ 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ఇదేవేదికపై రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చెక్కులను కొందరు రైతులకు అందజేస్తారు. ఈ సభలో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి తదితరులు ప్రసంగించనున్నారు.



కమలాపురంలో పంప్‌హౌస్-3 ట్రయల్ రన్ సందర్భంగా మంత్రి తుమ్మల, కలెక్టర్ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్

ఎనిమిదేళ్లుగా..


ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించాలనే లక్ష్యంతో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ పేర్లతో రెండు ఎత్తిపోతల పథకాలను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా ప్రారంభించారు. కానీ మహానేత మరణం తర్వాత ఈ పనులు నిలిచిపోయాయి. అనంతరం రాష్ట్ర విభజనతో ఇందిరాసాగర్ ప్రతిపాదిత స్థలం ఏపీలోకి వెళ్లిపోయింది. దీంతో ఈ రెండు ప్రాజెక్టులను కలిపేస్తూ ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 6.5 లక్షల ఎకరాలకు గోదావరి నీరు ఇచ్చేలా సీతారామ ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. 2016 ఫిబ్రవరి 16న ప్రాజెక్టు నిర్మాణ పనులకు నాటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు రూ.8 వేల కోట్లకు పైగా వెచ్చించగా.. మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం పూర్తయినా ప్రధాన కాల్వ పనులు అసంపూర్తిగా ఉండటంతో ఒక్క ఎకరాకూ నీరు అందించే అవకాశం లేకుండాపోయింది.

రాజీవ్ కెనాల్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీతారామ ప్రధాన కాల్వ 102 కి.మీ. వద్ద 9.8 కి.మీ. నిడివితో రాజీవ్ కెనాల్‌ను నిర్మించి గోదావరి నీటిని నాగార్జునసాగర్ కాల్వ ద్వారా వైరా రిజర్వాయర్‌కు మళ్లించేలా డిజైన్ చేశారు. తద్వారా 1.20 లక్షల ఎకరాల ఎన్ఎస్‌పీ ఆయకట్టుకు గోదావరి నీరు అందించే అవకాశముంది. దీంతో నాలుగేళ్ల క్రితం నిర్మాణం పూర్తయి, డ్రై రన్ కూడా జరగని మూడు పంప్‌హౌస్‌లను సిద్ధం చేసే పనిని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఒక్కో పంప్‌హౌస్‌లో రెండేసి మోటార్లు సిద్ధం చేయడమే కాక ప్రధాన కాల్వ పెండింగ్ పనుల్లో వేగం పెంచింది.

గిరిజన జిల్లాకు అన్యాయం

సీతారామ ప్రాజెక్టు ప్రధాన పనుల కోసం నీరు, భూసేకరణ అంతా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపట్టి సాగునీటిని మాత్రం ఖమ్మం జిల్లాకు తరలి స్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఖమ్మం జిల్లాకు ఇప్పటికే ఎన్ఎస్‌పీ కెనాల్ ద్వారా సాగు నీరు అందుతున్నా ఆ జిల్లాకు చెందిన మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి అదనంగా గోదావరి జలాలను తీసుకెళ్తూ భద్రాద్రికి అన్యాయం చేస్తున్నారని సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మాస్‌లైన్ పార్టీలతోపాటు పలు రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇల్లెందు, పినపాక నియోజకవర్గాలకు గోదావరి జలాలు ఇవ్వాలంటూ బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, బానోతు హరిప్రియ ఆయా నియోజక వర్గాల్లో బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు.



మూడేళ్ల కొడుకును పణంగా పెట్టి...

భగత్‌సింగ్‌ను కాపాడిన భాభీ

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌వీర్... వీరంతా ఆమెను 'దుర్గా భాభీ' అని పిలిచేవారు. సాయుధ పోరాటంతోనే బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమికొట్టగలం అని భావించిన దళంలో పిస్తోల్ పట్టిన తొలి విప్లవ వనిత దుర్గావతి దేవి. బ్రిటిష్ అధికారి సాండర్స్‌ను హత్య చేసిన భగత్‌సింగ్‌ను లాహోర్ నుంచి తప్పించేందుకు అతడి భార్య అవతారం ఎత్తిందామె. చరిత్ర పుటలలో కనుమరుగై పోయిన ఆ త్యాగమయి గురించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

'సైమన్ గోబ్యాక్' నిరసన కార్యక్రమం చేస్తున్న లాలా లజపతిరాయ్ మీద బ్రిటిష్ పోలీసుల లాఠీచార్జీ జరిగి ఆయన ప్రాణం పోయింది. పంజాబ్‌లో యువతకు మార్గదర్శిగా ఉన్న ఆ మహా నాయకుణ్ణి కోల్పోయినందుకు 'హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' (హెచ్‌ఎస్‌ఆర్‌ఏ) సభ్యులకు ఆగ్రహం వచ్చింది. ఇది స్వాతంత్ర్య సమరయోధుడు భగవతి చరణ్ ఓహ్రా నడుపుతున్న గ్రూప్. చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ తదితరులంతా ఇందులో సభ్యులు. వీరంతా కలిసి లాఠీచార్జిని ఆర్డర్ వేసిన బ్రిటిష్ ఆఫీసర్ స్కాట్‌ను చంపాలనుకున్నారు. నిర్ణయం అమలు పరచడమే తరువాయి.


టెలివిజన్ ఎపిసోడ్‌లో భగత్‌సింగ్, దుర్గా భాభీ

స్కాట్ బదులు సాండర్స్

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఈ ముగ్గురు 17 డిసెంబర్ 1928న లాహోర్‌లో పోలీస్ ఆఫీసర్ స్కాట్‌ను హతమార్చడానికి సిద్ధమయ్యారు. అయితే బైక్ మీద రావాల్సిన స్కాట్ కారులో, కారులోనూ రావాల్సిన మరో అధికారి సాండర్స్ బైక్ మీద రావడంతో అయోమయం నెలకొంది. అయినా సరే ఎదురుపడిన సాండర్స్‌పై మొదట రాజ్‌గురు, ఆ తర్వాత భగత్ సింగ్ తుపాకీ పేల్చి అతణ్ణి హతమార్చారు. లాహోర్ అంతా గగ్గోలు రేగింది. వందలాది మంది పోలీసులు అన్ని దారులు... బస్టాండ్లు... రైల్వేస్టేషన్లు కమ్ముకున్నారు. లాహోర్‌లో ఉండటం భగత్‌సింగ్‌కు ఏ మాత్రం మంచిది కాదు. అతణ్ణి తప్పించేవారు ఎవరు?

ఆమె వచ్చింది

భగవతి చరణ్ ఓహ్రా సతీమణి దుర్గావతిని అందరూ దుర్గాభాభీ అని పిలిచేవారు. సాండర్స్‌ని హత్య చేశాక భగత్‌సింగ్, రాజ్‌గురు నేరుగా దుర్గావతి దగ్గరకు వచ్చారు. అప్పటికి ఆమె భర్త వేరే పని మీద కలకత్తా వెళ్లి ఉన్నాడు. జరిగింది తెలుసుకున్న దుర్గావతి వెంటనే భగత్‌సింగ్‌ను లాహోర్ దాటించడానికి సిద్ధమైంది. జుట్టు కత్తిరించుకుని హ్యాట్ పెట్టి రూపం మార్చిన భగత్‌సింగ్‌కు ఆమె భార్యగా నటిస్తూ తన మూడేళ్ల కొడుకుతో మరుసటి రోజు సాయంత్రం లాహోర్ నుంచి డెహ్రాడూన్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో మొదటి తరగతి ప్రయాణికురాలిగా బయల్దేరదీసింది. వందలాది నిఘా కళ్ల మీద ఈ పని చేయడం చాలా ప్రమాదం... మూడేళ్ల కొడుక్కు కూడా ఏదైనా కావచ్చు అని భగత్‌సింగ్ ఆమెతో అన్నాడు. 'నా కొడుక్కు మరణం సంభవిస్తే ఒక దేశభక్తునిగా తన ప్రాణం అర్పించే అవకాశం వాడికి దక్కుతుంది' అని చెప్పి ఆమె ముందుకు కదిలింది. భగత్‌సింగ్ ఆధునికవేషంలో ఉన్న అధికారిగా, దుర్గావతి అతని భార్యగా, రాజ్‌గురు నౌకరుగా ఆ ప్రయాణం చేశారు. బ్రిటిష్ వాళ్లకు ఏ మాత్రం అనుమానం రాలేదు. భగత్‌సింగ్‌ను అలా క్షేమంగా కలకత్తా చేర్చి వెనక్కు వచ్చింది దుర్గావతి.

గొప్ప దేశభక్తురాలు

స్వతంత్ర పోరాటం చేస్తున్న భగవతి చరణ్ ఓహ్రాను వివాహం చేసుకునేనాటికి దుర్గావతికి 13 ఏళ్లు. పెళ్లి తర్వాతనే చదువుకుంది. ఇంట్లో ఇరుగు పొరుగు పిల్లలకు పాఠాలు చెప్పేది. సాయుధ పోరాటం చేయాలన్న భర్త ఆశయానికి మద్దతుగా నిలిచిందామె. భగత్‌సింగ్‌ను తన కన్నబిడ్డలా భావించింది. భగత్ సింగ్ పార్లమెంట్‌లో బాంబు దాడి చేసి అరెస్ట్ అయ్యాక ఆ తర్వాతగాని అతడే సాండర్స్ హత్యలో ఉన్నాడన్న సంగతి పోలీసులకు తెలియలేదు. ఆ కేసు వాదనలను బ్రిటిష్ ప్రభుత్వం హడావిడిగా ముగించి అక్టోబర్ 7, 1930న తీర్పు వెలువరించి భగత్‌సింగ్‌కు మరణశిక్ష విధించింది. అయితే లాహోర్‌లో ఈ విచారణ జరుగుతున్నప్పుడు భగత్‌సింగ్‌ను తీసుకెళ్లే వ్యానుపై బాంబుదాడి చేసి అతణ్ణి కాపాడాలని ప్లాన్ చేసింది దుర్గావతి. వీలు కాలేదు.

భర్తను కోల్పోయి

భగత్‌సింగ్‌ను జైలు నుంచి రక్షించడానికి స్వదేశీ జ్ఞానంతో బాంబులు తయారు చేస్తూ ప్రమాదవశాత్తు భగవతి చరణ్ ఓహ్రా మరణించాడు. అంత కష్టాన్ని తట్టుకుని దేశం కోసం పోరాడాలనుకుంది దుర్గావతి. భగత్‌సింగ్ మరణశిక్ష విధించాక ఆగ్రహంతో బొంబాయి వెళ్లి బ్రిటిష్ గవర్నర్‌ను చంపాలనుకుంది. అయితే గవర్నర్ దొరకలేదు. మరో బ్రిటిష్ అధికారి మీద స్వయంగా గుళ్ల వర్షం కురిపించి పగ చల్లార్చుకుంది. భగత్ సింగ్ ఉరి (1931 మార్చి 23) తర్వాత తన వాళ్లంటూ ఎవరూ లేకపోవడం, పోలీసుల వెతుకులాట ఎక్కువ కావడంతో తనే వెళ్లి లొంగిపోయింది. మూడేళ్ల జైలు శిక్ష అనంతరం మొదట లక్నో ఆ తర్వాత ఘజియాబాద్‌లో పెద్దగా పబ్లిక్‌లో ఉండటానికి ఇష్టపడక స్కూల్ నడుపుతూ 1999లో తన 92వ ఏట మరణించిందా గొప్ప దేశభక్తురాలు, భారత తొలి సాయుధ పోరాట సమరయోధురాలు దుర్గాభాభీ.

ఇది సైనికుల సంగ్రామం

- ఇంటికొకరుగా ఆర్మీ జవాన్లు
- నాటి పీపుల్స్‌వార్ ఖిల్లా నుంచి నేడు దేశరక్షణకు సరిహద్దుల్లో యువకులు

ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలా ఈ ఊరికి ఉన్న ప్రత్యేకత 'దేశభక్తి'. దేశాన్ని కాపాడాలనే ధ్యేయంతో ఊరి యువకులు సైన్యం బాట పట్టారు. ఒకే ఊరి నుంచి ఇంటికి ఒక్కరు చొప్పున సుమారుగా 92 మందికిపైగా యువకులు సైన్యంలో తమ సేవలను అందిస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్ ఖిల్లాగా ఉన్న ఆ ఊరిని ఇప్పుడు ఆర్మీ జవాన్ల పుట్టినిల్లుగా పిల్చుకుంటున్నారు. ఆ ఊరు సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం. ఆ ఊరి ముచ్చట్లలోకి వెళదామా?

సుమారు 40 ఏళ్ల క్రితం కట్కూర్ గ్రామానికి చెందిన జేరిపోతుల డేనియల్ మిలిటరీలో జవాన్‌గా చేరాడు. ఆయన స్ఫూర్తితో గ్రామంలోని యువకులు సైన్యం బాటపట్టారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆర్మీలో చేరారు. జవాన్ స్థాయి నుంచి లాన్స్‌నాయక్, నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఇలా గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం 92 మంది ఆర్మీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. దాంతో జిల్లాలో కట్కూరు గ్రామం అంటే ఆర్మీజవాన్‌ల గ్రామంగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలో 1,014 కుటుంబాలుండగా జనాభా సుమారుగా 3,045 ఉన్నారు. అందులో మొత్తం గ్రామంలో 175 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. వీరిలో కొందరు ఇతర ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు.

- మాలోతు శ్రీనివాస్, సాక్షి, అక్కన్నపేట

దేశసేవ ఇష్టం...



దేశసేవ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే 1998లో భారతసైన్యంలో చేరాను. మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్ బెంగళూర్‌లో ట్రైనింగ్ చేశాను. కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నాను. కాశ్మీర్‌లో రాష్ట్రీయ విభాగంలో సేవలు అందించి అనేక టెర్రరిస్ట్ ఆపరేషన్‌లలో పాల్గొన్నాను. కాశ్మీర్ సేవలను గుర్తించి నాకు సుబేదార్ మేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు.

- పంజా సదయ్య, సుబేదార్

గర్వపడుతున్నా...



దేశరక్షణ కోసం సైన్యంలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా దేశం కోసం పని చేయడం ఆనందంగా ఉంది.

- కొయ్యడ శ్రీనివాస్, ఆర్మీ జవాన్

పోస్టల్ స్టాంపులు

యుద్ధం ముద్రలు


మహిళలు ఇల్లు విడిచి బయట అడుగు పెడితే వింతగా చూసే కాలంలో సాహసమే వెన్నెముకగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు ఎంతోమంది మహిళలు. వారి త్యాగాల వెలుగు చరిత్రకే పరిమితమైనది కాదు, వర్తమానంలోనూ స్ఫూర్తిని ఇస్తుంటుంది. ఎంతోమంది మహిళా స్వాతంత్ర్య సమరయోధుల పోస్టల్ స్టాంప్స్ విడుదల అయ్యాయి. ఈ చిన్న స్టాంప్‌లు వారి త్యాగాలు, పోరాట పటిమను ప్రతిఫలిస్తాయి. పోస్టల్ స్టాంప్స్‌పై మెరిసిన కొందరు మహిళా స్వాతంత్ర్య సమరయోధుల గురించి...

రుక్మిణీ లక్ష్మీపతి



ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని మధురైలో పుట్టింది రుక్మిణీ. గాంధీజీ 'హరిజన సంక్షేమ నిధి' కోసం తన బంగారు నగలన్నీ విరాళంగా ఇచ్చేసింది. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో చురుగ్గా పాల్గొంది. ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా అరెస్టయి జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళగా చరిత్రలో నిలిచింది.

సుభద్రా జోషి



గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితం అయిన సుభద్రా జోషి విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొంది. 'హమారా సంగ్రామ్' పత్రికకు ఎడిటర్‌గా పని చేసింది. సుభద్రను అరెస్ట్ చేసి లాహోర్ సెంట్రల్ జైల్‌కు తరలించారు. విడుదలయ్యాక మళ్లీ ఉద్యమంలో భాగం అయింది. సుభద్ర అంకితభావాన్ని నెహ్రూ ప్రశంసించారు.

రాణి మా గైడిన్లియు



బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మొదలైన 'హెరాక' ఉద్యమంలో పదమూడు సంవత్సరాల వయసులోనే పాల్గొంది రాణి మా. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసి మహిళగా చరిత్రకెక్కింది. 'హెరాక' ఉద్యమంతో పాటు ఎదుగుతూ వచ్చిన రాణి మా ప్రముఖ రాజకీయ నాయకురాలిగా, ఆధ్యాత్మిక గురువుగా ప్రఖ్యాతి పొందింది.

బేగం హజ్రత్ మహల్



తొలి తరం మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలు బేగం హజ్రత్ మహల్. బేగం హజ్రత్ ఇతర సంస్థానాధీశులతో కలిసి బ్రిటిష్ వారితో యుద్ధం చేసింది. లక్నో సమీపంలో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారిని ఓడించింది. ఆ తరువాత కాలంలో మాత్రం ఓటమికి గురైంది. బ్రిటిష్ వారికి చిక్కకుండా అడవుల్లో తల దాచుకొని పోరాడేది.

కమలానెహ్రూ



జవహర్‌లాల్ నెహ్రూ సతీమణి కమలా నెహ్రూ మహిళా సాధికారత కోసం గళం విప్పిన యోధురాలు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అరెస్టై జైలుకు వెళ్లింది. 'దేశ సేవిక' సంఘాలను ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగం అయ్యేలా చేసింది.

సుభద్రాకుమారి చౌహాన్



సుభద్రాకుమారి చౌహాన్ కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరిన తరువాత నాగపూర్ నుంచి అరెస్ట్ అయిన మొట్టమొదటి మహిళా సత్యాగ్రహిగా చరిత్రలో నిలిచింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా పోరాడింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఎన్నో త్యాగాలు చేసింది.

అరుణా అసఫ్ అలి



భర్త అసఫ్ అలీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది అరుణ. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయింది. కాంగ్రెస్‌పార్టీ క్విట్ ఇండియా తీర్మానం చేసిన తరువాత బ్రిటిష్ వారు విరుచుకుపడ్డారు. ప్రముఖ నాయకులను అరెస్ట్ చేశారు. ఆ క్లిష్ట సమయంలో అరుణా అసఫ్ అలి కార్యకర్తలకు అండగా ఉంది. బొంబాయి గొవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ జెండాను ఎగరేసి క్విట్ ఇండియా ఉద్యమం ఊపందుకునేలా చేసింది.

దుర్గాబాయి దేశ్‌ముఖ్



దుర్గాబాయి దేశ్‌ముఖ్ సాహసవంతురాలైన సామాజిక కార్యకర్త, చిన్నతనం నుంచే మహిళల హక్కుల కోసం పోరాడింది. మహాత్మా గాంధీ నుంచి స్ఫూర్తి పొంది స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. గాంధీజీ ప్రభావంతో దుర్గాబాయి మాత్రమే కాదు ఆమె కుటుంబం మొత్తం అన్ని రకాల పాశ్చాత్య దుస్తులను విడిచిపెట్టి, ఖాదీని మాత్రమే ధరించేవారు. మద్రాస్‌లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించింది.

రాజ్‌కుమారీ అమృత్ కౌర్



రాజ్‌కుమారీ అమృత్ కౌర్ సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు. గాంధీజీ కార్యదర్శిగా పని చేసిన ఆమె దండి మార్చ్‌లాంటి ఎన్నో జాతీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంది. క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రాజ్‌కుమారి ఇరవై నెలల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. రాచరిక కుటుంబంలో పుట్టినప్పటికీ మహాత్ముడి ఆశ్రమంలో సాధారణ జీవితాన్ని గడిపింది.

మన(సు)లో మాట

మా బాబు ఒకచోట కుదురుగా ఉండటం లేదు...



మా బాబు వయసు 5 సంవత్సరాలు. ఒకచోట నిలకడగా ఉండకుండా, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. ఇంట్లో, స్కూల్లో బయటా కూడా ఇలాగే చస్తుంటాడు. బయట ఫంక్షన్లకు తీసుకెళితే తనను పట్టుకోవడం, తన చుట్టూ తిరగడంతోటే సరిపోతుంది. అందువల్ల ఈ మధ్య బయటకు వెళ్లడం కూడా తగ్గించేశాం. వాళ్ల నానమ్మేమో, ఇది పిల్లల్లో మామూలే అంటుంది. ఈ మధ్య వాళ్ల స్కూల్ టీచర్ మమ్మల్ని పిలిచి, మా బాబు మీద అనేక కంప్లయింట్లు చెప్పింది. మాకు చాలా ఆందోళనగా ఉంది.

- కె. మాధవి, సికింద్రాబాద్


పిల్లల మెదడులో ఉండే సెల్ఫ్ కంట్రోల్ విభాగం లోని లోపాల వల్ల, వారసత్వ లక్షణాల రీత్యా, కొందరు పిల్లలకు మీరు చెప్పిన లక్షణాలు రావచ్చు. దీనిని హైపర్ యాక్టివిటీ లేదా ఏడీహెచ్‌డీ అంటారు. నిలకడ లేకపోవడం, చదువు మీద ఏకాగ్రత లేకపోవడం, వస్తువులు విసిరేయడం, సహనం లేకపోవడం, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉండటం, స్కూల్‌లో వస్తువులు మరచిపోవడం, ఈ సమస్య ముఖ్య లక్షణాలు. వీరికి తెలివితేటలు బాగానే ఉన్నప్పటికీ, ఏకాగ్రత లోపించడం వల్ల చదువులో వెనకబడతారు. ఇలాంటి వారిని ఎంత చిన్నవయసులో గుర్తించి, సరియైన చికిత్స చేయిస్తే అంత తొందరగా దీంట్లోంచి బయట పడతారు. ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, అవసరమైతే కొద్ది మోతాదులో కొన్ని మందులు వాడటం ద్వారా వీరిని పూర్తిగా బాగు చెయ్యొచ్చు. పేరెంట్స్, టీచర్లు ఇలాంటి వారిని త్వరగా గుర్తించగలిగితే తొందరగా బాగుపడతారు. మైకేల్ ఫిలిప్స్ అనే స్విమ్మర్ ఈ సమస్యతో బాధపడుతూ చికిత్స తీసుకుని బాగుపడి, ఒలింపిక్స్‌లో 20కి పైగా స్వర్ణ పతకాలు సాధించాడు. చైల్డ్ సైకియాట్రిస్ట్‌ల సూచనలు తీసుకోవడం, పాటించడం మేలు చేస్తుంది.



- డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

హెల్దీ డైట్

సగ్గుబియ్యం పొంగనాలు



కావలసినవి: సగ్గుబియ్యం – అర కప్పు (గంట సేపు నానబెట్టాలి); పనీర్ తురుము – 75 గ్రాములు; వేరుశనగపప్పుల పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; క్యారట్ తురుము – 3 టేబుల్ స్పూన్‌లు ; బంగాళదుంప – 1 (ఉడికించి తొక్క తీసి చిదమాలి); జీలకర్ర పొడి– టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; క్యాబేజ్ తరుగు – ముప్పావు కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు (రెడ్, గ్రీన్ క్యాప్సికమ్); చీజ్ తురుము – 50 గ్రాములు (12 భాగాలు చేసుకోవాలి); నూనె – టీ స్పూన్.



దాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

తయారీ: • ఒక పాత్రలో క్యాబేజ్ తురుము, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఐదు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఇందులో నూనె, చీజ్ మినహా మిగిలినవన్నీ వేసి బాగా కలిపి పన్నెండు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో చీజ్ స్టఫ్ చేస్తూ గోళీలాగా చేయాలి • గుంత పొంగనాల పెనం వేడి చేసి ఒక్కో గుంతలో ఒక్కో చుక్క నూనె రుద్ది పొంగనాన్ని పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు కాలిన తర్వాత రెండోవైపు కాల్చాలి.

పోషకాలు: (ఒక్కో పొంగనంలో)...
• కేలరీలు 63; • ప్రొటీన్ – 2.5 – 3 గ్రాములు; • కార్బోహైడ్రేట్లు – 8-9 గ్రాములు; • ఫ్యాట్ – 2-3 గ్రాములు; • ఫైబర్– గ్రాము; క్యాల్షియం – 40 –50 గ్రాములు.

అరుదైన ఆహ్వానం

12 ఏళ్లు... 15 లైబ్రరీలు

ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న ఇరవై మందిలో విద్యార్థులు ఆరుగురు. వారిలో అమ్మాయి ఒకే ఒక్కరు. ఆ సరస్వతి పుత్రిక పేరు ఆకర్షణ. లైబ్రరీలు స్థాపిస్తూ సాహిత్యాన్ని సామాన్యులకు దగ్గర చేస్తున్న ఆమె అక్షరసేవకు జాతీయ స్థాయిలో అందిన గుర్తింపు ఇది.

''హైదరాబాద్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్‌మాస్టర్ నుంచి 12వ తేదీన నాన్నకు ఫోన్ వచ్చింది. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 15వ తేదీన ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కావలసిందిగా మీ అమ్మాయి ఆకర్షణకు ఆహ్వానం వచ్చిందని చెబుతూ అభినందనలు తెలియచేశారు'' అంటూ తాను లైబ్రరీ వ్యవస్థాపకురాలిగా మారిన వివరాలను సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు ఆకర్షణ సతీష్.


సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతితో...

కోవిడ్ వచ్చినప్పుడు

''హైదరాబాద్‌లో స్థిరపడిన తమిళ కుటుంబం మాది. నాన్న సతీశ్ క్యాన్సర్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ ఉద్యోగి. నేను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాను. పుస్తక పఠనం నా హాబీ కావడంతో వెయ్యికి పైగా పుస్తకాలతో ఇంట్లోనే నాకు సొంత లైబ్రరీ ఉంది. ఇతరుల కోసం లైబ్రరీ స్థాపించాలనే ఆలోచన కోవిడ్ సమయంలో వచ్చింది.

తొలి లైబ్రరీ క్యాన్సర్ హాస్పిటల్‌లో

నాన్న ఉద్యోగరీత్యా క్యాన్సర్ హాస్పిటళ్లకు టచ్‌లో ఉంటారు. కోవిడ్ సమయంలో ఎమ్ఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వాళ్లు 'కోవిడ్ కారణంగా వంటవాళ్లు డ్యూటీకి రావడం లేదు. పేషెంట్‌లకు ఆహారం అందించడానికి ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేసి పెట్టవలసింది'గా కోరడంతో నాన్న వాళ్ల కోసం రోజూ భోజనం వండించి తీసుకెళ్లి ఇచ్చేవారు. నాకు స్కూల్ లేకపోవడంతో రోజూ నాన్నతోపాటు హాస్పిటల్‌కి వెళ్లేదాన్ని. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న పేషెంట్‌లలో నా ఏజ్ గ్రూప్ వాళ్లతో స్నేహం ఏర్పడింది. వాళ్లు కొంతమంది చదువుకోవడానికి పుస్తకాలు తెచ్చిపెట్టమని అడిగారు. రోజూ నా పుస్తకాలు కొన్ని తీసుకెళ్లి ఇస్తూ ఉన్నప్పుడు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జయలత గారు... 'హాస్పిటల్‌కి చికిత్స కోసం ఎప్పుడూ కొత్తవాళ్లు వస్తుంటారు. హాస్పిటల్‌లోనే లైబ్రరీ ఉంటే బావుంటుంది' అన్నారు. వారి ఆలోచనే నా లైబ్రరీ ఉద్యమానికి నాంది. నా పుస్తకాలతోపాటు మా స్కూల్, అపార్ట్‌మెంట్ స్నేహితుల నుంచి సేకరించిన వెయ్యికి పైగా పుస్తకాలతో తొలి లైబ్రరీ అలా మొదలైంది. ఇప్పటికి 9,836 పుస్తకాలతో 15 లైబ్రరీలు ఏర్పాటు చేయగలిగాను.

పదకొండు వేల పుస్తకాలు

నాలుగేళ్లలో పదకొండు వేల పుస్తకాలు సేకరించాను. అందులో రెండు వేల పుస్తకాలు ప్రధాని నరేంద్రమోదీగారిచ్చారు. ఈ ఏడాది మార్చి 18న కోయంబత్తూరులో ఆయనను కలిసే అవకాశం వచ్చింది. ఆ సందర్భంగా ఆయన 25 లైబ్రరీలు స్థాపించమని, 25 లైబ్రరీ స్థాపనకు స్వయంగా హాజరవుతానని చెప్పారు. భారత రాష్ట్రపతి గత ఏడాది శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కి వచ్చినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కలిశాను. అప్పుడామె 'ప్రజల్లో రీడింగ్ హ్యాబిట్ తగ్గుతోంది, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి దోహదం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని కొనసాగించ'మని చెప్పి ఆమే స్వయంగా 74 పుస్తకాలిచ్చారు. ఈ ఏడాది ఢిల్లీ, కర్తవ్య పథ్‌లో జరిగిన 75వ రిపబ్లిక్ డే ఉత్సవాలకు ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరయ్యాను. ఇదే ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలకు కూడా హాజరయ్యే అవకాశం కలగడం సంతోషంగా ఉంది'' అంటూ 25 లైబ్రరీల లక్ష్యాన్ని పూర్తి చేస్తానని చెప్పింది ఆకర్షణ సతీశ్.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



తొలి రౌండ్‌లోనే సుమిత్ పరాజయం

సిన్సినాటి ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పోరాటం క్వాలిఫయింగ్‌లోనే ముగిసింది. తొలి రౌండ్‌లో ప్రపంచ 74వ ర్యాంకర్ సుమిత్ 2-6, 4-6తో ప్రపంచ 119వ ర్యాంకర్ మెకంజీ మెక్‌డొనాల్డ్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయాడు.. సుమిత్‌కు 7,290 డాలర్ల (రూ. 6 లక్షల 11 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

కెన్యా జట్టు హెడ్ కోచ్‌గా దొడ్డ గణేశ్

భారత జట్టు మాజీ పేస్ బౌలర్ దొడ్డ గణేశ్ కెన్యా క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. 2026లో భారత్-శ్రీలంక ఆతిథ్యమిచ్చే టి20 ప్రపంచకప్ కోసం అక్టోబర్‌లో ఆఫ్రికా క్వాలిఫయర్స్ పోటీలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో 51 ఏళ్ల భారత మాజీ క్రికెటర్‌ను కెన్యా క్రికెట్ బోర్డు నియమించుకుంది. ముందుగా వచ్చే నెలలో ఐసీసీ డివిజన్-2 చాలెంజ్ లీగ్ జరుగుతుంది. అంతర్జాతీయ కెరీర్‌లో 4 టెస్టులు, ఒక వన్డే మాత్రమే ఆడిన గణేశ్... దేశవాళీ క్రికెట్‌లో కర్ణాటక తరఫున 365 వికెట్లు పడగొట్టాడు.





ఒలింపిక్ బృందాన్ని అభినందించిన రాష్ట్రపతి

నేడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానం


న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పారిస్‌లో పాల్గొన్న భారత ఒలింపిక్ బృందాన్ని బుధవారం అభినందించారు. రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండప్‌లో భారత బృందంతో భేటీ అయిన ముర్ము... దేశంలోని యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. పతకాలు తెచ్చిన క్రీడాకారులతో పాటు పతకాల కోసం పారిస్‌లో శ్రమించిన అథ్లెట్లను ఆమె ప్రశంసించారు. పలువురు అథ్లెట్లతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముచ్చటించిన ఫొటోలు, బృందంతో దిగిన ఫొటోల్ని రాష్ట్రపతి భవన్ అధికారిక 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. మరోవైపు ఈరోజు ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని పారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన భారత క్రీడాకారులకు ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత క్రీడాకారులు కూడా ఆ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు.

వినేశ్‌కు చుక్కెదురు

కోట్లాది మంది అభిమానుల ప్రార్థనలు ఫలించలేదు. పారిస్ ఒలింపిక్స్‌లో అసమాన పోరాటంతో ఫైనల్‌కు చేరి... అనంతరం 100 గ్రాముల అధిక బరువు కారణంగా అనర్హత వేటుకు గురైన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు న్యాయ పోరాటంలోనూ ఊరట దక్కలేదు. తుదిపోరుకు చేరినందుకు రజత పతకమైనా ఇవ్వాలని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)ను ఆశ్రయించిన వినేశ్ ఫొగాట్ అప్పీలు తిరస్కరణకు గురైంది.

- అప్పీలును తిరస్కరించిన సీఏఎస్
- రజత పతకం ఇచ్చేందుకు నిరాకరణ
- భారత స్టార్ రెజ్లర్‌కు తప్పని నిరాశ

పారిస్: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లో చుక్కెదురైంది. పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ మహిళల 50 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫొగాట్... నిర్దేశిత బరువు కంటే 100 గ్రాములు ఎక్కువగా ఉండటంతో అనర్హతకు గురైంది. దీంతో అనుమతించిన బరువుతోనే ఫైనల్ వరకు చేరినందుకుగానూ... రజత పతకం అందించాలని వినేశ్ సీఏఎస్‌ను ఆశ్రయించింది. అయితే ఈ అంశంపై ఇప్పటికే రెండుసార్లు తీర్పు వాయిదా వేసిన సీఏఎస్... ఎట్టకేలకు బుధవారం రాత్రి ఏకవాక్యంలో తుది తీర్పు వెల్లడించింది. వినేశ్ పిటిషన్‌ను సీఏఎస్ అడ్‌హాక్ డివిజన్ కొట్టి వేసింది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) వివరాలు వెల్లడించింది. అథ్లెట్లు ఎదుర్కొంటున్న శారీరక, మానసిక ఒత్తిళ్లను పరిగణనలోకి తీసుకోవడంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ విఫలమైందని... ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష అభిప్రాయపడింది. 'నిరాశాజనక తీర్పు. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి వ్యతిరేకంగా వినేశ్ ఫొగాట్ అభ్యర్థనను ఆర్బిట్రేటర్ తిరస్కరించారు. మహిళల 50 కేజీల విభాగంలో తనకు కూడా రజత పతకం ఇవ్వాలన్న వినేశ్ దరఖాస్తును కొట్టేశారు' అని ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష ఒక ప్రకటనలో తెలిపింది. తొలి రోజు నిబంధనల ప్రకారమే బరువు ఉన్నందుకుగానూ దాన్ని పరిగణనలోకి తీసుకొని మానవీయ కోణంలో తీర్పు ఇవ్వాల్సిందని... కానీ అది జరగలేదని పీటీ ఉష వాపోయింది. కేవలం 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఇంత పెద్ద నిర్ణయం తీసుకోవడం సబబు కాదని పేర్కొంది. దీంతో 'పారిస్' క్రీడల్లో భారత్‌కు మరో పతకం వస్తుందనే ఆశలు ఆవిరయ్యాయి. ఫలితంగా విశ్వక్రీడల్లో భారత్ ఆరు (ఒక రజతం, 5 కాంస్యాలు) పతకాలతోనే సరిపెట్టుకోనుంది. అనర్హత వేటు అనంతరం మానసికంగా కుంగిపోయిన 29 ఏళ్ల వినేశ్.. కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించింది.



సీఏఎస్ తీర్పుపై అప్పీల్ చేయవచ్చా?

కష్ట కాలంలో వినేశ్‌కు అండగా నిలుస్తామని ఐఓఏ ప్రకటించింది. తదుపరి న్యాయ పరమైన అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. అధికారిక వెబ్‌సైట్ వివరాల ప్రకారం సీఏఎస్ తీర్పుపై అప్పీలు చేసే అవకాశం ఉంది. అయితే సీఏఎస్ తీర్పు మారే అవకాశాలు మాత్రం లేవనే చెప్పాలి. 'ప్రాథమిక విధానపరమైన నియమాల ఉల్లంఘన, ప్రజా పాలసీతో సంబంధం ఉన్న చాలా పరిమిత అంశాలపైనే తీర్పు మార్చే అవకాశం ఉంది. అది మినహా స్విస్ ఫెడరల్ ట్రిబ్యునల్‌కు న్యాయపరిధి పరిమితం' అని వినేశ్ కేసు వాదించిన ఫ్రాన్స్ లాయర్లు తెలిపారు.

భారత బౌలింగ్ కోచ్‌గా మోర్కెల్

- వచ్చే నెలలో బాధ్యతల స్వీకరణ
- 2027 వరకు పదవిలో కొనసాగనున్న దక్షిణాఫ్రికా మాజీ పేసర్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా మాజీ పేస్ బౌలర్ మోర్నీ మోర్కెల్ భారత సీనియర్ క్రికెట్ జట్టు కొత్త బౌలింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. సెప్టెంబర్ 19 నుంచి భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండు టెస్టుల సిరీస్ మొదలవుతుంది. ఈ సిరీస్‌తోనే బౌలింగ్ కోచ్‌గా మోర్కెల్ ఇన్నింగ్స్ ప్రారంభం కానుందని బీసీసీఐ కార్యదర్శి జై షా బుధవారం వెల్లడించాడు. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్ వరకు మోర్కెల్ కాంట్రాక్ట్ కొనసాగనుంది. మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ ఇటీవల టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టగా.. కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ తరఫున తనతో కలిసి పనిచేసిన అభిషేక్ నాయర్, టెన్ డస్కటేను అతను సహాయక బృందంలో చేర్చుకున్నాడు. ఇప్పుడు మోర్నీ మోర్కెల్ రాకతో ఇక కోచింగ్ స్టాఫ్ ఎంపిక ముగిసినట్లయింది. ఫీల్డింగ్ కోచ్‌గా హైదరాబాద్‌కు చెందిన టి.దిలీప్ కొనసాగుతున్నాడు.

మూడు దేశాలకు కోచ్‌గా...

మోర్కెల్‌కు గంభీర్‌కు మధ్య మంచి సమన్వయం ఉంది. ఐపీఎల్‌లో కేకేఆర్ తరఫున గంభీర్ సారథ్యంలో ఆడిన మోర్నీ అనంతరం లక్నో సూపర్ జెయింట్స్‌కు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. ఆ సమయంలో లక్నో ఫ్రాంచైజీకి గంభీర్ మెంటార్‌గా వ్యవహరించాడు. దక్షిణాఫ్రికా జాతీయ జట్టు తరఫున 86 టెస్టులు, 117 వన్డేలు, 44 టి20లు ఆడిన మోర్నీ మోర్కెల్ ఓవరాల్‌గా మూడు ఫార్మాట్లలో కలిపి 544 వికెట్లు పడగొట్టాడు. కెరీర్‌కు వీడ్కోలు పలికిన అనంతరం మోర్కెల్ పలు జట్లకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. 2023 వన్డే ప్రపంచకప్ సందర్భంగా పాకిస్తాన్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన మోర్కెల్... మహిళల టి20 ప్రపంచ కప్‌లో న్యూజిలాండ్ జట్టుకు శిక్షకుడిగా వ్యవహరించాడు. ఇక ఈ ఏడాది జరిగిన పురుషుల టి20 ప్రపంచకప్‌లో నమీబియా జట్టుకూ మోర్కెల్ శిక్షణ ఇచ్చాడు. బౌలింగ్ కోచ్ రేసులో వినయ్ కుమార్, లక్ష్మీపతి బాలాజీ వంటి భారత మాజీ పేసర్ల పేర్లు వినిపించినా... గంభీర్ కోరిక మేరకే మోర్నీ మోర్కెల్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఐపీఎల్ ద్వారా వెలుగులోకి వచ్చిన నయా పేస్ సంచలనం మయాంక్ యాదవ్ మెరుగైన ప్రదర్శన వెనక కూడా మోర్కెల్ కృషి ఉంది. ఇటీవల శ్రీలంక పర్యటనలో భారత మాజీ స్పిన్నర్ సాయిరాజ్ బహుతులే టీమిండియా తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించగా... అతడిని స్పిన్ కన్సల్టెంట్‌గా కొనసాగిస్తారా లేదో వేచి చూడాలి.



జెర్సీ నంబర్ 16కు వీడ్కోలు

భారత గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ గౌరవార్థం హాకీ ఇండియా నిర్ణయం





న్యూఢిల్లీ: భారత దిగ్గజ గోల్‌కీపర్ శ్రీజేశ్ ఇకపై హాకీ మైదానంలో కనిపించడు. అలాగే అతని జెర్సీ నంబర్ 16 కూడా కనిపించదు. గోల్‌పోస్ట్ ముందు ప్రత్యర్థులకు అడ్డుగోడలా నిలబడి భారత జట్టుకు విశేష సేవలందించిన శ్రీజేశ్ ఘనకీర్తికి గుర్తుగా ఆ జెర్సీకి అతనితోపాటే రిటైర్మెంట్ ఇవ్వాలని హాకీ ఇండియా (హెచ్ఐ) నిర్ణయించింది. బుధవారం ఒలింపిక్స్ కాంస్య పతక విజేత జట్టు సభ్యులను ఘనంగా సన్మానించారు. శ్రీజేశ్‌కు రూ. 25 లక్షల నగదు పురస్కారం చెక్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్ టిర్కీ, భోళానాథ్ సింగ్‌లు మాట్లాడుతూ శ్రీజేశ్‌ను ఆకాశానికెత్తారు. ఆధునిక భారత హాకీకి అతనొక దేవుడని కితాబిచ్చారు. భారత సీనియర్ పురుషుల జట్టులో 16వ నంబర్ జెర్సీని ఎవరికీ కేటాయించబోమని భోళానాథ్ చెప్పారు. 'శ్రీజేశ్ త్వరలోనే జూనియర్ భారత జట్టు కోచ్‌గా వెళతారు. ఘనమైన కెరీర్‌కు అతను వీడ్కోలు పలికితే ... హాకీ ఇండియా అతని ఘనకీర్తికి గుర్తుగా జెర్సీ నంబర్ 16కు రిటైర్మెంట్ ఇచ్చింది. అయితే ఇది సీనియర్ స్థాయికే పరిమితం. జూనియర్ జట్టులో 16వ జెర్సీ యథాతథంగా కొనసాగుతుంది' అని ఆయన వివరించారు.

దులీప్ ట్రోఫీలో అగ్రశ్రేణి క్రికెటర్లు

బరిలో గిల్, పంత్, రాహుల్, జడేజా, సిరాజ్ ● రోహిత్, కోహ్లి, బుమ్రా దూరం



సిరాజ్



భరత్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు భారత దేశవాళీ క్రికెట్ సీజన్ దులీప్ ట్రోఫీతో మొదలుకానుంది. వచ్చేనెల 5 నుంచి బెంగళూరు, అనంతపురంలో ఈ టోర్నీ జరగనుంది. దీనికోసం జాతీయ సెలెక్షన్ కమిటీ బుధవారం నాలుగు జట్లను ప్రకటించింది. శుబ్‌మన్ గిల్, అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్ వరుసగా 'ఎ' 'బి' 'సి' 'డి' జట్లకు కెప్టెన్‌లుగా వ్యవహరిస్తారు. పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, బుమ్రా, అశ్విన్‌లకు ఈ టోర్నీ నుంచి విశ్రాంతి ఇచ్చారు. శస్త్రచికిత్స తర్వాత పూర్తిగా కోలుకోని సీనియర్ పేసర్ షమీని కూడా ఎంపిక చేయలేదు. ఇక కారు ప్రమాదం నుంచి కోలుకున్న రిషభ్ పంత్ చాలా రోజులకు ఎర్రబంతితో ఆడనున్నాడు. గత సీజన్‌లో రంజీ ట్రోఫీ ఆడకుండా.. ఐపీఎల్‌పై దృష్టి పెట్టి సెంట్రల్ కాంట్రాక్టు కోల్పోయిన ఇషాన్ కిషన్ టీమ్ 'డి'లో చోటు దక్కించుకున్నాడు. సెప్టెంబర్ 19 నుంచి భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండు టెస్టుల సిరీస్ ప్రారంభమవుతుంది. టీమిండియా ఆటగాళ్లు దులీప్ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్‌లో మాత్రమే ఆడే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిని 'బి' జట్టుకు ఎంపిక చేశారు. హైదరాబాద్ ఆటగాళ్లు సిరాజ్ 'బి' జట్టులో చోటు పొందగా.. తిలక్ వర్మ 'ఎ' జట్టులో ఉన్నాడు. ఆంధ్ర ఆటగాళ్లు శ్రీకర్ భరత్, రికీ భుయ్ టీమ్ 'డి'లో చోటు దక్కించుకున్నారు.

రెండో ర్యాంక్‌లో రోహిత్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఒక స్థానం మెరుగుపర్చుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో రోహిత్ 765 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో రోహిత్ రెండు అర్ధ సెంచరీలతో కలిపి 157 పరుగులు చేశాడు. శుబ్‌మన్ గిల్ ఒక స్థానం పడిపోయి 763 పాయింట్లతో మూడో స్థానంలో నిలువగా... విరాట్ కోహ్లి 746 పాయింట్లతో నాలుగో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. పాకిస్తాన్ ప్లేయర్ బాబర్ ఆజమ్ 824 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.

చహల్ 10-5-14-5




లండన్: ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్ వన్డే కప్ టోర్నీలో భాగంగా ఆడిన తొలి మ్యాచ్‌లోనే భారత లెగ్ స్పిన్నర్ యుజువేంద్ర చహల్ అదరగొట్టాడు. కెంట్ జట్టుతో కాంటర్‌బరీలో బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో నార్తంప్టన్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహించిన చహల్ 10 ఓవర్లు వేసి 14 పరుగులిచ్చి 5 వికెట్లు తీసుకున్నాడు. చహల్ 5 మెయిడెన్లు కూడా వేయడం విశేషం. చహల్ మాయాజాలానికి కెంట్ జట్టు 35.1 ఓవర్లలో 82 పరుగులకే ఆలౌటైంది. నార్తంప్టన్‌షైర్ 14 ఓవర్లలో వికెట్ కోల్పోయి 86 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ టోర్నీలో నార్తంప్టన్‌షైర్ 8వ స్థానంలో నిలిచి గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

సినిమా

ఏ సినిమాకీ ఇంత కష్టపడలేదు

- విక్రమ్

"నేను నటించిన 'శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ' వంటి చిత్రాల్లానే 'తంగలాన్' కూడా వైవిధ్యమైన సినిమా. భావోద్వేగాలతో కూడుకున్న చిత్రమిది. ఈ స్క్రిప్ట్ చేసిన తర్వాత రంజిత్ ఒక ట్రాన్స్‌లోకి వెళ్లిపోయాడు. ఈ మూవీలో ఒక జీవితం ఉంటుంది. లైవ్ సౌండింగ్‌లో చిత్రీకరించిన ఈ సినిమా నాకు అందమైన అనుభూతినిచ్చింది" అని విక్రమ్ అన్నారు. పా. రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ హీరోగా నటించిన చిత్రం 'తంగలాన్'. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా విక్రమ్ చెప్పిన విశేషాలు.



● 'తంగలాన్'లో విక్రమ్

● నా ప్రతి చిత్రంలో కొంత గొంతు మార్చి మాట్లాడుతుంటా. 'తంగలాన్'లోనూ అలాగే డైలాగ్స్ చెప్పాను. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ ప్రాంతం వాళ్లు ఎలాంటి లైఫ్ లీడ్ చేశారో.. మేమూ అలాంటి పరిస్థితులను ఫేస్ చేస్తూ షూటింగ్ చేశాం. నేనిప్పటిదాకా ఏ సినిమాకీ ఇంతలా కష్టపడలేదు... ఇలాంటి సినిమా చేయనూ లేదు. మా డైరెక్టర్ రంజిత్ చేసిన గొప్ప సినిమాల్లో 'తంగలాన్' ఒకటిగా నిలుస్తుంది. ఇందులో నేను రెండు పాత్రలు చేశాను. సహజంగా కనిపించేందుకు శారీరకంగా శ్రద్ధ తీసుకున్నాను. ఈ సినిమాని పాన్ వరల్డ్‌కి తీసుకెళ్లడానికి ట్రై చేస్తున్నారు జ్ఞానవేల్ రాజా. ● 'తంగలాన్' తెలుగు, తమిళ, కన్నడ అని కాదు.. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ రిలేట్ అయ్యే స్టోరీ. బంగారం వేట అనేది హైలైట్ అవుతున్నా ఈ కథలో స్వేచ్ఛ కోసం చేసే పోరాటం ఉంది. ఈ మూవీ చేయడం వల్ల ఆఫ్రికన్ తెగలతో పాటు ప్రపంచంలోని కొన్ని తెగలు ఎలా ఉంటాయో తెలుసుకున్నాను.

దేవర... ఓ అద్భుతమైన ప్రయాణం

- ఎన్టీఆర్



'దేవర'... ఓ అద్భుతమైన ప్రయాణం' అంటున్నారు ఎన్టీఆర్. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'దేవర'. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్. కొరటాల శివ దర్శకత్వంలో నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ సినిమా తొలి భాగంలో తన పాత్ర చిత్రీకరణ పూర్తయినట్లు ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ''దేవర' మొదటి భాగం కోసం నా చివరి షాట్‌ను ముగించాను. శివగారు రూపొందించిన ప్రపంచంలోకి మీరందరూ అడుగుపెట్టే సెప్టెంబరు 27 ('దేవర' తొలి భాగం విడుదల తేదీ) కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని పేర్కొన్నారు ఎన్టీఆర్.

ఆ వార్తలు అవాస్తవం... ''దేవర' షూటింగ్‌లో ఎన్టీఆర్ గాయపడ్డారు, రోడ్డు ప్రమాదంలో ఎన్టీఆర్‌కి గాయాలు'... అంటూ బుధవారం ఉదయం సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఆ వార్తలు అవాస్తవం అని ఎన్టీఆర్ టీమ్ స్పష్టత ఇచ్చింది. ''ఎన్టీఆర్ జిమ్‌లో కసరత్తులు చేస్తుండగా ఎడమ చేతికి రెండు రోజుల క్రితం స్వల్ప గాయమైంది. అయినప్పటికీ ఆయన 'దేవర' షూటింగ్‌లో మంగళవారం పాల్గొన్నారు. ఆయకు పెద్ద ప్రమాదం జరిగినట్టు వస్తున్న వార్తలు అవాస్తవం'' అని క్లారిటీ ఇచ్చారు.

ఆయ్ చూసి భావోద్వేగంతో బయటికొస్తారు

- అల్లు అరవింద్



● నిఖిల్, నార్నే నితిన్, అల్లు అరవింద్, శ్రీలీల, అంజి, బన్నీ వాసు

''ఆయ్' డైరెక్టర్ అంజి ఈ చిత్రకథ బాగా చెప్పాడు.. కానీ ఎలా తీస్తాడో? అనుకున్నా. అందుకు నేను గ్యారెంటీ అని బన్నీ వాసు అన్నాడు. నిజంగానే సినిమాని అద్భుతంగా తీశాడు అంజి. నేనీ సినిమా చూశాను. ప్రేక్షకులు ఓ భావోద్వేగంతో థియేటర్ నుంచి బయటికొస్తారు'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. నార్నే నితిన్, నయన్ సారిక జంటగా అంజి కె. మణిపుత్ర దర్శకత్వం వహించిన చిత్రం 'ఆయ్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హీరో నిఖిల్, హీరోయిన్ శ్రీలీల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''జాతి రత్నాలు, మ్యాడ్, బేబీ' సినిమాల్లా 'ఆయ్' కూడా బ్లాక్ బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నాను'' అన్నారు నిఖిల్. ''ఆయ్'లో మంచి వినోదం ఉందని తెలుస్తోంది. నాకు ఇలాంటి చిత్రాలంటే చాలా ఇష్టం'' అన్నారు శ్రీలీల. ''కులాలు, మతాలను మించినదే స్నేహం అనే మంచి సందేశాన్ని మా సినిమాలో ఇచ్చాం'' అని నార్నే నితిన్ చెప్పారు. ''బన్నీ (అల్లు అర్జున్) లేకపోయి ఉంటే నేను ఉండేవాణ్ణి కాదు'' అని చెప్పారు బన్నీ వాసు. ''ఆయ్'తో మాకు పైసా వసూల్.. మీకు (ఆడియన్స్) నవ్వుల వసూల్'' అని అంజి కె. మణిపుత్ర పేర్కొన్నారు.

ఉమ కథ



● సుమయా రెడ్డి

సుమయా రెడ్డి హీరోయిన్‌గా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పృథ్వీ అంబర్ హీరోగా నటించారు. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను రిలీజ్ చేశారు సుమయా రెడ్డి. ''అందమైన ప్రేమకథ, ఫ్యామిలీ, యాక్షన్ డ్రామాతో రూపొందిన చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే వాణిజ్య అంశాలున్నాయి. త్వరలోనే ఈ చిత్రం రిలీజ్ కానుంది'' అని యూనిట్ పేర్కొంది. కమల్ కామరాజు, సప్తగిరి తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: రధన్.

జీరోలో మంచి కంటెంట్ ఉంది

- తనికెళ్ల భరణి




శివాజీ రాజా, తనికెళ్ల భరణి, విజయ్ రాజా, లక్ష్మణ్ రావు


''జీరో' గ్లింప్స్ చాలా బాగుంది. ఓ హీరోకి కావాల్సిన కసి విజయ్ రాజాలో కనిపించింది. మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. డైరెక్టర్ చాలా భావోద్వేగంగా తీశాడు. నిర్మాతలు ప్యాషన్‌తో నిర్మించారు. ఈ సినిమాని అందరూ ఆదరించాలి'' అని నటుడు తనికెళ్ల భరణి అన్నారు. నటుడు శివాజీ రాజా తనయుడు విజయ్ రాజా హీరోగా లక్ష్మీ నారాయణ .సి దర్శకత్వం వహించిన చిత్రం 'జీరో'. సాయి విలా సినిమాస్‌పై ఆర్. లక్ష్మణ్ రావు, ఆర్. శ్రీను నిర్మించిన ఈ చిత్రానికి 'జీరో' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ టైటిల్ గ్లింప్స్‌ని తనికెళ్ల భరణి లాంచ్ చేశారు. శివాజీ రాజా మాట్లాడుతూ- ''జీరో' బాగా వచ్చింది. ప్రేక్షకులు మా అబ్బాయిని ఆశీర్వదించాలి'' అన్నారు. ''మా చిత్రం అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని విజయ్ రాజా చెప్పారు. ''మన క్రీడల్లో ఉండే పాజిటివ్స్, నెగటివ్స్‌ని బేస్ చేసుకొని ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్, స్పోర్ట్స్ డ్రామాగా ఈ సినిమా తీశాను'' అని లక్ష్మీనారాయణ .సి పేర్కొన్నారు. ''మా సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది'' అన్నారు ఆర్. శ్రీను, ఆర్. లక్ష్మణ్ రావు. సంగీత దర్శకుడు సాయి కార్తీక్ మాట్లాడారు.

మేరా భారత్ మహాన్

దేశం అంటే భక్తి... ప్రేమ ఉన్నవాళ్లు దేశం కోసం ప్రాణాలను వదిలేయడానికి కూడా వెనకడుగు వేయరు. 'మేరా భారత్ మహాన్' అంటూ నిజజీవితంలో ప్రాణాలను పణంగా పెట్టిన అలాంటి మహానుభావులు ఎందరో ఉన్నారు. కొందరి జీవితాల ఆదర్శంగా వెండితెరపైకి వచ్చిన సినిమాలనూ చూశాం. ప్రస్తుతం నిర్మాణంలో అలాంటి నిజ జీవిత వీరుల నేపథ్యంలో, కల్పిత పాత్రలతోనూ రూపొందుతున్న దేశభక్తి చిత్రాలు చాలా ఉన్నాయి. ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొన్ని చిత్రాల గురించి తెలుసుకుందాం.



● కమల్‌హాసన్



● నాగచైతన్య

భూతల్లిపై ఒట్టేయ్...

''భూతల్లిపై ఒట్టేయ్... తెలుగోడి వాడి చూపెట్టేయ్... తెల్లోడి నెత్తురుతోనే నీ కత్తికి పదును పట్టేయ్' అంటూ ప్రజలను చైతన్యపరిచేలా, వారిలో దేశభక్తి ఉప్పొంగేలా పాట పాడుతున్నాడు వీరశేఖరన్. ఇతని గురించి బాగా తెలిసిన వ్యక్తి సేనాపతి. ఎందుకంటే సేనాపతి తండ్రి వీర శేఖరన్. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిషర్లకు వ్యతిరేకంగా వీర శేఖరన్ (కల్పిత పాత్ర) ఏ విధంగా పోరాడాడు? అనేది వెండితెరపై 'ఇండియన్ 3' సినిమాలో చూడొచ్చు. హీరో కమల్‌హాసన్-దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఇండియన్' ('భారతీయుడు') ఫ్రాంచైజీలో త్వరలో రానున్న చిత్రం 'ఇండియన్ 3'. ఈ చిత్రంలో వీరశేఖరన్, సేనాపతి పాత్రల్లో తండ్రీకొడుకుగా కమల్‌హాసన్ కనిపిస్తారు. 1806 సమయంలో బ్రిటిషర్లకు వ్యతిరేకంగా వీర శేఖరన్ ఏ విధంగా పోరాడాడు? అతని పోరాట స్ఫూర్తితో 1940లలో సేనాపతి ఏం చేశాడు? అనే అంశాలతో 'ఇండియన్ 3' ఉంటుందని తెలుస్తోంది. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.



● శివ కార్తికేయన్





● అక్షయ్ కుమార్

భారత్ మాతా కీ జై

'తేరే పాకిస్తానీ అడ్డా మే ఘుస్ కే బతా రహా హూ... భారత్ మాతా కీ జై...' అంటూ నాగచైతన్య చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ 'తండేల్' సినిమాలోనిది. విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు జీవనోపాధి కోసం గుజరాత్ తీర ప్రాంతానికి వలస వెళ్తారు. వేటలో భాగంగా వారికి తెలియకుండానే పాకిస్తాన్ సరిహద్దుల్లోకి వెళ్తారు. పాకిస్తాన్ కోస్ట్ గార్డులు ఈ భారత మత్స్యకారులను బందీలుగా పట్టుకుని జైల్లో వేస్తారు. పాకిస్తాన్ జైల్లో వీరి పరిస్థితి ఏంటి? వీరి కుటుంబ సభ్యులు వీరి కోసం ఏమైనా పోరాటం చేశారా? అనే అంశాల నేపథ్యంలో 'తండేల్' కథనం ఉంటుందని తెలిసింది. వాస్తవ ఘటన ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో జాలరి రాజు పాత్రలో నాగచైతన్య, అతని భార్య పాత్రలో సాయి పల్లవి కనిపిస్తారు. దేశభక్తి అంశాలతో పాటు ప్రేమకథ, కుటుంబ భావోద్వేగాలు మిళితమైన ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ ఏడాదే విడుదలయ్యే అవకాశం ఉంది.

సరిహద్దు యుద్ధం

దేశభక్తి ప్రధానాంశంగా ఉన్న చిత్రాల్లో నటించేందుకు అక్షయ్ కుమార్ ఆసక్తి చూపిస్తుంటారు. ఆయన చేసిన 'బేబీ, ఎయిర్ లిఫ్ట్, 'మిషన్ మంగళ్' వంటి చిత్రాలు ఇందుకు ఓ నిదర్శనం. తాజాగా అక్షయ్ కుమార్ నటించిన చిత్రం 'స్కై ఫోర్స్'. 1965లో ఇండియా-పాకిస్తాన్‌ల మధ్య జరిగిన వార్ నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని సమాచారం. వీర్ పహారియా, నిమ్రత్ కౌర్, సారా అలీఖాన్ ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తారు. సందీప్ కెవ్లానీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం అక్టోబరు 2న రిలీజ్ కానుంది. అలాగే 1971లో ఇండియా-పాకిస్తాన్‌ల మధ్య జరిగిన వార్ నేపథ్యంలో 1997లో హిందీలో 'బోర్డర్' చిత్రం వచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో సన్నీ డియోల్ హీరోగా నటించారు. కాగా ఇటీవల సన్నీ డియోల్ 'బోర్డర్ 2'ను ప్రకటించారు. ఇంకా భారత్-పాకిస్తాన్ విడిపోయిన నాటి పరిస్థితుల నేపథ్యంలో 'లాహోర్ -1947' సినిమా కూడా చేస్తున్నారు సన్నీ డియోల్. ఇక పాకిస్తాన్ చిన్నారిని ఆమె దేశంలో విడిచి పెట్టేందుకు 'భజరంగీ భాయిజాన్' (2015)గా సల్మాన్ ఖాన్ చేసిన సాహసాలను సులభంగా మర్చిపోలేం. ఈ ఫిల్మ్‌కు సీక్వెల్ ఉంటుందని చిత్ర కథారచయిత విజయేంద్ర ప్రసాద్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

మార్టిన్... ఇండియన్

పాకిస్తాన్ ఆర్మీ మార్టిన్ అనే భారతీయుడిని క్రూరంగా శిక్షించాలనుకుంటుంది. మార్టిన్‌కు దేశభక్తి ఎక్కువ. ఎంతలా అంటే... అతని చేతిపై ఇండియన్ అనే ట్యాటూ ఉంటుంది. అసలు పాకిస్తాన్ జైల్లో మార్టిన్ ఎందుకు ఉండాల్సి వచ్చింది? అనేది కన్నడ చిత్రం 'మార్టిన్' చూస్తే తెలుస్తుంది. ధ్రువ్ సర్జా హీరోగా నటించిన చిత్రం ఇది. ఏపీ అర్జున్ దర్శకత్వం వహించిన ఈ దేశభక్తి, యాక్షన్, ఎమోషనల్ మూవీ అక్టోబరు 11న రిలీజ్ కానుంది.

అమరన్

'రమణ (తెలుగులో 'ఠాగూర్'గా రీమేక్ అయింది), తుపాకీ, కత్తి' వంటి సినిమాల్లో సామాజిక బాధ్యతతో పాటు కాస్త దేశభక్తిని కూడా మిళితం చేసి, హిట్ సాధించారు తమిళ దర్శకుడు ఏఆర్ మురుగదాస్. ప్రస్తుతం హీరో శివ కార్తికేయన్‌తో 'అమరన్' సినిమా చేస్తున్నారాయన. ఈ చిత్రంలో సైనికుడి పాత్రలో కనిపిస్తారు శివ కార్తికేయన్. సాయిపల్లవి హీరోయిన్. మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోందని టాక్. ఈ చిత్రం అక్టోబరు 31న రిలీజ్ కానుంది. అలాగే ప్రస్తుతం మురుగదాస్ హిందీలో సల్మాన్ ఖాన్‌తో చేస్తున్న 'సికందర్' కూడా దేశభక్తి నేపథ్యంలోనే ఉంటుందని టాక్.

సాక్షి బిజినెస్

గురువారం
15-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
150	5
79,106	24,144

విదేశీ సూచీలు (తొలి సెషన్ రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,510	▽	35
డోజోన్స్	39,996	▲	230
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,281	▲	46
డాక్స్	17,886	▲	73
షాంఘై	2,850	▽	17
నికాయ్	36,442	▲	209

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	70,793	▲	394
బంగారం (99.5 స్వచ్ఛత)	70,510	▲	348
వెండి (కిలో)	80,921	▲	219

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.51	84.53
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.74	109.32
€	యూరో	ఎస్‌బీఐ	91.16	93.54
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.64	57.93
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.41	56.34
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.05	66.21
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.89	12.71

పిక్సెల్ 9 సిరీస్ వచ్చేసింది..

- 4 మోడళ్లను ఆవిష్కరించిన గూగుల్
- ధర రూ.74,999 నుంచి ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ దిగ్గజం గూగుల్ పిక్సెల్ 9 సిరీస్‌ను ఆవిష్కరించింది. పిక్సెల్ 9, పిక్సెల్ 9 ప్రో, పిక్సెల్ 9 ప్రో ఎక్స్‌ఎల్, పిక్సెల్ 9 ప్రో ఫోల్డ్ వీటిలో ఉన్నాయి. ధర రూ.74,999 నుంచి ప్రారంభం. ఫోల్డ్ మోడళ్లలో తొలిసారిగా గూగుల్ నుంచి పిక్సెల్ 9 ప్రో ఫోల్డ్ భారత్‌లో ఎంట్రీ ఇస్తోంది. పిక్సెల్ 9, పిక్సెల్ 9 ప్రో ఎక్స్‌ఎల్ ఆగస్ట్ 22 నుంచి భారతీయ కస్టమర్లకు అందుబాటులోకి వస్తాయి. ప్రీ–ఆర్డర్లు ప్రారంభం అయ్యాయి. మిగిలిన రెండు మోడళ్లు సెప్టెంబర్‌లో ఎంట్రీ ఇస్తాయి. పిక్సెల్ ఫోల్డ్ ధర రూ.1,72,999 ఉంది. పిక్సెల్ 9 సిరీస్‌లో జెమిని అనేక ప్రత్యేక ఫీచర్లు ఉన్నాయని కంపెనీ తెలిపింది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్–2 రక్షణతోపాటు మోడల్‌నుబట్టి ఇంటర్నల్ మెమరీ 1 టీబీ వరకు ఉంది. కాగా, కొత్త సిరీస్ రాకతో పిక్సెల్ 8, పిక్సెల్ 7 సిరీస్ ధరలను వేరియంట్‌నుబట్టి రూ.7,000 వరకు గూగుల్ తగ్గించింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరులో గూగుల్ వాకిన్ సెంటర్స్ రానున్నాయి. పిక్సెల్ 8 సిరీస్ ఫోన్లను భారత్‌లో తయారు చేస్తున్నట్టు కంపెనీ ఇప్పటికే ప్రకటించింది.



టోకు ధరలూ తగ్గాయ్..

- జూలైలో ద్రవ్యోల్బణం 2.04 శాతం
- మూడు నెలల కనిష్ట స్థాయి
- శాంతించిన కూరగాయల ధరలు



న్యూఢిల్లీ: కూరగాయల ధరలు గణనీయంగా దిగిరావడంతో, జూలై మాసంలో టోకు ద్రవ్యోల్బణం (హోల్‌సేల్) 2.04 శాతానికి క్షీణించింది. అంతకుముందు జూన్ వరకు వరుసగా నాలుగు నెలల పాటు టోకు ధరల ఆధారిత సూచీ (డబ్ల్యూపీఐ/టోకు ద్రవ్యోల్బణం) వరుసగా పెరగడం గమనార్హం. జూన్ నెలకు ఇది 3.36 శాతంగా ఉంది. క్రితం ఏడాది జూలై నెలలో టోకు ద్రవ్యోల్బణం మైనస్ 1.23 శాతంగా నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇది 1.19%గా ఉంది. జూలై నెలలో ఆహార విభాగం ద్రవ్యోల్బణం 3.45%కి పరిమితమైంది. జూన్‌లో నమోదైన 10.87% స్థాయి నుంచి గణనీయంగా తగ్గింది. కూరగాయలు, పప్పులు, ఉల్లిపాయల ధరలు తగ్గడం ఆహారద్రవ్యోల్బణం శాంతించేందుకు సహకరించింది. కూరగాయల ధరలకు సంబంధించి ద్రవ్యోల్బణం జూన్‌లో 38.76% స్థాయిలో ఉంటే, జూలై నెలలో మైనస్ 8.93%కి (డిఫ్లేషన్) పడిపోయింది. తయారీ ఉత్పత్తుల వార్షిక ద్రవ్యోల్బణ రేటు జూన్ నెలలో ఉన్న 1.43 శాతం నుంచి జూలైలో 1.58 శాతానికి పెరిగింది. 'ఆహార తయారీ మినహా టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం వరుసగా ఐదో నెలలోనూ పెరిగింది. క్రితం నెలతో పోల్చితే తగ్గినప్పటికీ.. జూలైలో 17 నెలల గరిష్ట స్థాయిలో 1.2%గా నమోదైంది'అని ఇక్రా సీనియర్ ఆర్థికవేత్త రాహుల్ అగర్వాల్ తెలిపారు.

ఐటీ షేర్ల అండతో..



- రెండురోజుల నష్టాలకు చెక్
- 150 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు సెప్టెంబర్‌లో వడ్డీరేట్లను తగ్గించవచ్చనే ఆశలతో ఐటీ షేర్లు రాణించాయి. ఫలితంగా దేశీయ స్టాక్ సూచీలు బుధవారం రెండు రోజుల నష్టాల నుంచి తేరుకున్నాయి. సెన్సెక్స్ 150 పాయింట్లు పెరిగి 79,106 వద్ద స్థిరపడింది. నిఫ్టీ అయిదు పాయింట్ల లాభంతో 24,144 వద్ద ముగిసింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో లాభ, నష్టాల మధ్య ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 333 పాయింట్ల మధ్య 78,896–79,229 శ్రేణిలో కదలాడింది. ఐటీతో పాటు కన్జూమర్ డ్యూరబుల్స్, కన్జూమర్ డిస్క్రీషనరీ షేర్లూ రాణించాయి. కమోడిటీ, ఇంధన, టెలికం, యుటిలిటీ, మెటల్, విద్యుత్, రియల్టీ, సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ప్రొడ్యూసర్ ప్రైజ్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ డేటా అంచనాలకు తగ్గట్లు వెలువడంతో సెప్టెంబర్‌లో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- ఖనిజాలు, గనులపై రాష్ట్రాలకు రాయల్టీ విధించే హక్కు ఉందంటూ సుప్రీం కోర్టు స్పష్టం చేయడంతో మైనింగ్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. హిందుస్థాన్ కాపర్ 4%, ఎంఓఐఎల్ 3.50%, కోల్ ఇండియా, నాల్కో 3% చొప్పున క్షీణించాయి. సెయిల్ 2%, టాటా స్టీల్ 2%, నష్టపోయాయి.
- తొలి త్రైమాసికంలో నికరలాభం 121% వృద్ధి నమోదు మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ షేరుకు డిమాండ్ లభించింది. బీఎస్ఈలో 3.50% పెరిగి రూ.4997 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

జూలైలో ఎగుమతులు డౌన్	హిందుస్థాన్ జింక్ ఓఎఫ్ఎస్ షేరు ధర రూ. 486

ఐటీ కొలువులు.. చిగురిస్తున్న ఆశలు!

ఐటీ రంగం ఉద్యోగాల విషయంలో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికం (2023–24, క్యూ1)లో వరుసగా ఏడో క్వార్టర్లోనూ టాప్–5 ఐటీ దిగ్గజాల మొత్తం సిబ్బంది సంఖ్య తగ్గింది. అయితే, గతంతో పోలిస్తే తగ్గుదల జోరుకు భారీగా అడ్డుకట్ట పడటం సానుకూలాంశం. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరికల్లా మళ్లీ ఐటీ రంగం పెరిగిన ఉద్యోగులతో కళకళలాడే పరిస్థితి వస్తుందంటున్నారు పరిశ్రమ విశ్లేషకులు.



- వరుసగా ఏడో క్వార్టర్లోనూ తగ్గిన ఐటీ బిగ్–5 సిబ్బంది సంఖ్య
- తగ్గుదల జోరుకు అడ్డుకట్టపడటం ఊరట
- టీసీఎస్, విప్రో, టెక్ మహీంద్రాకు క్యూ1లో ప్లస్
- ట్రెండ్ రివర్స్ అవుతుందంటున్న విశ్లేషకులు

టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా... దేశీ ఐటీ రంగంలో ఇవి టాప్–5 కంపెనీలు. ఈ ఆర్థిక సంవత్సరం క్యూ1లో వీటి మొత్తం సిబ్బంది సంఖ్య సీక్వెన్షియల్‌గా (గతేడాది క్యూ4తో పోలిస్తే) 2,034 మంది తగ్గారు. అయితే, టీసీఎస్, విప్రో, టెక్ మహీంద్రా.. ఈ మూడు దిగ్గజాలు మాత్రం ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో నికరంగా ఉద్యోగులను జత చేసుకోవడం విశేషం. 'గడిచిన ఐదు క్వార్టర్లలో ఉద్యోగుల తగ్గుదల జోరుకు క్రమంగా అడ్డుకట్ట పడటం సానుకూల పరిణామం' అని హైరింగ్ కంపెనీ ఎక్స్‌ఫెనో బిజినెస్ హెడ్ (టెక్నాలజీ సిబ్బంది నియామకాలు) దీప్తి ఎస్ పేర్కొన్నారు. టాప్–5లో మూడు దిగ్గజ సంస్థలు క్యూ1లో నికరంగా ఉద్యోగులను జత చేసుకోవడంతో నియామకాల రికవరీ ఆశలు చిగురిస్తున్నాయని, ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఐటీ పరిశ్రమ మళ్లీ కొత్త ఉద్యోగుల చేరికలతో కళకళలాడే అవకాశం ఉందని కూడా ఆమె అంచనా వేస్తున్నారు.

హైరింగ్‌పై ఆర్థిక అనిశ్చితి ఎఫెక్ట్...

దేశీ ఐటీ కంపెనీలకు ప్రధాన మార్కెట్లయిన అమెరికా, యూరప్‌లలో ఆర్థిక అనిశ్చితి కొనసాగుతుండటంతో గత ఏడాదిన్నరగా హైరింగ్‌కు ముఖం చాటేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఉద్యోగాల్లో కోతలకు కూడా తెరతీశాయి. అయితే, ఈ ఆర్థిక సంవత్సరం క్యూ1 ఫలితాల్లో ఈ ప్రతికూల పరిస్థితులు సద్దుమణుగుతున్న సంకేతాలు వెలువడ్డాయి. టాప్–5 కంపెనీల మొత్తం సిబ్బంది సంఖ్య ఈ జూన్ నాటికి 15,23,742కు చేరింది. మార్చి చివరికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 15,25,776గా నమోదైంది. టీసీఎస్ సిబ్బంది 6,06,998కి చేరింది. కొత్తగా 5,452 మంది జతయ్యారు. ఇన్ఫోసిస్ ఉద్యోగుల సంఖ్య 3.15 లక్షలకు చేరింది. 1,908 మంది తగ్గారు.

2,034
టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా మొత్తం ఉద్యోగుల సంఖ్య క్యూ1లో సీక్వెన్షియల్‌గా తగ్గుదల.


15,23,742
ఈ ఏడాది జూన్ (క్యూ1) చివరి నాటికి ఈ బిగ్5 కంపెనీల మొత్తం సిబ్బంది సంఖ్య 15,23,742.

5
గడిచిన ఐదు త్రైమాసికాలుగా సిబ్బంది తగ్గుదల క్రమంగా శాంతించడం సానుకూలాంశం.

హెచ్‌సీఎల్ టెక్‌లో దాదాపు 8,000 మంది తగ్గుదలతో మొత్తం సిబ్బంది 2.27 లక్షలకు చేరారు. విప్రోలో ఉద్యోగుల సంఖ్య క్యూ1లో స్వల్పంగా 337 మంది పెరిగి 2.34 లక్షలకు చేరింది. టెక్ మహీంద్రాకు నికరంగా 2,165 మంది జతకావడంతో మొత్తం ఉద్యోగులు 1.47 లక్షలకు పెరిగారు. అయితే, గతేడాది క్యూ1 నాటి సిబ్బంది సంఖ్యతో పోలిస్తే బిగ్–5 కంపెనీల్లో 46,325 మంది ఉద్యోగులు తగ్గారు. గడిచిన రెండేళ్లలో టాప్–5 కంపెనీల మొత్తం ఉద్యోగుల సంఖ్య 3 శాతం తగ్గగా... అంతక్రితం మూడేళ్ల కాలంతో పోలిస్తే 18 శాతం పెరిగారని దీప్తి తెలిపారు. ఐటీ హైరింగ్ విషయంలో సాధారణ స్థాయికి రావడానికి మరి కొన్నాళ్లు పట్టే అవకాశం ఉన్నప్పటికీ, తాజా గణాంకాలు ఆశాజనకంగా ఉన్నాయని ఆమె చెబుతున్నారు.

ఫ్రెషర్లకు చాన్స్..

ఐటీ రంగంలో ఫ్రెషర్ల హైరింగ్ భారీగా పుంజుకోనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 15,000–20,000 మంది ఫ్రెషర్లను నియమించుకునే అవకాశం ఉందని ఇన్ఫోసిస్ క్యూ1 ఫలితాల సందర్భంగా ప్రకటించింది. విప్రో సైతం 10,000–12,000 మందికి ఈ ఏడాది ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొంది. ప్రధానంగా జెనరేటివ్ ఏఐ, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ విభాగాల్లో కూడా అదనంగా ఉద్యోగులను తీసుకోనున్నట్లు కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. క్యూ1లో 3,000 మంది ఫ్రెషర్లకు (న్యూ జెన్ అసోసియేట్స్) అవకాశం ఇచ్చినట్లు తెలిపింది. ఇక హెచ్‌సీఎల్ టెక్ కొత్తగా 10,000 మంది ఫ్రెషర్లకు ఉద్యోగాలిస్తామని ప్రకటించింది. టీసీఎస్ సైతం క్యాంపస్ హైరింగ్‌పై దృష్టిపెడుతోంది. మొత్తంమీద ఈ ఐటీ పరిశ్రమ ఫ్రెష్ హైరింగ్ 1,00,000–1,20,000 స్థాయిలో ఉండొచ్చని హెచ్ఆర్ కన్సల్టెన్సీ ఎక్స్‌ఫెనో అంచనా. గతేడాది 60,000 స్థాయితో పోలిస్తే ఇది భారీగానే లెక్క.



– సాక్షి, బిజినెస్ డెస్క్

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సర్కారీ బ్యాంకులో స్పెషలిస్ట్ ఆఫీసర్!

ప్రొఫెషనల్ కోర్సుల ఉత్తీర్ణులకు చక్కటి అవకాశం! ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో.. స్పెషలిస్ట్ ఆఫీసర్ కొలువు స్వాగతం పలుకుతోంది. ప్రభుత్వ బ్యాంకింగ్ నియామక సంస్థ ఐబీపీఎస్.. తాజాగా 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొత్తం 896 స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడు దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. నియామకం ఖరారవుతుంది. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ ఎస్‌ఓ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర సమాచారం..

» ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 896 ఎస్‌వో పోస్టులు
» నోటిఫికేషన్ విడుదల చేసిన ఐబీపీఎస్
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ



మొత్తం పోస్టులు 896

ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారు బ్యాంకు ఉద్యోగాల పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి వారికి ఐబీపీఎస్ ఎస్‌ఓ నోటిఫికేషన్ చక్కటి అవకాశం. సంబంధిత అర్హతలు ఉన్నవారు సరైన వ్యూహంతో ప్రిపరేషన్ సాగిస్తే స్పెషలిస్ట్ ఆఫీసర్ కొలువు సొంతం చేసుకోవచ్చు. మొత్తం 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 896 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఐబీపీఎస్ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్,లా,అగ్రికల్చర్ అనుబంధ కోర్సుల్లో యూజీ,పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు.
- **వయసు:** అన్ని పోస్టులకు ఆగస్ట్ 1, 2024 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. గరిష్ట వయో పరిమితిలో ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీ (నాన్–క్రీమీ లేయర్) వర్గాల వారికి మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులకు మూడు దశలలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ. ప్రిలిమినరీ పరీక్షను లా ఆఫీసర్, రాజ్ భాష అధికారి పోస్టులకు, ఇతర పోస్టులకు వేర్వేరుగా నిర్వహిస్తారు.

లా ఆఫీసర్, రాజ్ భాష అధికారి ప్రిలిమినరీ

ఈ పరీక్షలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 50 ప్రశ్నలు–25 మార్కులు, రీజనింగ్ 50 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు బ్యాంకింగ్ ఇండస్ట్రీ 50 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటాయి. మొత్తంగా 150 ప్రశ్నలు–125 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం రెండు గంటలు.

ఇతర పోస్టులకు ప్రిలిమ్స్ ఇలా

ఐటీ ఆఫీసర్, అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్, హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్ పోస్టులకు జరిపే ప్రిలిమ్స్ పరీక్షలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 50 ప్రశ్నలు–25 మార్కులకు, రీజనింగ్ 50 ప్రశ్నలు–50 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 50 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 120 నిమిషాలు. రెండు రకాల పరీక్షలు పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ మినహా మిగతా విభాగాలకు ఇంగ్లిష్ లేదా హిందీ మీడియంలలో హాజరుకావచ్చు.

రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్

- ప్రిలిమినరీ పరీక్షలో ప్రతిభ చూపిన వారిని మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు. రాజ్ భాష అధికారి పోస్టులకు నిర్వహించే మెయిన్ పరీక్ష ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో, మిగతా పోస్టులకు జరిగే మెయిన్ ఎగ్జామ్ ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటాయి.
- రాజ్ భాష అధికారి మెయిన్ ఎగ్జామినేషన్‌లో ప్రొఫెషనల్ నాలెడ్జ్‌పై 45 ప్రశ్నలతోపాటు డిస్క్రిప్టివ్ విధానంలో మరో 2 ప్రశ్నలు ఉంటాయి. రెండింటికి కలిపి పరీక్ష సమయం ఒక గంట. రెండు విభాగాలకు సంబంధించి మొత్తం 60 మార్కులకు పరీక్ష ఉంటుంది. డిస్క్రిప్టివ్ విభాగానికి సంబంధించి అభ్యర్థులు ఇంగ్లిష్ లేదా హిందీ మీడియంలో ఒక ఎస్సే రైటింగ్, ఒక లెటర్ రైటింగ్ రాయాల్సి ఉంటుంది.
- ఐటీ ఆఫీసర్, లా ఆఫీసర్, అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్, హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించే మెయిన్ పరీక్షలో ప్రొఫెషనల్ నాలెడ్జ్‌పై 60 ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 45నిమిషాలు.
- ప్రిలిమ్స్, మెయిన్స్ రెండు పరీక్షల్లోనూ నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 కోత విధిస్తారు.

చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ

ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షల్లో పొందిన మార్కుల ఆధారంగా ఖాళీలను అనుసరించి.. మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. మొత్తం 100 మార్కులకు జరిగే పర్సనల్ ఇంటర్వ్యూలో అభ్యర్థులకు బ్యాంకింగ్ రంగంపై ఉన్న ఆసక్తి, ఈ రంగంలో తాజా పరిణామాలపై అవగాహన, వ్యక్తిగత దృక్పథం, వైఖరి వంటి అంశాలను పరిశీలిస్తారు.

80 : 20 వెయిటేజీ విధానం

తుది జాబితా రూపకల్పనలో మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూలలో పొందిన మార్కులకు 80 : 20 నిష్పత్తిలో వెయిటేజీ విధానాన్ని అనుసరించి విజేతలను ఖరారు చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఆగస్ట్ 21.
- ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 2024,నవంబర్‌లో నిర్వహించే అవకాశం
- ఆన్‌లైన్ మెయిన్ ఎగ్జామ్ తేదీ: 2024, డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం.
- పర్సనల్ ఇంటర్వ్యూలు: 2025, ఫిబ్రవరి/మార్చిలో జరిగే అవకాశం.
- వెబ్‌సైట్: www.ibps.in/index.php/specialisto-fficer-sxiv

రాత పరీక్షలో రాణించేలా

బ్యాంకు పరీక్షలంటేనే తీవ్రమైన పోటీ నెలకొంటుంది. స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అందుకు తగ్గట్టుగా పటిష్ట ప్రణాళికతో సమగ్ర ప్రిపరేషన్ సాగించాలి.వేగంతోపాటు కచ్చితత్వంపై దృష్టిపెట్టాలి.అప్పుడే విజయావకాశాలు మెరుగవుతాయి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే..బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

రీజనింగ్

ఇందులో సిరీస్, అనాలజీ, కోడింగ్–డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై ఫోకస్ చేయాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ అవేర్‌నెస్

లా ఆఫీసర్, రాజ్‌భాష అధికారి పోస్టుల ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో ఉండే విభాగం ఇది. జనరల్ అవేర్‌నెస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు బ్యాంకింగ్ ఇండస్ట్రీ అని స్పష్టంగా పేర్కొన్నారు. కాబట్టి ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో పరిణామాలు,బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. బ్యాంకింగ్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

మెయిన్ పరీక్షలో ఉండే ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగంలో అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు అభ్యర్థులు తమ బ్యాచిలర్, పీజీ స్థాయి అకడెమిక్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అవగాహన చేసుకోవాలి. ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

విద్య, ఉద్యోగ సమాచారం


ఐటీబీపీలో 202 కానిస్టేబుల్ (పయనీర్) పోస్టులు

ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ) వివిధ విభాగాల్లో కానిస్టేబుల్ (పయనీర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 202
- **పోస్టుల వివరాలు:** కానిస్టేబుల్(కార్పెంటర్)(పురుషులు)–61, కానిస్టేబుల్ (కార్పెంటర్)(మహిళలు)–10, కానిస్టేబుల్(ప్లంబర్) (పురుషులు)–44, కానిస్టేబుల్(ప్లంబర్) (మహిళలు)–08, కానిస్టేబుల్(మేసన్)(పురుషులు)–54, కానిస్టేబుల్(మేసన్)(మహిళలు)–10, కానిస్టేబుల్(ఎలక్ట్రీషియన్) (పురుషులు)–14, కానిస్టేబుల్(ఎలక్ట్రీషియన్) (మహిళలు)–01.
- **అర్హత:** మెట్రిక్యులేషన్/పదో తరగతితో పాటు ఐటీఐ (మేసన్/కార్పెంటర్ /ప్లంబర్/ఎలక్ట్రీషియన్ ట్రేడ్) ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలి.
- **వయసు:** 10.09.2024 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** నెలకు రూ.21,700 నుంచి 69,100.
- **ఎంపిక విధానం:** ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), రాత పరీక్ష, ఒరిజనల్ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. జనరల్ ఇంగ్లిష్(20 ప్రశ్నలు–20 మార్కులు), జనరల్ హిందీ(20 ప్రశ్నలు–20 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(20 ప్రశ్నలు–20 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్(20 ప్రశ్నలు–20 మార్కులు), సింపుల్ రీజనింగ్(20 ప్రశ్నలు–20 మార్కులు) సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 12.08.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.09.2024
- **వెబ్‌సైట్:** https://recruitment.itbpolice.nic.in.



ఇబ్రహీంపూర్ గ్రామం. (ఇన్‌సెట్లో) ఇంకుడు గుంత

ఇంటింటా ఇంకుడు గుంతల..
ఇబ్రహీంపూర్

- ఆదర్శంగా నిలుస్తున్న సిద్దిపేట జిల్లాలోని గ్రామం
- గ్రామస్తుల సమష్టి కృషితో జల సంరక్షణ.. దుర్వాసన, దోమలకు చెక్

కరువు నుంచి విముక్తి

సాక్షి, సిద్దిపేట: ఊరు ఏదైనా ఎండాకాలం వస్తే.. నీటి కోసం ఎంతో కొంత కరువు ఖాయం, డ్రైనేజీలతో మురికి పారడమూ మామూలే. కానీ సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ మాత్రం ఇందుకు విభిన్నం. కావాల్సినంతగా భూగర్భ జలాలు ఉన్నాయి. రోడ్లపై మురుగు నీరు, దుర్వాసన, దోమల వంటి వాటి జాడే లేదు. అదెలా సాధ్యమైంది? జల సంరక్షణ కోసమని ఇంటింటా కచ్చితంగా ఇంకుడు గుంతలు నిర్మించడం.. ఇళ్లలో వెలువడే నీరంతటినీ వాటిల్లోకి మళ్లించడంతోనే.. ఇబ్రహీంపూర్‌లో 336 ఇళ్లుండగా, జనాభా 1,224 మంది. గ్రామస్తులంతా ఏకతాటిపై ఉంటారు. 2013లో ఇబ్రహీంపూర్ ప్రజలు సర్పంచ్‌గా కుంబాల లక్ష్మీరాఘవరెడ్డిని, వార్డు సభ్యులందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2014లో అప్పటి మంత్రి హరీశ్‌రావు ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాన్ని మొదలుపెట్టారు.

ఒక ఇంకుడు గుంతతో మొదలై..

గ్రామంలో 2015లో మొదటి ఇంకుడు గుంతను నిర్మించారు. తర్వాత మరో నాలుగు ఇళ్లలో కట్టారు. ఆ ఇళ్లలో వినియోగించిన నీటిని, వాన నీటిని ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా పైపులు ఏర్పాటు చేశారు. దీనివల్ల డ్రైనేజీలు, మురికినీటి బాధలేకుండా పోతుందని గుర్తించి.. ఇంటింటికీ ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. ఇప్పటివరకు 292 ఇళ్లలో ఏర్పాటు చేశారు. దీనితో గ్రామంలో భూగర్భ జలాలు పెరిగాయి. బావులు, బోర్లలో నీటికి ఢోకా లేకుండా పోయింది. ఇదేకాదు.. హరితహారంలో ఒక్కరోజే 2.1 లక్షల మొక్కలను నాటడం, 100 శాతం ఇంటి పన్నులు చెల్లించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ఇంటింటికి మరుగుదొడ్ల నిర్మాణం వంటివీ ఈ గ్రామానికి పేరు తెచ్చాయి. జాతీయ, రాష్ట్రస్థాయిలో అవార్డులూ వచ్చాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు ఈ గ్రామాన్ని సందర్శించి ప్రశంసించారు. ''గ్రామస్తులందరం ఐకమత్యంతో ముందుకు సాగుతున్నాం. 2013కు ముందు గ్రామానికి బస్సు సౌకర్యం, ఆస్పత్రి లేవు. పాలకవర్గం ఏకగ్రీవం అయ్యాక అభివృద్ధి బాట పట్టాం. ఊరు అందంగా మారింది..'' అని స్థానికులు ఎల్లారెడ్డి, రాజమణి తెలిపారు.



రామప్ప గుడికి త్రివర్ణార్చన

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం రామప్ప దేవాలయాన్ని బుధవారం రాత్రి కేంద్ర పురావస్తుశాఖ అధికారులు త్రివర్ణ కాంతులీనే విద్యుద్దీపాలతో అలంకరించారు. సుమారు రెండు కిలోమీటర్ల వరకు మూడు రంగుల విద్యుద్దీపాలు కాంతులీనుతుండడంతో రామప్ప గుడి మెరిసిపోతోంది. - వెంకటాపురం(ఎం)



సాగర్.. రెండు గేట్లు.. మూడు రంగులు

సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులకు చేరడంతో బుధవారం సాయంత్రం రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువ కృష్ణానదిలోకి 16,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యామ్‌ను బుధవారం రాత్రి అధికారులు మూడు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. - నాగార్జునసాగర్

డ్రగ్స్.. డోర్ డెలివరీ

కస్టమర్ల ఆర్డర్ మేరకు కారులో నేరుగా సరఫరా • గుట్టురట్టు చేసిన హెచ్- న్యూ అధికారులు

కటకటాల్లోకి నైజీరియన్ సహా ముగ్గురు • రూ.కోటి విలువైన ఆరు రకాల డ్రగ్స్ సీజ్

సాక్షి, హైదరాబాద్ : బెంగళూరులో స్థిరపడిన నైజీరియన్ సప్లయర్‌గా మారగా..మధ్యప్రదేశ్ నుంచి వచ్చి రాజేంద్రనగర్‌లో ఉంటున్న కారు డ్రైవర్, అతడి సోదరుడు పెడ్లర్, డెలివరీబాయ్ అవతారమెత్తారు. ఇలా ఈ ముగ్గురూ కలిసి ఓ కారులో తిరుగుతూ నగరవ్యాప్తంగా వివిధ రకాల డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. ఈ దందాపై సమాచారం అందుకున్న హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) వలపన్ని వారిని పట్టుకుందని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.1.1 కోటి విలువైన ఆరు రకాలైన మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్.సుధీంద్ర, బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డితో కలిసి బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.



విలేకరులతో మాట్లాడుతున్న హైదరాబాద్ పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

ఫుట్‌బాల్ ప్లేయర్‌గా అడుగుపెట్టి...

నైజీరియాకు చెందిన ఒఫోజో సండే ఎజోకా అలియాస్ ఫ్రాంక్ అక్కడే కెమికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా చేశాడు. 2016లో స్పోర్ట్స్ వీసాపై ఢిల్లీకి వచ్చాడు. కొన్నాళ్లు ఆల్‌స్టార్స్ ఆఫ్రికన్ స్పోర్ట్స్ క్లబ్ తరఫున ఫుట్‌బాల్ ఆడాడు. 2018లో తన మకాం బెంగళూరుకు మార్చి ఫుట్‌బాల్ ఆటగాడిగా కొనసాగాడు. ఈ మ్యాచ్‌ల ద్వారా వచ్చే డబ్బు ఖర్చులకు సరిపోక ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాడు. అదే సమయంలో బెంగళూరు కేంద్రంగా మాదకద్రవ్యాల దందా చేస్తున్న మరో నైజీరియన్‌తో పరిచయమైంది. అతడి సలహాతో డ్రగ్ సప్లయర్‌గా మారిన ఎజోకా ఆ నగరంతోపాటు హైదరాబాద్‌లోనూ పలువురికి మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నాడు. బెంగళూరులో వీటిని తక్కువ రేటుకు ఖరీదు చేసి వివిధ నగరాల్లో ఉన్న పెడ్లర్స్‌కు ఎక్కువ రేటుకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు.

దందాలో దిగిన అన్నాతమ్ముడు

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన అన్స్‌ఖాన్ తన తండ్రి మరణానంతరం 2022లో హైదరాబాద్ వచ్చి రాజేంద్రనగర్‌లో స్థిరపడ్డాడు. తొలినాళ్లలో మెకానిక్స్ వద్ద కార్లు పికప్–డెలివరీ చేసే డ్రైవర్‌గా పనిచేశాడు. డ్రగ్స్ వినియోగానికి అలవాటు పడిన ఇతగాడు 2023లో కోల్‌కతాకు చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. ఆమె కూడా మాదకద్రవ్యాలకు బానిస కావడంతో నైజీరియన్ల నుంచి డ్రగ్స్ ఖరీదు చేయడం మొదలెట్టాడు. అలా ఎజోకాను పరిచయం చేసుకుని, తానే పెడ్లర్‌గా మారాడు. డిమాండ్‌ను బట్టి ఆయా డ్రగ్స్ సరఫరా చేయాల్సిందిగా అన్స్ ఆర్డర్ ఇచ్చేవాడు. ఆ ప్రకారం ఎజోకా నగరానికి వచ్చి డెలివరీ చేసి వెళ్లేవాడు. తనకు పరిచయస్తులపైన వినియోగదారుల నుంచి సందేశాలు, వాయిస్ మెసేజ్‌ల ద్వారా ఆర్డర్ తీసుకునే అన్స్ ఆయా డ్రగ్స్‌ను నేరుగా వారి చేతికే ఇచ్చి నగదు తీసుకునేవాడు. పోలీసు నిఘాకు చిక్కకుండా జాగ్రత్త పడ్డాడు. ఈ దందాలోకి అన్స్ తన సోదరుడు సైఫ్‌ఖాన్‌ను కూడా దింపాడు. అతడిని డెలివరీ బాయ్‌గా మార్చాడు. కారులో అన్ని రకాలైన మాదకద్రవ్యాలు పెట్టుకొని తిరిగే సైఫ్..అన్న సూచనల మేరకు వినియోగదారుల వద్దకు వెళ్లేవాడు. వారి ఆర్డర్, అవసరాన్ని బట్టి తన వద్ద ఉండే వేయింగ్ మిషన్‌తో తూకం వేసి అందించడంతోపాటు నగదు తీసుకునేవాడు. వీరి దందాపై హెచ్–న్యూకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్, జీఎస్.డానియేల్, ఎస్సై సి.వెంకటరాములు తమ బృందాలతో బంజారాహిల్స్ వద్ద వలపన్నారు. డ్రగ్ తీసుకొచ్చిన ఎజోకాతో పాటు అన్స్, సైఫ్‌లను పట్టుకొని కారు స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద ఉన్న 36 గ్రాముల కొకైన్, 140 గ్రాముల ఎండీఎంఏ, 32 గ్రాముల చెరస్, 41 గ్రాములు ఎంఊఓడబ్ల్యూ, 9 ఎక్స్‌టసీ పిల్స్, ఆరు ఎల్ఎస్‌డీ బోల్ట్స్‌తోపాటు వేయింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. హెచ్–న్యూ బృందానికి కొత్వాల్ రూ.3 లక్షల రివార్డు అందించారు. తదుపరి చర్యల నిమిత్తం కేసును బంజారాహిల్స్ ఠాణాకు అప్పగించారు.



రక్షాబంధన వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

యాదాద్రిలో పవిత్రోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం పవిత్రోత్సవాలకు అర్చకులు అంకురార్పణ చేశారు. ఉదయం ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీస్వామివారికి తిరుమంజన సేవ చేపట్టారు. రాత్రి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ హోమం, కుంభస్థాపన, మంత్ర పుష్ప నీరాజనంతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి సహస్రనామార్చన చేశారు.



రూపుమారి'నది'

ఈ చిత్రంలో కనిపించే పచ్చని ఆకులు కొత్త రకం పంట కాదు. పారు తున్న మంజీరా వాగు. సింగూరు ప్రాజెక్టు నుంచి నీళ్లు వదలడంతో.. నీటి ప్రవాహానికి గుర్రపుడెక్క కొట్టుకొచ్చి మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కు ల్ శివారులోని వంతెన కింద నిలిచింది. వంతెనపై నుంచి చూస్తే మంజీరా వా గు ఎండిపోయిందా?.. పిచ్చి మొక్కలు మొలిచాయా? అన్నట్టుందీ దృశ్యం.
– చిలప్‌చెడ్ (నర్సాపూర్)

అమల్లోకి వచ్చిన స్కిల్స్ యూనివర్సిటీ చట్టం

సాక్షి, హైదరాబాద్: ది యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బిల్లును రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం ఆమోదించారు. ఆ వెంటనే రాష్ట్ర న్యాయశాఖ బిల్లును చట్టరూపంలో అమల్లోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



విద్యార్థులు కావలెను

ముత్తారం (మంథని): పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కేవలం ఇద్దరు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. ఇందులో మండల సూర్య అనే విద్యార్థి మూడో తరగతి, ఒంటల శివసాయి అనే విద్యార్థి ఒకటో తరగతి చదువుతున్నారు. ఉపాధ్యాయుడు ముత్త సతీశ్ వారికి విద్యాబోధన చేస్తున్నారు. గ్రామంలో ఐదేళ్లకు పైగా వయసున్న 18 మంది విద్యార్థులున్నారు. వీరు స్థానిక, ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. ఇటీవలి వరకు ఒక్క విద్యార్థే తమ పాఠశాలలో ఉండగా, గత జూలైలో మరో విద్యార్థిని చేర్పించామని ఉపాధ్యాయుడు సతీశ్ తెలిపారు. సర్కారు బడి కావడంతో పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదని ఆయన వాపోయారు.



అంత్యక్రియలకు అవస్థలు..

సరైన రహదారి లేక మృతదేహాన్ని మంచంపై మోసుకెళ్లిన గ్రామస్తులు

దుమ్ముగూడెం: చనిపోయిన వ్యక్తికి సగౌరవంగా వీడ్కోలు పలకాలని అందరూ భావిస్తారు. కానీ ఇక్కడ మాత్రం కనీసం పాడెను భుజాలపై మోసే పరిస్థితి లేక మృతదేహాన్ని మంచంలో పెట్టి మోసుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నడికుడి జీపీ పరిధి నందులచెలక గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లే రహదారి బురదమయమై అధ్వానంగా తయారైంది. అడుగుతీసి మళ్లీఅడుగువేయడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన సోయం రామమ్మ బుధవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పాడెపై తీసుకెళ్లడం సాధ్యపడలేదు. దీంతో గ్రామస్తులు ఆమె మృతదేహాన్ని మంచంపై పెట్టి నాలుగు దిక్కులా భుజాలపై మోస్తుండగా మరొకరు మధ్యలో తల ఆదరువుగా పెట్టి శ్మశానవాటికకు తీసుకెళ్లారు. తమకు ఇలాంటి ఇబ్బందులను తప్పించడానికి ఇక్కడి రహదారిని పక్కాగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

డెంగీకి రెండేళ్లలో టీకా!

మూడో దశ ప్రయోగాలు షురూ!

10,335 మందిని పరిశీలించనున్న ఐసీఎంఆర్, పాన్ ఆసియా

పూర్తిగా స్వదేశీ టెక్నాలజీలతో అభివృద్ధి



సాక్షి, హైదరాబాద్: సీజన్ మారిందంటే ప్రజలను బెంబేలెత్తించే డెంగీ వ్యాధికి చెక్ పడే అవకాశం కన్పిస్తోంది. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), పాన్ ఆసియా బయోటెక్ కంపెనీలు కలిసికట్టుగా తయారు చేస్తున్న టీకా 'డెంగీఆల్' కీలకమైన మూడో దశ ప్రయోగాలకు సిద్ధమైంది. ఈ దశలోనూ ఆశించిన ఫలితాలు వస్తే టీకా అందుబాటులోకి రావడమే తరువాయి అవుతుంది. ఈ టీకా తయారీ ప్రక్రియ యావత్తూ దేశీయంగానే జరిగిందని, డెంగీపై పోరాటంలో టీకా అభివృద్ధి కీలక మలుపు అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం: నడ్డా

ఏదైనా వ్యాధి నివారణకు అభివృద్ధి చేసే టీకా మూడు దశల ప్రయోగాలను విజయవంతంగా పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే పాన్ ఆసియా బయోటెక్ డెంగీఆల్‌పై ఇప్పటివరకు రెండు దశల ప్రయోగాలను పూర్తి చేసింది. తాజాగా బుధవారం హరియాణాలోని రోహతక్‌లో ఉన్న పండిట్ భగవత్ దయాళ్ శర్మ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మూడో దశ ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ.. డెంగీఆల్ మూడో దశకు చేరుకోవడం ప్రజారోగ్య సంరక్షణపై ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. పూర్తిగా స్వదేశీ టెక్నాలజీల సాయంతో ఈ టీకాను అభివృద్ధి చేయడం ఆరోగ్య రంగంలో ఆత్మ నిర్భర్ భారత్‌కు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.

కోవిడ్‌కు ముందే రెండు దశలు పూర్తి

డెంగీ వ్యాధికి ప్రస్తుతం ఎలాటి టీకా లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో కనీసం నాలుగు రకాల డెంగీ వైరస్‌లను నియంత్రించే లక్ష్యంతో టీకా తయారీ ప్రయత్నాలు మొదలయ్యాయి. అమెరికా లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అభివృద్ధి చేసిన ఒక టెట్రా వేలంట్ టీకా ప్రపంచ వ్యాప్తంగా ప్రీ క్లినికల్, క్లినికల్ ట్రయల్స్‌లో ప్రభావశీలంగా కనిపించింది. అయితే దేశంలోని పాన్ ఆసియా బయోటెక్‌కు కూడా ఇది అందుబాటులోకి రావడంతో ఆ కంపెనీ ఐసీఎంఆర్‌తో కలిసి ప్రయోగాలు మొదలుపెట్టింది. తొలి, మలి దశ ప్రయోగాలు కోవిడ్‌కు ముందు 2018 – 19లోనే పూర్తి చేసింది. మూడో దశ ప్రయోగాల కోసం 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 19 కేంద్రాలను ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా 10,335 మందిపై జరిగే మూడో దశ ప్రయోగాల్లో భాగంగా టీకాలు తీసుకున్న వారిని రెండేళ్ల పాటు పరిశీలించనున్నారు.



48 ఏళ్లుగా జాతీయజెండా ఆవిష్కరణ

తండ్రి బాటలో తనయుడు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): జాతీయ జెండాను ఏళ్ల తరబడి ఆవిష్కరించే అవకాశం అందరికీ రాదు. కానీ గాంధీ విగ్రహ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన సాయిలు 48 ఏళ్లపాటు ప్రతి జనవరి 26న, ఆగస్టు 15న జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆ వివరాలు ఏమిటో చూద్దాం. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల కేంద్రంలో 1975లో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి 15 మంది సభ్యులతో ఒక సంఘంగా ఏర్పడ్డారు. ఆ సంఘానికి సాయిలు ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. గాంధీ విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన సాయిలుతోనే జెండాను ఆవిష్కరింపజేయాలని ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. జెండా పండుగ వస్తుందంటే చాలు సాయిలు వారం రోజుల నుంచి సిద్ధమయ్యేవాడు. సొంత డబ్బుతో విగ్రహానికి, గద్దెకు రంగులు వేయించడం, పిల్లలకు మిఠాయిలు పంచడం వంటి కార్యక్రమాలు చేపట్టేవాడు. 83 ఏళ్ల వయస్సులో 2023 ఫిబ్రవరి 2న గుండెపోటుతో సాయిలు తుదిశ్వాస విడిచాడు. సాయిలు మరణానంతరం ఆయన తనయులు తండ్రి బాటలో నడుస్తున్నారు. తమ తండ్రి ఆశయ సాధనకు కృషి చేస్తామని చెప్పగా, దానికి గ్రామస్తులు కూడా అంగీకరించారు. దీంతో 2023 ఆగస్టు 15న , 2024 జనవరి 26న సాయిలు కుమారుడు మోహన్‌రాజ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.